
రామాయణం

# అంతరార్ధ రామాయణము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014


కళాప్రపూర్ణ
డా॥ వేదుల
సూర్యనారాయణ
శర్మ
294.59
SUR

# అంతరార్థ రామాయణము.

## (జ్ఞాన పీఠము)

అసతో మా సద్గమయ

తమసో మా జ్యోతిర్గమయ

మృత్యోర్మా అమృతం గమయ

గ్రంథకర్త :

సంస్కృతికంఠాభరణ, తత్త్వార్థప్రబోధక,

కళాప్రపూర్ణ, విద్వాన్,

డా॥ వేదుల సూర్యనారాయణ శర్మ.

# నివేదనము

'అంతరార్థం' అన్నప్పుడు: అంతర్ + అ (సమంతాత్) + అర్థం; అన్న వ్యుత్పత్తిని చెప్తే 'లోపలనున్న సంపూర్ణమైన అర్థం' అనే అర్థం వస్తుంది. 'అంతర్ + అర్థం' అని విడదీస్తే, విభిన్నమైన అనగా పైకి కనిపించే అర్థంకంటె భేదం కల మరొక అర్థం అని చెప్పుకోవచ్చు. పైకొక అర్థమూ, లోపల ఇంకొక అర్థమూ వచ్చేలాగు రచన అసలు ఎందుకు చెయ్యవలసి వచ్చింది? అనే ప్రశ్న ముందు వస్తుంది. దానికి ముందు సమాధానం **చెప్పాలి.**

సులువుగా గ్రహించి జ్ఞప్తిలో ఉంచుకోడానికి అంతగా శక్యంకాని నిరాకార నిర్గుణ పరమాత్మకు సంబంధించిన విషయాల్ని మనస్సుకు హత్తుకుపోయేటట్లు చెయ్యాలంటే వానిని సమసాదృశ్య ఔపమ్యధర్మంకల సాకార సగుణ సాంసారిక విషయాలుగా మలచికొని ఆసక్తికరములైన వానినిగా కల్పన చేసి వ్యంగ్యశైలిలో చెప్పాలి. అప్పుడవి సులువుగా మనస్సునందు స్థిరపడతాయి. పైకి కన్పించే అర్థం కొంత ప్రయోజనకరంగా ఉన్నా, అదే ప్రధానం కాదనీ వానిని వివేచనా దృష్టితో పరిశీలిస్తే పైకి అర్థమయ్యే ఆ సాకార సగుణ సాంసారిక విషయాలు సాధర్మ్యంతో నిరాకార నిర్గుణ పరమాత్మ విషయాలుగా బోధపడతాయిఅనీ, అట్లు బోధపడడానికే ఆ విషయాల్ని చెప్పే నామవాచక పదాలకు వ్యుత్పత్త్యర్థాలతో అర్థం చెప్పుకోవాలనీ అప్పుడు ఆ పదాలు కీలక పదాలుగా తాళంచెవులుగా (key words) పనిచేసి జ్ఞాన రత్న పేటికను తెరచి అంతరార్థ రత్నాలను సులువుగా కరతలామలకం చేస్తాయి అనీ, మనస్సుకు సులువుగా అందడంకోసమూ, చిరకాలం గుర్తులో ఉండడం కోసమూ చెప్పదలచిన నిరాకార విషయాలను సాకారాలుగా దృశ్యీకరణం (visualise) చేసి చెప్పాలనే అవసర దృక్పథంతో మన ప్రాచీన తత్త్వబోధకులు కనిపెట్టిన రహస్యమే ఈ అంతరార్థగర్భిత రచనా శిల్పమనీ మనకు ఆలోచిస్తే కన్పిస్తుంది. ఇలా ఉపమిచ్చి అర్థం చేసుకొంటే ఎందు అంతరార్థంగా నిక్షేపించి చెప్పిన నిరాకార నిర్గుణ పరమాత్మయొక్క తత్త్వము మనకు అందుతుంది. ఈవిధమైన వ్యంగ్య రచనాకల్పనలలో ఆసక్తిని పెంచడంకోసమూ, మనస్సులో పాతుకొని జ్ఞానకోశంలో ఉండిపోవడంకోసమూ సరైన సమాన ధర్మం కల్గిన కొన్ని అసందర్భాలూ, అశ్లీలాలూ, అసంబద్ధాలూ అయిన విషయాల్నికూడ ప్రవేశపెట్టడం ఆదికాలంలో జరిగింది ఈరచనల్లో. ఆ

అసందర్భాలూ, అశ్లీలాలూ చెప్పే కీలకపదాలను (key words) వ్యుత్పత్త్యర్థంతో విప్పి చెప్పుకొంటే అంతరార్థంలో ఏవిధమైన అసందర్భమూ, అశ్లీలమూ మనకు కన్పించదు సరిగదా శిపలైన అసలైన తత్త్వవిషయం సరిగ్గా బోధపడుతుంది. ఇదంతా జ్ఞాపనాశక్తిని (Memory) పరిరక్షించడానికి కన్పెట్టిన సులభ బోధనా రహస్యం. ఈరకం బోధనాశిల్పం మన ప్రాచీన వేదకాలంలోనే వెలసిందని చెప్పాలి. ఇదే విధానాన్ని నేడు అమెరికన్ విద్యావేత్తలు 'విద్యావిధానంలో జ్ఞాపనాశక్తి సిద్ధాంతం' (Memory of Education System) అనే పేరుతో ప్రచారంచేసి అది జయప్రదంగా వుందని నిరూపించియున్నారని వారు వ్యక్తీకరించిన వ్యాసాలు చెప్తున్నాయి. ఈవిధంగా దృశ్యీకరణవిధానంలో జరిగిన అంతరార్థ గర్భిత రచన ఎంత ప్రాచీనమో అంత నవీనముకూడనై యున్నది.

ఇది సార్వకాలికమైనదీ, వివిధ దేశవ్యాప్తమైనదీ అయిన మనస్తత్త్వశాస్త్ర విషయంగా భావించాలి. మరిన్నీ, మన కర్మ కాండలోని విఘ్నేశ్వర పూజ మొదలు అశ్వమేధయాగం వరకూ గల యాజ్ఞిక కార్యక్రమ తంత్రం కూడా వేదంలోని నిరాకార నిర్గుణ పరమాత్మ తత్త్వానికి దృశ్యీకరణమే అనిపిస్తుంది. 'కల్పం' అనే వేదాంగం ఈ రూపకీకరణను శాస్త్రీయంగా నిరూపించేదిగా కనిపిస్తుంది. 'నిరుక్తం' అనే మరొక వేదాంగం వేదాలలోని అమూర్తములైన తాత్త్విక పదాలకు దృశ్యములైన వేటితో ఏ సాకార-పదాలతో ఏ నిరాకార పదాల సామ్యాల చెప్పబడిందో విప్పిచెప్పింది. ఇక్కడ ఉదాహరణకు కొన్ని వేదములలోని అమూర్తములైన పదాలకు మూర్తీకరణం ఏ సామ్యంతో ఎట్లు చేయబడినట్లు 'భారతీనిరుక్తి' అనే నిరుక్తగ్రంథంలో చెప్పబడివుందో వివరిస్తాను,

ఉపనయన సమయంలో 'చర్మధారణ' అంటే తోలు జందెం ధరించడం అనేది బ్రాహ్మచర్య కర్మలలో అంగంగా ఉంది. అది 'చర్మధారణ' కాదనీ 'శర్మధారణం' అనీ, 'శర్మధారణం' అంటే 'మోక్షసుఖాన్ని ధరించడం' అనీ, 'శర్మ' అనే పదం ముక్తి అర్థంలో అమూర్తం అవడంవల్ల దానిని శబ్ద ఉచ్చారణా సాదృశ్యంతో లేడి చర్మంలోని (హరిణాజినంలోని) తెలుపూ, గోధుమరంగూ, నలుపురంగూ గల మచ్చలు సత్త్వరజస్తమోగుణాలను చెప్పే చిహ్నాలనీ ఆత్మ ఈ త్రిగుణాల్ని జాగ్రత్తగా అవిరోధంగా నడిపితే ముక్తి సుఖం చేకూరుతుందనీ ఈ భావ సామ్యంతోనూ శర్మధారణం చర్మధారణంగా 'చర్మ' పదం శర్మపదంతో మూర్తిమంతం చెయ్యబడిందనీ వేదార్థం చెప్పే గ్రంథంలో వివరింపబడియున్నది.

ఇంకా అగ్ని ఉపాసనా కార్యక్రమంలో ఆజ్యంలో (నేతిలో) మోదుగ పుడక 'సమిధ' అనే పేరుతో ముంచి అగ్నిలో వేల్చడం అనే ప్రక్రియ ఉంది. దానిలో 'అగ్ని' అనేది 'అగ్రి' అనే అమూర్త పదానికి చేసిన మూర్తీకరణ కల్పన అనీ, అగ్రి అన్నదానికి ఆది, అంతము కూడ తానే అయియున్న పరమాత్మ అర్థమనీ, 'ఆజ్యం' (నేయి) అనే పదం 'ఆద్యం' అనే అమూర్త పదానికి ఉచ్చారణా సారూప్యంతో చేసిన మూర్తీకరణమనీ, 'ఆద్యం' అంటే అన్నిటికంటె మొట్టమొదటిదిగా సృష్టియైన 'మాయ' అనేది అర్థమనీ, 'సమిధ' అంటే, బాగుగా పెరిగినది అనే అర్థంలో 'సమ్యక్ ఏధతే ఇతి సమిధా' అని దాని వ్యుత్పత్త్యర్థమనీ, అనగా ఇంద్రియవృత్తియే సమిధ అనీ, ఇంద్రియ వృత్తులు అమూర్తములు కావడంవల్ల మోదుగపుడకలను సమిధలు అను పేరుతో మూర్తీకరణకల్పన చేయడం జరిగిందనీ, సమిధలను ఆజ్యంలో ముంచి అగ్నిలో వ్రేల్చడమనేది ఇంద్రియవృత్తులను మాయతో సహా పరమాత్మలో విలీనం చెయ్యడమనే ముక్తి సాధనకు దృశ్యీకరణం అనీ ఆ నిరుక్తి గ్రంథాల్లో చెప్పబడివుంది.

ఇంకా, వృషపదం ధర్మాన్ని చెప్పే పదం. గరుత్మత్పదం వేదాన్ని చెప్పే పదం. ధర్మమూ, వేదమూ రెండూ అమూర్తములు కాన వానిని ఒకటి ఎద్దుగానూ, మరొకటి గ్రద్దగానూ మూర్తీకరణంచేసి ఒకటి ఈశ్వరునికూ, రెండవది విష్ణువునకూ వాహనాలుగా చెప్పబడడం జరిగింది. పరమాత్మను ధర్మమూ, వేదమూ మోసికొని వస్తున్నాయని చెప్పడమే శివకేశవులకు వృషభ, గరుడములు వాహనములని ఆ భారతీనిరుక్తిగ్రంథంలో చెప్పబడింది. 'వృష' పదానికి ధర్మం అనే అర్థం ఉంది. గరుత్మంతుడు ఛందోమయుడు అని ప్రసిద్ధి ఉంది గ్రంథాల్లో.

ఇంకా అశ్వమేధం, గోమేధం, అజామేధం అనే యజ్ఞాలలోని గుఱ్ఱము, ఆవు, మేక అనే పశువులు క్రమంగా ప్రకృతికీ, ఇంద్రియ వ్యాపారాలకూ, మాయకూ మారుగా చేసిన మూర్తీకరణ కల్పనలేననీ, ఆ పదాల వ్యుత్పత్త్యర్థాలతో నిరూపిస్తూ 'వేదనిగూఢతత్త్వ పరిశీలనం' అనే వ్యాస సముచ్చయంలో శ్రీ అరవిందమహర్షి ఆంగ్లంలో వ్రాసియున్నారు.

ఇంకా, భావనోపనిషత్తు అనే ఉపనిషత్తు ఉపాసనా, కర్మ తంత్రాలలోని ఏ దృశ్యీకరణ పదములను ఏవిధంగా అమూర్తములను చెప్పే తత్త్వములుగా

భావనచేసి ఆతత్త్వాల్ని అందుకోవాలో వివరంగా చెప్పింది. శ్రీ విద్యా తంత్రంలోని మూర్తీకరణ కల్పనకు అంతటా ఆ భావనోపనిషత్తు వ్యాఖ్యలలో తత్త్వం వివరింపబడివుంది.

పై విధములైన వేదార్థ తాత్త్విక పరిశీలనంతోనూ, శాస్త్రీయాధారాల తోనూ వేదరూపమైన శ్రీమద్రామాయణానికి నేను వాల్మీకి మహర్షి హృదయాన్ని సరిగ్గా ఆధ్యాత్మికపరంగా అవగాహన చేసికొని ఈ అంతరార్థ రామాయణాన్ని రచించాను. ఇంతవరకున్న రామాయణ వ్యాఖ్యాన చతుష్టయంలో అక్కడక్కడ కొన్ని ఆధ్యాత్మిక పరంగా అంతరార్థాలు వివరింపబడినా గ్రంథమంతకూ అనుపూర్వికగా అంతరార్థం చెప్పియుండలేదు. అధ్యాత్మ రామాయణ గ్రంథం కథావిషయానికి అంతరార్థంగా అధ్యాత్మ చెప్పినది కానేకాదు. ప్రసంగవశాత్తు కవి పాత్రముఖంగా అధ్యాత్మ విషయం చెప్పడం జరిగింపబడుటలో.

ఇంకా భాగవతంలో పురంజనోపాఖ్యానం అనే కథ ఒకటి ఉంది. దానిని వ్యాసమహర్షియే ముందుగా కథగా చెప్పి తర్వాత తానే అందలి అంతరార్థాన్ని ఆధ్యాత్మపరంగా వివరించియున్నాడు. అంటే అంతరార్థాలు వాల్మీకి వ్రాసిన రామాయణానికే కాక వ్యాసుడు వ్రాసిన భాగవత, భారతాలకుకూడ చెప్పవలసివస్తుందని కవిచేసిన వ్యాఖ్యవలననే తోస్తూంది. నేను భారత, భాగవతాలకు కూడ అంతరార్థాలు వ్రాస్తున్నాను.

కథాపరంగా 24 వేల శ్లోకాలతో రామాయణం వ్రాసిన వాల్మీకియే యోగపరంగా, జ్ఞానపరంగా 'యోగ వాశిష్ఠమూ లేక జ్ఞాన వాశిష్ఠమూ' అనే పేరుతో 32 వేల శ్లోకాలతో కేవల వేదాంతమార్గమును చెప్పే గ్రంథమును కూడ వ్రాసియున్నాడు. అందుకూడ రాముడే నాయకుడుగా వశిష్ఠుడు బోధకుడు. అట్లాగే తన వంశ చరిత్రగా భారతం వ్రాసిన వ్యాసమహర్షి చిట్టచివరకు భారతాంగంగానే భగవద్గీత వ్రాసినాడు. కాన కథలు అన్నీ ఆధ్యాత్మిక అంతరార్థపరంగా మలచుకొనేందుకు తగిన విధంగా వ్రాసివుంటాడు అనిపిస్తూంది బ్రహ్మసూత్రాలనే ఆధ్యాత్మికగ్రంథాన్ని కూడా శారీరక మీమాంస అనే పేరుతో వ్రాసినాడు వ్యాసుడు. కాన వ్యాసుని భారతాన్ని చారిత్రకంగా కాక, ఆధ్యాత్మికంగానే గ్రహించవలసి వుంటుంది.

ఈ విధంగా వ్యాస, వాల్మీకులు కేవల చరిత్రకవులు కారనీ, జీవితంలో విశేషంగా వేదాంత ప్రబోధ చేసినవారనీ మనం గ్రహించక తప్పదు. వారు

దృష్టిని అంతా ప్రకృతిని పురుషునిలో ఐక్యం చెయ్యడం అనే సాయుజ్య ముక్తికి సంబంధించిన అధ్యాత్మిక తత్త్వాన్ని ప్రచారం చెయ్యడంలోనే లగ్నం చేసి జీవించారు అనిపిస్తుంది. కాన వారి రచనలకు అధ్యాత్మికపరంగానే అర్థాలు చెప్పుకోవాలి. కాని వట్టి చరిత్రకు ప్రాధాన్యం ఇవ్వకూడదు.

ఇంక నావిషయంకూడ కొంచెం చెప్పాలి. ఈ రామాయణాంతరార్థ రచన ఒకేసారి నాకు ఉబెత్తుగా స్ఫురించినదీకాదు. కేవలం ప్రతిభా సంపత్తి చేత మాత్రం కష్టపడి ఎల్లాగో సాధించినదీ కాదు. నేను నలభై యేండ్లు రామాయణంలోని సుందరకాండను నిత్యమూ పారాయణం చేసివున్నాను. నిజంగా ఏకోరికలూ మనస్సులో లేకుండగనే నా రామాయణ పారాయణం చిరకాలం జరిగింది. అలా జరగడంతో నాకు క్రమంగా అప్పుడప్పుడు ఈ అంతరార్థములు కథలో స్ఫురిస్తూ వచ్చేయి. ఏది ఏమైనా భగవంతునిగూర్చి ఆలోచించేటప్పుడు భగవదావేశం ( Intusion ) కల్గిన పవిత్ర సమయాల్లో మాత్రమే నేనీ అర్థాలు గ్రహించి నిర్ధారించుకొన్నానని, అవి ఇప్పుడు వ్రాయ గల్గేనని సవినయంగా మీకు నివేదించుకుంటున్నాను.

నేను 1974 లో ఢిల్లీలో నా అంతరార్థములతో రామాయణ భారత భాగవతోపన్యాసాలు శ్రీ ఆంధ్రఎడ్యుకేషన్ సొసైటీవారి ఆధ్వర్యమున 21 ఉపన్యాసాలు ఆంధ్రులు నివసించే అన్ని కాలనీలలోను జరిపేను. అచ్చట గొప్ప పదవులలోనున్న ఆధ్యాత్మ విద్యావేత్తలగు పౌరులు నా ఉపన్యాసాలను బహు శ్రద్ధతో విని నన్ను 'తత్త్వార్థ ప్రబోధక' అను బిరుదముతో గొప్పగా కీ. శే. క్రొత్త రఘురామయ్య (కేంద్ర మంత్రి)గారి అధ్యక్షతతో సత్కరించి ఈరచనకు ఉత్సాహము కల్గించేరు. ఢిల్లీలోని ఆంధ్రేతర కాలనీలలోకూడ ఉపన్యాసాలు జరిపించి వానిని ఆంగ్లంలో అనువదించి శ్రోతలకు విన్పింప చేశారు. ఈవిధంగా ఆంధ్రదేశంలో పెక్కుచోట్ల ఉపన్యాసాలు జరిగేయి విషయ పరిగ్రహణం చిరకాలంనుండి చేస్తూ వున్నప్పటికీ నేను నాభార్య గౌరిదేవి 7–12–78 తేదీని లక్ష్మీసాయుజ్యం పొందినతర్వాత, ఆమె ఆత్మ శాంతికోసం ఈరచన దీక్షగా సాగించి ఈనాటికి ప్రకటించగల్గేను.

నేను ముందుగా ఈ గ్రంథానికి సైక్లోస్టయిలుతో, 30 ప్రతులు తయారు చేయించి పెక్కురు పండితులకు, ఆధ్యాత్మిక సాధకులకు పంపి వారి ఆశీర్వాదాలు పొంది అందరి ఆమోదముతోను నేడు దీనిని ప్రకటించుచున్నాము.

నొకు తమ అమూల్యములైన అభిప్రాయముల నిచ్చిన పండితులకు, నావినయ పూర్వక వందనము లర్పిస్తూన్నాను.

దీని అచ్చువ్యయము భరించిన శ్రీ తిరుపతి దేవస్థానము కార్యకర్తలకూ, శ్రీ యాదగిరి లక్ష్మీనృసింహ దేవస్థాన కార్యకర్తలకూ, బ్రహ్మశ్రీ మాగంటి సూర్యనారాయణగారికీ పునఃపునరభివాదములు తెల్పుకొనుచున్నాను.

ఇట్లు,

వేదుల సూర్యనారాయణశర్మ,

ర చ యి త



క ళా ప్ర పూ ర్ణ

డా॥ వేదుల సూర్యనారాయణ శర్మ.

# బాలకాండ, అయోధ్యకాండలు.

## ఇంద్రియ నిగ్రహీకరణ సాధన.

### బా ల కాం డ.


| వచన క్రమము. | విషయసూచిక. | సాధనాసూచిక. | పేజి. |
|---|---|---|---|
| 1. | దేవతలు విష్ణువును వేడికొనుట | — ప్రార్థనా సాధన — | 3 |
| 2. | పుత్రకామేష్టి,పాయసప్రదానం | — హోమేష్టి-భగవద్భక్తి ప్రాప్తి | 5 |
| 3. | దశరథునకు శబ్దవేధి బాణంతో మునిబాలుని చంపుట | — వేద విజ్ఞానంతో కర్మసేవా ఫలత్యాగం చేయుట. | 6 |
| 4. | పాయసవిభాగం-శ్రీరామాదుల జననం. | — సత్వాది త్రిగుణములలో భగవద్భక్తిని పంచి ఆనందాది శక్తుల నందుట. | 8 |
| 5. | విశ్వామిత్రుని ఆగమనం అస్త్రవిద్యోపదేశం | — గురు సమాగమ సంసాధనా శిక్షణం. | 11 |
| 6. | సుబాహుంవధ మారీచపలాయనం | — ద్వంద్వాతీత స్థితి మాయా నిష్క్రమణం | 13 |
| 7. | మిథిలాగమనం | — అమనస్కయోగంలో ఆనందాను సంధానం. | 15 |
| 8. | శివధనుర్భంగం | — ఓంకార సాధన. | 20 |
| 9. | సీతా పాణిగ్రహణం | — ప్రకృతి వశీకరణ. | 21 |
| 10. | పరశురామ గర్వభంగం | — సత్వగుణంలో రజోగుణ విలీనీకరణం. | 23 |

# అయోధ్యాకాండ.


| వరుస క్రమము | విషయసూచిక. | సాధనా సూచిక. | పేజీ. |
|---|---|---|---|
| 1. | కైకకు మంథర ప్రబోధం | — ముక్తికోసం తమోగుణం సంక్షోభ పడి నిర్ణయం తీసికొనుట. | 27 |
| 2. | కైకవరాలు-దశరథుని మరణం | — తమోగుణం ప్రశాంతీకరణం కొఱకు సాధనలను ఏరుకొనుట. దశేంద్రియ నిగ్రహ సాధన యొక్క అవసరం తీరుట. | 29 |
| 3. | సీతా లక్ష్మణులు రాముని అనుసరించుట | — జీవప్రకృతులు ఆనందాంశ ననుసరించుట. | 30 |
| 4. | సీతకు వల్కలధారణం నిషేధించుట | — ప్రకృతిని కాదనకుండుట | 30 |
| 5. | గుహుని సహాయంతో గంగను దాటుట. | — జ్ఞానంతో కాలం వెళ్ళించుట. | 32 |
| 6. | సీత గంగను ప్రార్థించుట. | — సాధకునిలోని ప్రకృతి కాలగమనము ననుకూలింపగోరుట. | 33 |
| 7. | రాముడు భరద్వాజాశ్రమంచేరుట | — హఠయోగసాధనల నెఱుంగుట. | 35 |
| 8. | భరద్వాజ జననం | — హఠయోగం పుట్టుక | 36 |
| 9. | చిత్రకూట ప్రవేశం | — జ్ఞానంతో నిశ్చలత నొందుట | 39 |
| 10. | చిత్రకూట నివాసము | — నిశ్చలతా సాధన | 54 |
| 11. | పాదుకలకు పట్టాభిషేకం | — ఆనందంతోకూడిన జీవనభరణం | 57 |
| 12. | ఖర విప్రకరణం | — ఇంద్రియ ప్రజ్వలనాన్ని దూరీకరించుట. | 61 |
| 13. | అత్రి ఆశ్రమ ప్రవేశం | — త్రిగుణాతీత స్థితికి వచ్చుట. | 61 |

# అంతరార్థ రామాయణము.

## బాలకాండ

మానవులకు ముక్తిని ప్రసాదించే గ్రంధాలు అనేకం మన మహర్షులచేత రచింపబడ్డాయి. ప్రజా సామాన్యానికి అందుబాటుగా ఉండటంకోసం, పైకి కధలుగా కన్పించేటట్లూ, అధ్యాత్మిక విజ్ఞానం అంతర్గర్భితంగా ఉండేటట్లూ కొన్ని గ్రంధాలు రచింపబడ్డాయి. వానిలో భారత, భాగవత, రామాయణాలు [illegible] ముఖ్యమైనవిగా చెప్పబడ్డాయి.

'అధ్యాత్మం' అంటే ఆత్మయందు జరిగే భగవంతుని విషయం గురించి చెప్పేది అని అర్థం. మనసులోనే, మనసుతోనే మనస్సును ఉద్ధరించే పద్ధతిలో భగవదైక్యం సాధించేందుకు అనువైన వేద తత్వార్థం పురాణాల్లో కధా రూపంలో పరోక్షం చెయ్యబడి వుంది. కాన, ఆకధ లన్నిటికీ, వేదార్థాన్ని విస్తరింపజెయ్యడమే ప్రయోజనం అనాలి. అందుచేత, వేద విరుద్ధంగా వాటికి వ్యాఖ్య చెయ్యనే కూడదు. పురాణ కధల్లో చెప్పే లోకాలు, లోకాధీశులు అధ్యాత్మ పరమైనవే అని ఐతరీయోపనిషత్తులో చెప్పబడివుందికూడ.

శారీరక మీమాంసయే పురాణాల్లో రాముడు, కృష్ణుడు, సీత, రుక్మిణి అనే పేర్లతో కధలుగా కట్టి చెప్పబడింది. ప్రజల మనస్సుల్ని ఆకర్షించేందుకు ప్రజలు అనుసరించే సంసార ప్రసంగాలు ప్రత్యక్షం చేసి కధలుకట్టి పరమార్థ తత్వం రామాయణంలో వాల్మీకిచేత పరోక్షంగా అందజేయబడింది. అసలు వేదంలోకూడా, ఈ[illegible]ంగా దేవతల సంబంధంగా, ఆఖ్యాయికలు కల్పింపబడి ఉన్నాయి. ఈ కధల్లో పరోక్షంగా జ్ఞానం అందించబడుతుంది. ''పరోక్షప్రియాః! దేవాః!'' అని పదే పదే వేదంలోనే చెప్పబడి వుందికూడా.

# అయోధ్యాకాండ.


| వరుస క్రమము | విషయసూచిక. | సాధనా సూచిక. | పేజీ. |
|---|---|---|---|
| 1. | కైకకు మంధర ప్రబోధం | — ముక్తికోసం తమోగుణం సంక్షోభపడి నిర్ణయం తీసికొనుట. | 27 |
| 2. | కైకవరాలు-దశరథుని మరణం | — తమోగుణం ప్రశాంతీకరణం కొఱకు సాధనలను ఏరుకొనుట. దశేంద్రియ నిగ్రహ సాధన యొక్క అవసరం తీరుట. | 29 |
| 3. | సీతా లక్ష్మణులు రాముని అనుసరించుట | — జీవప్రకృతులు ఆనందాంశ ననుసరించుట. | 30 |
| 4. | సీతకు వల్కలధారణం నిషేధించుట | — ప్రకృతిని కాదనకుండుట | 30 |
| 5. | గుహుని సహాయంతో గంగను దాటుట. | — జ్ఞానంతో కాలం వెళ్ళించుట. | 32 |
| 6. | సీత గంగను ప్రార్థించుట. | — సాధకునిలోని ప్రకృతి కాలగమనము ననుకూలింపగోరుట. | 33 |
| 7. | రాముడు భరద్వాజాశ్రమంచేరుట | — హఠయోగసాధనల వెలుంగుట. | 35 |
| 8. | భరద్వాజ జననం | — హఠయోగం పుట్టుక | 36 |
| 9. | చిత్రకూట ప్రవేశం | — జ్ఞానంతో నిశ్చలత నొందుట | 39 |
| 10. | చిత్రకూట నివాసము | — నిశ్చలతా సాధన | 54 |
| 11. | పాదుకలకు పట్టాభిషేకం | — ఆనందంతో కూడిన జీవనభరణం | 57 |
| 12. | ఖర విప్రకరణం | — ఇంద్రియ వ్యత్వలనాన్ని దూరీకరించుట. | 61 |
| 13. | అత్రి ఆశ్రమ ప్రవేశం | — త్రిగుణాతీత స్థితికి వచ్చుట. | 61 |

# అంతరార్ధ రామాయణము.

## బాలకాండ

మానవులకు ముక్తిని ప్రసాదించే గ్రంథాలు అనేకం మన మహర్షులచేత రచింపబడ్డాయి. ప్రజా సామాన్యానికి అందుబాటుగా ఉండటంకోనం, పైకి కథలుగా కన్పించేటట్లూ, ఆధ్యాత్మిక విజ్ఞానం అంతర్గర్భితంగా ఉండేటట్లూ కొన్ని గ్రంధాలు రచింపబడ్డాయి. వానిలో భారత, భాగవత, [illegible] ముఖ్యమైనవిగా చెప్పబడ్డాయి.

'ఆధ్యాత్మం' అంటే ఆత్మయందు జరిగే భగవంతుని విషయం గురించి చెప్పేది అని అర్ధం. మననులోనే, మననుతోనే మనస్సును ఉద్ధరించే పద్ధతిలో భగవదైక్యం సాధించేందుకు అనువైన వేద తత్త్వార్ధం పురాణాల్లో కథా రూపంలో పరోక్షం చెయ్యబడి వుంది. కాన, ఆకథ లన్నిటికీ, వేదార్ధాన్ని విస్తరింపజెయ్యడమే ప్రయోజనం అనాలి. అందుచేత, వేద విరుద్ధంగా వాటికి వ్యాఖ్య చెయ్యనే కూడదు. పురాణ కథల్లో చెప్పే లోకాలు, లోకాధీశులు ఆధ్యాత్మ పరమైనవే అని ఐతరీయోపనిషత్తులో చెప్పబడివుందికూడ.

శారీరక మీమాంసయే పురాణాల్లో రాముడు, కృష్ణుడు, సీత, రుక్మిణి అనే పేర్లతో కథలుగా కట్టి చెప్పబడింది. ప్రజల మనస్సుల్ని ఆకర్షించేందుకు ప్రజలు అనుసరించే సంసార ప్రసంగాలు ప్రత్యక్షం చేసి కథలుకట్టి పరమార్ధ తత్త్వం రామాయణంలో వాల్మీకిచేత పరోక్షంగా అందజేయబడింది. అసలు వేదంలోకూడా, ఈవిధంగా దేవతల సంబంధంగా, ఆఖ్యాయికలు కల్పింపబడి ఉన్నాయి. ఈ కథల్లో పరోక్షంగా జ్ఞానం అందించబడుతుంది. ''పరోక్షప్రియాః దేవాః'' అని పదే పదే వేదంలోనే చెప్పబడి వుందికూడా.

'దేవ దానవ యుద్ధం' అన్నది శరీరంలోగల సత్త్వ వృత్తులకీ, తామస వృత్తులకీ, జరిగే యుద్ధానికి మారుపేరే; కాని, అసలు జరిగింది కానే కాదు. దేవతలుకాని రాక్షసులుకాని లేనే లేరు. మనుష్యులలోని ఉత్తమ గుణాలు దేవతలు, నీచగుణాలు రాక్షసులు అంతే.

ఛాందోగ్యోపనిషత్తులో శాస్త్రప్రకారం అనుసరించే మానసిక వృత్తులే దేవతలనీ, విశృంఖలంగా సంచరించే మానసిక వృత్తులే రాక్షసులనీ వ్యాఖ్యానం చెయ్యబడి వుంది.

రామాయణంలో, సాత్త్విక వృత్తికీ, తామసికవృత్తికీ జరిగే నిరంతర సంఘర్షణ వర్ణింపబడింది. ఎంతగా అణచబడినా, చిట్ట చివరకు, సత్త్వ వృత్తి జయించియే తీరుతుంది; అట్లా సత్త్వ విజయం జరిగించడమే భగవదైక్యం సాధించడానికి మూలం అని రామ రావణ యుద్ధం ద్వారా, వాల్మీకి మహర్షిచేత చెప్పబడింది.

రామాయణ కథకంతకూ, అందులోని పేర్లకు వున్న వ్యుత్ప త్త్యర్థాలలో అంతరార్థాన్ని బహిర్గతం చెయ్యడానికి వీలౌతూంది, 'దశరథుడు' అన్న పదంలో వున్న, 'దశ','రథ' అనే పదాలు 'పది ఇంద్రియాలు అనే గుఱ్ఱాలచే కట్టబడ్డ రథం' అంటే, 'మనస్సు కల్గిన సాధకుడు' అన్న అర్థాన్ని వెల్లడిస్తూన్నాయి.

భారత, భాగవత రామాయణాలు మనకు మహర్షులిచ్చిన జ్ఞాన రత్న పేటికలు. వాటిని ఎవరుపడితే వారు తెరచి అపహరించ కుండా గట్టిగా తాళాలు వేసి వుంచారు. అదే కథారూపం. ఆ తాళాలు తీసే, తాళం చెవులు కూడా, వానికే తగిలించి వుంచారు. అవే గ్రంథాల్లోని పాత్రల పేర్లు. అయితే, తీసే కిటుకు తెలిస్తేకాని తాళం చెవులు వున్నా తాళాలు తీయలేము. పేర్లకు గల వ్యుత్ప త్త్యర్థాలు గమనిస్తే, ఆ కిటుకు తెలిసిపోతుంది. ఆ వ్యుత్పత్త్యర్థాల సహాయంతో, లోపలి కథ అంతా బాహ్య రూపాన్ని విడిచిపెట్టి, సత్యస్వరూపంతో ప్రత్యక్షమౌతుంది. కొంచెం శ్రమించి తెలిసికోవాలి.

## దేవతలు విష్ణువును వేడుకొనుట.

దేవతలు, రావణాది రాక్షసుల బాధపడలేక, విష్ణువునొద్ద మొఱపెట్టుకున్నారు. దశకంఠరావణుని సంహరించడానికి, అయోధ్యనేలే దశరథునికి తాను జన్మిస్తానని చెప్పి తనకు సాయపడ్డానికి, వానరులుగా జన్మించండని వారిని విష్ణువు ఆదేశించాడు.

దేవతలంటే, మనలోని దైవీ సంపదకు సంబంధించిన, సాత్త్విక మనోవృత్తులు – భయంలేకుండుట, మనస్సు పరిశుద్ధంగా ఉండుట, జ్ఞానం, దానం, ఇంద్రియ నిగ్రహం, ఇచ్చేది నిష్కామంగా ఇవ్వడం, సద్గ్రంథ పఠనం, తపస్సు, ఋజువర్తనం, అహింస, సత్యం పలుకడం కోపం లేకుండా వుండడం, మృదు భాషణం, వినయ ప్రవర్తనం, త్యాగం, శాంతం, ఎవరిమీదా నేరాలు చెప్పకుండా వుండడం, చంచలత లేకుండడం, తేజస్సు, ఓర్పు, ధైర్యం, శుచిత్వం కల్గి వుండడం, ద్రోహచింత లేకుండడం, దురభిమానం లేకుండడం, అనే సుగుణాలకు సంబంధించిన మనోవృత్తులు. ఇవన్నీ 'దేవతలు' అన్న పదానికి అర్థం. ఇవన్నీ జ్ఞానానికి సహాయపడుతాయి. 'సుర' పదానికి, సు=మంచిని, రాతి (లాతి)=తీసికొనినవారు అని అర్థం. మంచిని తీసికొనే మనోవృత్తి గలవారు అని 'సుర' పదానికి వ్యుత్పత్త్యర్థం. దేవ' పదానికి ప్రకాశం అర్థం. జ్ఞాన ప్రకాశములైన మనోవృత్తులన్న మాట.

రాక్షసులు అంటే, అసురులు. (మంచిని గ్రహించనివారు) మనలోని అసుర సంపదకు సంబంధించిన తామసిక మనోవృత్తులు. డాబు, దర్పం, అహంభావం, పరుషభావం, హింస, కామం, క్రోధం, లోభం, మోహం, ఇల్లాంటి వాటికి సంబంధించిన మనోవృత్తులు రాక్షసులు. ఇవన్నీ అజ్ఞానాన్ని పెంపొందిస్తాయి.

విష్ణువు అంటే, సర్వత్రా వ్యాపించియుండే పరమాత్మ అని వ్యుత్పత్తి రీత్యా అర్థం. రావణుడంటే అరపించేవాడు అని వ్యుత్పత్తి

రీత్యా అర్థం. దశకంఠాలచే అరిపించేవాడు దశకంఠరావణుడు. పది ఇంద్రియములతో ఉద్రేకం పొందే, తామస లక్షణమే దశకంఠ రావణుడుగా నిర్దేశింపబడింది. అంతేకాని, పది కంఠాలు ఉన్న వాడని అర్థంకాదు. పది కంఠాలు ఎవరికీ ఉండవు. తామసవృత్తులు, సాత్త్విక వృత్తులను నాశనం చేసి, తాము మనో రాజ్యాన్ని అంతా ఆక్రమించడానికిచేసే ప్రయత్నమే దేవతల్ని, రాక్షసులు బాధించడం అంటే, అట్లా జరుగుతూన్నప్పుడు సాత్త్విక వృత్తులు, తమ ఉనికిని రక్షించుకోడానికి తమకు బలంచాలక తమలో ఉన్న సర్వ వ్యాపకు డైన భగవంతుని ధ్యానించడమే, రాక్షస సంహారానికి దేవతలు విష్ణు వును వేడుకోవడమంటే. దశరథుడంటే, పదిరథాలు కలవాడనీ అర్థంకాదు. పది దిక్కులందు అడ్డు లేని రథం కలవాడనీ అర్థం కాదు. దశరథుడికి పది రథాలేమిటి? వేల కొలదీ రథాలున్నాయి. పైకి, క్రిందికి, పది దిక్కులకీ రథం పోవడం ఏమిటి? అదేం కాదు. దశరథుడంటే, పది ఇంద్రియములనే గుఱ్ఱాలను పూన్చిన మనస్సు అనే రథాన్ని సరియైన త్రోవలో సంయమంగా నడిపించే సాధకుడు అన్నమాట. అదే సరైన అర్థం. 'అయోధ్య' అంటే, యుద్ధం చేసి గెలువ శక్యం కానిది అని వ్యుత్పత్త్యర్థం. అది శరీరానికి పర్యాయ పదంగా చెప్పబడింది. 'శరీరం' అంటే నశించేది. అంటే జన్మ అని అర్థం. దానిని లేకుండా చేసుకోవడమే మోక్షం. అది అంత సులువుగా శక్యం కానిది కాబట్టి శరీరాన్ని అంటే జన్మను జయించరాని దానినిగా, అంటే, అయోధ్యగా చెప్పాలి. ఈ శరీరంలోని 'జీవుడు' అనే సాధకుడు పది ఇంద్రియాలను పాలిస్తున్నాడు, అన్నదే అయోధ్యను దశరథుడు పాలిస్తున్నాడు, అన్నదాని అంతరార్థం. ఆ దశరథునకు, విష్ణువు, రాక్షస సంహారానికి, అవిర్భవిస్తానన్నాడు అంటే, ఇంద్రియ సంయమనం చేసే సాధకునిలో భగవత్‌శక్తి ప్రవే శించి, తామసిక లక్షణాల్ని నశింపచేస్తుందనీ, అల్లాగ జరగడం భగవన్నిర్ణయం అనీ తాత్పర్యం.

## పుత్త్రికామేష్టి - పాయస ప్రదానం.

దశరథుడు, పుత్రకామేష్టి చేయగా, అగ్నిహోత్రుడు పాయసాన్నిచ్చి, దానిని, నీ భార్యలు సేవిస్తే, పుత్త్రులు కలుగుతారని దశరథునకు చెప్పేడు

పుత్త్రకామేష్టి - పుత్ + త్ర + కామ + ఇష్టి. పుత్-నరకము నుండి, త్ర-రక్షించేది. నరకాన్నుంచి రక్షించాలనే కోరికతో చేసే తపస్సు పుత్రకామేష్టి అవుతుంది. నరకం అన్న పదం 'నౄ' హింసాయాం అనే ధాతువు వల్ల ఏర్పడింది. హింస కలది అని దాని అర్థం హింస నుండి రక్షించేది, ఒక్క జన్మ రాహిత్యం కల్గించే ముక్తి మాత్రమే. కాన, పుత్త్ర పదానికి 'ముక్తి' అన్నది అర్థం. ముక్తిని కోరి చేసే ప్రయత్నం పుత్త్ర కామేష్టి అవుతుంది దశేంద్రియ సంయమనం చెయ్యడమే ఆ ప్రయత్నం అంటే. ఆపనిచేసే సాధకుడే దశరథుడు. ఆతని పనికి మెచ్చుకుని, భగవంతుడు పాయసాన్నిచ్చేడు పయస్సుయొక్క భావార్థకరూపం 'పాయసం' అన్నపదం. 'పయస్సు' అన్న పదానికి, నీరు, పాలు, అనే అర్థాలలో మాత్రం ఎక్కువ వాడుక కన్పిస్తుంది. 'పయస్సు' అన్న పదానికి 1. Vital Spirit, 2. Power, 3. Strength అనే అర్థాలు Apte Dictionary లో ఉన్నాయి. కాన, ఇచ్చట * 'పాయస' పదానికి భగవత్సంబంధమైన మహా శక్తి అనే అర్థాన్ని చెప్పుకోవచ్చు. ముక్తిని కోరి యత్నం చేసే సాధకునిలో భగవంతుడు, తన మహత్తరశక్తిని ప్రసారం చెయ్యడమన్నదే, ఈ పాయస ప్రదానంలోని అంతరార్థం.

* "అప ఏవ ససర్జాదౌ తాసు వీర్య మపాసృజత్" అని వున్నది. భగవంతుడు మొదట నీటిని సృష్టించాడనీ, ఆ నీటిలో తన శక్తిని వుంచాడనీ దాని అర్థం.

## దశరథుడు శబ్దవేధి బాణంతో ముని బాలుని చంపుట.

దశరథుడు, బాల్యంలో 'శబ్దవేధి' అనే విద్యను, అభ్యాసం చేసేడు. ఆ విద్యాభ్యాసకాలంలో, ఒకప్పుడు, అరణ్యంలో పొద చాటున దాగి వుండి, ముని బాలుడు కొలనులో నన్నుని మూతిగల కుండతో నీళ్ళు ముంచుతూ వుంటే కలిగే బుడ బుడ ధ్వనిని విని, ఏనుగు తొండంతో, నీళ్ళు త్రాగుతూన్న ధ్వనిగా భ్రమపడి, శబ్దవేధి బాణాన్ని ప్రయోగించేడు అది ముని బాలునికి తగిలింది పెద్దగా రోదిస్తూ, అతడు చనిపోయేడు. దశరథుడు తన తప్పు గుర్తించి, ఆ బాలుని శవాన్ని, అతని వృద్ధ పితరుల వద్దకు తీసికొని వెళ్ళి, తన తప్పు క్షమించుమన్నాడు. తాను బ్రహ్మహత్య చేసేనని వాపోయేడు. వృద్ధముని, తాను వైశ్యుడనని తన భార్య శూద్ర స్త్రీ అని, తమకు కల్గిన బాలుడు, బ్రాహ్మణుడు కాని కారణంచేత, నీకు బ్రహ్మహత్యా పాతకం రాదని చెప్పి, "నీవు పుత్త్ర వియోగంతో మరణిస్తావ"ని శపించేడు.

దశరథుడంటే, ముక్తి కోరి, పది ఇంద్రియాలను, సంయమనంతో నడిపేవాడు. అతడు శబ్దవేధిని అభ్యాసం చేసాడు. 'శబ్దం' అంటే వేదం 'వేధి' అంటే బాధించేది. వేదాభ్యాసంతో, దుష్టశక్తుల్ని కొట్టివేయడాన్ని అభ్యసించడమే 'శబ్దవేధి' విద్యాభ్యాసం చెయ్యడం అంటే. మోక్షేచ్ఛ గలవాడు, ముందు వేదాధ్యయనంతో పరిశుద్ధుడు కావాలన్నదే దాని తాత్పర్యం. తొలిశబ్దం వేదం కాన శబ్దపదం వేదాన్ని చెప్తుంది.

దశరథుడు, వైశ్యునకూ, శూద్రస్త్రీకి కల్గిన బాలుని సంహరించేడు. 'వైశ్య' పదం లక్షణావృత్తిచేత ఇచ్చట వేదంలో చెప్పబడిన, కర్మ మార్గాన్ని తెలుపుతుంది. వైశ్యుడు, తన వృత్తిలో, ఒక దేశవస్తువులను, మరొక దేశం తెచ్చి, క్రయ విక్రయ కర్మ జరుపుతాడు. ఆవృత్తి కేవలం కర్మకు సంబంధించేది కాబట్టి, ఇందలి వైశ్యపదం

కర్మ మార్గ పరంగా లక్షణా వృత్తితో చెప్పుకోడానికి అభ్యంతరంలేదు. ఆముని భార్య శూద్రస్త్రీ. శూద్రుడు వర్ణ త్రయమును సేవించి బ్రతికేవాడు, కాబట్టి, ఇచ్చట శూద్రపదం కూడ, లక్షణా వృత్తి చేత, వేదంలోని సేవా మార్గాల్లో దేవతల్ని సేవించడాన్ని, చెబుతుంది. వైశ్యునకు శూద్ర స్త్రీయందు కల్గిన బాలుడనగా, కర్మ, సేవామార్గాల వల్ల కలిగే ఫలం అని అర్థం. ఈవిధంగా అర్థాలు చెప్పడం వేద భాష్యంలోకూడా వుంది. కాగా, వేదాభ్యాసంతో కర్మ సేవామార్గాలు నడిపి, ఫలాన్ని తాను కోరుకునే ముక్తికి అవసరం కానిదిగా భావించి, ఆ కర్మ సేవా మార్గముల వల్ల కలిగే ఫలమును, దశరథుడు వేద మార్గంతోనే అంటే జ్ఞాన మార్గంతో త్యజించి వేశాడన్నదే, వైశ్య. శూద్ర జాతుడైన బాలుని, శబ్దవేధి బాణంతో చంపాడన్నదానికి అంతరార్థం. మునిబాలుని వధవల్ల బ్రహ్మహత్యాదోషం వస్తుందేమో అనే భయం దశరథునకు, కలిగిందన్నదానికి, "బ్రహ్మ స్వరూపమైన ముక్తికి, కర్మ సేవా మార్గాలను, వాని ఫలితాలతో సహా, చివరకు త్యజించి వేయడంవల్ల, వేదాపచారం కాదుకదా!" అని సాధకుడు తనలోన సందేహించేడు. నీవు చేసినపని జ్ఞాన ప్రతిబంధకం కాదని సాధకునికి అతని మనస్సు చెప్పడమే - వృద్ధముని, నీకు బ్రహ్మహత్యా దోషంరాదని చెప్పడంలోని అంతరార్థం. కర్మ సేవా మార్గాలతో ఐహిక ఫలం కోరకుండా, సంచరించాలనీ, జ్ఞాన మార్గంలో మోక్షఫలం కోరాలనీ ఆధ్యాత్మ సాధన చెప్తూంది. ఇంతకీ మోక్షేచ్ఛ గలవాడు వేదాధ్యయనం లెస్సగా చెయ్యాలనీ, అపైని, అందులోని కర్మ సేవా మార్గాల ఫలం కోరకుండా, జ్ఞానార్పణం చెయ్యాలనీ, అల్లా చెయ్యకపోతే ఆ మార్గాలు మోక్ష ప్రతిబంధకాలు అవుతాయనీ, సాధకుడు అనుభవం వల్ల తెలిసికొని, వేదంలోని జ్ఞానమార్గాన్ని ( ఉపనిషదర్థాన్ని ) సాధకుడు తనలో నిలువరించు కోవడం జరిగినదన్నదే ఈ శబ్దవేధి కథా సారాంశంగా మనం గ్రహించాలి,

## పాయస విభాగం — శ్రీరామాదుల జననం.

దశరథుడు, అగ్నిభగవానుడిచ్చిన పాయసాన్ని, కౌసల్య, సుమిత్ర, కైకేయి అనే తన ముగ్గురు భార్యలకు భాగాలు వేసియిస్తాడు. ఈ విభాగం చిత్రంగా ఉంటుంది. మొత్తంలో సగం (1/2) కౌసల్యకు ఇస్తాడు. మిగిలిన సగంలో సగం అంటే మొత్తంలో నాల్గవ (1/4) వంతును, సుమిత్ర కిస్తాడు. మిగిలినదానిలో సగం. అంటే, మొత్తంలో ఎనిమిదవ వంతు (1/8) కైక కిస్తాడు. చివరకు మిగిలిన ఎనిమిదవ వంతు (1/8) తిరిగి సుమిత్ర కిస్తాడు. సుమిత్రకు (1/4+1/8) వంతులు వస్తాయి. సుమిత్రకు మొదటి నాల్గవ భాగం ఇచ్చేకకూడా, తిరిగి ఎనిమిదవభాగం ఇవ్వడంలో అర్థం ఏమిటి? ఇక్కడ రామాయణవ్యాఖ్యాకారులు, కైకకు మిగిలిన భాగం (1/8వ వంతు) ఇస్తే, సుమిత్రను, కైకను, ఒకే స్థానంలో ఉంచినట్లవుతుందనీ, సుమిత్ర, కైకకంటె ముందు పెండ్లాడబడింది కావడంవల్ల, ఆమెకు కౌసల్య తరువాతి స్థానం, రెండవ స్థానం వుందనీ సుమిత్రతోపాటు నాల్గవ భాగం ఇచ్చి, మూడవ స్థానంలో కైకను, రెండవస్థానంలో ఉన్న సుమిత్రతో సమానం చెయ్యడం సబబు కాదనీ ఆలోచించి, బుద్ధిమంతుడైన దశరథుడు మిగిలిన ఆ నాల్గవ భాగాన్ని, తిరిగి రెండు సమ భాగాలు చేసి, ఎనిమిదవ భాగం తిరిగి సుమిత్ర కిచ్చి, కైక కంటె ఆమెకు ఉన్నత స్థాన గౌరవాన్ని నిలబెట్టేడని, రాజకీయ లౌకిక పరంగా అర్థం చెప్పేరు. అది సరికాదు. ఈ భాగాల పంపకానికి అంతరార్థ పరంగా ఎంతో ప్రయోజనం ఉంది.

* 'కౌసల్య' అన్నది 'కౌశల్య' అని చెప్పవచ్చును. 'కౌశల్య' అంటే, కుశలము యొక్క భావము అని అర్థం. సాధకునకు కుశలం చేకూర్చే సత్త్వగుణమే కౌశల్య పదానికి అర్థం. కైక అన్నదానికి

*'శ సయో రభేద:' అని వున్నది. దానివల్ల కౌసల్య అను పదాన్ని కౌశల్య అని చెప్పవచ్చును.

వ్యుత్పత్త్యర్థంలో – 'క + ఏక' అని విడదీయాలి. 'క' అంటే సుఖం, 'ఏక' అంటే ముఖ్యం. ఐహిక సుఖమే ముఖ్యంగా కలది; తమోగుణం అని అర్థం. 'కైక' అనే పదం సాధకునిలోని తమోగుణం అన్న అర్థాన్నిస్తుంది. ఇక 'సుమిత్ర' పదాన్ని చూద్దాం. 'సుమిత్ర' అన్నపదానికి మంచి మిత్రభావం కలది అని అర్థం. రాజసగుణం అటు సత్త్వగుణంలోనూ, ఇటు తమోగుణంలోనూ కూడా కలుస్తుంది. దానికి ప్రత్యేకరూపం లేదు. అయితే, సాత్త్వక, తామసగుణాల రెండింటితోనూ, చెలిమిచేసి వుండే కారణంచేత సాధకునిలోని రాజస గుణానికి 'సుమిత్ర' అన్న పేరు సరిపడి వుంది.

భగవంతుడు తనకు ఇచ్చిన పాయసాన్ని అంటే, తనకు తపస్సువల్ల సంక్రమించిన, దివ్యశక్తిని, సాధకుడు సగం వరకు తనలోని సాత్త్వక గుణంలో విలీనంచేశాడనీ, నాల్గవ భాగాన్నీ, తిరిగి ఎనిమిదవ భాగాన్నీ, తనలోని రాజసగుణానికి సంక్రమింపజేసాడనీ, ఎనిమిదవ భాగాన్ని తనలోని తమోగుణంతో కలపియుంచేడనీ చెప్పడమే, దశరథుడు తన భార్యలకు పంచిన పాయసవిభాగంలోని అంతరార్థం. సుమిత్రకు రెండుభాగాలి వ్వడంవల్ల ఇద్దరు బిడ్డలు ఆమెకు కలిగారు ఒకరు రామునితోనూ, రెండవవాడు భరతునితోనూ, చెలిమి చేసారనడం, రాజసగుణం, సాత్త్వకంతోనూ, తామసికంతోనూ కలిసిపోతుందని చెప్పడానికి సరిగా వుంది. కౌసల్యకు రాముడు, సుమిత్రకు లక్ష్మణ శత్రుఘ్నులు, కైకకు భరతుడు పుట్టారు.

'రమంతే యోగినః అస్మిన్ ఇతి రామః' అని రామ పదానికి వ్యుత్పత్త్యర్థం. యోగులు దేనియందు, ఆనందిస్తూ వుంటారో అది రామ పదానికి అర్థం. జ్ఞానమునందే యోగులు ఆనంద భావం పొందుతారు; కాన, రామ పదానికి జ్ఞానం అర్థం. సాధకునిలోని సత్త్వగుణం, తనలో భగవచ్ఛక్తి ప్రకాశించడంతో ఆనందరూప

జ్ఞానంగా మారుతుంది. అదే, పాయస సేవనంవల్ల కౌసల్యకు రాముడు కలిగాడన్నదాని అంతరార్థం *

'భరణాత్ భరతః' అన్న వ్యుత్పత్త్యర్థంలో భరించుటవలన భరతుడు అన్నపేరు వచ్చింది. సకల ఐహిక కార్య కలాపంతో కూడిన రాజ్యమును భరించువాడు. రాజ్య భరణం తమోగుణం వల్ల నడిచేపని. "సాధకునిలోని తమోగుణం భగవచ్ఛక్తి ప్రవేశించడంవల్ల, భగవదర్పణ బుద్ధితో రాజ్య భారాన్ని నడిపే భరణశక్తి పుట్టింది." అన్నదే కైకకు పాయసపానంవల్ల భరతుడు పుట్టేడన్నదాని అంతరార్థం. 'లక్ష్మ నయతి ఇతి లక్ష్మణః' అన్న వ్యుత్పత్త్యర్థంలో 'లక్ష్మ' అనగా చిహ్నము. 'నయతి' అనగా పొందుచున్నాడు-తన చిహ్నమే అయిన జ్ఞానానంద స్వరూపమైన రామ పరమాత్మను నిరంతరం కలసియుండే జీవాత్మకే లక్ష్మణుడను పేరు ఏర్పడింది. సాధనలోని రాజసగుణంలో భగవచ్ఛక్తి పాలు హెచ్చుగా (1/4 వ వంతు) కలగడంవల్ల, జ్ఞానానుసరణ లక్షణం పుట్టిందన్నదే నాల్గవ భాగం పాయస భక్షణంవల్ల, సుమిత్రకు రామునే అనుసరించి యుండే లక్ష్మణుడు పుట్టేడన్నదానికి అంతరార్థం.

'శత్రూన్ ఘ్నంతి ఇతి శత్రుఘ్నః అన్న వ్యుత్పత్త్యర్థంలో శత్రువులను నాశనం చేసేవాడన్నది శత్రుఘ్న పదానికి అర్థం. రాజసగుణంలో భగవచ్ఛక్తి కొంత (1/8 వ వంతు) కలగడంవల్ల సాధకునిలోని తామసిక లక్షణమైన రాజ్య భరణ శక్తికి శత్రు నాశక శక్తియొక్క తోడ్పాటు లభించిందన్నదే ఎనిమిదవ వంతు పాయస భక్షణం వల్ల సుమిత్రకు భరతుడిని అనుసరించే శత్రుఘ్నుడు పుట్టే డన్నదానికి అంతరార్థం. సాధకుని లోని సాత్త్విక భావాలు, తామసిక

---

*పాయసంలో సగముతో రాముడు పుట్టేడు అంటే, ఇచ్చట సగము ఈశ్వరతత్త్వము మాత్రమే దశరథ సాధనలో వచ్చినది అనీ, దశకంఠ రావణ సంహారంతో సాధకునకు మిగిలిన సగం భగవత్ శక్తి వచ్చి పూర్ణత్వం లభించిందనీ తెలిసికోవాలి.

భావాలవల్ల తమకు నాశం సంభవిస్తూన్నందున, విశ్వాంతరాళంలో అంతటా వ్యాపించియున్న భగవానుని సాయం అర్థించడమూ, భగవానుడు, తన శక్తిని సాధకునకు ప్రసాదించడమూ, దశేంద్రియాలను నిగ్రహిస్తూ ఆ శక్తిని, సాధకుడు తనలోని, సత్త్వ, రజ, స్తమో గుణాల్లో ప్రవేశపెట్టి, దానివల్ల కల్గిన, ఫలితాలతో చక్కగా ఆధ్యాత్మిక సాధన సాగిస్తూ సకల సుఖములతో, జీవితము లెన్నగా నడుపుకుంటూవుండడమూ, అన్నది, దేవతలు విష్ణువుకు రాక్షస బాధలు నివేదించుకొని సాయ మర్థించడమూ, విష్ణువు పుత్రకామేష్టి యాగంలో, పాయసాన్ని దశరథునకు అందించడమూ, దశరథుడు ఆ పాయసాన్ని తన ముగ్గురు భార్యలకు పంచడమూ, పాయస ప్రభావం వల్ల రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు జన్మించడమూ అన్న కథకు సాధకుడు సాధనలో సాగించవలసిన ఆధ్యాత్మిక రహస్యాల్ని, అంతరార్థ పరంగా తెలిసికొన్నాము. ఇది సాధనయొక్క ప్రథమ దశలో మొదటి మెట్టు. దీనితో సాధకునిలో, దశేంద్రియ నిగ్రహ సాధన జరుగుతుంది. ఈ ప్రథమ దశలోనే, రెండవ మెట్టు జ్ఞాన సాధన. సాధకుడు ఈపైని, గురు సహాయంతో, జ్ఞాన సాధనా సోపానం అధిరోహించవలసి వుంది. మొదటి మెట్టును, అధిగమించడంతో, సాధకుణ్ణి, తనంతట తానుగా గురువు వెతుక్కుంటూ వస్తాడు. సాధకుడు, గురూపదేశానికి, అర్హతను సంపాదించుకోవాలేగాని, గురువుకోసమంటూ తా నెక్కడకూ వెళ్ళవలసిన పనేలేదు. 'అర్హతగల సాధకు లెక్కడున్నారా? వారి కెప్పుడు సాధనలు అందించుతామా' అని భూమి అంతటా తిరుగుతూ అన్వేషించుకుంటూ వస్తాడు శిష్యుని వద్దకు గురువు. మొదటి దశలోని మొదటి మెట్టు ఇంద్రియనిగ్రహం; రెండవ మెట్టు జ్ఞానాభివృద్ధి సాధన చేసుకోవడమూను.

## విశ్వామిత్రుని ఆగమనం – అస్త్రవిద్యోపదేశం.

ఇచ్చటనుండి కథలోని దశరథ పదంతో చెప్పబడిన సాధకుడే క్రమంగా రాముడుగా మారిపోతాడు. దశరథునిలోని సగపాలు

భగవత్శక్తితో ఏర్పడిన ఆనందరూప జ్ఞానాంశమే రాముడు జ్ఞానాభి వృద్ధి సాధనకు సంబంధించిన మెట్టు. రామ జననంతో ప్రారంభం కావడంవల్ల, ఆనందపద వాచ్యుడైన రాముడు జ్ఞానసాధకుడుగా చెప్పబడుతాడు జ్ఞానం కొంత కలిగాక ఇంద్రియ నిగ్రహం అవసరం క్రమంగా తీరుతుంది. దశరథపదం, రామపదం సాధకునియొక్క గుణాల్ని తెలిపే పదాలు. సాధించిన సాధనాగుణాల్నిబట్టి ఆ పేర్లు ఏర్పడ్డాయి. సాధకుడుమాత్రం ఒక్కడే. ఇచ్చట ఇంద్రియ నిగ్రహంతో సాధకునిలో ఆనందరూపమైన జ్ఞానం అవిర్భవిస్తుందనీ, ఆ అనందరూపజ్ఞానాంశ క్రమంగా గురుసహాయంతో వికసించి, అపిదప ప్రకృతి వశీకారందాకా గురుసహాయం పొంది ప్రకృతిని కూడియే ఆత్మానందం పొంది వుంటుందని చెప్పుకోవాలి. రామ సాధన ప్రారంభంతో దశరథ సాధన అక్కర పూర్తిగా తీరుతుందని అనుకోకూడదు. దశరథ సాధన ఇంతటినుండి క్రమంగాతొలగి రామ సాధన అందుకొంటుందని మాత్రమే తాత్పర్యంగా భావించాలి.

విశ్వామిత్రుడు దశరథుని యొద్దకు వచ్చి, రామలక్ష్మణులను తనతో పంపుమని యాచించి తీసుకొని వెళ్ళుతాడు. దారిలో బల, అతిబల అనే విద్యలను ఉపదేశిస్తాడు తాటకను చంపిస్తాడు. ఆశ్రమం చేరేక సుబాహు మారీచులను చంపడానికి నియోగిస్తాడు.

'విశ్వామిత్రుడు' అన్న పదానికి, 'విశ్వస్య మిత్రః' అని వ్యుత్పత్త్యర్థం. విశ్వానికి మిత్రుడైనవాడు విశ్వామిత్రుడు అని. వ్యుత్పత్త్యర్థంలో, ప్రత్యేకంగా చెప్పిన వ్యాకరణ సూత్రంవల్ల 'విశ్వ' పదానికి దీర్ఘం వచ్చి 'విశ్వా' అని అయింది అంతేకాని, దీర్ఘం వుంది కదా! అని 'విశ్వ+అమిత్రుడు' అని, సవర్ణదీర్ఘ సంధి అనుకొని విడదీయకూడదు. అది 'విశ్వస్య ఋషేః' అనే ప్రత్యేక వ్యాకరణ సూత్రానికి విరుద్ధం అవుతుంది. విశ్వమునకు మిత్రుడు, మోక్ష సాధనను చెప్పే గురువే కాన, విశ్వామిత్రపదం మోక్ష విద్యాగురువు అనేదానికి పర్యాయపదంగా చెప్పబడింది. గురువు తానేవచ్చి

శిష్యులను అడిగి తీసికొని వెళ్ళాడన్నదే, తానై వచ్చి, విశ్వామిత్రుడు రామలక్ష్మణుల్ని, అడిగి తీసికొని వెళ్ళేడన్నదానిలోని అంతరార్థం.

విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు దారిలో, బల, అతిబల అనే విద్యలను ప్రసాదించేడు. అస్త్రములు, మంత్రాలకు సంబంధించినవి. మంత్రం ఆలోచనకు (అనగా ధ్యానానికి) సంబంధించినది. ధ్యానం, జ్ఞాన సాధాన్ని ఆరోహింపచేసేది. ఈవిధంగా, గురువు ఇంతవరకూ ఇంద్రియ నిగ్రహంతో, అర్హతను సంపాదించిన సాధకుని లోని సగంగా వున్న ఆనంద జ్ఞానాంశను, ధ్యానమార్గంతో సంపూర్ణ ఆనందరూపజ్ఞానమార్గాన్ని పయనింపజేస్తున్నాడన్నదే, విశ్వామిత్రుడు రామునికి అస్త్రవిద్యోపదేశం చెయ్యడంలోని అర్థం.

గురువు అంటే ప్రత్యక్షంగా మానవరూపంతో ఉండే గురువే కానక్కరలేదు. గురుశబ్దానికి అంధకారనిరోధకత్వమే అర్థం కాన, గ్రంథపఠనంకాని, ఏదైనా సంఘటనగాని, మృగ, పక్షి, జడ రూపములయొక్క స్వభావ పరిశీలనంగాని, జ్ఞానాన్ని ప్రబోధిస్తే అవి అన్నీకూడా గురువులే కావచ్చు. భాగవతంలో ఈరకంగా 21 గురువులను ఒక కథలో పేర్కొనడం జరిగింది.

## సుబాహు మారీచుల వధ.

దారిలో, విశ్వామిత్రుడు రామునిచేత తాటకను చంపించేడు తాటక స్త్రీ కావడంచేత రాముడు ముందు చంపడానికి సందేహించేడు. కాని విశ్వామిత్రుని ప్రబోధంవల్ల ఆమెను చంపివేశాడు.

తాటక పదం 'తాడఘ' పదం యొక్క ఉచ్చారణలో మారిన అపభ్రంశరూపం. 'తాడ' అన్నదానికి, 'కొట్టడం' అనీ, 'ఘ' అన్న దానికి 'చంపడం' అని అర్థాలు. బాధించి, చంపే అజ్ఞానం, లేక మాయా వరణం అన్నది 'తాడఘ' పదం వల్ల స్ఫురిస్తుంది. విశ్వామిత్రుడిచ్చిన అస్త్ర విద్యా విధానంతో, అంటే, ధ్యాన మార్గ సహాయంతో, జ్ఞానాభి

వృద్ధిని పొందుతూవున్న రాముడు అనే సాధకుడు తన సాధనా దశలో ప్రప్రథమంగా ఎదురైన భూసంబంధ సుఖరూపమైన అజ్ఞానావరణాన్ని, నిస్తరింపజేసుకోవడమే. తాటకా సంహారంలోని అంతరార్థం. తటక యే 'తాటక' అవుతుంది. తట + క = తటక; తట - తీరమందలి అనగా భూమియందలి, క = సుఖం; అని వ్యుత్పత్త్యర్థము చెప్పవచ్చు. 'తటక' అన్నదే స్వార్థమున అణ్ చేస్తే 'తాటక' అవుతుంది. సుఖరూపం కావడంచేత స్త్రీగా చెప్పబడింది. ఆ సుఖరూప అజ్ఞానావరణం గురుప్రేరణ లేనిదే తొలగదన్నదే, విశ్వామిత్రుడు * 'స్త్రీ అని సందేహించక సంహరించు' అని ఆదేశించి ప్రేరేపించిన మీదటే, తాటకా సంహారం, రాముడు జరిపేడు అన్నదానిలోని అర్థం. సుఖరూప అజ్ఞానావరణం స్త్రీతో పోల్చబడింది. అది తొలగడంతో సాధకునికి ఇక గురూపదేశం అక్కరలేదు. నిమిత్త మాత్రంగా, గురు సన్నిధానంతో, తన కెదురయ్యే ప్రతిబంధక సామగ్రిని సులువుగానే శిష్యుడు తొలగించుకుంటాడు. తర్వాత విశ్వామిత్రుడు రాముణ్ణి సుబాహు మారీచుల వధకు నియోగిస్తాడు.

సుబాహుడు అంటే పెద్ద చేతులు కలవాడు అని అర్థం. ఈ పదంతో పెద్దగా మీదికి వచ్చి పీక్కుతినే ద్వంద్వముల తాలూకు ప్రతిఘటన స్ఫురిస్తుంది. ఆ ప్రతిఘటనను, నిస్తరించడమే సుబాహు వధకు అర్థం. రెండు పెద్ద బాహువులు సుఖ దుఃఖాది ద్వంద్వాలకు చిహ్నంగా చెప్పుకోవచ్చు. సు = మిక్కిలి పెద్దవైన; బాహుడు-చేతులు కలవాడు. పెద్దగా పొడవైన చేతులు గలవాడు అని వాచ్యార్థము.

మారీచుణ్ణి, రాముడు చంపలేదు. దూరంగా పడవేశాడు అంతే. 'మరీచి' పదంలోనుంచి మారీచపదం పుట్టింది. 'మరీచి' అంటే

* సుఖముల నపసంహరించడం ఏమిటి? అని సాధకుడు అనడమే స్త్రీని చంపడ మేమిటి? అని రాముడు అడిగిన దాని అంతరార్థంగా భావించాలి.

ఎండ మావులు. అంటే, నీరు అని భ్రమపెట్టే ఎండలోని తళతళలు. ఎండమావులు, జలరూపాన్ని ప్రదర్శించేవి గాన మాయగా చెప్పడం కలదు. అందుచేత, మారీచ పదం, లేనిది ఉన్నట్లుగా చూపి మాయకు మారుపదం. ఈ మాయ, అసలు లేనిదే అవడంచేత, దీన్ని చంపడం అన్నది ఎల్లాగు? ఎప్పటి కప్పుడు తత్తాత్కాలాలలో తెలిసికోవడం మాత్రమే (తొలగించుకోవడం మాత్రమే) జరుగుతుంది. కనుకనే, మారీచుణ్ణి చంపేడనక, పారద్రోలేడని, చెప్పవలసి వచ్చింది. ఈ మారీచుడు, మరల, రాముడికి, మున్యాశ్రమాలలో కన్పిస్తాడు. సీతాపహరణంలో, మాయలేడిగా రాముణ్ణి భ్రమ పెడుతాడు. పరిపూర్ణ జ్ఞానానందానికిగాని, మాయపూర్తిగా వశపడదు. ఇంకా రాముడు (సాధకుడు) జ్ఞానసాధనాప్రారంభదశలోనే వుండడంచేత, మాయను తాత్కాలికంగా మాత్రమే పారద్రోలడం జరిగినట్లు చెప్పబడింది.

## మి థి లా గ మ న ం.

గురువు, సాధకునకు, అన్ని విద్యలు ఉపదేశించి, ఆ పిమ్మట, ప్రకృతిని వశీకరణం చేసికొనే విద్యలో కూడ, సాధకుణ్ణి, సిద్ధి పొందించి ఆపైని సాధకుణ్ణి తన సాయం లేకుండా, స్వయంగానే, మిగిలిన దశలను సాధించుకోడానికి వదలివేస్తాడు. ప్రకృతిని వశీకరింపచెయ్యడానికి ముందు గురువు, శిష్యుణ్ణి సాధనలలో సంశయరహితుణ్ణిగా చేస్తాడు.

విశ్వామిత్రుడు, సీతాపాణిగ్రహణం రామునిచేత జరిపించాలని, రామలక్ష్మణుల్ని మిథిలాపట్టణానికి తీసుకొని వెడతాడు.

సీత అన్నపదం, 'సీ+ఇత' అని విడదీయవచ్చు. 'సే' అంతకర్మణి, అనే ధాతువునకు స్త్రీ ప్రత్యయమైన 'జీప్" చేస్తే 'సీ' అనే రూపం అవుతుంది. అప్పుడు 'సీ" అంటే 'అంతముకలది' అని అర్థం. 'సీ+ఇత'-సీత అవుతుంది. 'ఇత' అంటే పొందబడినది

అని అర్థం. అప్పుడు సీత అంటే అంతము కలదానిని పొందినది అనే అర్థం వస్తుంది. అంతంకల స్వభావమును పొందినది 'ప్రకృతి'. కాన 'సీత' అన్న పదానికి పైవిధంగా ప్రకృతి అనే అర్థాన్ని సాధింప వచ్చును. అంతే కాదు, సీత అంటే 'నాగేటిచాలు' అని కూడ అర్థం. నాగలితో దున్ని, భూమినుండి పంట తీస్తాం. నాగటి చాలు భూమిలో పంటకు మూలాధారమైనది. ప్రకృతి సమస్తమూ, నాగేటిచాలులోనే ఉంది. కాగా, సీత, ప్రకృతికి యావత్తుకూ ప్రతిరూపం అన్నమాట. భూమిలో నుండి, ప్రకృతి సంపద ఉద్భవిస్తూంటుంది. *షడ్భావ వికారాలు పొంది భూమిలోనే అణగిపోతూంటుంది. ఈ లాగు ఉత్పత్తి వినాశాలు కలిగినది 'ప్రకృతి' అన్నమాట. భూమినుండి సీత పుట్టిందికాన, సీత ఐహికప్రకృతి. ఈఐహికప్రకృతి మాయవలెనే సాధకునకు ప్రతిబంధకము. జ్ఞానానికిమాత్రమే అది వశమౌతుంది. అజ్ఞాని, దీన్ని వశపరచుకోలేడు. జ్ఞానాభివృద్ధిని సాధించే సాధకుని కే ఐహిక ప్రకృతిని గురువు వశపరుస్తాడు. ఇది గురువు ఇచ్చే అఖండ విద్య. రామునికి సీతతో పెండ్లి చేయించాలని మిథిలాగమనానికై విశ్వామిత్రునకు సంకల్పం కల్గిందన్నదానికి, జ్ఞానాభివృద్ధిని సాధిస్తూన్న శిష్యునకు, ప్రకృతి వశీకారవిద్యను ప్రసాదించడానికి గురువునకు సంకల్పం కల్గిందన్నదే అర్థం.

---

* షడ్భావ వికారములు :— 1 పుట్టుక, 2 పెరుగుదల, 3 నిలబాటు చేసి ఉండుట, 4 సడల నారంభించుట, 5 ముదిమి, 6 చావు.

ఈ షడ్భావ వికారాలు కలది ప్రకృతి, అట్టి ప్రకృతి నిత్యమైనదను కోవడంతో దానికి వశమవడంవల్ల వాసనలు మనస్సునంటి జన్మకారణము లౌతాయి. అయితే ప్రకృతి లేకుండ ఉంటే జీవించడమే కష్టం, జీవనం లేనిదే సాధనలేదు. కాన ముక్తిసాధకునకు ప్రకృతి వశమై ఉండాలి. అప్పుడు ప్రకృతితో ఉన్నా ముక్తి సాధ్యమే అవుతుంది.

## అహల్యా శాప విమోచనం.

అహల్య కథలో ఒక మహత్తరప్రయోజనం ఉద్దేశించాడు వాల్మీకి.

మిథిలాపట్టణానికి వెళ్ళే దారిలో, ఒకచోట, రాముడు, శూన్యమై పాడుపడియున్న ఒక ఆశ్రమాన్ని చూచి 'ఇది శూన్యంగా ఉంది ఏమిటి కారణం?' అని విశ్వామిత్రుణ్ణి అడుగుతాడు. విశ్వామిత్రుడు, 'ఇది పూర్వం గౌతముడు తపస్సుచేసినచోటు. అతనిపుత్రుడు శతానందుడు, ఇచ్చట గౌతముని భార్య అహల్య ఇంద్రునితో వ్యభిచరించింది. అది గౌతముని కళ్ళబడింది. ఇంద్రుణ్ణి గౌతముడు "నీవు అఫలుడ వౌతావు" (వృషణ రహితుడు) అని శపించి, తన భార్యయైన అహల్యను 'నీవు చలనరహితంగా ఇచ్చటనే దుమ్ముతో కప్పబడిపోయి చిరకాలం వుండి తరువాత రాముడు ఈ మార్గాన వచ్చినప్పుడు, అతని పాదరజస్సు సోకి, స్వస్వరూపం పొంది తిరిగి నాలో కలుస్తావు' అని శాపంతో, విమోచనాన్నికూడ చెప్పి వెళ్ళిపోయాడు. కాన, ఇది ఆనాటినుండి శూన్యంగా వుంది.' అని చెప్పి, ఆ దుమ్ములో కప్పబడి వున్న అహల్యకు రామపాదస్పర్శ కల్గింపజేస్తాడు అప్పుడు ఆనందంతో, అహల్య స్వస్వరూపం పొంది రాముని స్తుతించి వెళ్ళి పోతుంది. ఆ తర్వాత, రాముణ్ణి తీసుకొని విశ్వామిత్రుడు మిథిలకు వెడుతాడు.

ఈకథలో, సాధకుడైన రాముడు గురువును సాధనాభ్యాసంలో ఎదురైన ఒక క్లిష్ట పరిస్థితిని గూర్చి అడుగగా గురువు దానిని సవివరంగా చెప్పి సాధనలోని అడ్డు తొలగించాడు.

'గోతము' అన్నపదం, స్వార్థంలో వృద్ధి వచ్చి వ్యాకరణ రీత్యా గౌతము డవుతుంది. 'గో' అంటే, ఇంద్రియములు అర్థం. 'తముడు' అంటే, అణచివేసేవాడు. ఇంద్రియవృత్తుల ఉద్రేకాలను అణచివేసే సాధకుడే గౌతముడు. ఇచ్చట, గురూపదేశం ప్రకారం జ్ఞానమార్గంలో సాధన చేస్తున్న రాముడె, గౌతముడంటే. అతనిభార్య

అహల్య. భార్య అంటే, అతని పోషణతో అతనితోనే ఉండేది అని అర్థం. హలము అంటే నాగలి అర్థం. నాగలిచే దున్నదగినది 'హల్య' అవుతుంది. అట్లా దున్ని సంస్కరించడానికి శక్యం కానిది 'అహల్య' అని అవుతుంది. సాధకునిలోని ఇంద్రియ ప్రవృత్తులన్నిటికి మూలమైన వాసనాబీజం (మూలసంస్కారం) సంస్కరించడానికి శక్యం కానిది. 'అహల్య' అంటే, ఆ వాసనా కారణమైన మూలబీజమే అన్నమాట. ఈ వాసనాబీజం, మనస్సుతో కలిసినంతనే ఉద్బుద్ధములై పైకి మనస్సుతో తిరుగుతూ ఆనందిస్తూ వుంటుంది. పైకి వచ్చే విషయ వృత్తుల్ని, సాధకుడు ఎంత అణచినా అతనికి తెలియకుండా, వాసనా బీజం సాధకునిలోని మనస్సుతో తిరుగుతూ వుండడమే గౌతముడు తపస్సు చేస్తూన్న కాలంలో అతని భార్య, అహల్య అతనికి తెలియకుండా ఇంద్రునితో వ్యభిచరిస్తూందన్న దానిలోని అర్థం. మనం పూజాదులు నిర్వర్తిస్తూన్నప్పుడు కూడ మనస్సు వేరే వేరే ఆలోచనలు చేస్తూండడం మనకు అనుభవమే. ఈ మనస్సే ఇంద్రపదంతో చెప్పబడింది. (ఇందితి) ఇతి ఇంద్రః అనే వ్యుత్పత్త్యర్థంలో రాజు అని అర్థం వుంది. కాన ఇంద్ర పదానికి విషయములపైకి ప్రకాశంతో ప్రసరించే మనస్సుఅని అర్థం వేద భాష్యంలో చెప్పబడివుంది.

గౌతముడు అంటే, సాధకుడు మనస్సు చేసే పనిని గుర్తించి, అది ఎంతగా వాసనాబీజంతో కలిసినా, ఏవిధమైన ఫలితాన్ని, అంటే, పునర్జన్మవాసనలను కల్గించేదిగాను ఉండకూడదు; అని తనలో తాను దృఢంగా మనస్సును నియమించడమే, అఫలుడవౌతావని ఇంద్రుణ్ణి గౌతముడు శపించడం అన్నదానిలోని అంతరార్థం. ఫలం అంటే యోజనం అని, వృషణం అని రెండర్థాలూ ఉన్నాయి తర్వాత తనలోని వాసనాబీజకేంద్రాన్ని జ్ఞానానందసంయోగం లభించేవరకూ, కదలిక, మెదలిక లేకుండా ఉండేట్లు సాధకుడు కనిపెట్టి చూచుకొనే దీక్షను వహించడమే అహల్యను రామపాద ధూళిస్సు సోకేవరకూ రాయిగా పడివుండుమని శపించడమంటే.

అమనస్కయోగంతో వాసనలు తలయెత్తకుండా వుంటాయి. అట్లా, అమనస్కయోగం సాధకుడు పొందియుండటమే అహల్య రాయిగా పడియుండడమంటే. దీన్ని జడసమాధి అంటారు, యోగ విద్యలో, ఈ అమనస్కయోగం సిద్ధించడానికి పూర్వం, ఇంద్రియ నిగ్రహణతో సాధకుడు, సాధన చేసేటప్పుడు, వాసనలు ఉద్రేకస్థితిని కోల్పోతాయి. సాధకునిలోని వాసనాకేంద్రం ఎన్నో సుఖానుభూతుల్ని కల్గిస్తుంది. అవిధంగా, సుఖానుభూతులు, పుట్టుటనే, అహల్యా గౌతములకు శతానందుడు పుత్రుడుగా లోగడనే కల్గివున్నాడని చెప్పడంలోని అంతరార్థం. ఆవిధంగా నిగ్రహంతో కల్గిన సుఖాను భూతులు, తిరిగి జన్మనిచ్చే వాసనా ప్రాబల్యాన్నిమాత్రం కల్గివుండవు. కాన, అవి విదేహముక్తికి దగ్గరలో వుంటాయి. శతానందుడు, విదేహరాజులకు పురోహితుడుగా వున్నాడన్నదానిలోని అర్థం ఇదే.

అమనస్కయోగం, యోగము లన్నిటిలోను రాజులాంటిది, ఈ యోగమే నిర్వికల్ప సమాధి అనబడుతుంది. ఈయోగంతో జడ సమాధిలో ఉండగా జ్ఞానానందసంపర్కం కలిగితే, సాధకుడు సచ్చిదానంద స్వరూపాన్ని సాక్షాత్కరించుకోగల్గుతాడు. ఈస్థితిని సాధిస్తేనే సాధకునికి ప్రకృతిలోనిదంతా, ఆనందస్వరూపంగా గోచరించి ప్రకృతి అతనితో జతపడివుంటుంది. అప్పుడు సత్త్వ, రజ, స్తమోగుణాలు అతనికి దాస్యం చేస్తాయి.

సాధకుడైన రాముడు తనకు గురువైన విశ్వామిత్రుడు చెప్పిన విధానంతో సాధనలు చేస్తూండగా అమనస్కయోగం సిద్ధించింది. అమనస్కయోగం, జడ సమాధిస్థితి కావడంవల్ల, అంతా శూన్యంగా సాధకునకు గోచరించింది. ఆ శూన్యస్థితి తర్వాత, ఏమిసాధించాలో తెలియకపోవడంవల్ల సాధకుడు తికమకపడి, గురువుని సందేహ నివృత్తికి ప్రశ్నించడమే, దారిలో రాముడు, శూన్యాశ్రమంచూచి 'ఇది శూన్యంగా ఉందేమి' టని, విశ్వామిత్రుని ప్రశ్నించడంలోని అంతరార్థంగా భావించాలి, ఆ తర్వాత ఆశూన్యస్థితికి కారణం,

సవివరంగా అతనిలో ఏమేమి జరిగిందో, అంతా ముందు చెప్పి, దానికి జ్ఞానసంపర్కం కల్గించి, ఆనందమయంగా దాన్ని చెయ్యవలసిందని, గురువు సాధకునిచే ఆపని చేయించడమే, గౌతముని తపస్సునుగూర్చి, ఇంద్రాహల్యల సంయోగంగూర్చి, వారికి కల్గిన శాపాన్నిగూర్చి, చెప్పి విశ్వామిత్రుడు, రామునిచే పాదరజస్సు సోకింపజేసి, అహల్యకు శాపంనుండి విమోచనం కల్గించడం అన్న దానికి అంతరార్థం. ఇదంతా సాధకునికి తెలియకుండా, సాధకునిలో కల్గిన మార్పులకు కారణాలను గురువు విశదంగా చెప్పి, ఆపైన చేయవలసిన సాధనను ఉపదేశించడం అన్న సాధనాక్రమమును తెలిపేకథ. దీనినివాల్మీకి కావాలని వ్రాసేడు. ఈతర్వాతనే సాధకుడు ప్రకృతి శక్తిని వశీకరించుకొనే అర్హతను పొందుతాడు.

## శివధనుర్భంగం -- సీతాపాణిగ్రహణం.

సీతను పొందడానికి, జనకమహారాజు శివధనుర్భంగం, పణంగా నిర్దేశించేడు. విదేహరాజుల పూర్వుల కాలంలో, జనకుని ఇంటిలో ఏనాడో శివుడు త్రిపురాసురులను సంహరించిన ధనుస్సు, దేవతలచే దాచబడివుంది.

త్రిపురములు అంటే, మూడు పురములు. 'పురిశేతే ఇతి పురుషః' పురుషుడు అనగా పురమునందు శయనించువాడు. 'పురం' అనే పదం శరీరమునకూ, పురుషుడు అన్నపదం అందుండే పరమాత్మకూ అర్థం. ఈవిధంగా, ఆధ్యాత్మికగ్రంథాల్లో చెప్పబడింది. శరీరం త్రిగుణాలతో మూడు పురములుగా వుందనీ, మూడింటి లోనూ, ఒకే పరమాత్మ వున్నాడని చెప్పబడింది.

'ఓం' కారం ఈ అర్థాన్నే చెప్తూంది. 'అ + ఉ + మ్ = ఓమ్' అవుతుంది. అకా రోకార మకారాలు మూడూ, జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థాలక్షణాలు కల త్రిపురాలకు పేర్లనీ, వాటిలో, విశ్వ, తైజస, ప్రాజ్ఞులనే పేర్లతో పరమాత్మ వసిస్తూ వుంటాడనీ,

ఈమూడు అవస్థలను, చూచే సాక్షిమాత్రంగా ఉండే పరమాత్మను గ్రహించడమే తురీయావస్థ (నాలుగోఅవస్థ) అనబడుతుందనీ, ఆధ్యాత్మికగ్రంథాలు చెప్తున్నాయి. సమస్తమైన ఆకారముతో కూడిన విశ్వమూ, ఆ విశ్వములోని చైతన్యమూ, (తైజసమూ) ఆ చైతన్యములోని జ్ఞానమూ, (ప్రాజ్ఞమూ) మూడు పురములుగా, ఒకదానిలో ఒకటి వున్నాయి. అన్నిటియందూ పరమాత్మశక్తి కలదు కనుకనే, ఆకారము, కదలిక, ఎఱుక అనేవి కల్గుతూవున్నాయి. ఈమూడిటిని, ఏకంగా చూచినప్పుడు కల్గేది ఆనందము. అదే పరమాత్మస్వరూపం. అకారములో ఉకారమును లీనంచేసి, ఆ 'ఉ' కారమును మకారములో లీనంచేసి, ఆ మకారమును పరమాత్మలో లీనం చెయ్యాలి 'ఓం' కార జపంలో. అంటే, విశ్వాన్ని చైతన్యంలో లీనం చెయ్యాలి. చైతన్యాన్ని జ్ఞానంలో లీనం చెయ్యాలి. జ్ఞానాన్ని ఆనందంలో లీనం చెయ్యాలి. ఈ పురములు మూడింటినీ విడి విడిగా చూసినప్పుడు, అవి అసుర లక్షణములౌతాయి. ఆ అసురలక్షణములను సంహరించడము అంటే, మూడింటినీ, ఒకదానితో ఒకటి లయం చెయ్యటమే. ఇదే త్రిపురాసురసంహారం అంటే, త్రిపురాసురులను సంహరించినవాడు శివుడు. అంటే మంగళ రూపుడు ఆనందస్వరూపుడు.

శివ ధనుస్సు అంటే, త్రిపురములను, ఒకదానితో ఒకటి, లయం చేసే 'ఓం'కారప్రణవనాదం. ఆ శివ ధనుస్సు, విదేహ రాజులవద్ద దాచబడివుంది. విదేహరాజులు, అంటే, విదేహముక్తితో ప్రకాశించునట్టివారు; వారు జీవన్ముక్తులు. 'ఓం'కార జపసిద్ధిని పొందినవారు.

## సీతాపాణిగ్రహణం.

'శివధనుస్సును వంచినవారికి, సీతతో పాణిగ్రహణం జరుగుతుంది' అని పణంగా నిర్ణయించడములో 'ఓం'కార జపసిద్ధి పొందినవారికి, ఘనసంబంధమైన ప్రకృతి వశపడుతుంది అన్నదిఅంతరార్థం.

రాముడు, అహల్యాశాపవిమోచనం కల్గించేడు. అంటే అమనస్కయోగంలోని జడసమాధి ( నిర్వికల్ప ) స్థితిని, జ్ఞాన సంయోగంతో, సహజసమాధిస్థితిగా ( సవికల్పసమాధి ) మార్చ గలిగేడు. అమనస్కస్థితి అన్నది, త్రిపురములను ఏకత్ర చూడగల్గడం వల్లనే సిద్ధిస్తుంది. కాన, అమనస్కస్థితిలో సహజసమాధిని సిద్ధింపజేసిన సాధకునకు త్రిపురవిజయం సిద్ధించిందన్నమాట. అది జడసమాధిగా గాక ఆనందసమాధిగా మార్చబడిందికూడా.

త్రిపురవిజయం సాధించిన సాధకునిచేతిలో ఓంకార జప స్థితి తనంత తానుగా స్వాధీనపడింది. అదే శివ ధనుర్భంగం అంటే, శివధనుర్భంగంతో సీత అనగా భూసంబంధమైన ప్రకృతి, సాధకుడైన రామునకు అనగా సాధకునకు భార్యగా ఐనది. అంటే, వశపడింది అని అర్థం.

లక్ష్మణునికి ఊర్మిళతోను, భరతునికి మాండవితోను, శత్రుఘ్నుడికి శ్రుతకీర్తితోను, వివాహం జరిగింది. ఊర్మిళ, జనక రాజునకు కడుపున పుట్టిన కూతురు. సీత, యజ్ఞభూమిని దున్ను తూండగా దొరకినది కాగా, పెంపుడుకూతురు. మాండవి, శ్రుత కీర్తులు, జనకుని తమ్మునియొక్క కూతుళ్ళు.

లక్ష్మణుడు, పరమాత్మ లక్షణములను పొందిన జీవాత్మ, అతనికి భార్య ఊర్మిళ. ఉర్ములు అనగా క్షుత్, తృట్ తృష్ణా, శోక, మోహ, జరా మరణములు. వీనికి షడూర్ములు అని పేరు. ఇవి వాసనావశంవల్ల జీవుని ఆవరించి వుండేవి. 'ఊర్మీః లాతి గృహ్ణాతి ఇతి ఊర్మిలా'. అంటే షడూర్ములు గల జీవప్రకృతి అని అర్థం. ఈ ప్రకృతులు, జీవుణ్ణి పొంది వున్నాయనడమే, లక్ష్మణు నకు, ఊర్మిళ భార్య అన్నదానిలోని అర్థం. అయితే, లక్ష్మణుడు ఎక్కువ భాగం (నాల్గవవంతు) భగవదంశ సహాయంతో జన్మించిన వాడు కాన, అతడు నిరంతరం జ్ఞానానందరూపుడగు రామునితో,

నిత్యం కలిసివుండేవాడు. కాన, అజీవునికి షడూర్మలు ఏమియూ బాధింపవు. కనుకనే, లక్ష్మణుడు, రామునితో అరణ్యవాసమున ఉన్నంతకాలం, ఊర్మిళాదేవి నిద్రపోతూనే ఉన్నదని చెప్పబడింది.

భరతుడు, రాజ్యభరణం చేయువాడు. అతని భార్య మాండవి. 'మండ' అంటే భూషణం. మండేనా, వాతి, మండవా; మండపమునకు సంబంధించినది మాండవి అవుతుంది. భూషణంగా ఉండేదని మాండవిపదానికి అర్థం. రాజ్యం భరించే శక్తిని అలంకరించేది. అంటే, వన్నె పెట్టేది. రామాజ్ఞతో, భరతుడు చక్కగా రాజ్యం చేసేవాడు కావడము, మాండవి అతనికి భార్యగావుంది అన్నదాన్ని చెప్తూంది.

శత్రుఘ్నుని భార్య శ్రుతకీర్తి. శత్రువులను నాశం చేసే వానికి శ్రుతకీర్తి గుణంవుండాలి. 'శ్రుతం' అంటే శాస్త్రం. 'కీర్తి' అంటే పొగడిక. శాస్త్రంయొక్క స్తుతితో శత్రునాశంచేయడం జరగాలి, భరతునికి తోడుపడేవాడు శత్రుఘ్నుడు. శాస్త్రోక్త విధానంతో శత్రువులను, పారద్రోలేవాడుగా ఉన్నాడన్నదే, (శ్రుతకీర్తి) శత్రుఘ్నుని భార్య అని చెప్పడంలోని భావం.

ఈవిధంగా, రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు, వారి వారి లక్షణాలకు, అనుకూలురైన వారితో వివాహం జరిగింది. అనగా, వారి లక్షణాల కనుకూలమైన మనశ్శక్తులతో, వారు జత పడి వున్నారు అని అర్థం.

## పరశురామ గర్వభంగం.

శ్రీరాముడు, సీతాదేవిని పెండ్లాడి, అయోధ్యకు వస్తూంటే, ప్రకృతి అంతా భీభత్సంగా మారింది. సుడిగాలి రేగింది. భూపరాగం, ఆకాశాన్ని కప్పివేసింది. దుశ్శకునాలు తోచేయి. పరశురాముడు, విక్రమించుకుంటూ వచ్చి, రామునితో యుద్ధానికి తలపడ్డాడు.

ఆధ్యాత్మిక సాధకుడు, పైస్థాయికి వెళ్ళుతూన్నప్పుడు, విశ్వాంతరాళంలో కేంద్రీకృతమైవున్న దుష్టశక్తులు, సాధకుణ్ణి, భ్రష్టుణ్ణి చెయ్యడానికి, విక్రమిస్తాయి. దుష్టశక్తులు, ఉన్నతశక్తుల వృద్ధిని సహించలేవు. ఒక్కుమ్మడి, అన్నీకలిసి సాధనను భంగం చెయ్యడానికి విక్రమిస్తాయి. అదే, శ్రీరాముడు, సీతను తీసుకొని వెళ్ళేటప్పుడు జరిగిన గందరగోళం.

పరశురాముడు, భగవదంశమే అయిన రజోగుణ, తమోగుణములకు ప్రతికృతి. పరశురాముని చేతిలోని, పరశువును రాముడు అందుకోవడంతో అతని శక్తి రామునిలో ప్రవేశించింది. సాధకుడు, తనసాధనలో, త్రిగుణాతీతస్థితి సాధించినవాడు కావడంవల్ల, విశ్వాంతరాళంలోని, రజ, స్తమో గుణాలు అతనికి లోబడిపోయాయి అన్నది పరశురామ గర్వభంగానికి అర్థం.

పరశురామ గర్వభంగంతో రామాయణంలోని బాలకాండ పూర్తి అవుతుంది.

సాధకునికి ఇంక గురు సహాయం అక్కర్లేదు. కనుకనే, విశ్వామిత్రుడు, ఈతర్వాత కనబడడు. బాలకాండతో, సాధకునిలో స్వయంప్రజ్ఞ ఏర్పడడంతో ప్రథమ సాధనాదశలోని రెండవ మెట్టును అధిగమించడం జరిగింది. ఇంతటినుంచి సాధకునిలో రెండవదశ అందుకుంటుంది.

# అంతరార్థ రామాయణము

## అ యో ధ్యా కాం డ.

---

అష్టాచక్రా నవద్వారా దేవానాం పూ రయోధ్యా
తస్యాగ్ం హిరణ్మయః స్వర్గో లోకో జ్యోతిషా ఒఒవృతః
యో వై తాం బ్రహ్మణోవేద, అమృతే నాఒఒవృతాం పురీం
తస్మై బ్రహ్మ చ బ్రహ్మ చ అయుః కీర్తిం ప్రజాం దదుః॥

అధర్వణం 10-2-31 తై ఆ1 - 27-2-3

"త్వ గా ద్యష్ట ధాతు రూపములైన ఎనిమిది చక్రాలతో చక్షు రాది నవద్వారాలతో అయోధ్య అనే సార్థక నామంతో దేవతానిలయ మైన శరీరం అనే పట్టణం ఉంది. (శరీరం పుట్టుతూ, చస్తూ జనన మరణ పరిభ్రమణం కలది. ఈ జననమరణాలతో యుద్ధం చెయ్యడం అసాధ్యం కాన శరీరానికి అయోధ్య అంటే యుద్ధంచేసి గెలువ శక్యం కానిది అనే పేరు ఏర్పడింది). ఈశరీరం అనే పట్టణంలోని జ్యోతి ర్మయకోశానికి స్వర్గం అని పేరు. అది జీవచైతన్యరూపమైన జ్యోతిస్సుచే ఆవరించబడిఉంది. ఈ పట్టణాన్ని బ్రహ్మసంబంధ మైనదాన్నిగా ఎవడు తెలిసికొంటాడో వానికి బ్రహ్మయు, ప్రజాపతియు అయువు, కీర్తి, సంతానం మొదలగువానిని ఇస్తారు." అని పై వేద వాక్యాలకు అర్థం. దీన్నిబట్టి 'అయోధ్య' అంటే మామూలుపట్టణం కాదని, శరీరానికే అయోధ్య అని పేరు అని ధ్రువపడుతూంది. అయోధ్యలో అంటే శరీరంలో జరిగే విషయాలి గూర్చి చెప్పేదే అయోధ్యాకాండ అని అంతరార్థపరంగా చెప్పకోవాలి.

## శ్రీరామునకు యౌవరాజ్య పట్టాభిషేక ప్రయత్నం.

సీతాసమేతుడై అయోధ్యకు చేరుకున్న రామునకు యౌవరాజ్యాభిషేకం చెయ్యాలని దశరథుడు చేసిన ప్రయత్నంతో అయోధ్యాకాండ ప్రారంభిస్తుంది. సాధకుడు తనకు ప్రకృతి వశం కాగానే తాను సాధనలో పరిపూర్ణత్వం పొందినట్లుగా భ్రమపడి తాను ఇక సాధనతో నిమిత్తం లేకుండా సత్త్వరజస్తమో వాసనల నన్నిటిని తనలో ఐక్యంచేసికొని జన్మరాహిత్యాన్ని పొందదల సనుకొనడమే రామునకు సీతతో వివాహం కాగానే దశరథుడు పట్టాభిషేకం చెయ్యడానికి తొందరపడి ప్రయత్నం చెయ్యడమంటే.

అందుకు, దశరథుడు సామంతరాజుల్ని అందర్ని సమావేశపరచి శ్రీరామునిపట్టాభిషేకాన్నిగూర్చి వారివారి అభిప్రాయాలడుగుతాడు. అంటే, సాధకుడు ప్రకృతి వశీకారంతో తనలోని రాజసభావాన్ని తనలో ప్రకృతిని వశంచేసికొని వున్న ఆనందపూర్ణమైన ఆనందస్థాయితో ఐక్యంపొందే విషయాన్నిగూర్చి వాటి ఇచ్ఛను పరిశీలిస్తాడు అని అర్థం. రాజులంతా శ్రీరాముని గుణగణాల్ని వర్ణిస్తూ అతని పరిపాలనం దశరథుని పరిపాలనాన్ని మరపిస్తుందని తమ ఆమోదం తెలుపుతారు. అంటే, రాజసిక భావాలన్నీ సాత్త్విక భావ సముద్భూతమై ప్రకృతిని వశీకరించుకొన్న ఆనంద స్థాయిలో తాము కైవల్యస్థితిని పొందడానికి ఉత్సహిస్తాయి అనిఅర్థం. దశేంద్రియముల యొక్క దమన వృత్తిలో కంటె (దశరథవృత్తి) తాము ప్రకృతి వశీకారంపొందిన ఆనందస్థాయిలో అంటే, శ్రీరామునిలో పరమాత్మను దర్శింపగలుగుని సాక్షాత్కారస్థాయని అంతరార్థం. సాధకుడు ప్రకృతికి సంబంధించిన వృత్తుల్ని తమోగుణానికి సంబంధించిన వృత్తుల్ని అయంతకు అపరిపక్వదశలో భ్రమపడి ఈవిధంగా ఆత్మ పరిశీలన కుపక్రమించడమే దశరథుడు శ్రీరామునకు జనకుని కేకయరాజుని పిలువక పట్టాభిషేక ప్రయత్నం చెయ్యడంలోని అంతరార్థం.

## కైకకు మంధర ప్రబోధం, కైకవరాలు, దశరధమరణం.

మంధర అన్నపదానికి 'మంథం రాతి గృహ్ణాతి ఇతి మంధరా' అని వ్యుత్పత్త్యర్థం. 'మంథం' అంటే క్రిందదాన్ని పైకి, పైవాన్ని క్రిందకు తిరగ బోర్ల వేసేసాధనం కవ్వం అని అర్థం చెప్పవచ్చు. కవ్వముయొక్క స్వభావాన్ని, 'రాతి' అంటె, గ్రహించేది మంధర అనే మనోవృత్తి. ఒక నిర్ణయం తీసుకొనేముందు జరిగే మనసులోని కల్లోల పరిస్థితికే 'మంధర' అనిపేరు. ఇచ్చట సాధకుడు తనలోని ఆనందస్థితి ప్రకృతి వశీకారస్థితిని పొందడంతో సమస్త జన్మవాసనలను ఆ స్థితిలో కైవల్యం పొందించదలచడానికి ఒక నిర్ణయం తీసుకొనే ముందు తమోవృత్తిలో తమోగుణ సంబంధ వాసనలను రెచ్చగొట్టే తీవ్ర భావ సంచలనానికే 'మంధర' అని వాల్మీకి నామకరణంచేసి నాడు. మంథర మనోవృత్తి కైకను అంటే తమోగుణాన్ని రెచ్చ గొట్టింది. ముందు కైక మంథరమాట వినిపించుకోలేదు రామ పట్టాభిషేకం కౌసల్యకంటే తనకే ఎక్కువ సంతోషకారణంగా చెప్పింది. అంటే, ఆనందస్థాయిలో సత్త్వవృత్తికంటే తాను ఎక్కువగా పరవశిస్తాను అని సాధకునిలోని తామసవృత్తి భావించిందన్నమాట. తర్వాత మంథర రామపట్టాభిషేకంవల్ల కౌసల్య రాజమాత అవు తుందని, అప్పుడు ఆమెకు సర్వాధికారాలు వస్తాయని, నీవు కౌసల్య యొక్క చెప్పుచేతల్లో ఉండి దాస్యం చెయ్యవలసి వస్తుందని, నీగతి చివరివరకు అంతేనని తల తిరిగేటట్లు బోధిస్తుంది. అంటే సాధకునికి అతనిలోని తమోవాసనలు పెడిచిపెట్టడానికి అవి ఇంకా పరిపక్వా వస్థకు రాలేదని అందుకు ఇంకా సాధనలు సాగించవలసియే యుంటుందని, ఇప్పుడు రామపట్టాభిషేకంవల్ల తమోవాసనలు కైవల్యం పొందవని అందుచే ముక్తి సిద్ధించదని సాధకునకు మానసిక మైన కలతవల్ల చిట్టచివరకు తోస్తుందని పై మంథరా వృత్తాంతంవల్ల స్ఫురిస్తుంది. సాధనచేసేవానికి కలిగే మానసిక పరిశీలనాస్థితిగా మంథర పాత్ర ప్రవేశపెట్టబడిందిగా మనం గ్రహించాలి.

తనలోని ఆనందస్థాయి తనలోని తమోవాసనలను ఐక్యంచేసి కోవడానికి ఏమి కావలసి వుంది? తమో వాసనలు అప్పుడు కోరవలసిన దేమిటి? ఆ సంగతికూడ మంథర చెప్పింది అంటే మనస్సుయొక్క కలవరంవల్ల సాధకునకు తోచింది అన్నమాట. 14 సంవత్సరాలు శ్రీరామునకు అరణ్యవాసం, భరతునకు రాజ్య పట్టాభిషేకం వరాలుగా కోరవలసిందని మంథర కైకకు నచ్చచెప్పింది. అంటే, సాధకునిలోని అసంపూర్ణమైన ఆనందస్థాయి తమోవాసనలను ఐక్య పరచుకొనడానికి పరిపూర్ణస్థితిని పొందాలంటే 14 సంవత్సరాలు అంటే 14 ఇంద్రియాలు అరణ్యవాసం చెయ్యాలి. అరణ్యం అంటే రణం = యుద్ధంరణయోగ్యం. రణ్యం అంటే యుద్ధస్థితి, అంటే, భావసంఘర్షణం మనసులోని అంతరాంతరాలలో సాగే భావ సంచలనం రణ్యం అన్న మాట. ఇది కైవల్యస్థితిని పొందించడానికి ప్రబలమైన అంతరాయం. రణ్యంకానిది అరణ్యం అత్యంత ప్రశాంతి స్థితిఅన్నమాట. ఆనంద స్థాయితో ప్రకృతిని వశీకరణం చేసికొన్నప్పటికే సాధకునిలో 14 ఇంద్రియాల్లో అంతరాల్లో నిరంతరం భావ సంచలనం కల్గుతూనే ఉంటుంది. ఆ భావ సంచలనం ఐదు ఇంద్రియాలకూ, ఐదు కర్మేంద్రియాలకూ, అంతఃకరణ చతుష్టయానికి (మనో, బుద్ధి, చిత్తాహంకారాలకు) మొత్తం 14 గింటికి సంబంధించిఉంటుంది 14 ఏండ్లు అరణ్యవాసం అంటే, ఈ పద్నాలుగింటను అత్యంత ప్రశాంతస్థితిని నివసింపచెయ్యడం అనే సాధన అన్నమాట. ఈ సాధన జరిపే సందర్భంలో సాధకునకు జీవయాత్రకు సంబంధించిన వ్యవహార భరతవృత్తి అంటే జీవనభరణవృత్తి చూడాలి, అంటే *భగవదంశ 1/8 వంతు పొందియున్న జీవన భరణ వృత్తి శత్రుఘ్న సహాయంతో అంటే, 1/8 వంతు భగవదంశముతో గూడిన శత్రువిజయ మనో

*పాయస విభాగం ముందు వెనుకల తేడాతో జరుపడంవల్ల దశరధుడు సుమిత్రకు ముందుగా ఇచ్చిన 1/4 పాయస భక్షణంతో లక్ష్మణుడు, తర్వాత ఇచ్చిన 1/8 పాయస భక్షణంతో శత్రుఘ్నుడు కల్గేరని చెప్పుకోవాలి.వారిద్దరు కవలపిల్లలుగదా అని వారిద్దరు సమాంశ సంభవులని అనుకొనుటకూడదు.

గుణంతో సాధకుడు జీవయాత్ర సాగించాలి అన్నదే భరతునకు పట్టాభిషేకం జరిగించాలి అన్నదానికి అర్థం. సాధకునిలో కలిగిన మానసికవు కలవరపాటువల్ల తేలిన సారమే అతనికి పూర్ణ ప్రశాంతి స్థితికి అంటే కైవల్యానికి దారి చూపించింది అని తాత్పర్యం. రామ వనవాస గమనంతో దశరథుడు మరణిస్తాడు. అంటే, సాధకుడు కర్మ జ్ఞానేంద్రియాలలోను అంతఃకరణ చతుష్టయంలోను ప్రశాంత స్థితిని పొందించడానికి ప్రారంభించగానే అతనిలో దశరథ స్థితి అంటే దశేంద్రియ మనస్థితి అవసరం తీరిపోతుంది. ప్రశాంతస్థితినే సాధించేటప్పుడు యింద్రియాలకు నిగ్రహాస్థితి ఉండదు అని అర్థం. దశరథ సాధనలో అనగా ఇంద్రియనిగ్రహానున్న సాధకుడు క్రమంగా సాగిన శ్రీరామ సాధనతో అనగా ప్రకృతితో కూడి ఆత్మానందం కల్గిన వాడుగా మారుతాడు పూర్తిగా.

## కైక కోరిన మొదటి వరం.

శ్లో॥ నవ పంచ చ వర్షాణి దండకారణ్య మాశ్రితః
చేరాజినధరో రామో భవతు తాపసః॥

పధ్నాలుగు సంవత్సరాలు దండకారణ్యంలో రాముడు నార బట్టలతో కృష్ణాజినంతో ధీరుడై తపస్సు చేసేవాడుగా ఉండాలి. అని కైక కోరిన మొదటి వరం.

రాముణ్ణి కేవలం తొలగించుకోవడానికి మాత్రమే అయితే పధ్నాలుగు సంవత్సరాలు మాత్రమే ఎందుకు గడువు పెట్టింది? దండకారణ్యంలోనే ఉండాలన్న నియమం దేనికి? ధీరుడై, తపస్సు చెయ్యాలనడం మరీ వింతగా ఉందే!

ధీరుడై తపస్సు చెయ్యాలి అనడంలో కైక రామునికి ఏదో ఘనత కలిగించే స్థితిని ఆకాంక్షిస్తూందనక తప్పదు. దండక + అరణ్యం అంటే, శిక్షణను చేకూర్చే ప్రశమనస్థితి. *నవపంచ చ=పధ్నాలుగు;

*నవ, పంచ, చ = తొమ్మిది ద్వారములు. ( రెండు చెవులు, రెండు కన్నులు, రెండు ముక్కు రంధ్రములు, నోరు, మలద్వారము, మూత్రద్వారము) 1 జిహ్వ, 2 పాణి, 3 పాదము, 4 చర్మము 5 మనస్సు అను అయిదింటిని మొత్తం పధ్నాలుగింటిని అనికూడ చెప్పవచ్చును.

వర్తాణి = స్రవింపజేయువాటిని గూర్చి, అనగా దశేంద్రియములు, అంతఃకరణ చతుష్టయం అను పథ్నాలుగును వెలుపలికి సంకల్పము లను స్రవింపజేయునట్టివి. అట్టిపథ్నాలుగింటిని సాధకుడు శిక్షణముతో ప్రశమనస్థితిని కల్గించి ధీరుడై తపస్సు చెయ్యాలి అని వాల్మీకి పై మాటలలో ప్రస్ఫుటం చేస్తున్నాడనక తప్పదు. దశేంద్రియ నిగ్రహం తర్వాత అనగా దశరథ స్థితి తర్వాత మోక్షాన్ని కోరే సాధకుడు చేయవలసిన సాధనా మార్గం 14 ఇంద్రియాలలోను ప్రశాంతస్థితిని సాధించే సాధన చెయ్యక తప్పదు అనేది సాధనారహస్యం.

## సీతా లక్ష్మణులు రాముని అనుసరించుట.

**రామునకు మాత్రమే అరణ్యవాసం విధింపబడితే సీతా లక్ష్మ** ణులుకూడా వెళ్ళారు ఎందుకు? ఎప్పుడూ వ్యష్టిగతంగా ప్రతి ప్రాణి లోను, పరమాత్మ, జీవుడు, మాయాప్రకృతి అనే మూడూ ఉంటాయి. పరమాత్మను విడదీస్తే మిగిలిన రెండూ ఉండవు. అసలు నిజానికి మూడూ ఒకటే. మూడూ పరమాత్మస్వరూపాలే. వాసనాబద్ధుడైనపుడు జీవుడుగా ప్రతిబింబ మాత్రంగా ప్రతి ప్రాణిలోను ఉన్నవాడు పర మాత్మ. విక్షేపావరణశక్తులలోని జీవ, పరమాత్మలను ఆవరించి యుండేదిగా మాయాప్రకృతి వుంది. లక్ష్మణుడు, రాముని లక్ష్మ అంటే చిహ్నము కల్గినవాడుగా జీవునకు ప్రతిరూపము. సీత భూ పుత్రిగాన ప్రకృతి రూపిణి, కాన పరమాత్మతో (ఆనందరూప పర మాత్మాంశతో), అవి (సీతా లక్ష్మణరూప ప్రకృతి, జీవాత్మలు) నిత్యమూ అనుసరించియే ఉంటాయి అని అర్థం.

## సీతకు వల్కాల ధారణం నిషేధించుట.

కైకేయి తెచ్చి యిచ్చిన నారచీరలు రామ, లక్ష్మణులు స్వీక రించి కట్టుకున్నారు, కాని సీత మాత్రం కట్టుకోడానికి ఇష్టపడలేదు.

శ్లో॥ అ ధాత్మ పరిధానార్థం సీతా కౌశేయవాసినీ
సంప్రేక్ష్య చీరం సంత్రస్తా వృషతీ వాగురా మివ
సా వ్యపత్ర పమాణేవ ప్రగృహ్య చ సుదర్శనా
కైకేయ్యాః కుశచీరే తే జానకీ శుభలక్షణా॥

పట్టుచీర కట్టుకొనియున్న సీత తాను కట్టుకోవడంకోసం తెచ్చిన నారచీరను చూచి అడులేడి, వలనుచూచి బెదరిపోయినట్లు భయపడి పోయింది. ఆమె మనస్సు ఎక్కువగా దుఃఖపడింది. సిగ్గుతో కుమిలిపోతూ, కైక యిచ్చిన నారబట్టలందుకొన్నది. కాని, అ బట్టలు ఎల్లాగు కట్టుకోవాలో బోధపడక వానిని తన మెడమీద వేసుకొంది. శ్రీరాము డప్పుడు తాను ఇట్లా ధరించాలని ఆమె పట్టుచీరమీద వానిని కట్టిచూపించేడు. వశిష్ఠుడు ఆ దృశ్యంచూచి కైకేయిపై మండిపడినాడు. "అధోత్తమా న్యాభరణాని దేవి! దేహి స్నుషాయై వ్యపసీయ చీరం" నారబట్టలను తీసివేసి కోడలికి మంచిమంచి అభరణాలు ఇయ్యి" అన్నాడు. అజ్ఞాపిస్తూన్నట్లు దశరధుడు, సీతకు పెట్టెలలోవున్న పట్టుచీరలన్నీ వనవాసంలో ధరించడానికి రధంమీద పెట్టండని కోశాగారాధిపతుల్ని అజ్ఞాపించేడు.

నిజానికి సీతాలక్ష్మణులు అరణ్యవాసం చెయ్యనక్కర్లేదు. అందుచేత వారు నారబట్టలూ కట్టుకోనక్కర్లేదు; అయినా లక్ష్మణుడు, అన్న నారబట్టలు కట్టుకోవడంతో తానూ నారబట్టలు ధరించాడు. తాను అన్నకంటే, మంచి దుస్తులు ధరించడానికి ఇష్టపడలేదు. మఱి, సీతమాత్రంభర్త వేషానికి అనుగుణంగా నారచీర ఎందుకు ధరించడాని కిష్టపడలేదు? అది పతివ్రతా ధర్మమా? వశిష్ఠ, దశరధులు కూడ ఆమె నారచీర ధరించడాన్ని కాదనడం ఏమి సముచితం? భర్తతో సకల కష్టాలు అనుభవించాలని స్వయంగా కోరుకొని అరణ్యగమనానికి భర్తను ఒప్పించి వెళ్ళడానికి సిద్ధపడిన సీతకు చీరలుమీద, అభరణాల మీద మోజు ఉండడం తగునా?

సీత భూమినుండి పుట్టిన ప్రకృతిరూపిణి ప్రకృతి ఎప్పుడూ నిత్యనూత్నంగా మారుతూనే ఉంటుంది. నిత్యసౌందర్యం సంతరించు కుంటూనే వుంటుంది. ప్రకృతిని ఇల్లాగే ఉండాలని శాసించేవారు లేరు. అది సహజసిద్ధమైనది. పరమార్థంలో సీత నిత్యసౌందర్యం గల ప్రకృతిరూపిణి అని చెప్పడానికే వాల్మీకి ఆమెచేత నారచీర కట్టించలేదు. సర్వాభరణములతో, సర్వ వస్త్రములతో ఆమెను అరణ్యంలో భర్తతో సంచరింపజేసాడు. ప్రశాంతస్థితిని సాధింప దలచిన సాధకునికూడ, ప్రకృతి తన విలాసములతో భ్రమపెడుతూనే అతనిలోనే ఉంటూంటుందనీ, సాధకుడు ప్రకృతిని విడవకుండానే ఆమెను స్వస్వరూప అనుసంధానంతో పరమాత్మ భావనతో అనుభూతి పొంది తనలో ఐక్యపరచాలి అనీ, సాధనాపరమైన అంతరార్థం మనకు ఇందులో వాల్మీకి మహర్షి ప్రస్ఫుటింప జేసాడు అని చెప్పాలి

## గుహుని సహాయంతో రాముడు గంగను దాటుట.

అరణ్యంలో సీతా,రామ, లక్ష్మణులు ప్రవేశించినతర్వాత ఆ అరణ్యాన్ని పాలించే నిషాదరాజు గుహుడు శృంగబేరపురమున రాముని కలిసికొని గంగానదిని తాను స్వయంగా దాటించేడు. రాముడు గంగను దాటి వెళ్ళేడనీ, శృంగబేరపురంలోని నిషాదరాజు తాను స్వయంగా పడవమీద గంగను తరింపజేసాడనీ చెప్పడం రామాయణంలోని ముఖ్య కథకు అంతగా అవసరం లేకపోయినా; వాల్మీకి దీనికి ప్రాధాన్యం యిచ్చాడు. ఇదేవిధంగా, బాలకాండలో అనవసరమైన అహల్యా వృత్తాంతముకు ప్రాధాన్యం ఇచ్చి, అందులో ఒక గొప్ప ఆధ్యాత్మికసాధన ప్రవేశపెట్టేడు, ఈ గుహో పాఖ్యానంలోకూడ ఒక విశేషమైన సాధన ఉంది.

శృంగబేరం అన్నప్పుడు, బేరముయొక్క అనగా దేహము యొక్క శృంగం అని ప్రథమాతత్పురుష సమాసం చెప్పాలి; అప్పుడు దేహముయొక్క అగ్రభాగం అనగా సహస్రారచక్రం అనే

అర్థం ఆ శృంగబేరపదానికి చెప్పుకొనవచ్చు. నిషాదుడు అంటే, ని+సాదః నితరాం సాదః=నిషాదః అనే మనోవృత్తిలో మిక్కిలి నైర్మల్యం కలవాడు అని అర్థం. గుహుడు అంటే, గు=అంధకార మును, హ=హరించునది, జ్ఞానము అరణ్యవాసం అంటే ప్రశాంత స్థితి. గంగా అంటే గచ్ఛతి, గచ్ఛ తీతి గంగా అని అవుతుంది నిరంతర గమనశీలమైన, కాలం అని దానికి అర్థం. అరణ్యంలో ప్రవేశించడానికి బయలుదేరినతర్వాత, రామునకు అనగా సాధకు నకు శృంగబేరమునందు అనగా సహస్రారచక్రమందు నిషాదునకు అనగా నైర్మల్యమునకు గుహుడు అంటే అజ్ఞానాన్ని హరించేజ్ఞానం గంగను అనగా కాలాన్ని దాటిస్తుంది. ఈ మహోపాఖ్యానములో ముందు దశేంద్రియదమనం జరిగేక, తర్వాత ప్రశాంతస్థితిని ఇంద్రియాలు పద్మాల్గింటిలోను కల్గించడమునకు పూనుకొనడంతో సహస్రారం విచ్చుకొని బుద్ధియోగంలో విశుద్ధజ్ఞానంపొంది సాధకుడు కాలానికి కట్టుబడక సాధన సాగిస్తాడన్నది ఈకథలో అంతరార్థ పరంగా చెప్పబడింది.

## సీత గంగను ప్రార్థించుట.

శ్లో॥ వైదేహీ ప్రాంజలి ర్భూత్వా తాం నదీ మిద మబ్రవీత్
పుత్రో దశరథ స్యాయం మహారాజస్య ధీమతః
నిదేశం పాలయ త్వేనం గంగే త్వదభిరక్షితః
చతుర్దశ హి వర్షాణి సమగ్రాణ్యుష్య కాననే
భ్రాత్రా సహ మయా చైవ పునః ప్రత్యాగమిష్యతి
తత స్త్వాం దేవి! సుభగే క్షేమేణ పునరాగతా
యక్ష్యే, ప్రముదితా గంగే! సర్వకామ సమృద్ధినీ
త్వం హి త్రిపథగే! దేవి! బ్రహ్మలోకం సమీక్షసే
భార్యా చోదధిరాజస్య లోకేఽస్మిన్ సంప్రదృశ్యసే
సా త్వందేవి! నమస్యామి ప్రశంసామి చ శోభనే!
ప్రాప్త రాజ్యే నరవ్యాఘ్రే శివేన పునరాగతే
పునరేవ మహాబాహుః మయా భ్రాత్రా చ సంగతః॥

వైదేహి ప్రాంజలియై గంగానదినిగూర్చి ఈవిధంగా పలికిం
'గంగాదేవీ! ఇతడు దశరథుని కొడుకు; దశరథుని అజ్ఞమ
స్తున్నాడు. నీ రక్షణను పొందినవాడై పదునాల్గుసంవత్సర
కాననమందుండి నాతోను, తమ్మునితోను తిరిగి క్షేమంగా రా
అన్నికోరికలతో నిండినదానినై సంతోషము పొందినదానినై ని
సేవిస్తాను. నీవు త్రిపథగవు; బ్రహ్మలోకమును చూస్తున్నా
ఉదధి రాజునకు భార్యవు; తిరిగి రాముడు రాజ్యమునుపొ
శివము పొందినవాడై నాతోను, తమ్మునితోను, మహాబాహు
నీతడు రావడంతో నీకు మ్రొక్కులు చెల్లిస్తాను. నిన్నుస్తుతిం
కొంటాను.

వైదేహి గంగను ప్రార్థించింది. అంటే, సాధకునిలోని విదే
ముక్తినికోరే మనోవృత్తి కాలాన్ని ప్రార్థించడం అన్నమాట. దశరథ
పుత్రుడు అతని అజ్ఞను పాలించి 14 వర్షములు కాననమందుంటా
అంటే, పది ఇంద్రియాలను సంయమనం చేసిన సాధకుడు,
బలంతో ఇప్పుడు పదునాల్గు ఇంద్రియాలను (కర్మేంద్రియములు
జ్ఞానేంద్రియములు 5+అంతఃకరణ చతుష్టయం 4) కాననమందుండి
అనగా క+(*పరబ్రహ్మము) ఆసనమందు, భగవన్ముఖమునందు
అనగా ఇంద్రియములను భగవదర్పణంచేసి సీతతో, లక్ష్మణుని
అంటే, ప్రకృతిలో, జీవునితో అని అర్థం, శివము పొందినవా
అంటే శివము అనగా భగవత్స్వరూపము (సత్యం, శివం, సుంద
మూడు భగవద్రూపాలు) నొంది, అనగా భగవదైక్యమునుపొం
నపుడు నేను సర్వ కామములు పొందినదాననై సంతోషించినదాన
అనగా భగవదైక్యానుసంధానము కలవాని ప్రకృతి సర్వకామము
సిద్ధించి నిరంతరానందానుభవం పొందుతుందని అర్థం,

* 'క' అనగా పరబ్రహ్మము 'క' అను దానికి ఆనందము లేక సుఖ
ఆనే అర్థం వుంది. కాన, ఆనందరూపం పరబ్రహ్మ రూపం పరబ్రహ్మ
రూపమే అవుతుంది.

" గంగే! త్రిపథగే " అంటే భూత, భవిష్య, ద్వర్తమానములు మూడింటను నడుచునట్టికాలము అని అర్థం. నీవు ఉదధిరాజు యొక్క భార్యవు. అంటే, ఉత్ + అధిరాజు ఉన్నతస్థానము నధిష్ఠించిన ప్రభువునకు అనగా పరమాత్మకు భార్యవు అని అర్థం. బ్రహ్మలో కొన్నినీవు చూస్తున్నావు. అనగా "కాలము బ్రహ్మస్వరూపము" అని ఉంది కాన బ్రహ్మదర్శనము కలది కాలమన్నమాట. నాకు నీవు బ్రహ్మదర్శనం కల్గించగలవని అర్థంకూడ ఇందున్నది. ప్రాప్త రాజ్యుడై అంటే, పరబ్రహ్మానుసంధానముపొందినవాడై సాధకుడు, తిరిగి లోకప్రవృత్తిలోనికి వచ్చి సీతతోను, లక్ష్మణునితోనుకూడి, అంటే, ప్రకృతితోను జీవాత్మతోను కలిసి పరబ్రహ్మానుభూతికలవాడై అని అర్థం.

కాలమా! సాధకుడు 'అహంబ్రహ్మాస్మి' అనే భావంతో ఇంద్రియ ప్రశాంతిని సాధించి తర్వాత 'సర్వంఖల్విదం' భావమును సాధించి తిరిగి వచ్చేటట్లు చేయవలసింది' అని సాధకునిలోని ప్రకృతిచేసే కాలప్రార్థన, సీత గంగను ప్రార్థించడం అన్న ఘట్టంలో వాల్మీకి మహర్షిచేత పరోక్షం చెయ్యబడింది. ఇచ్చట రాముడు ప్రార్థించక సీత ప్రార్థించిందని చెప్పబడింది. ఇచ్చట రాముడు సాధకుడు. అతనిలోని ప్రకృతియే సీత. కాన సాధకుడు తనలోని మనః ప్రకృతిని పైవిధంగా వెల్లడించినాడన్నమాట. అంటే, రాముడే ప్రార్థించాడన్నా సీత ప్రార్థించిందన్నా, ఇచ్చట ఒక్కటే తాత్పర్యం. సాధకుడు సాధకునకు ముందు, మనోదార్ఢ్యాన్ని పొందడానికి కాలరూపభగవానుని తన సాధనను సిద్ధింప జెయ్యవలసింది అని కోరడమే పై శ్లోకాలలోని అంతరార్థం. ఇచ్చట సీత, రాముడు అన్నవన్నియు ఒకే సాధకునిలోని తత్త్వాలకు పేర్లు.

## రాముడు భరద్వాజాశ్రమం చేరుట.

తర్వాత రాముడు గంగా, యమునాసంగమప్రదేశమున ప్రయాగలో భరద్వాజాశ్రమాన్ని ప్రవేశిస్తాడు. భరద్వాజమహర్షి

రాముణ్ణి తన ఆశ్రమంలో నివశించుమమంటారు. 'ఇచ్చట ఉంటే ప్రజలు వస్తూ, పోతూ ప్రశాంతతను ఉండనివ్వ'రని రాముడు భరద్వాజునకు అభ్యంతరం చెప్తాడు. అంత భరద్వాజుడు రామునకు చిత్రకూటపర్వతం సరియైన నివాసంగా నిర్ణయిస్తాడు. ఇక్కడ ముందుగా మనం భరద్వాజకథలోని అంతరార్ధం తెలిసికోవాలి. భరద్వాజ జన్మవృత్తాంతం భాగవతంలో వుంది. ముందు, కథాక్రమం చెప్పి తర్వాత అందులోని ఆధ్యాత్మికమైన అంతరార్థాన్ని వివరిస్తాను.

## భరద్వాజ జననం.

'ఉతథ్యు' డనేవాడు బృహస్పతికి అన్న. ఉతథ్యుని భార్యపేరు మమత. ఆమె పూర్ణగర్భిణిగా ఉండగా బృహస్పతి ఆమెను తనతో కలియవలసిందిగా నిర్బంధించి ఆమె ఇష్టపడకున్నా బలాత్కారంగా రమిస్తాడు. గర్భంలోనున్న శిశువు బృహస్పతి వీర్యాన్ని పైకి గెంటివేస్తాడు. మమతకూడ తన యోని అంచులుబిగించి ఆ వీర్యాన్ని తిరిగి యోనిలో చేరకుండా బైటకు నెట్టివేస్తుంది బృహస్పతి లోపలి శిశువు పైని కినిసి "నీవు పుట్టంధుడ వౌదువు గాక" అని శపిస్తాడు. ఆబిడ్డయే 'దీర్ఘతముడు'. క్రిందపడిన బృహస్పతియొక్క వీర్యం ఒక శిశువుగా ఏర్పడింది. మన ఇద్దరకూ పుట్టిన ఈ శిశువును 'నీవు తీసికొనివెళ్ళు' అంటే, నీవు తీసికొనివెళ్ళు అని 'ద్వాజం ద్వాజం భర' అంటూ మన ఇద్దరకు పుట్టినవానిని నీవు పోషించు మన ఇద్దరకు పుట్టినవానిని నీవు పోషించు అంటూ సంస్కృతంలో మమతా, బృహస్పతులు వాదులాడుకొన్నారు. ద్వాజంభర, ద్వాజంభర' భర అని అవ్యవహితంగా పెక్కుసార్లు ఉచ్చరించడంతో భరద్వాజ అని విన్నవారికి వినబడింది. దానితో ఆబిడ్డను 'భరద్వాజుడ'ని అందరూ పేర్కొన్నారు. చివరకు ఇద్దరూ ఆశిశువును వదలిపోతే, తర్వాత మరుత్తులు ఆ బిడ్డనుతీసి, సంతానార్థియైన భరతుడనే రాజు కిచ్చారు. తర్వాత చాలకాలం భరద్వాజుడు చక్కగా రాజ్యమేలి, చివరి కాలంలో సన్న్యసించి మహర్షియైనాడు.

ఇటువంటి అశ్లీలకథలు పురాణాల్లో ఎన్నో కన్పిస్తాయి. అవి వాచ్యార్థంలో చాల జుగుప్సావహమైన కథలు. అవి ఎందుకు వ్రాయబడ్డాయి? ఆలోచించి చూస్తే అంతరార్థపరంగా, వ్యంజనా వృత్తితో వానిలో మహత్తరమైన ఆధ్యాత్మికత గోచరిస్తుంది. పై కథలో అంతరార్థాన్ని విడదీద్దాము.

'ఉ' అనగా ప్రకృతి. ఓమ్ లో అ + ఉ + మ్ అనే అక్షరాలున్నాయి, వానిలోని ఉ కారమునకు 'తైజస' ప్రకృతిఅర్థం. ఉ + తథ్యుడు అనగా ప్రకృతియే సత్యమని తలచు మనోవృత్తి అన్నమాట. అతని భార్య మమత. ఆ ఉతథ్యవృత్తితో ఉండేది, మమకారవృత్తి. మమత అనగా మమకారము. ఉతథ్యుని భార్య మమత. అంటే, ప్రకృతికి వశపడి మమకారం ఉంటుందన్నమాట. ఉతథ్యునివల్ల మమత పూర్ణగర్భిణియై దీర్ఘతముని కన్నది. అనగా, ప్రకృతియే నిత్యము అనుకొనే మమకార ప్రవృత్తి వలన విడువరాని అజ్ఞానం ( దీర్ఘ-విస్తారమైన, తమః-అజ్ఞానం ) కల్గుతుందనీ అర్థం. దీర్ఘతముడు,ఉతథ్యునకు, మమతకుపుట్టేడంటే ప్రకృతి మమకారాలకు అజ్ఞానం పుట్టిందని అర్థం. 'బృహత్ వాచః పతిః బృహస్పతిః అని వ్యుత్పత్త్యర్థంలో, గొప్ప వాక్కులకు అనగా వేదవాక్కులకు ప్రభువు బృహస్పతి అని అర్థం. కాన, వేదవేద్యుడైన పరమాత్మయే ఇచ్చట బృహస్పతి పదానికి అర్థం. బృహస్పతి మమతను బలాత్కరించి రమించేడంటే, ప్రకృతిసత్యం అని నమ్ముకొన్న అహంకార, మమకార వృత్తుల్ని హఠాత్తుగా బలాత్కరించినపుడు పుట్టేది భరద్వాజ మనోవృత్తి. హఠయోగంలో ప్రాణాయామ సాధనతో కుంభకంతో మనస్సును బలవంతంగా నిశ్చలంచేసి పరబ్రహ్మానుసంధానం జరిగించడం అన్నమాట. హఠయోగం అన్నపదానికి హఠ-బలాత్కారంగా, (వాయు నిరోధంతో) యోగం-భగవంతునితో కలయిక కల్గించడం అని అర్థం. వాయువును కుంభకం చేసినంతకాలం మనస్సు కదలక నిశ్చలంగా ఉంటుంది. మనస్సు నిశ్చలంగా ఉన్నప్పుడు వాసనలు ఉద్ఘాతం

కానేకావు. మనస్సు నిర్వాసనాస్థితిని పొందుతే బ్రహ్మానందానుభవం అదే కల్గుతుంది. ఈవిధంగా హఠయోగం ప్రాణాయామ అన్నది 'భరద్వాజ' పదానికి అంతరార్థంగా చెప్పవచ్చును. భర=బరువుతో, ద్వా=రెండిటివల్ల జ=పుట్టినది. బలవంతంగా హఠయోగంతో ప్రాణాయామంలో మనస్సును నిశ్చలంచేసి, బ్రహ్మానందానుసంధానం కల్గించి, ఆతర్వాత ప్రాణాయామయోగం విడిచినప్పుడుకూడ మొదటి అనుభవాన్ని నిల్పి ఉంచుకోవాల్సి వుంటుంది. కుంభకం విడువడం తోనే మనస్సు చంచలత పొంది వాసన లలముకొని ప్రకృతి పరవశత పొందినచో సాధకుడు ప్రమాద పడేస్థితి ఈహఠయోగంలో ఉంది. సాధకుడు జాగరూకత వహించి సాధనచేస్తే ఇది సులభోపాయంగానే కన్పిస్తుంది. నూటికి 90 మంది జాగరూకత వహింపలేక క్రమంగా కుంభకంవల్ల కల్గిన కొన్ని సిద్ధులు పొంది ప్రకృతియొక్క మోజులో పడిపోతుంటారు. మహిమలు ప్రకటించే యోగసాధనలో ఆగిపోయి, యోగభ్రష్టత పొందే ప్రమాదం ఇందులో వుంది. పై హఠయోగ * సాధన బలాత్కారసాధనగా భాగవతంలోని భరద్వాజ జనన వృత్తాంతంలో స్ఫురిస్తుంది.

రాముడు భరద్వాజాశ్రమం ముందుగా ప్రవేశించినాడనగా హఠయోగ ప్రాణాయామ సాధనకు ఆలోచించినాడని అర్థం.

> భగ వన్నిత ఆసన్నః పౌరజానపదో జనః
> సుదర్శ మిహ మాం ప్రేక్ష్య మన్యే ఒహ మిమ మాశ్రమమ్
> ఆగమిష్యతి వైదేహీం మాం చాపి ప్రేక్షకో జనః
> అనేన కారణే నాహ మిహ వాసం నరోచయే॥

'భగవానుడా! నే నీ ఆశ్రమంలో ఉంటే నన్నూ వైదేహినీ పౌర జానపదులు వస్తూ చూస్తూ పోతూవుంటారు. ఆకారణంచేత నే నిచ్చట నుండ నిష్టపడను" అని రాముడు భరద్వాజునితో అన్నాడు. అంటే, ఈ హఠయోగ సాధనలో కుంభకాన్ని విడిచినప్పుడు

* నా అంతరార్థ కథల్లో ఈకథ విస్తరించబడింది.

ప్రకృతి వాసనలు అవహించే లక్షణం ఉంది. ఆకారణంచేతనే నేను హఠయోగంలో ఇంద్రియాలకు ప్రశాంతస్థితిని కల్గించడానికిష్టపడను అని, తర్వాత పర్యాలోచించి సాధకుడు సాధనకు హఠయోగాన్ని ఇష్ట పడలేదని పౌర జానపదులు మమ్మల్ని చూడడానికి వచ్చి మాటిమాటికి ఆకర్షిస్తూంటారన్నదాని అంతరార్థంగా భావించాలి.

తర్వాత భరద్వాజుడు 'చిత్త్రకూటం సరియైన నివాసస్థలంగా నిర్ణయిస్తాడు. చిత్+త్ర+కూటం=చిత్త్రకూటం. చిత్ అనగా జ్ఞానం. సత్+చిత్+ఆనందం, అనగా శాశ్వతముగ జ్ఞానమును అయిన ఆనందమే పరబ్రహ్మస్వరూపం. చిత్=జ్ఞానమును, త్ర=రక్షించు నట్టి *కూటము-నిశ్చలస్థితి; (కూటము అనగా అగసాలివాని దాగలి) చిత్త్రకూటం. జ్ఞానంచే రక్షింపబడిన నిశ్చలస్థితియే సచ్చిదానంద స్వరూపం. అంటే, ఇంద్రియాలను పదువాల్గింటిని నిశ్చలస్థితిలోనుంచి ప్రశాంతస్థితిని సాధించాలంటే జ్ఞానమార్గం ఒక్కటే శ్రేష్ఠమైనసాధనం. ఇతర సాధనలు అన్నీ అపాయముతో కూడినవే. జ్ఞానమార్గం ఒక్కటే నిరపాయకరం అని సాధకుడునిశ్చయించుకోవడమే చిత్రకూటపర్వతం పైని రాముడు నివసించడానికి ఎన్నుకొన్నాడన్నదానిలోని అంతరార్థం. ఈవిషయం హఠయోగులు కాదనరని చెప్పడమే భరద్వాజుడు రామునకు చిత్రకూటపర్వతాన్ని నిర్దేశం చేశాడన్నదాని అంతరార్థం.

## చి త్రి కూ ట ప్రి వే శ ము.

శ్లో॥ చిత్రకూట ఇతి ఖ్యాతో గంధమాధన సన్నిభః
యావతా చిత్త్రకూటస్య వర శృంగాణ్యవేక్షతే
కల్యాణాని సమాధత్తే న పాపే కురుతే మనః
ఋషయ స్తత్ర బహవో నివస్య శరదాం శతం
తపసా దివ మారూఢాః కపాల శిరసా సహ
ప్రవివిక్త మహం మన్యే తే వాసం భవత స్సుఖం
ఇహ వా, వన వాసస్య వస రామ మయా సహ॥

*దాగలిమీద ఎన్నో లోహాలు రూపు దిద్దబడి వస్తూ పోతూ వుంటాయి. కాని దాగలి మాత్రం కదలదు మెదలదు.

"చిత్రకూట' మను ప్రఖ్యాతిగల పర్వతముంది, అది గంధ మాదన పర్వతముతో సాటియైంది. ఎవడైనా చిత్రకూటపర్వత శిఖరాల్ని దర్శిస్తేచాలు. అతడికి సర్వశుభములు కల్గుతాయి. అతని మనశ్చింత పాపములవైపు మరలదు, అక్కడ చాలమంది ఋషులు నివసించి నూరేండ్లు తలక్రిందుగా తపస్సుచేసి స్వర్గాన్ని చేరుకున్నారు. ఈ చిత్రకూటపర్వతం చాల ప్రశాంతమైంది. ఇచ్చట నీవు నివసించిన నీకు సుఖంగా నుండునని నా అభిప్రాయం. అరణ్యవాసానికైనా ఆశ్రమమందైనా సరే నాతో సహా నీవు నివసింపవచ్చు అని భరద్వాజుడు రామునితో పల్కాడు.

శ్రీరాముడు భరద్వాజాశ్రమమును దర్శించినాడే కాని అరణ్య వాసము గడుపడానికి దాన్ని ఎంచుకోలేదు. భరద్వాజాశ్రమం, అంటే, హఠయోగంలోని 'ప్రాణాయామ సాధన' అనే అంతరార్థం ఇంతకు ముందు చెప్పుకున్నాం.

చిత్రకూటం, అంటే, చిత్ + త్ర + కూటం; చిత్-జ్ఞానముచేత. త్ర-రక్షించే, కూటం-నిశ్చలస్థితి 'కూటం' అనేపదం అగసాలె వాని దాగలికి పర్యాయపదం. దాగలిపైని ఎన్నో లోహములు సాగకొట్టబడి అనేక రూపాలు పొందుతాయి; కాని దాగలిమాత్రం కదలదు మెదలదు. అట్లే, భగవంతుడు ప్రకృతిని తనలో వుంచి దానిని నిర్మించడానికి, నాశనం చెయ్యడానికీ కారకుడౌతాడేకాని తానుమాత్రం నిశ్చలుడు. నిరాకారుడునై కూటము వలె ఉండువాడు; కాననే కూటస్థుడు అను పేరు భగవంతునికి ఏర్పడియున్నది. అందుచే చిత్రకూటమనగా జ్ఞానముచేత పొందించే నిశ్చలస్థితి (ప్రశాంతస్థితి)) అని అర్థం. ఇది చిత్రకూట సాధన అనిపించుకొనే అభ్యాసం, 'భరద్వాజ' అనే సాధనలో ప్రాణాయామం వల్ల (కుంభకంవల్ల) నిశ్చలస్థితి వచ్చినా ఆస్థితి వాయు నిరోధం ఉన్నంతవరకే నిలుస్తుంది. చిత్రకూట సాధనం అనగా జ్ఞానంవల్ల సాధించే నిశ్చల స్థితమాత్రం ఎల్లప్పుడూ నిలిచియే వుంటుంది. మనస్సులో లౌకిక వ్యాపారాలు ఎన్ని నడుస్తూన్నా

జ్ఞానంవల్ల కలిగిన నిశ్చలస్థితికి మాత్రం అంతరాయం వుండదు. ఈ చిత్రకూట సాధన జ్ఞానంచేతనే పొందే ప్రశాంతస్థితి సాధన, ప్రాణాయామసాధన ( భరద్వాజ ) కంటే గొప్పది; నిరుపద్రవమైనదీ, శాశ్వతమైనదీ ఇది. ఇది గంధమాదన సన్నిభము. గంధమాదనము అంటే గంధ+మాద+న అనే వ్యుత్పత్తిలో గంధమనగా వాసనలు అనగా జన్మ కారణములు మదము యొక్క భావమే మాదము; గంధమాదమనగా వాసనల ప్రాబల్యము, 'న' అనగా లేకపోవుట. ఇది 'నఞ్' అర్థకమైన 'న' శబ్దము దీనితో సమానము చేయబడినది. వాసనల ప్రాబల్యం లేకుండ జేయు సాధనకు గంధమాదనము దీనితో అనగా వాసనల ప్రాబలంము లేకుండజేయు సాధనముతో సమానమైనది చిత్రకూటము అన్నమాట. జ్ఞానమువల్ల మనోనిశ్చలతస్థితి సాధించినపుడు వాసనలుండవు, అవి తమంత నాశనమై పోవును. కాన, చిత్రకూట సాధనము వాసనాప్రాబల్యమును పోగొట్టునదే యగుటచే గంధమాదన సాధనతో సమానమైనది. రెండును ఒకే గుణము కల్గిన సాధనలు. చిత్రకూటములో అనగా జ్ఞానముచే గలిగిన నిశ్చలస్థితి భరద్వాజముకంటె అనగా, ప్రాణాయామ సాధన వల్ల కల్గిన నిశ్చల స్థితికంటె గొప్పది. ఏలననగా, చిత్రకూట పర్వతములో మృగ పక్షి సముదాయములు, లతావృక్ష సముదాయ దాయములు ఎన్నో యున్నప్పటికీ, అనగా చిత్రవిచిత్రమైన మనో భావనలు ఎన్నో వచ్చుచు పోవుచున్నప్పటికీ, మనో నిశ్చలస్థితికి మాత్రము భంగము రాదు. దాగటిపైని అనగా కూటముపైని ఎన్ని లోహములు నిలబడి అకృతులు మార్చుకొన్నా దాని నిశ్చలతకు ఎంతమాత్రము భంగము రానట్లే, జ్ఞానమువల్ల మనోనిశ్చలతను సాధించిన సాధకుడు తాను ఎన్ని లౌకిక కార్యక్రమములలో సంచరించినా, వాని మనో నిశ్చలతమాత్రము పోదు. హఠయోగములోని ప్రాణాయామమువల్ల ఇట్టిది సాధ్యముకాదు. కాన, చిత్రకూటపర్వతము యొక్క శిఖరాలు చూస్తేనే, సర్వశుభాలు కలుగుతాయి; పాపాలు

తాళ్ళనమౌతాయి అన్నాడు. వాల్మీకి కనుకనే ఋషులు వందలాదిఏండ్లు చిత్రకూటములో అఖండ తపస్సుచేసి స్వర్గాన్ని చేరుకుంటారు. అంటే, శరీరము ఉన్నంతవరకు సర్వసుఖాలు అనుభవిస్తారన్నమాట. కనుక చిత్రకూట సాధన నీకు తగినది. ఆనందమును కల్గిస్తుంది; ప్రశాంత మైనది. నీవు నాతో ఇక్కడ ( భరద్వాజాశ్రమములో ) ఉన్నను ఆపనిని సాధించవచ్చును. అన్నాడు భరద్వాజుడు. హఠయోగ ప్రాణాయామముకూడ నిశ్చలస్థితికి పర్వాలేదు, నాతోకూడి ఉంటే అని అర్థం. "మయాసహ" నాతోకూడ అంటె, అహం స్ఫురణతో కూడి వుంటే అని అర్థము. అహం అన్నపదానికి తృతీయావిభక్తిరూపం 'మయా' అనే పదంవల్ల 'అహం' తో అని అర్థం చెప్పవచ్చు. 'అహం' అంటే పరమాత్మయే "సోఽహం" అనగా, అహం-అహం అనేస్ఫురణ ఏదయితే కలదో అది, సః-అపరమాత్మయే అని అర్థం. 'సోఽహం' జపసాధనలో సాధకుడు 'అహం' ఏదో తెలిసికొనడమునకు యత్నిస్తే ఆ అహం మాయమై 'సః' అవుతుంది. అంటే, ఆ అహం ప్రత్యయ గోచరుడే పరమాత్మ అని తెలియబడతాడన్నమాట. ఈవిషయం శ్రీ రమణమహర్షులవారు చక్కగా కోఽహం అన్న గ్రంథంలో తెలిపి యున్నారు.

కొంచెం 'నేను, నేను' అనేది ఏదో అంతర్దృష్టితో తెలుసుకోవడానికి చేసేవిచారణకు ఆత్మ విచారణ అనిపేరు. ఆ ఆత్మవిచారణలో నిమగ్నుడైన సాధకునకు సమాధి సిద్ధించి స్వస్వరూపావస్థితి కల్గడంతో పరమాత్మ బోధ కల్గుతుంది. అంటే, ప్రాణాయామంలో, కుంభకం చేసి కూర్చున్నప్పుడు వాయువు కదలనంతసేపు మనస్సుకూడ కదలదు. మనస్సు కదలనప్పుడు వాసనలప్రాబల్యం ఉండదు. వాసనల ప్రాబల్యం లేనప్పుడు స్వస్వరూపస్థితి తప్పక కల్గుతుంది. అయితే కేవల కుంభకంవల్లకాక, సోఽహం జ్ఞానంతో అనగా ఆత్మా న్వేషణతోకూడిన కుంభకంవల్లనే ఆఫలితం సాధించబడుతుంది. నాతోకూడవున్నను, అనగా అహంస్ఫురణతోకూడి కుంభకములో

ఉన్నను నీకు అనుకున్న జ్ఞాన ప్రశాంతస్థితి కల్గుతుంది అనే అర్థం. 'మయానహా' అన్న పదంవల్ల తెలియబడుతోంది. 'ఇహ వా వనవా నన్య, అన్నదానిని ఇహవా + అవన + వానన్య అని విడదీసేస్తే అలీన వానమునకు అనగా రక్షణస్థితికి ఇహవా-ఇక్కడైనను, వన-వసింపుమా! నీవు రక్షణస్థితికి కావాలనుకుంటే, ఈకుంభకయోగంలో కూడ జాగ్రత్త వహిస్తే పరవాలేదు. రక్షణస్థితికి, అనగా ప్రశాంతస్థితికి అదికూడ నిరుపయోగం కాదుసుమా! ఈవిధంగా అహం స్ఫురణతో, అనగా సోహం జ్ఞానంతో కలిసిన హఠయోగ సాధనలో కుంభకమును వదలినప్పుడుకూడ మనస్సు నిశ్చల స్థితిని కోల్పోదు అన్న యోగ రహస్యము 'ఇహ వా వనవానన్య వన రామ మయా నహా' అన్న భరద్వాజ వాక్యములో వ్యక్తమౌతుంది. ఈ ప్రకరణం వల్ల మనకు 'అహం' యొక్క స్ఫురణతో (ఆత్మాన్వేషణతో) కూడిన హఠయోగమూ (భరద్వాజసాధన) చిత్రకూటమూ గంధమాధనమూ అను సాధనలు మూడునూ కూడ సమమైన సాధనలనీ, సాధకులు ఎవరికి ఏది సులభ మని తోస్తే ఆసాధనను స్వీకరింపవచ్చుననీ; ఇవి మూడును మనో నిశ్చలతనూ ప్రశాంతస్థితినీ సాధించగలవని తెలుస్తూంది. ఈమూడింటి లోను చిత్రకూట సాధన, అనగా జ్ఞానముతో నిశ్చలస్థితిని సాధించుట మంచిది. అందు అపాయమునకు తావులేదు.

శ్లో॥ తేషాం స్వస్త్యయనం చైవ
మహర్షి స్స చకార హ
ప్రస్థితాం శ్చైవ తాన్ ప్రేక్ష్య
పితా పుత్రా ని వాన్వగాత్॥

భరద్వాజ మహర్షి, సీతారామలక్ష్మణులు చిత్రకూటానికి బయలు దేరినపుడు వాళ్ళకి స్వస్తివాచకాలు పలికి, తండ్రి తన బిడ్డల ననుస రించినట్లు తానూ వాళ్ళ ననుసరించి బయలుదేరేడు.

భరద్వాజుడనగా హఠయోగముగా మనము అంతరార్థం చెప్పు కొన్నాం. చిత్రకూటం అంటే, జ్ఞానం సాధించే నిశ్చలస్థితి అని తెలిసి కొన్నాము. హఠయోగం, జ్ఞానయోగాన్ని కల్గిస్తుంది. హఠయోగంలో

వాయువును కుంభకంచేసి స్తభింపచడంవల్ల జ్ఞానమార్గాన్ని సాధించే నిశ్చలస్థితి పుట్టుతుంది కనుక, జ్ఞానయోగానికి హఠయోగం తండ్రి వంటిదన్నమాట భరద్వాజుడు, చిత్రకూటానికి బయలుదేరిన రాముడిని తండ్రి బిడ్డల్ని అనుసరించినట్లు అనుసరించాడంటే హఠయోగం, జ్ఞానయోగంలో ప్రవేశించేవారికి నిశ్చలత్వానికి మార్గాన్ని చూపెట్టుతుంది అనే అర్థం వస్తుంది.

శ్లో॥ తతః ప్రచక్రమే వక్తుం
వచనం స మహామునిః
భరద్వాజో మహాతేజోః
రామం సత్యపరాక్రమం
కాళిందీ మనుగచ్ఛేతాం
నదీం పశ్చాన్ముఖస్థితామ్
అ థార్థా సాద్య తు కాలిందీం
శీఘ్రస్రోతవ మాపగామ్
తస్యా స్తీర్థం ప్రచరితం
పురాణం ప్రేక్ష్య రాఘవౌ।
తత్ర యూయం ప్లవంకృత్వా
తర తాంశుమతీం నదీమ్
తతో న్యగ్రోధ మాసాద్య
మహాంతం హరితచ్ఛదమ్
శ్యామం సిద్ధోపసేవితం
తస్మై సీ తాంజలిం కృత్వా
ప్రయుంజీ తాశిషః శివాః
సామాసాద్య తు తం వృక్షం
వసే దతి క్రమేతవా
క్రోశమాత్రం తతో గత్వా
నీలం ద్రక్ష్యథ కాననమ్
సల్లకీ బదరీ మిశ్రం
రమ్యం వంశై శ్చ యామునైః
న పంథా శ్చిత్రకూటస్య

గత స్సుబహుశో మయా
రమ్యో మార్దవయుక్త శ్చ
దావై  శ్చైవక్షైవివర్జితః
ఇతి సంధాన మాదిశ్య
మహర్షి సన్న్యవర్తత॥

భరద్వాజాశ్రమం ప్రయాగక్షేత్రంలో నున్నది. గంగాయమునా సంగమక్షేత్రం ప్రయాగక్షేత్రం. అక్కడ సరస్వతీనది అంతర్వాహినిగా ప్రవహిస్తూంది అంటారు. అందుచేత ప్రయాగ త్రివేణీ సంగమమని చెప్తారు.

గంగనీరు తెలుపు; యముననీరు నలుపు; సరస్వతీ ప్రవాహం ఎఱుపు. ఈ మూడు రంగులు సత్త్వ, తమో, రజోగుణాలకు చిహ్నాములుగా కవుల వాడుకలో వుంది. సత్త్వగుణం, తమోగుణంతో కలిసివుండవు. తమోగుణాన్ని మార్చి సత్త్వంలో కలుపడానికి సాధకులు హఠయోగంతో యత్నిస్తారు. రజోగుణం ప్రత్యేకంగా కన్పించేది కాదు. అది తమోగుణాన్ని, సత్త్వగుణాన్ని పైకి తాను కన్పించకుండా అంటి వుంటూంది. త్రివేణీ సంగమంలో మనకు గంగాజలమే ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. యమున సంగమించినచోటును చూపిస్తారు. అక్కడ కొద్దిగా నల్లని నీరు కన్పిస్తుంది. సరస్వతి అంతర్వాహినిగా కన్పించేదికాదు. అంటే, సత్త్వగుణం, తమోగుణాన్ని తనలో కల్పుకొని తనరూపం దానికిస్తుంది. అంటే, సత్త్వంతో తమస్సును నాశం చేయడం జరుగుతుందన్నమాట. తమస్సుతో, రజోగుణం ఉండనే ఉంటుంది. కానీ, సత్త్వగుణం, రజస్సునుకూడ తనలో ఐక్యం చేసికోవడం, అనేది త్రిగుణముల నైక్యము కల్గించే సాధన అనిపించుకుంటుంది. అదే సరస్వతీనది అంతర్వాహికంగా గంగాయమునలో కలుస్తూందంటే ఈ సాధన జరిగించేది ప్రయాగ అంటే, గొప్ప యాగం, యజ్ఞం అన్నమాట. కనుక త్రివేణీసంగమస్థలాన్ని 'ప్రయేగ' అనికూడ అంటారు. రజస్తమోగుణాలు సత్త్వంతో కలిసిపోవడంవల్ల ఇది 'ప్రయేగ' క్షేత్రం అనీ పిలువబడుతూంది. ఇది భరద్వాజుని ఆశ్రమక్షేత్రం,

ఇప్పుడు భరద్వాజుడు అంటే, హఠయోగం అనీ, హఠయోగంలో కుంభకంతో రజస్తమోగుణాల్ని సత్త్వంలోకి మార్చడం అనేది భరద్వాజ సాధన అనీ, ఈసాధన జ్ఞానమార్గానికి చోటునిస్తుందనీ సత్త్వంలో నుంచియే జ్ఞానం అవతరిస్తుందనీ, అందుచేత భరద్వాజుడు తండ్రి అనీ, చిత్రకూటం అంటే, జ్ఞాననిశ్చలత దాని బిడ్డ అనీ అంతరార్థాలు స్పష్టంగా గోచరిస్తాయి.

తర్వాత భరద్వాజుడు సత్య పరాక్రముడైన రాముణ్ణి చూచి ఇల్లా అన్నాడు. 'పడమటివైపు ప్రసరిస్తూన్న కాళిందీనదికి నడిచి వెళ్ళండి. మహావేగప్రవాహంకల కాళిందీనదిని చేరేక, రామలక్ష్మణులారా! చిరకాలంగా వస్తూన్న అనదీజలాన్ని తెప్పకట్టుకొని దాటండి. తర్వాత నల్లని ఆకులతోనున్న న్యగ్రోధ వృక్షం కనిపిస్తుంది. అది నల్లగా ఉంటుంది. దానిని సిద్ధులు సేవిస్తూంటారు. అవృక్షానికి సీత అంజలి సమర్పించి దానివల్ల మంగళకరములైన ఆశీస్సులు పొందుతుంది. అవృక్షం దగ్గరే నిశసించినాసరే. లేదా, దాన్ని దాటి వెళ్ళినాసరే. ఏదైనా మంచిదే.

అక్కడనుండి క్రోసుదూరం దాటి వెడితే నల్లని అడివి కనిపిస్తుంది. అది అనేక వృక్షాలతో కూడి వుంటుంది. ఆదారిని వెడితే చిత్రకూటం వస్తుంది. నేను ఎన్నోసార్లు చిత్రకూటానికి వెళ్ళాను. అది అందమైనది మృదువైనది. దావానలాలు ఏవీ అచ్చట ఉండవు." అని దారిచెప్పి మహర్షి వెనక్కి వెళ్ళిపోయేడు.

భరద్వాజుడు (హఠయోగం), రాముణ్ణి (సాధకుణ్ణి), సత్యపరాక్రముణ్ణిగా (పరమాత్మాన్వేషణంలో సమర్థుణ్ణిగా) గుర్తించడం జరిగింది. 'సత్యం, శివం, సుందరమ్' అన్నవి మూడూ పరమాత్మను చెప్పేవే కాన, 'సత్యపరాక్రమమ్' సత్యపర + ఆ + క్రమమ్ అంటే, భగవత్పరమైన, సంపూర్ణమైన నడక కలవాడన్నమాట. హఠయోగం, సమర్థుడైన సాధకునకు జ్ఞానమార్గాన్ని చూపిస్తోంది. ఇక్కడ రాముడు అంటే, సాధకుడు, సమర్థుడు కావడంవల్ల హఠయోగముచేత (భరద్వాజునివలె) జ్ఞానమార్గం (చిత్రకూటమార్గం) చూపబడింది.

కాళింది అంటే తమోగుణం అని చెప్పుకోవాలి. కాళిందీనది నలుపు. తమోగుణం నలుపురంగుతో పోల్చబడేది. తమస్సంటే చీకటి అనికూడ అర్ధం. కాళిందినది వొడ్డునే సిద్ధులు ఉంటారు. సిద్ధులు బలాత్కారంగా ప్రాణాయామయోగంతో నిశ్చలమనస్సును సాధిస్తారు. ఆయోగం ఆగినపుడు తిరిగి ప్రకృతిలోకి వస్తూంటారు. ఈవిధంగా జరిపేటప్పుడు ప్రకృతిలోని అనేకములైన ఐహిక సిద్ధులు వారికి వశపడుతూంటాయి. ఈసిద్ధుల ప్రలోభంలోపడి కొందఱు యోగ భ్రష్టులయ్యే అవకాశం ఈహఠయోగంలో వుందికూడ ప్రకృతియొక్క శక్తులు వశపడే లక్షణంకూడా ఈ హఠయోగంలో వుంది. హఠ యోగం సత్వగుణంతో, తమోగుణానికి అనగా ప్రకృతితో పర తత్వానికి అనుసంధానమార్గంగా ఉంటుందని చెప్పడానికే యమునా నదీ తీరాన న్యగ్రోధవృక్షం (మద్దిచెట్టు) వుందని చెప్పడంజరిగింది. న్యగ్రోధం అంటే, న్యగ్ రుణద్ధిమార్గమితి న్యగ్రోధం (రుధృ ఆవరణే) అనే వ్యుత్పత్త్యర్థంలో మార్గము నడ్డగించేది అని అర్ధం. ముక్తిమార్గాన్ని అడ్డగించేదిగా ఈ న్యగ్రోధాన్ని ప్రకృతిగా చెప్పడం జరిగింది. భగవద్గీత చెప్పిన 'ఊర్ధ్వమూల మధశ్శాఖం అన్న లక్షణం కల ప్రకృతిని ఈ న్యగ్రోధానికి అర్ధం చెప్పారు. నదిని తెప్పగట్టుకొని దాటండి అంటే, ఈ తమోగునాన్ని అంటకుండా దానిలో దిగవడి పోకుండా, అంటే, తమకు అది అంటకుండా సాత్వికాన్ని ఆధారం చేసికొని తమోగుణాన్ని జాగ్రత్తగా దాటాలి అన్నఅర్ధం ఇందులో కనిపిస్తుంది. ప్లవము అంటే, పైకితేల్చేది; అదితెప్ప. నీటిపైనేవుంటుంది. కాని నీరుమాత్రం దానిలో చేరదు. అదే సత్వగుణంతో తమోగుణాన్ని అంటకుండా ఉండటమంటే. అదే అసంగతత్వంఅంటే.

ఈ వృక్షం దగ్గఱ నివసించినా నివసించవచ్చు. లేకపోతే దాన్ని దాటి వెళ్ళినా వెళ్ళవచ్చు. అంటే, అందఱు సిద్ధుల్లాగా ప్రకృతిలో ఉంటూనే బలాత్కారంగా పరమాత్మను అనుసంధానంచేస్తూ, అంత్యకాలంలో యోగంతో మనోనిశ్చలతను సాధించగల్గితే ముక్తిని

పొందనూ వచ్చు. లేదా, ఈ ప్రకృతిని సంబంధం పెట్టుకోకుండా, అంటీ ముట్టకుండా, అనంగయోగంతో దాటివెళ్లి జ్ఞానమార్గాన్ని పొంది ముక్తిని పొందనూ వచ్చు అని అర్థం.

సీత అవృక్షానికి నమస్కరించి మంగళకరములైన ఆశీస్సులు పొందవచ్చును. అంటే, సీత భూజాత కాన, భూమినుండి పుట్టిన ప్రకృతియే యాపె కనుక ఆ న్యగ్రోధం వృక్షం అర్థంతో ప్రకృతి అనే భూరుహప్రకృతి. కాన,, భూరుహప్రకృతిని భూజాత పూజించి తమోగుణాన్ని దాటడంలో సాధకునికి ఏవిధమైన ఇబ్బందిని కల్గించకుండా చెయ్యవచ్చునన్న అర్థం. ఇందు అంతరార్థపరంగా గోచరిస్తూందనక తప్పదు.

భూప్రకృతియైన సీత న్యగ్రోధరూపంలోని భూప్రకృతికి నమస్కరించి ఆశీర్వాదం పొందడంలో నున్న అర్థం ఏమిటంటే – ప్రకృతి ఇంద్రియ వశమైనపుడు ముక్తికి అవరోధంగా ఉంటుంది. అప్రకృతియే ఆత్మవశమైయున్నపుడు ముక్తికి సుముఖంగా ఉంటుంది. సీత ఆత్మ వశమైన (రామవశమైన) ప్రకృతి. న్యగ్రోధం ముక్తిమార్గ ప్రతిరోధక మైన ప్రకృతి. ఇచ్చట సాధకునిలోని ప్రకృతి ఆత్మవశమై ముక్తికి సుముఖంగా నున్నది. తాను ఇంద్రియవశం కాకుండాలనే తపన దానికి (సీతకు) ఉంది. తనలోనే ఉన్న ముక్తిమార్గ ప్రతిరోధకశక్తి (న్యగ్రోధం) తన్ను అడ్డుపెట్టకుండా ఉండాలని తనలో తాను నిశ్చయం చేసికోవడమే సీత న్యగ్రోధానికి నమస్కరించి ఆశీర్వాదం పొందాలనుకోవడంలోని అంతరార్థంగా భావించాలి.

ఆ వృక్షం దాటి క్రోసు దూరం వెడితే నల్లని అడవి వస్తుంది. అక్కడినుండి చిత్రకూటానికి వెళ్ళవచ్చు. నేను ఎన్నోసార్లు అక్కడికి వెళ్ళేను. అంటే, అప్రకృతిలో వెళుతూంటే కొంతదూరం దాని మాయ అవరించి వుంటుందని. ఆ మాయను దాటి వెడితే జ్ఞానమార్గంలో ప్రవేశించవచ్చుననీ అర్థం,

భరద్వాజుడు చిత్రకూటానికి చాలాసార్లు వెళ్ళేడు అంటే హఠయోగి కుంభకయోగంలో ఉన్నప్పుడల్లా మనోనిశ్చలతతోనే ఉంటాడు. యోగంవిడిచినప్పుడు తిరిగి ప్రకృతిలో చంచలతతోనే ఉంటాడు. కాన హఠయోగి (భరద్వాజుడు) ఎన్నోసార్లు జ్ఞానమార్గ సంబంధమైన మనోనిశ్చలతను (చిత్రకూటాన్ని) పొందుతూనే వుంటాడు అని అర్థం.

చిత్రకూటం చాల రమ్యమైంది; మృదువైందిను. అడవిలో పుట్టే దావానలాలు అక్కడలేవు. అంటే, జ్ఞానమార్గానికి తీసుకొని వెళ్ళే మనోనిశ్చలత ఎంతో ఆనందమయంగా ఉంటుందనీ, ఎంతో అనువుగా సుఖంగా ఉంటుందనీ, అందులో ఉంటే సంసారప్రకృతి వల్ల కలిగే దుఃఖంఏమీ కన్పించదనీ అర్థం.

శ్లో॥ స్వస్తి దేవి తరామి త్వాం। పారయే న్మే పతి ర్వ్రతం
యక్ష్యే త్వాం। గోసహస్రేణ। సురాఘటశతేన చ
స్వస్తి ప్రత్యాగమే రామే। పురీ మిక్ష్వాకుపాలితాం
కాలిందీ మథ సీతా తు। యాచమానా కృతాంజలిః

కాలిందీనదిని దాటడానికై తెప్ప యెక్కడానికి ముందుగా సీతాదేవి కాలిందీనదిని ఈవిధంగా ప్రార్థిస్తుంది.

"దేవీ! స్వస్తి. నిన్ను దాటుతున్నాను. నాభర్త తనవ్రతం పూర్తి చేసినతర్వాత నేను నీకు గోసహస్రాన్ని సురాఘటశతాన్ని సమర్పిస్తాను. నాభర్త ఇక్ష్వాకులు పాలించిన పట్టణానికి తిరిగి రావాలి" అని సీత అంజలి పట్టి కాళిందినదిని యాచించింది.

సీత అంటే సాధకునిలోని భౌతికప్రకృతి. అది సాధకుని వశంలోనే అతనిని విడువకుండా అతనికి సాయపడుతూ ఉంటుంది, సాధనకు ఇదియొక శుభకరమైనవిషయం. ఏమంటే, అది సాధకుని ద్వారా తాను ఆత్మైక్యం కావాలని కోరుకుంటూ వుంటుంది. సాధకుడు తాను పట్టిన ఆత్మాన్వేషణ వ్రతం పూర్తికావాలని కోరుకుంటుంది.

తమోగుణాన్ని అంటకుండా, ముట్టకుండా, దాన్ని సాధకుడు దాటుతున్నాడు. తమోగుణం, విజృంభిస్తే సాధన చెడుతుంది. అంచేత సాధకునిలోని ప్రకృతి, గోసహస్రాన్ని నీకోసం బలివేస్తాను. సురాభాండశతం సమర్పిస్తాను. అంటూ తమోగుణాన్ని బ్రతిమాలుకుంటాడు.

* 'గో' అంటే ఇంద్రియవృత్తి. గోసహస్రాన్ని అంటే, అనేక వేల ఇంద్రియ ప్రవృత్తుల్ని అని ఇక్కడ అర్థం. తమోగుణప్రకృతి అనేకవేల ఇంద్రియ ప్రవృత్తులు కలిగి ఉంటుంది. ఆ ఇంద్రియ ప్రవృత్తులు అన్నింటినీకూడ, సాధకుడు తననుంచి విడిచి వేసినప్పుడే తమోగుణాన్ని తాను తరించడం అనేది జరుగుతుంది. అంటే, తన్ను తమోగుణం విడిచిపెట్టుతుందన్నమాట. ఇక్కడ సాధకుడు తమోగుణాన్ని పూర్తిగా నాశంచెయ్యడానికే అరణ్యవాసానికి వెడుతున్నాడు. అంటే, తమోరాహిత్యంతో సర్వ ఇంద్రియ ప్రశాంతిని సాధించడానికి పూనుకొన్నాడు. కాన, సర్వేంద్రియ ప్రవృత్తులను, వ్రత పరిపూర్తికోసం తననుండి విడుదలచేస్తాను. అని అతనిలోని ప్రకృతి దీక్ష వహించడమే ఇచ్చట సీత కాళిందిని యాచించడంలోని అర్థం. సీత అంటే, సాధకునిలోని భాగమే అగు ప్రకృతియే. కనుక ఇచ్చట సీతకు రామునకు భేదం లేదు. ఇంకా సురాభాండశతాన్ని ఇస్తాను అంటుంది. సురాభాండశతమంటే, అనేక వందల కల్లుకుండలు. వాచ్యార్థంలో, అంతరార్థంలో, గోవు అంటే ఆవులూ కావు. సుర అంటే కల్లూకాదు. ఆవుల్ని బలివేస్తాననడం, కల్లుకుండలు సమర్పిస్తాననడం మూర్ఖజనుల లక్షణం. సీతవంటి దయార్ద్రహృదయ, సుగుణ సంపన్నురాలు ఈవిధంగా అంది, అంటే సమంజసంకూడా కాదు.

సురాభాండం అంటే సు+ర+అభ+అంటే శతము. సు=మంచిని ర=గ్రహించేటువంటి, అభ=కాంతియొక్క, అండ=గ్రుడ్ల

* గో శబ్దానికి ఇంద్రియం అర్థం వుంది. గోపాలుడు, గోవిందుడు అనే పదాల్లోని గో శబ్దానికి ఇంద్రియం అనే అంతరార్థం.

యొక్క, లేక బీజములయొక్క (జననమిచ్చే సాధనములయొక్క) శతము-సమూహము మంచి కాంతివంతములైన జ్ఞానబీజాలను నీలో ఉంచుతాను; అని దాని అంతరార్థం - తమోగుణాన్ని సత్త్వగుణంగా మారుస్తాను అని సాధకుని ప్రకృతి దీక్ష వహించడమే ఇచ్చట మనం అంతరార్థపరంగా గ్రహించాలి. తమోగుణాన్ని సత్త్వగుణంగా మార్చాలి; సత్త్వాన్ని పరబ్రహ్మంలో లీనంచెయ్యాలి. అదే సాధన యొక్క సారాంశం. తమోగుణం ఇంద్రియ ప్రకృతుల్ని పోగొట్టడంవల్ల శాంతించే మాట నిజం. అందుకే గో (ఇంద్రియ) సహస్రాన్ని బలివేస్తానంది. అంతటితో చాలదు. తిరిగి తమోగుణం తలయెత్త కుండా చెయ్యడానికి సత్త్వగుణాన్ని ఆస్థానంలో ప్రవేశపెట్టి దాని రూపునే మార్చివెయ్యాలి. అందుకే, సురాభాండశతాన్ని అందులో సమర్పించడం జరగాలి. అంటే, చక్కని జ్ఞానబీజాలను అంకురింపజేసే సాత్త్విక ఇంద్రియ వృత్తుల్ని తమోగుణంలో ప్రవేశపెట్టాలన్నమాట. ఈవిధంగా సాధకుడు ముక్తికోసం తమోగుణాన్ని సత్త్వగుణంగా సాధకుడు ముక్తికోసం తమోగుణాన్ని సత్త్వగుణంగా మార్చాలి అన్న అంశం ఇందు అంతరార్థపరంగా కన్పిస్తోంది.

శ్లో॥ అవలోక్య తత స్సీతా । యాయాచంతీ మనిందితామ్
దయితాం చ విధేయాం చ । రామోలక్ష్మణ మబ్రవీత్
సీతా మాదాయ గచ్ఛ త్వం । అగ్రతో భరతానుజ
పృష్ఠతో ఽహం గమిష్యామి । సాయుధో ద్విపదాంవర!
య ద్యత్ ఫలం ప్రార్థయతే । పుష్పం వా జనకాత్మజా
తత్త త్ప్రదద్యాత్ వైదేహ్యాః । య త్రాస్యాః రమతే మనః॥

తనకు ఇష్టురాలూ, విధేయురాలూ అయిన సీత, కాళిందీ నదిని ప్రార్థిస్తూండడంచూచి రాముడు లక్ష్మణునితో భరతునియొక్క అనుజాడా - భరతుని తర్వాత పుట్టినవాడని తత్పురుషలో.

లక్ష్మణుడు "రామానుజుడౌతాడు కానీ" భరతానుజుడు కాడు అను సందేహము కల్గడం నిజమే కానీ, యిచ్చట తత్పురుష సమాసం

కాక బహువ్రీహి చెప్పవలెను. అప్పుడు భరతుడు అనుజుడుగా కల వాడు అని అర్థమున "భరతానుజ" అనునది సమర్థనీయము. ఇంత క్లిష్టంగా బహువ్రీహి సమాసంలో 'భరతానుజ' అనే ప్రయోగం చేయడంలో వాల్మీకి ఇందులో జ్ఞానమార్గపరంగా అంతరార్థం స్ఫురింప జేయాలనే చేశాడని విస్పష్టంగా మనకు గోచరిస్తూంది. ముందు పేరాలలో ఈ 'భరతానుజ' అనుదానికి అంతరార్థాన్ని వివరిస్తాను. భరతానుజ! నీవు సీతను ముందుంచుకొని నడుస్తూండు. ద్విపదాంవర! (మనుష్యులలో శ్రేష్ఠుడా) నేను వెనక్కాల ఆయుధం చేతపట్టుకొని కనిపెడుతూ వుంటాను. జనకాత్మజ, పువ్వుకాని, పండుకాని ఏది ఇష్టపడి కోరితే అది నీవు ఆమెకు ఇస్తూండు. దానివల్ల వైదేహి మనస్సు నిత్యమూ ఆనందంగా ఉంటుంది.

సీత ప్రకృతి స్వరూపిణి ఇంద్రియ భోగ్యంగా వుండటానికి ప్రకృతి త్రిగుణములతో నిండివుంటుంది. అది మాయారూపమైన ప్రకృతి, త్రిగుణాల్ని వదలి పరమాత్మపరం కావాలనే తపన ప్రకృతికి ఉంటుంది. అది పరమాత్మకు విధేయంగానే సంచరిస్తూ ఇష్టంగా ఉంటుంది. తానెంత త్రిగుణాత్మయైనా నిర్గుణ పరబ్రహ్మంనుండియే ఆమె జనించింది కాబట్టి, తన స్వస్థానంలో విలీనంకావాలన్న తపన ప్రకృతికి వుంటూనే ఉంటుంది. ఇప్పుడు సాధకుడు కౌసల్యాసుతుడు. కౌసల్య అనగా సత్త్వగుణం. రాముడు అగ్ని ఇచ్చిన పాయసంలోని (భగవచ్ఛక్తిలో) హెచ్చుభాగం పొందిన కౌసల్యకు కొడుకు కావడం వల్ల సత్త్వగుణ సంపూర్ణుడు, (అగ్ని అంటే జ్యోతి స్వరూపుడైన పరమాత్మగా చెప్పుకొని యున్నాం). పరమాత్మాంశ సగంవరకూ కలిగినవాడు రాముడు, భగవచ్ఛక్తిని మిగిలిన సగభాగం సాధించు కొని పూర్ణుడు కావడానికే సాధకునియొక్క ఈసాధన అంతా. లక్ష్మణు డంటే ఆత్మచిహ్నమును పొందినవాడు. పరమాత్మయొక్క చిహ్నమే జీవుడు, కాన, సాధకునిలోని జీవాత్మ లక్ష్మణుడు. జీవాత్మ ఎప్పుడూ ఇటు పరమాత్మనూ అనుసరించి ఉంటుంది. వాసనలద్వారా అటు ప్రకృతినీ అనుసరించి ఉంటుంది. లక్ష్మణుడు సుమిత్ర కొడుకు.

సుమిత్ర అంటే రజోగుణం. ప్రత్యేకరూపం కలదికాదు. సత్త్వగుణం లోనూ, తమోగుణంతోనూ కూడ కలసి ఉంటుంది. కాన ద్విపదము అవుతుంది. జీవాత్మ ప్రకృతిని, పురుషుని రెండిటినీ ఆరాధిస్తూ వుంటుంది. దాని స్థావాలు ప్రకృతి పరమాత్మలు రెండూను, కాన్న, ఈవిధంగాకూడ జీవాత్మ ద్విపదం అవుతుంది. ఇక్కడ రెండు స్థానాలుకల రజోగుణం ద్విపదం అని అర్థం చెప్పుకోవాలి. ఈవిధంగా 'ద్విపదాంవర' అన్నది రెండు స్థానాలలో శ్రేష్ఠమైనది అని అంతరార్థ పరంగా రజోగుణానికి విశేషణంగా భావించాలి.

సుమిత్రకు ఇద్దరు కొడుకులు - లక్ష్మణుడు, శత్రుఘ్నుడు. వారిలో లక్ష్మణుడు సత్త్వగుణ జనితుడైన రామునితో కలిసివుంటే, శత్రుఘ్నుడు తమోగుణజనితుడైన భరతునితో కలిసి వుంటూంటాడు. 'ద్విపదాం వర' అన్న సంబోధన, బాహ్యార్థంలో రెండుకాళ్ళుగల మనుష్యులలో శ్రేష్ఠుడా! అని అర్థం చెప్పినా, అంతరార్థంలో సత్త్వ తమోగుణాల రెంటిని పొందిన శ్రేష్ఠమైన రజోగుణమా! అన్నది అంతరార్థం.

సీత కాళిందిని ప్రార్థించడం చూచి తనకోసం తనలోని ప్రకృతి చేసే ప్రయత్నాన్ని హర్షించి సాధకుడు తనలోని జీవునితో ఇల్లా అంటున్నాడు.

'భరతానుజ' అంటే భరతా + అనుజ అన్నప్పుడు జీవవ భరత్వము 'భరత' అవుతుంది. దానిని అనుసరించి అనగా, పూర్వ జన్మ వాసనల భారము ననుసరించియుండు జీవుడా! అని అంతరార్థ పరంగా సంబోధన. నీవు సీతను ముందుంచుకొని నడుస్తూ ఆమె ఏపండు కోరినా, ఏపువ్వు అడిగినా అవి ఆమెకు సమర్పిస్తూ ఆమె మనస్సు ఆనందపరుస్తూండు. అల్లా వుంటే, నేను మీవెనకాలనే ఉండి ఆయుధంతో ఏ ఇబ్బంది రాకుండా కాచుకొని ఉంటాను.

అంటే, సాధకునిలోని ప్రకృతి అతనికి అనుకూలంగా సంచ రిస్తూనే ఉంటుందని, ఆమెను నిర్బంధంతో వశపరచుకోనవలదని,

అపె కోర్కెలు తీర్చినా అది నష్టం కల్గించేదిగా వుండవనీ పైగా ప్రకృతిని కోర్కెలు తీరుస్తూ బుజ్జగిస్తూ తనకంటుకుండా సంచరిస్తూ ఉండాలనీ సాధకుడు తనలోని జీవుణ్ణి ప్రబోధించడమే అందలి అంతరార్థంగా భావించాలి. ఆపని అంతా జీవాంశ చేసేపని. జీవుడు పూర్వ జన్మవాసనావృతుడు కాన, తిరిగి అతనికి వాసనలంటరానివిధంగా ప్రకృతియొక్క అనుభవాల్ని కనిపెట్టుకుంటూ బుజ్జగిస్తూ అంటకుండా వుండాలి. కనుక సాధకునిలోని వ్యష్టిపరమాత్మ సాధకునిలోని జీవాత్మను ప్రకృతియొక్క అనుకూలతను గమనించి దానిని వశపరచుకోవాలని ఏదైనాలోపం జరిగేటప్పుడు, అంటే, ఆ ప్రకృతియొక్క కోరిక తిరిగి జీవునకు జన్మనిచ్చే వాసనలుగా పరిణమించేటంతటివిగా వున్నప్పుడు పరమాత్మ తానే సాధకునికి ఆ లోపం రానీకుండా కాపాడుతూ వెంట వెంటనే వుంటాడనీ పైశ్లోకాలలోని అంతరార్థంగా తోస్తుంది.

## చిత్రకూట నివాసము.

శ్లో॥ తత స్తౌ పాదచారేణ గచ్ఛంతౌ సహ సీతయా
రమ్య మాసేదతుః శైలం । చిత్రకూటం మనోరమమ్
తం తు పర్వత మాసాద్య । నానా పక్షి మృగాకులమ్
బహు మూల ఫలం రమ్యం । సంపన్నమ్ తపోధనం
మనోజ్ఞో యం గిరిః సౌమ్య । నానాద్రుమ లతాయుతః
బహుమూల ఫలో రమ్యః । స్వాజీవః ప్రతిభాతి మే
మునయశ్చ మహాత్మానః । వసం త్యస్మిన్ శిలోచ్చయే
అయం వాసో భవే । త్తావ దత్రా ర్యే! రమేమహి
ఇతి సీతాచ రామశ్చ । లక్ష్మణశ్చ కృతాంజలిః
అభిగ మ్యాశ్రమం సర్వే । వాల్మీకి మభివాదయన్
తాన్ మహర్షిః ప్రముదితః । పూజయామాస ధర్మవిత్
ఆస్యతా మితి చో వాచ । స్వాగతం తు నివేద్య చ
లక్ష్మ ణానయ దారూణి । దృఢాని చ వరాణి చ
కురు ష్వావసథం సౌమ్య । వాసే మే ఒభిరతం మనః॥

రామలక్ష్మణు లిరువురూ సీతతో కూడి పాదచారులై నడుస్తూ మనోహరమైన చిత్రకూట పర్వతాన్ని చేరుకున్నారు. నానాపక్షులతో నానామృగములతో కూడినది, ఎన్నెన్నో కందమూలములు ఫలములూ కలదీ, తపోధనులతో కూడినదీ అయిన చిత్రకూట పర్వతాన్ని చూచి "ఈగిరి నానాద్రుమ లతలతో బహుమూలఫలములతో తనపై నున్న వారందరికీ ప్రాణదాతయైనట్లుంది. దీని శిలలమీద మహాత్ములైన మునులు నివసిస్తూన్నారు. ఇది మనకు నివాసానికి బాగుంది. ఇక్కడ మనం ఆనందంగా ఉండగలం." అని సీతారామలక్ష్మణులు అంజలి బద్ధులై వాల్మీకాశ్రమానికి వెళ్ళి వాల్మీకికి నమస్కరించేరు. ధర్మవేత్తయైన వాల్మీకి మహర్షి సంతోషించినవాడై వారిని పూజించేడు. వారికి స్వాగతం చెప్పి 'ఇక్కడ నివాసంగా ఉండండి' అని చెప్పేడు. రాముడు లక్ష్మణుణ్ణి 'గట్టి కఱ్ఱలు తెచ్చి ఇక్కడ గృహ వసతి కల్పించు' ఇది చాల బాగుంది అన్నాడు. చిత్రకూటం వాల్మీకికి నివాసంగా వున్నదని పైమాటల్లో తోస్తూంది.

చిత్రకూటం అంటే, మనోనిశ్చలస్థితి. ఆస్థితి జ్ఞానమార్గాన్ని అందిస్తుంది. పరమాత్మను సాక్షాత్కరింప జేస్తుంది. సాధకుడు పరమాత్మాంశ సంపన్నుడు. జీవునితో, ప్రకృతితో ఒక్కొక్క సాధనతో ఆత్మోపలబ్ధిని సాధిస్తూనే మఱొకప్రక్క ఇంద్రియాలు పదింటిని అంతః కరణ చతుష్టయాన్ని మొత్తం పదునాల్గింటినీ ఏవిధంగానూ చలింప నీయక నిశ్చల స్థితిలో నుంచడానికి జ్ఞానమార్గాన్ని ఎన్నుకొని మనో నిశ్చలసాధనకు ఉపక్రమించేముందు కుండలినీశక్తిని జ్ఞానమార్గంతో పరమాత్మ తత్త్వంతో కలుపడానికి మూలాధారంలోకి ప్రవేశించేడు అనీ, అచ్చట కుండలినీశక్తి అతనికి సాయపడింది అనీ పైశ్లోకముల కంతరార్థం చెప్పాలి. వాల్మీక్యాశ్రమమంటే మూలాధారచక్రమని అర్థం చెప్పాలి. వాల్మీకి అనగా, రామాయణం వ్రాసిన వాల్మీకి మహర్షి అని వాచ్యార్థం అంతరార్థంలో వల్మీకం అంటే పుట్ట. పుట్టలో ఉండేది పాము. వల్మీకంనుండి పుట్టింది అనే అర్థంలో 'వాల్మీకి' అని శబ్దం నిష్పన్నమౌతుంది. పాము అంటే మూలాధారంలో

సర్పాకారంలో ఉండే కుండలినీ శక్తి అని ఇచ్చట అంతరార్థపరంగా చెప్పుకోవాలి. కుండలిని మూలాధారంలో ఉంటుంది. అంటే, అన్నిటికీ, అదే మూలంగా ఆధారంగా ఉంటుందన్నమాట. ఆదిమాయావరణంగల జీవాంశ అదే వాసనాకేంద్రం. దానిని జ్ఞానసాధనతో పరమాత్మాంశగా భావనచేస్తూ దాని ప్రవృత్తులను పరమాత్మలోనికి ప్రవేశించేటట్లు చేసే సాధన యోగమార్గంలో వుంది. షట్చక్రాలలోనికి కుండలినీ శక్తిని కుంభకయోగంతో పైకి ప్రసరింపజేస్తారు. పరమయోగులు భావనాబలంతో జ్ఞానమార్గంతో పరమాత్మలోనికి అంటే, పురుషుని లోనికి ప్రకృతిని ఆరోహణచేయించి తిరిగి అవరోహణంకూడ జరిపిస్తారు. జ్ఞానమార్గంలో మహాజ్ఞానులు ఇచ్చట రాముడనే సాధకుడు సాధన చేసేది జ్ఞానమార్గం. అదిపతనంలేనిది. ప్రమాదంలేనిది దానికి మనో నిశ్చలతయే ముఖ్యమైనది. ఆ మనోనిశ్చలస్థితికి వచ్చి సాధకుడు జీవప్రకృతిని దైవప్రకృతిగా మార్చుటకు పూర్ణజ్ఞానసాధకుడు యత్నిస్తాడు, అన్నదే ఇందలి అంతరార్థం. ముఖ్యంగా ఈఅంతరార్థం కోసమే రాముని వాల్మీక్యాశ్రమ ప్రవేశం రామాయణంలో చెప్పబడింది. వాచ్యార్థంలో అది సరిపడదు. ఏమంటే, వాల్మీకి రామాయణం తాను వ్రాయడానికి ముందు నారదుణ్ణి అడిగి రామచరిత్ర తెలిసికున్నాడని వాల్మీకి రామాయణంలో ముందు మొదటి సర్గలోనే.

> తప స్స్వాధ్యాయ నిరతం । తపస్వీ వాగ్విదాం వరం
> నారదం ప్రతి పప్రచ్ఛ । వాల్మీకి ర్ముని పుంగవః

అని వ్రాయబడివుంది. కాన, వాల్మీకి రాముడెవరో తాను రామాయణం రచించే ముందు తనకు తెలియదనే చెప్పాలికదా! రాముడు వాల్మీక్యాశ్రమం ప్రవేశించాడు అని పైని చెప్పినది కవియైన వాల్మీకిని గూర్చియే ఎట్లవుతుంది? రాముడు వాల్మీకిని ఆశ్రమంలో చూచి ఉన్నప్పుడు వాల్మీకి రాముడి సంగతిని నారదుడివల్ల మొట్టమొదటిగా తెలిసికున్నాడన్నది ఎట్లా సరిపడుతుంది? అదికాకుండా వాల్మీకి మహర్షి తాను రామాయణం వ్రాస్తూ వాల్మీకిని రాముడు చూచేడు

రామలక్ష్మణు లిరువురూ సీతతో కూడి పాదచారులై నడుస్తూ మనోహరమైన చిత్రకూట పర్వతాన్ని చేరుకున్నారు. నానాపక్షులతో నానామృగములతో కూడినదీ, ఎన్నెన్నో కందమూలములు ఫలములూ కలదీ, తపోధనులతో కూడినదీ అయిన చిత్రకూటపర్వతాన్ని చూచి "ఈగిరి నానాద్రుమ లతలతో బహుమూలఫలములతో తనపై నున్న వారందరికీ ప్రాణదాతయైనట్లుంది. దీని శిలలమీద మహాత్ములైన మునులు నివసిస్తూన్నారు. ఇది మనకు నివాసానికి బాగుంది. ఇక్కడ మనం ఆనందంగా ఉండగలం." అని సీతారామలక్ష్మణులు అంజలి బద్ధులై వాల్మీకాశ్రమానికి వెళ్ళి వాల్మీకికి నమస్కరించేరు. ధర్మవేత్తయైన వాల్మీకి మహర్షి సంతోషించినవాడై వారిని పూజించేడు. వారికి స్వాగతం చెప్పి 'ఇక్కడ నివాసంగా ఉండండి' అని చెప్పేడు. రాముడు లక్ష్మణుణ్ణి 'గట్టికఱ్ఱలు తెచ్చి ఇక్కడ గృహ వసతి కల్పించు' ఇది చాల బాగుంది. అన్నాడు. చిత్రకూటం వాల్మీకికి నివాసంగా వున్నదని పైమాటల్లో తోస్తూంది.

చిత్రకూటం అంటే, మనోనిశ్చలస్థితి. ఆస్థితి జ్ఞానమార్గాన్ని అందిస్తుంది. పరమాత్మను సాక్షాత్కరింప జేస్తుంది. సాధకుడు పరమాత్మాంశ సంపన్నుడు, జీవునితో, ప్రకృతితో ఒక్కొక్క సాధనతో ఆత్మోపలబ్ధిని సాధిస్తూనే మఱొకప్రక్క ఇంద్రియాలు పదింటిని అంతఃకరణ చతుష్టయాన్ని మొత్తం పదునాల్గింటినీ ఏవిధంగానూ చలింపనీయక నిశ్చల స్థితిలో నుంచడానికి జ్ఞానమార్గాన్ని ఎన్నుకొని మనోనిశ్చలసాధనకు ఉపక్రమించేముందు కుండలినీశక్తిని జ్ఞానమార్గంతో పరమాత్మ తత్త్వంతో కలుపడానికి మూలాధారంలోకి ప్రవేశించేడు అనీ, అచ్చట కుండలినీశక్తి అతనికి సాయపడింది అనీ పైశ్లోకముల కంతరార్థం చెప్పాలి. వాల్మీక్యాశ్రమమంటే మూలాధారచక్రమని అర్థం చెప్పాలి. వాల్మీకి అనగా, రామాయణం వ్రాసిన వాల్మీకి మహర్షి అని వాచ్యార్థం అంతరార్థంలో వల్మీకం అంటే పుట్ట. పుట్టలో ఉండేది పాము. వల్మీకంనుండి పుట్టింది అనే అర్థంలో 'వాల్మీకి' అని శబ్దం నిష్పన్నమౌతుంది. పాము అంటే మూలాధారంలో

ప్రకృతి తోడ్పడుతూనే వుంది. ఆ ప్రకృతియే తాను నిశ్చలతలో నున్నప్పుడు జీవన భరణంలో కూడ తన ప్రయత్నం లేకుండానే తనకు తోడు పడాలి. అంటే, ఇదివరకునుండి తాను ప్రకృతిమీద ఏ ఆనందాంశ తాను నిలుపుకున్నాడో ఏ ఆనందాంశతో ఇప్పుడుకూడ నిశ్చల ప్రశాంత స్థితియొక్క సాధనకు పూనుకుంటున్నాడో అదే ఆనందాంశయొక్క రక్షణతో ప్రకృతిని సాధకుడు తన జీవనభరణ వ్యాపారాల్లో ప్రవర్తింపజెయ్యాలి. జీవనభరణం రజోగునాంశతో కూడిన తమో గుణంతో జరుగవలసినదే. అయినా తమోగుణానికి సంబంధించిన ఆ ప్రకృతి భగవదానందంయొక్క అడుగుజాడలలో నడిచేదిగా ఉన్నప్పుడే తన నిశ్చల ప్రశాంతస్థితిని నిలబెట్టుతుంది. ఆకారణంచేత సాధకుడు తన నిశ్చల సాధనా ప్రవేశ సమయంలో తనలోని జీవన భరణాంశను ఆనందమార్గంలో నడిపించడానికి పూనుకొనడమే రామ పాదుకలను భరతునకు ఇవ్వడమంటే.

'ఉ' అంటే ప్రకృతి. ఉకా అన్నా అంతే అర్థం. ఉ-కారము మీద స్వార్థమందు 'క' ప్రత్యయము చేసిన స్త్రీలింగరూపం అది. 'పా' అంటే రక్షించేది పాత్ అన్నది అచారార్థ క్విం చింతం అది. రక్షించేదిగా ఆచరించడం అని అర్థం. * పాత్+ఉకా పాదుకా అవుతుంది. రామ అంటే ఆనందం అర్థం. అది నిర్విషయానందం. దానిచేత రక్షించే ప్రకృతి ఏదైతే కలదో అది రామపాదుక, అవుతుంది. అది భరతుడు స్వీకరించేడు. ఆ ఆనందరక్షకమైన ప్రకృతితో జీవనభరణ వ్యాపారం సాధకుడు సాగించడానికి పూనుకొన్నాడన్నదే భరత పాదుకా పట్టాభిషేకంలోని అంతరార్థం.

రాముడు త్రొక్కిన చెప్పులను సింహాసనముమీద పెట్టి భరతుడు రాజ్యకార్యాలు దానికి నివేదించేవాడు. అంటే, ఆనంద

---

* పాతి ఇతి పః, రక్షక ఇత్యర్థః; 'ప' ఇవ ఆచరతి ఇతి పత్ ఆచారార్థ క్విచింత రూపం పత్ + ఉకా = పదుకా పదుకా ఏవ పాదుకా (ప్రజ్ఞాద్యణ్) అనికూడ వ్యుత్పత్తి చెప్పవచ్చు. ఈవిధమైన రెండింటిలోను అర్థం ఒక్కటే.

ప్రకృతి రక్షణకల జీవనభరణం సాధకుడు జరిగించవడమన్న అర్థం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. సాధకుడు ఎప్పుడూ తాను నిశ్చలతత్వ సాధనకు దిగబోయేముందు తన జీవన భరణ రక్షణగూర్చి జాగ్రత్త పడాలన్నదే ఇందులోని సాధనా రహస్యం. మంత్రశాస్త్రంలోని 'పాదుకాంత దీక్ష' అన్నప్పుడుకూడ 'పాదుకా' అంటే రక్షించే ప్రకృతి అన్నదే అర్థంగా చెప్పుకోవాలి. జ్ఞానమార్గ పరంగా, "శ్రీదేవీ ఉపాసనా సిద్ధి కల్గింది". అంటే; ప్రకృతి రక్షణ తనకు లభించింది అని అర్థం. అంతవరకు సాధకుడు దీక్షలో ఉండాలి. అతని జన్మవాసనలకు బద్ధంగా కాకుండా తన జీవనం తరణమునకు అనుకూలముగా ప్రకృతి ఉండడమే పాదుకాంతదీక్ష. దానివలనే దేవీఉపాసనాసిద్ధి. అట్లే, రామపాదుకా పట్టాభిషేకం అంటే, రామరక్షితమైన ప్రకృతికి పట్టాభిషేకం జరిపించడం. అనగా ఆనందాశచే రక్షింపబడిన ప్రకృతికి జీవన సర్వభారము అప్పజెప్పడం అన్న సాధనా రహస్యాన్ని ఇది చెప్తూంది.

ఆ పాదుకాపట్టాభిషేకం నందిగ్రామంలో జరిగింపబడింది. గ్రామం అన్నదానికి వ్రజం పర్యాయపదం. దానికి సమూహం అన్నది అర్థం. "నందతి ఇతి" నందీ అని వ్యుత్పత్త్యర్థంలో 'నంది' అంటే ఆనందం గలది. ఆనందంగల సమూహం (Group) అనగా, శరీరంలోని సాత్త్విక వృత్తులు ఆనందంతో ఉన్నవని, అచ్చటనే రక్షించే ప్రకృతికి (పాదుకలకు) పట్టాభిషేకం జరిగిందని అంతరార్థం. భాగవతంలో శ్రీకృష్ణుడు పెరిగిన పల్లెకు 'నందవ్రజం' అన్నపేరు ఉన్నది. అక్కడకూడ నందిగ్రామం అన్నదాని కున్న అర్థమే చెప్ప బడుతుంది. *శ్రీదేవి మంత్రోపాసన పాదుకాంత దీక్షతో సిద్ధిస్తుంది అన్నప్పుడు జ్ఞానమార్గ పరంగా చెప్తే అచ్చట 'పాదుకా' అన్నదానికి రక్షకమైన ప్రకృతి అనియే అర్థం. ఆ ఉపాసనా సిద్ధికలవారు ప్రకృతి రక్షితులై సిద్ధులను పొంది చివరకు ముక్తులు కాగలరు.

---

* 'శ్రీ' అంటే 'శ్రూహింసాయాం' అన్న ధాతురూపం వశించే ప్రకృతి అను దాని అర్థం. శ్రీదేవీ ఉపాసన అంటే ప్రకృతి రక్షణ కోరే ఉపాసన అని అర్థం చెప్పుకోవాలి.

## ఖర విపరీకరణ కథనం; అత్రి ఆశ్రమప్రవేశం.

చిత్రకూటంలో రాముడు ప్రవేశించేక అచ్చటనుండెడి ఋషులు తమలో తాము గుసగుసలుపోయి తమ కులపతిద్వారా అచ్చట తాము పడుతూన్న రాక్షసబాధలు రాముడికి చెప్పుకున్నారు. "ఖరుడనే రాక్షసుడు రావణుని తమ్ముడున్నాడు. వాడు మీరాక చూచి మమ్ము మరింత బాధిస్తా డనిపిస్తోంది. తాపసుల ఆశ్రమాలు పీకివేయడం, అగ్ని హోత్రాలు మలినపఱచడం, అర్పివేయడంలాంటి పనులు చేస్తూ బాధిస్తున్నా" డని చెప్పుకొని ఋషులు వెళ్ళిపోయారు. ఎన్నో ఆశ్రమాలు, తపస్వులు లేకుండా శూన్యములుగా ఉండడం చూచేడు రాముడు. ఇక్కడ తాము నివసిస్తే సుఖంలేదని తెలిసికొన్నాడు.

శ్లో॥ రాఘవ స్త్వథ యాతేషు తపస్విషు తపస్విషు విచింతయన్
న తత్రారోచయ ద్వాసః కారణై ర్బహుభి స్తదా
ఇహ మే భరతో దృష్టః మాతరశ్చ సనాగరాః
సా చ మే స్మృతి రన్వేతి తా న్నిత్య మనుశోచితః
తస్మా దన్యత్ర గచ్ఛామః ఇతి సంచిత్య రాఘవః
సో ఽత్రే రాశ్రమ మాసాద్య తం వవందే మహాయశాః

తరువాత మునులు వెళ్ళిపోయేక రాముడు అనేక కారణాల వల్ల అక్కడ నివసించియుండడానికి ఇష్టపడలేదు. ఇక్కడ వుండగా భరతుడు వచ్చేడు. తల్లులతో సహా అయోధ్యవాసులు వచ్చేరు. అస్తమానం వాళ్ళనుగూర్చియే మనస్సులోకి ఆలోచనలు వస్తూన్నాయి. అందుచేత మఱొకచోటికి మకాం మార్చాలని రాముడు అత్రిమహాముని ఆశ్రమాన్ని ప్రవేశించి ఆయనకు నమస్కరించేడు అత్రి అతనిని కొడుకులాగ ఆదరించేడు. అతనిభార్య, అనసూయ, వైదేహిని స్వీకరించేటట్లు చేసి రామునికి ఆమెనుగూర్చి చెప్తాడు. అనసూయ సీతకు దివ్యాంగరాగాన్ని అలంకారాల్ని ఇస్తుంది. తర్వాత సీతా రామలక్ష్మణులు దండకారణ్యానికి వెళ్ళేరు.

సాధకుడు మనోనిశ్చలస్థితిని సాధించడానికి, అంటే, ఏ ఇంద్రియవృత్తికూడా కదలకుండా ఉండే అంతరమౌనసాధన ప్రారంభించడంతో, లోనున్న నీచప్రకృతి రేగుతుంది. అదే తీవ్ర రూపం ధరిస్తుంది. అది దశేంద్రియ ప్రకృతికి సంబంధించిందే కాని అన్యంకాదు. ఆ తీవ్రతకు సాధకునిలోని సాత్త్వికవృత్తులు దెబ్బతింటాయి. ఈసంగతిని గుర్తించి సాధకుడు, ఆవిధమైన మౌన సాధనలో ఉండడం చాలా ఇబ్బందులకు గురిచేస్తుందని గ్రహిస్తాడు. జ్ఞానసాధనలో సాధకునకు మనస్సులో నిశ్చలత నిలవకుండా ఆలోచనలు ఏవేవో అప్పుడప్పుడు వస్తూంటాయి. భరతుడు రావడం తల్లులు రావడం, అయోధ్యావాసులు రావడం మన రామునకు మనస్సు వికలపడింది అనే సంగతిని చెప్పడంలో వాల్మీకి సాధకునకు జ్ఞానమార్గంలో అప్పుడప్పుడు నిశ్చలతను భంగంచేసే ఆలోచనలు వస్తూంటాయని తెలియచేసాడు అని గ్రహించాలి. ఆకారణం చేతనే రాముడు అత్రిమహాముని ఆశ్రమానికి వెళ్ళేడు; అంటే, సాధకుడు తనకువచ్చే ఇతరాలోచనలు అన్నీ సత్త్వరజస్తమోగుణాలకు సంబంధించినవని గుర్తించి ఆమూడుగుణాలను తనలో లేకుండా చేసికోవాలన్న భావం పొందేడన్నమాట. 'అత్రి' అనగా న + త్ర మూడు లేనిది - త్రిగుణ రాహిత్యం; ఇతర ఆలోచనలేవీ లేకపోవడం అని అర్థం. సాధకుడు, త్రిగుణరాహిత్యం తనలో కల్గేటట్లు తద్వారా అసూయ అనేది తనలో తలెత్తకుండా ఉండేటట్లా సాధనచేస్తాడు. అసూయ లేనప్పుడు త్రిగుణరాహిత్యం కల్గుతుంది. త్రిగుణరాహిత్యం సాధించినప్పుడు అసూయ ఉండనే వుండదు. ఈవిధంగా సాధకుడు తనలోని ప్రకృతికి అసూయా అక్షణం లేకపోవడాన్ని త్రిగుణ రాహిత్యాన్ని సాధించేడు అన్నదే అనసూయ,అత్రిమునులను దర్శింప చేశాడన్నదాని అంతరార్థం. ఆపైని ఇంకా ప్రశాంతస్థితి సాధించ డానికి తీవ్రశిక్షణ అభ్యసించడానికి పూనుకుంటాడు సాధకుడు.

రాముడంటే సాధకుడు. సీత ప్రకృతి రూపిణిగా, లక్ష్మణుడు జీవరూపంగా సాధకునిలోని భాగములే కాన సాధకుని చెప్పినప్పుడు అతని జీవప్రకృతులను వేఱు వేఱుగా పేర్కొనవలసిన పని వుండదు. కథకోసం విడివిడిగా సీతారామలక్ష్మణులని ముగ్గురను చెప్పేదు. చిత్రకూటం చేరడంతో అంటే, సాధకుడు నిశ్చల మౌనస్థితి సాధన కుపక్రమించడంతో అచ్చటనున్న తాపసులు అంటే, సాధకునిలోని సాత్త్వికభావాలు రావణుని తమ్ముడైన ఖరుడు అనేవాడు తమ ఆశ్రమాల్ని పీకివేస్తున్నాడని, అగ్నిహోత్రాలు ఆర్పివేస్తున్నాడని రామునకు తమ కులపతిద్వారా చెప్పుకున్నారు. అంటే, సాధకుని లోని నీచప్రకృతియొక్క తీవ్రతయే ఖరుడన్నపదానికి అర్థం. 'ఖర' అంటే, తీవ్రమైనది. ఖరుడు రావణానుజుడు అంటే, దశఇంద్రి యములను బిగ్గరగా ధ్వనిచేయించే నీచప్రకృతికే దశకంఠరావ ణుడని అర్థం, దశకంఠాలు అంటే, దశఇంద్రియాలు. రావణం అంటే, బిగ్గరగా ధ్వనిచేయించడం అని అర్థం. దశకంఠరావణుడు అంటే, ఇచ్చట దశేంద్రియములు తమ కోర్కెలను తీర్చుకోడానికి చేసే ఆక్రందన వ్యాపారానికి. ఖరుడు అంటే ఆ ఇంద్రియారాటం యొక్క తీవ్రస్వరూపం (తీక్ష్ణత) అనిఅర్థం లేక, ఖ - ఇంద్రియ ములయొక్క, ర - అగ్ని. ఇంద్రియప్రజ్జ్వలనం అని రెండు రకాలుగా అర్థాలూ చెప్పవచ్చు. ఖ - ఇంద్రియములను, 'రాతి' గృహ్ణాతి ఇతి ఖరః అనికూడ మూడవరకంగాను చెప్పవచ్చు. ఈవిధమైన వ్యుత్పత్త్యర్థాలతో ఖరుడంటే తీవ్రమైన ఇంద్రియ ప్రజ్జ్వలనం అనే అంతరార్థం స్ఫురిస్తుంది. ఇంద్రియ ప్రజ్జ్వలన తీవ్రతకు సాధకులలోని సాత్త్వికవృత్తులు తట్టుకోలేకపోవడాన్ని 'ఖర' రాక్షసుడు చేసే తపోవిఘ్నకార్యాలుగా చెప్పబడ్డాయి. అగ్నిహోత్రాలు అంటే, జ్ఞానప్రవృత్తులయొక్క ప్రకాశం అన్నమాట. వానిని ఖరుడు ఆర్పివేస్తున్నాడు; అంటే దశేంద్రియప్రవృత్తులు తీవ్రరూపం ధరించి సాధకునిలోని సాత్త్విక ప్రవృత్తిల్ని ప్రదీపింప కుండా ఆర్పివేస్తున్నాయన్నదే ఖర రాక్షసుడు తనపరివారంతో

ఋషులను తీవ్రహింసలకు గురిచేస్తున్నాడన్నదానికి అంతరార్థం. అందుచేత ఇట్టిచోట అంటే, ఇంద్రియప్రజ్వలనంలో తాము ఉండడంవల్ల లాభంలేదని చిత్రకూటంలోని ఆ భాగాన్ని వదలి రాముడు అత్రి ఆశ్రమం ప్రవేశించాడు. అంటే, సాధకుడు జ్ఞానంద్వారా నిశ్చలస్థితిని సాధించడానికి తనలోని అపరాప్రకృతి దశేంద్రియా ప్రకోపంయొక్క తీవ్రతారూపంతో తనకు ధ్యానభంగం కల్గించడాన్ని గుర్తించాడన్నమాట. అత్రి అంటే, న + త్రి = అత్రి మూడులేనిది అనగా సత్త్వ, రజ, స్తమన్సులనే త్రిగుణరాహిత్యమైన స్థితి అన్నమాట లోగడ చెప్పుకొన్నాం, ఆస్థితిని సాధించేడు సాధకుడని, అత్రి ఆశ్రమానికి రాముడు వెళ్ళేడన్నదానికి అంతరార్థంగా చెప్పుకోవాలి. అత్రి రామునకు అనసూయను గురించి చెప్పేడు. న + అసూయ = అనసూయ, అనసూయ అనేదీ లక్షణం త్రిగుణ రాహిత్యం కల్గినవానికే అంటిపెట్టుకొని వుంటుంది. అంటే, అత్రిని అనసూయాదేవి విడవకుండా పాతివ్రత్యంతో అనుసరిస్తూంది అనే దానికి అంతరార్థంగా చెప్పుకోవాలి. అనసూయ అత్రిని విడిచి వుండదు; అంటే, అసూయాలక్షణం లేకపోవడం త్రిగుణ రాహిత్యంవల్లనే లభిస్తుంది అని అర్థం. అనసూయ సీతకు అంగ రాగం ఇచ్చి ఎప్పుడూ ఆమె తనువు వాడకుండా, అలసిపోకుండా ఉండేటట్లు చేసింది. అంటే, సాధకునిలోని ప్రకృతి అనూయా లక్షణం లేని కారణంచేత, ఎట్టి దుష్టప్రకృతులను ఎదుర్కొన్నా కుంగకుండా సాధనభ్రష్టం కాకుండా ఉందని అంతరార్థం చెప్పుకోవాలి.

సీతయొక్క పాతివ్రత్యాన్ని ప్రశంసించి అనసూయ ఆమెకు అంగరాగము, దివ్యాలంకారములను అందజేస్తుంది. అంగరాగం అంటే, అం = సర్వవ్యాపకమైన భగవంతుని, గ = పొందినట్టి, రాగము = ఆసక్తి. భగవదాసక్తిని సాధకునిలోని ప్రకృతికి కల్గింది అన్నమాట.

సీత అంటే, భూప్రకృతి. అది *వైదేహి అనగా దేహములేనిది లేక అన్ని దేహములు దానివే అని అర్థం. ఆమె భర్త రాముడు-ఆనందరూప పరబ్రహ్మ. వైదేహి పరబ్రహ్మస్వరూపాన్ని విడువకుండా ఉన్న పాతివ్రత్య మహిమ వలననే ఆమెకు అసూయాలక్షణం లేక పోవడం కల్గింది. ఆకారణంచేత, అంటే, అనసూయచేత ఎప్పుడూ సడలని యౌవనాన్ని, రూపసౌందర్యాన్ని పొందింది. అంటే, సాధకునిలోని భూసంబంధమైన ప్రకృతి తాను పరమాత్మలో ఐక్య పడడానికి యత్నిస్తూ వుంటుందని, అప్పుడు సాధకునకు త్రిగుణ దోషములేవీ అంటవనీ, తద్వారా అనసూయత్వం లభిస్తుందని ఆ అనసూయా లక్షణంవల్ల ప్రకృతికి భగవదాసక్తి కల్గుతుందనీ, దానివల్ల ఏ పరిస్థితిలోనూ తన్ను బాధించకలేది ఏదీకూడా ఉండదని, అతని సాధన అమోఘంగా సాగిపోతుందనీ అంతరార్థం దీనిలో ఉన్నదిగా పై కథనుబట్టి గ్రహించాల్సి వుంది.

* విదేహరాజుకూతురు కాన వైదేహి. 'విదేహ' అంటే విగతమైన దేహం కల అని ఒవిశేషములైన దేహాలు కల అని రెండు విధాల వ్యుత్పత్త్యర్థం చెప్పవచ్చు. 'వి' అనే ఉపసర్గకు లేకపోవడం అర్థమే విశేషమైన అన్నది అర్థమే.

సంపూర్ణం.

# అరణ్యకాండ - కిష్కింధాకాండలు:

## ఇంద్రియ పరిశాంతీకరణ సాధన.

## అ ర ణ్య కాం డ.


| వరుస క్రమము. | విషయసూచిక. | సాధనాసూచిక. | పేజీ. |
|---|---|---|---|
| 1. | మహర్షి సంగం | — గొప్పగొప్ప తపస్సాధనల పరిశీలనం. | 1 |
| 2. | విరాధ వధ | — అహంకారాన్ని పోద్రోలుట | 5 |
| 3. | విరాధ ప్రహరణం-ఖననం | — అహంకారము నణగద్రొక్కుట | 7 |
| 4. | శరభంగుని బ్రహ్మలోక ప్రస్థానం. | — శరీర నాశంతో ముక్తిని పొందే సాధనాపరిశీలనం. | 9 |
| 5. | రక్షోవధకు ప్రతిజ్ఞ | — తామసిక వృత్తులను నాశనం చేయు సంకల్పం | 20 |
| 6. | సుతీక్ష్ణాశ్రమ ప్రవేశం | — సాధనలను తీవ్రతరం చేయుట | 21 |
| 7. | సీత ధర్మసందేహం-రాముని నిర్ణయం | — తామసికశక్తులనుగూర్చి ప్రకృతి దయచూపుట, సాధకుని నిర్ణయం. | 24 |
| 8. | పంచాప్సరస్తీర్థం | — పంచేంద్రియప్రలోభపరిశీలనం | 25 |
| 9. | దశవర్ష ఖండం | — దశేంద్రియాల వృత్తులను ఓడ్చివేయుట. | 30 |
| 10. | అగస్త్యాశ్రమ ప్రవేశం | — విశ్వలస్థితిలో 'సర్వం ఖల్విదం' సాధన. | 31 |
| 11. | ఇల్వల వాతాపుల కథ | — మాయా జనన మరణ నాశం | 33 |
| 12. | వింధ్య గర్వాపహరణం | — నాస్తికత్వ విరోధం | 35 |

| | | | |
|---|---|---|---|
| 13. | పంచవటీ ప్రవేశం | — ఇంద్రియ వృత్తులను ప్రేరేపించే స్థితిని పరిశీలించుట. | 43 |
| 14. | జటాయువు | — వేదవిజ్ఞానంయొక్క తోడ్పాటు | 47 |
| 15. | శూర్పణఖ | — ఇంద్రియనిశ్చలతను నాశంచేసే దుష్టశక్తిని నిరాకరించుట. | 50 |
| 16. | ఖరదూషణాదుల వధ | — ఇంద్రియ తీవ్ర ప్రజ్వలనాదుల నాశనం. | 54 |
| 17. | రావణునకు అకంపనుని ప్రబోధం, | — సాధనలను కంపింపజేయు శక్తియొక్క ప్రబోధ. | 57 |
| 18. | మారీచోపదేశం | — మాయ భగవంతుని గుర్తించుట | 63 |
| 19. | బంగారులేడి, సీతాపహరణం | — మాయ, ప్రకృతిని ప్రలోభపెట్టి అవమానించుట. | 65 |
| 20. | అశోకవనం | — ప్రకృతి పురుషునితో ఉండుట | 68 |
| 21. | సీతా విరహం | — ప్రకృతి వియోగం | 69 |
| 22. | జటాయు మరణం | — వేద విజ్ఞానం వల్ల ప్రకృతిజాడ తెలియుట. | 73 |
| 23. | అయోముఖి | — తమోగుణ దర్శనం | 75 |
| 24. | కబంధ వధ | — సుఖవాసనా నాశనం | 76 |
| 25. | శబరి కథ | — శ్రేష్ఠమైన దైవీశక్తి | 78 |

# కిష్కింధాకాండ.


| వరుస క్రమము. | విషయసూచిక. | సాధనాసూచిక. | పేజీ. |
|---|---|---|---|
| 1. | వాలివధ. | — మాయా నాశనం | 85 |
| 2. | మహిషాసుర దుందుభి | — భూసంబంధ వాసనా ప్రకోప పరిశీలనం. | 87 |
| 3. | సప్త తాళ భంజనం | — సప్తధాతు నిగ్రహం | 88 |
| 4. | తార - రుమ | — తరించవలెనను వృత్తి, ప్రవృత్తి సంపద వాని పరిశీలనం | 90 |
| 5. | ఆంజనేయుడు | — బుద్ధియోగం | 92 |
| 6. | స్వయంప్రభ | — తనకు తానై స్ఫురించు దైవ సహాయం | 93 |
| 7. | సంపాతి కథ | — ఉపనిషద్విజ్ఞానం | 94 |
| 8. | ఆంజనేయుని జననవృత్తాంతం | — బుద్ధియోగం యొక్క ప్రాదుర్భావ పరిశీలనం. | 96 |

# అంతరార్ధ రామాయణము.

## అ ర ణ్యా కాం డ.

### మ హ ర్షి స ం గ ం.

'అరణ్యం' అంటే ప్రశాంతస్థితి, అని ఇదానిలో పధ్నాలుగు సంవత్సరాలంటే అంతఃకరణ చతుష్టయంలోను పది ఇంద్రియాల్లోను నివసించడానికి, అంటే శాంతిని సాధించడానికి రాముడు అంటే, ఆనందాంశతో కూడిన సాధకుడు పూనుకోవడమే అరణ్యకాండలో చెప్పబడేదిఅనితెలిసికోవాలి. ప్రశాంతస్థితిని సాధించేసాధనలు ఎన్నెన్నో ఈ అరణ్యకాండలో అనేక కధావిధానాలతో వ్యంగ్యంగా చెప్పబడినాయి. ఏ యే కధాసంధర్భాలలో ఏ యే సాధనలు చెప్పబడ్డాయో ఇప్పుడు అంతరార్ధపరంగా మనం తెలిసికొందాం.

ప్రశాంతస్థితి సాధనయే ముక్తి సాధనకు మూలం కాన, ఈ కాండ సాధకులకు అవశ్యపఠనీయం. ఇందు ముఖ్యములైనవానికి మూలశ్లోకములు ఉదహరించి వాటికి తాత్పర్యం చెప్పి ఆపైని సాధనా సమన్వయాన్ని అంతరార్ధపరంగా విడదీసి వివరంగా చెప్తాను.

కధ :—

శ్లో॥ ప్రవిశ్య చ మహారణ్యం
దండకారణ్య మాత్మవాన్
దదర్శ రామో దుర్ధర్షః
తాపసాశ్రమ మండలం
కుశ చీర పరిక్షిప్తం
బ్రాహ్మ్యా లక్ష్మ్యా సమావృతం॥

తా॥ ఆత్మవంతుడైన రాముడు మహారణ్యమైన దండకారణ్యాన్ని ప్రవేశించేడు. తేరిచూడశక్యంకానటువంటివాడై తాపసాశ్రమ మండలాన్ని దర్శించేడు. ఆ ఆశ్రమ సమూహం కుశచీర పరిక్షిప్తమై బ్రహ్మ సంబంధమైన సంపత్తుతో కూడివుంది. అని వాచ్యార్థం.

రాముడు ఆత్మవంతుడు, అంటే ఆనందంతోకూడిన సాధకుడు పరమాత్మతోకూడి వున్నాడు. అంటే, పరమాత్మను సాధించే యత్నం చేస్తున్నాడన్నమాట. చూడ శక్యంకాని తేజస్సుతోఉన్నాడు. తాపసాశ్రమ మండలాన్ని, తాప+స+ఆశ్రమ+మండలాన్ని, అంటే తాప-ఆధి భౌతిక, అధి దైవిక, ఆధ్యాత్మికములను, తాపత్రయ ములను, స=నశింపజేసినదగుటచే 'స' అంటే అంతము చేయుట అని, 'సే అంతకర్మణి' అనుధాతువు వల్ల అర్థం చెప్పుకోవాలి ఆశ్రమ-శ్రమలేని సాత్త్వికవృత్తులయొక్క, మండలం-సమూహము. అనగా, తాపశాంతిని కల్గించేవిగా తనలోనున్న సాత్త్విక వృత్తుల సమూహాల్ని అని అంతరార్థం చెప్పుకోవాలి. సాధకుడు ఆ సాత్త్విక వృత్తులను గుర్తించేడు అన్నది తాపసాశ్రమమండలం రాముడు చూచేడు అన్నదానికి ఇచ్చట అంతరార్థంగా చెప్పాలి, 'కుశ చీర పరిక్షిప్తం' అంటే, దర్భలచేత, నారబట్టలచేత, పఱచబడి వున్నది. అని బాహ్యార్థం. 'కుశచీర పరిక్షిప్తం' అంటే; కుశ, కు-భూమియందు, శ-శయనించియున్న, (అంటివున్న) చీర-మాయచేత,వస్త్రం శరీరాన్ని ఆచ్ఛాదన చేస్తుంది. అట్లే మాయకూడ పరమాత్మను కన్పడకుండా కప్పివేస్తుంది. కాన వస్త్రపర్యాయపదాలుఅన్నీ మాయకు సాంకేతికంగా వాడడం ఉంది. పరిక్షిప్తం-వ్యాప్తమైనది అని అంతరార్థం. బ్రాహ్మ్య లక్ష్మ్య సమావృతం-బ్రహ్మజ్ఞాన సంపత్తుతో కూడి వుంది, సాధకుని లోని సాత్త్వికభావ మండలం బ్రహ్మజ్ఞానం కల్గివున్నది ఐనా, అది ఐహిక విషయికమైన మాయతో కప్పబడివుంది అని అర్థం. సాధన పూర్తి అయ్యేవరకు బ్రహ్మజ్ఞానం కల్గివున్న ఎంతటి సాత్త్వికభావాలైనా, మాయచే కప్పబడి అనుసుగులోనుండి తొంగిచూస్తూ వుంటాయి.

ఆ మాయను తొలగించడానికి ఇంకా పది ఇంద్రియాలలోను, అంతరంగచతుష్టయంలోను, ప్రశాంతతను సాధించ వలసియే యున్నది. ఇంద్రియచలనం ఉన్నప్పుడే ఐహిక భోగ సంబంధం ఉంటుంది. అదే మాయావరణం అంటే. ఆ మాయావరణాన్ని తొలగించాలంటే, భోగలంపటత సంపూర్ణంగా శాంతించాలి. ఇహాముత్ర భోగవిరాగం కావాలి. అందుకు పధ్నాలుగు ఇంద్రియాలలోను ప్రశాంతస్థితిని సాధించాలి. ఆ సంగతిని సాధకుడు గుర్తించాడన్నదే ఇందలిఅంతరార్థం. 'దదర్శ రామో దుర్ధర్షః' అంటాడువాల్మీకి. వాచ్యార్థంలో దుర్ధర్షుడు అన్నా, అంతరార్థంలో; దుర్ + దర్శుడు దుర్దర్శుడు* అనిదానినిమార్చుకోవాలి. అప్పుడు చూడశక్యముకానట్టివాడై అనిఅర్థం. కాన ఆ మాయావరణానికి రాముడు అంటే, 'ఆనందం', చూడశక్యము కాకుండా ఉంది. కాని, రాముడు మాత్రం ఆమాయను చూచాడు, అని అర్థం. రాముడుఅంటే సాధకునిలోని పరమాత్మసంబంధమైన ఆనందాంశ. ఆ ఆనందాంశను మాయ చూడలేదు. కానిఆ ఆనందాంశ కల సాధకుకునిలోనున్న సాత్త్వికమండలాన్ని మాత్రం ఆ మాయ కప్పివైచింది. ఇది ఏమిటి? సాధకునిలోనే ఉన్నది ఆనందాంశ. అది మాయకు కట్టుబడదు. ఆ సాధకునిలోనే ఉన్నది సాత్త్వికవృత్తి సమూహం. అదిమాత్రం బ్రహ్మజ్ఞానంకల్గిఉన్నా మాయావృతమైయే వుంది. ఇదే ఆధ్యాత్మికతలోని దుర్దర్శమైన చిత్రం; దీనిని ప్రతి సాధకుడు స్వానుభవంతో తప్ప, మాటలతో అవగాహనం అయ్యేటట్టు చేసుకోవడం అనేది పూర్తిగా సాధ్యంకాకపోవచ్చు. మనలోనే పరమాత్మ (మాయావృతం కానిది) ఉన్నది. మాయావృతములుగా మనోవృత్తులూ ఉన్నవి. అవి జీవాత్మకు సంబంధించినవని చెప్పాలి. జీవుని కప్పిన మాయాజాలాన్ని అంటే వాసనాసమూహాన్ని ఛేదించి ఆత్మతో, ఆత్మలోనే మాయను లీనంచేసుకోవడానికి చేసే సాధనలే

* దుర్ధర్షః, అనియే చెప్పినా దుర్ధర్షుడు = ఎదిరింపశక్యము కానివాడు, మాయచేత ఎదిరింపశక్యముకానివాడనీ చెప్పవచ్చు.

అధ్యాత్మిక సాధనలంటే. ఇది చాల మెలకువతో 'తన్ను, తాను తనచేతనే ఉద్ధరించుకోవాలి' అన్న భగవద్గీతా రహస్యాన్ని సాధించ డానికి సంబంధించిన సాధన.

కథ :—

రామ దర్శనం పొందిన తపస్వులు రామునితో ఈవిధంగా చెప్పుకున్నారు.

శ్లో॥ న్యస్తదండా వయం రాజన్!
జితక్రోధా జితేంద్రియాః
రక్షితవ్యాః త్వయా శశ్వత్
గర్భ భూతా స్తపోధనాః॥

తా॥ రాజా! మేము సాధనలతో శిక్షణ పొంది యున్నాము. క్రోధాన్ని జయించేము. ఇంద్రియజయం సాధించేము. తపస్సే ధనం మాకు. నీగర్భంలో ఉన్నాము. మమ్ము మాటిమాటికీ నీవు రక్షిస్తూ వుండాలి.

సాధకునిలోని సాత్త్విక భావాలు, సాధకునిలోని పరమాత్మతో చెప్పుకోవడంగా ఈ సంభాషణకు అంతరార్థంగా గ్రహించాలి. ప్రభూ! మేము నీగర్భంలో వున్నాము; అంటే నీవు ఆధారంగా నీలోనే ఉన్నాం అని అర్థం. మేము సాధనల శిక్షణతో ఇంద్రియ జయం సాధించేము. క్రోధాన్ని జయించేము. నీలో నిన్ను, రక్షణకైనమ్ముకొని వున్నాం. అంటే, నీలో ఐక్యం కావాలని యత్నిస్తూన్నాం. మమ్ము నీవు మాటి మాటికి ఏపతనస్థితీ రాకుండా కనిపెట్టి చూస్తూ రక్షించాలి. అని వేడుకొన్నాయి. అంటే, సాధకుడు తనలోని సాత్త్విక భావాలను శిక్షణతో దిద్ది తీర్చి ఆనందాంశలో వానిని ఐక్యం చెయ్యడానికి వాని పైని కప్పివున్న మాయ అనే ముసుగును తొలగించడానికి ఇంకా సాధనలు జరిపించాలి, అనే జ్ఞానమార్గ రహస్యాన్ని ఇందులో గ్రహించాలి. సాధకునిలో అంత ర్దృష్టి పరిశీలనం ఇందు ప్రస్ఫుటింప

బడిందిగా ఈ మహర్షి సంగ్రప్రకరణంలో గ్రహించాల్సి వుంది సాధకుడు. ఈ సాత్త్విక మండలాన్ని ఎట్లురక్షించుటకు యత్నించాలో ఈక్రింది విషయాలు తెల్పుతాయి. 'విరాధ వధ' అనే సాధనా ప్రసంగం వాల్మీకి మూడు సర్గలలో వివరించాడు. విరాధుడు ఎదుర్కొనడం, 'విరాధుని దెబ్బతీయడం' విరాధుని భూమిలోపూడ్చిపెట్టడం అన్న మూడు అంశములతో విరాధవధ కధ కూడుకొని యున్నది. ఇది సాధనలలో ముఖ్యాతి ముఖ్యమైన సాధన. కాన, దీనిని చాలా వివరంగా వాల్మీకి చెప్పేడు.

## వి రా ధ వ ధ.

### వి రా ధ సం రో ధం

రాముడు దండకారణ్యంలో సీతా లక్ష్మణులతో కలిసి తిరుగుతూండగా విరాధుడు అనే రాక్షసుడు వారిని అడ్డగిస్తాడు. ఇది విరాధ సంరోధం అనే ప్రసంగం. విరాధ సంరోధం అంటే విరాధుడు ఎక్కువగా అడ్డగించడం అని అర్థం.

శ్లో॥ అహం వన మిదం దుర్గం విరాధో నామ రాక్షసః
చరామి సాయుధో నిత్యం ఋషిమాంసాని భక్షయన్
ఇయం నారీ వరారోహా మమ భార్యా భవిష్యతి
శ్రుత్వా సగర్వితం వాక్యం సంభ్రాంతా భయవిహ్వలా
సీతా ప్రావేప తోద్వేగాత్ ప్రవాతే కదళీ యధా
తాం దృష్ట్వా రాఘవ స్సీతాం విరాధాంకగతాం శుభాం
అబ్రవీ ల్లక్ష్మణం వాక్యం ముఖేన పరిశుష్యతా॥

తా॥ నేను విరాధుడను పేరుగల రాక్షసుడను. నిత్యమూ సాయుధుడనై ఋషిమాంసాలను తింటూ ఎవరూ చొరలేని ఈ ప్రాంతాన్ని తిరుగుతున్నాను. ఈసీత నాకు భార్య కాగలదు. అంటూ, సీతను తన తొడమీద పెట్టుకొన్నాడు విరాధుడు, ఆమాటలు విని సీత భయంతో పెద్దగాలికి అరటిచెట్టు ఊగినట్టుగా గడగడ వణకిపోయింది. విరాధుని తొడమీద సీతను చూచి రాముడు నోరెండిపోయి మాటరాక లక్ష్మణుని హెచ్చరించగా లక్ష్మణుడు విరాధునిపైకురికాడు.

'అహం - - - విరాధో' అన్న వాల్మీకి మాటల్లోనే అంతరార్థం స్పష్టపరుపబడుతూంది. 'అహం' అంటే 'అహం' అని ఏది పిలువ బడుతుందో, అది, విరాధః-విరాధుడు. అహం అంటే అహంకారం; అహంకారం మమకారానికికూడ గ్రాహకమే, 'అహం' పదం యొక్క షష్ఠీవిభక్తిరూపమే 'మమ' అనే పదం కనుక, అహంకార, మమకారాలు విరాధుడు అన్న పదానికి అంతరార్థం. ఈ దుర్గమమైన అరణ్యములో అంటే, ఎవ్వరూ పొందలేని ఈ ఇంద్రియ ప్రశాంత స్థితిలో 'నేను ఋషిమాంసం భక్షిస్తూ సాయుధుడనై తిరుగుతాను' అంటాడు విరాధుడు. అంటే, ఈ ప్రశాంతిస్థితిలో తపస్సులోనున్న వారిలోకూడ నేను చోటుచేసికొని వారి తపస్సును భ్రష్టం చేస్తూంటాను అని అహంకారపరమైన అర్థం. అహంకార మమకారాలు ఎంతో ఇంద్రియ నిశ్చలతను సంపాదించినవారిలోకూడ చోటు చేసికొని వారి సాధనను పాడు చేస్తూ వుంటాయనీ, వాటి ప్రభావంవల్ల వారు తపస్సిద్ధిని పొందలేక పోతారనీ జ్ఞానమార్గ రహస్యం ఇందులో చెప్పబడింది.

ఈ సీత నాకు భార్యఅని ఆమెను తొడమీద పెట్టుకుంటాడు, అంటే ఐహిక ప్రకృతి నాకు వశీవర్తిని అన్న అహంకారం అనడమే. అహంకారం ప్రకృతిని బలాత్కరించి లోబఱచుకోవడం అన్నది సీతను విరాధుడు లాగి తన తొడమీద పెట్టుకోవడం అన్న దానిలోని అంతరార్థంగా ఇందులో ద్యోతకమవుతుంది. సాధకుడు శిక్షితములైన సాత్త్విక వృత్తులతో ఇంకా నిశ్చలత్వాన్ని సాధించకుండా వున్నప్పుడు సాధకుని లోపలనున్న అహంకార, మమకారాలు రేగి సాధకునిలోని ఐహిక ప్రకృతిని తాము వశపఱచుకొనడానికి బ్రహ్మాండమైన యత్నం జరిగిస్తాయి. అప్పుడు సాధకునకు దిక్కూ, తెన్నూ తోచదు. అహంకార నాశం తనలోని జీవాత్మవల్లనే జరగాలి కాన దానికి అతనిలోని ఆత్మ ప్రోత్సాహం మాత్రమే అందిస్తుంది. అదే రామునకు సీతను విరాధుడు తొడమీద చేర్చుకోడాన్ని చూడ్డంతో నోరెండి మాటరాక ఎట్లాగో లక్ష్మణుని హెచ్చరించాడు; లక్ష్మణుడు విరాధుని మీదికి

వురికి వాని వినాశానికి యత్నించాడు అన్నదానికి అర్థం. విరాధః, అంటే, వి=విగతమైన రాధః=ఆరాధనము కలవాడు; అనగా పూజించుటకు కూడనివాడు అని అర్థం. పూజార్హత లేనిది అహంకారం అని చెప్పుకోవాలి.

విరాధప్రహరణం, ఖననం

రామలక్ష్మణులు విరాధునిమీద బాణవర్షం కురిపిస్తారు. కాని విరాధుడు చావడు, పైగా త్రిశూలం పుచ్చుకొని ఎదురు తిరుగుతాడు. చివరకు విరాధుడు తనచావును గూర్చి తానే ఉపాయం చెప్తాడు. తాను జయుడనేవానికి శతక్రోధ అనే అపెవల్ల జన్మించినట్లు, తనకు ఏ ఆయుధాలతోనూ మరణం లేదని వరం ఉన్నట్లు చెప్తాడు. తాను శాపగ్రస్తుడై రాక్షస జన్మ పొందినట్లుకూడ చెప్తాడు.

శ్లో॥ 'యదా దాశరథీ రామః
త్వాం వధిష్యతి సంయుగే
తదా ప్రకృతి మాపన్నో
భవాన్ స్వర్గం గమిష్యసి'॥

అని రాముని చేతిలో తాను చనిపోయినప్పుడు శాప విముక్తి కల్గుతుంది అనికూడ చెప్తాడు. తన్ను పూర్తిగా ఎవరూ చంపలేరనీ గొయ్యి తీసి తన్ను అందులో సజీవసమాధి చెయ్య వలసిందనీ తన్ను తలెత్తకుండా రాళ్ళతో గోతిని పూడ్చిపెట్టవలసిందనీకూడ చెప్తాడు.

'అహం' అనేది చచ్చేదికాదు. అది జీవాత్మను ఆశ్రయించి వుండేదే. జీవునియొక్క కర్మ వాసనల ననుసరించి అది తలెత్తుతూనే వుంటుంది. జీవుడు కర్మ వాసనలనుండి విముక్తుడైతేనే అహంకారం, నశిస్తుంది. అహంకారం నశించిపోతేనే కర్మవాసనలు నశిస్తాయి. రెండూ ఒకదానితో ఒకటి జతపడి వున్నాయి. సాధకుడు, ఇటు కర్మవాసనలను నశింపుచేయడానికై, తామసంనుండి రాజసమునకు రాజసమునుండి సాత్త్వికమునకు కర్మలను పరిణమింపజేస్తూ సాత్త్వి

కమునుండి, బ్రహ్మజ్ఞానంతో అహంకార నాశానికి యత్నించాలి. సాత్త్వికాహంకారాన్ని అంటిపెట్టుకొని కర్మవాసన లున్నంతవరకూ జీవుడు జీవాత్మ అనే అనిపించుకుంటాడు. తాను పరబ్రహ్మ స్వరూపమే అని జ్ఞానంతో అహంకారం విడవడంతో ఆజీవుడు సచ్చిదానందరూప పరమాత్మఅని అనిపించుకుంటాడు.

పరమాత్మయే జీవుడు, 'అహం' అన్నా అతడే. అహం అనేదే పరమాత్మగా జీవునిచే భావించబడి ఆత్మైక్యాన్ని సాధించడమే ముక్తి. కనుక సోఽహం ధ్యానం సాధకునిలో సాగాలి. అహం అనేదే సః= ఆ పరమాత్మ అనే ఆత్మబోధ సాధకునిలో సాగి 'అహం బ్రహ్మాస్మి' అనేది అనుభూతికి రావాలి. అంతవరకూ 'అహం' చావదు. కాని, దాన్నితలెత్తకుండామాత్రం సాధనలచే పూడ్చిపెట్టాలి అదే, విరాధుడు తనకు ఆయుధాలచేత చావు లేదనీ, గొయ్యి త్రవ్వి పూడ్చిపెట్టండనీ చెప్పినదానిలోని అంతరార్థం. త్రిశూలంతో విరాధుడు విక్రమించేడు అంటే, త్రిగుణములను ఆధారం చేసికొని అహంకారం విజృంభిస్తుందన్నమాటగా దానిని భావించాలి.

"దాశరథియైన రాముడు తన్ను సంయుగమందు వధించినపుడు తనకు స్వస్వరూపం వస్తుందని" తన శాప విమోచనం చెప్పేదంటే, దశ ఇంద్రియములను సాధనలచే అదుపులో ఉంచిన సాధనవల్ల కలిగిన నిర్విషయ ఆనందశక్తి తన్ను సంయుగమందు వధించినపుడు అంటే సం=చక్కగా తనలో, యుగమందు అంటే కలిసిపోయేటట్లు చేసికొనుటయందు, అని అర్థం పరమాత్మలో తన్ను లీనం చేసికొన్నప్పుడు తన స్వరూపం పరమాత్మయే తా నను భావం కల్గుతుంది అన్నమాట.

విరాధుడు, జయునకు శతక్రోధవల్ల జన్మించాడు. — సర్వోత్కృష్టంగా ఉండాలనే వాంఛయే జయం అంటే. ఆవాంఛ సిద్ధించడానికి ఇతరులతో విరోధం సాగించి ఆ జయం సాధించాలి. అనేకవిధములైన

క్రోధాలవల్ల అహంకారం పుట్టుకొస్తుంది అన్నదే విరాధుడు జయునికి శతక్రోధకు పుట్టాడన్నదానికి అర్థం. రాళ్ళు వేసి గొయ్యిపూడ్చాలి. అంటే, సాత్త్విక సాధనలతో, ఇంద్రియ నిగ్రహంతో అహంకారాన్ని పూడ్చిపెట్టాలి అని అర్థం. సత్త్వం, నిశ్చలంగా, మార్పు లేకుండా వుండేది. రాళ్ళు నిశ్చలములు కాన సాత్త్విక నిశ్చల సాధనలను తెల్పేవిగా ఇచ్చట చెప్పవచ్చు.

లక్ష్మణుడు గొయ్యి త్రవ్వి దానిలో విరాధుణ్ణి పడవేసి బండ రాళ్ళు తెచ్చి ఆగొయ్యిని పూడ్చాడు. – అహంకారాన్ని తలెత్తకుండా గట్టిగా ఇంద్రియ నిగ్రహ సాత్త్విక సాధనలతో సాధకునిలోని జీవుడు నిగ్రహించాలి, అన్న ఆధ్యాత్మిక సందేశం ఇందు అంతరార్థపరంగా చెప్పబడిందిగా గ్రహించాలి.

ఈ విరాధ కథ అరణ్యకాండలో 2, 3, 4 సర్గలలో చెప్పబడింది. ఇది చాల ముఖ్యమైన సాధన కనుక, వాల్మీకి ఇంత విపులంగా, విరాధ సంరోధం, విరాధ ప్రహరణం, విరాధ ఖననం అనే విషయాలు మూడింటిగా భాగించి సవివరంగా మూడు సర్గలలో వర్ణించేడు.

### శరభంగుని బ్రహ్మలోక ప్రస్థానం.

శ్లో॥ ఆశ్రమం శరభంగస్య
రాఘవోఽ భిజగామహ
తస్య దేవ ప్రభావస్య
తపసా భావితాత్మనః
సమీపే శరభంగస్య
స దదర్శ మహాద్భుతం॥

శరభంగ మహర్షి ఆశ్రమాన్ని రాముడు చేరుకొన్నాడు. తపస్సుచే దివ్య ప్రభావంతో నిత్యమూ ఆత్మ భావనతోనున్న శరభంగుని సమీపమందు రాముడు ఒకానొక గొప్ప అద్భుత విషయాన్ని చూచేడు.

శరభంగ ఆశ్రమం చేరడం అంటే జన్మరాహిత్యమునకు సంబంధించిన సాధనా మార్గాన్ని చేరుకోవడమని అర్థం.

శర్యతే ఇతి శరం, 'శౄ' హింసాయాం అను ధాతువుమీద 'శర' ము అనే పదం ఏర్పడుతుంది. శరము అంటే, హింసకలది; అనగా నశింపజేయునది లేక నశించునది — శరీరం. శరీరధారణమును అనగా, జన్మధారణను భంగ=భంగించునది; నశింపుచేయునది ఈ విధంగా జన్మరాహిత్యమును కల్గించునది, — ముక్తి, అని శరభంగ పదానికి అర్థం వస్తుంది. ఆశ్రమము — ఆ + అశ్రమము; అనగా, ఆ సమంతాత్ = సంపూర్ణంగా, అశ్రమము = శ్రమములేనిది. ముక్తికి ఏమీ శ్రమలేని సులభ సాధనా మార్గము 'శరభంగాశ్రమము' అవుతుంది. దానిని సాధకుడు చేరుకోవడమే శరభంగాశ్రమమును రాముడు దర్శించడమంటే. ఆ ఆశ్రమము (సాధన) తపస్సుచేత దేవ ప్రభావం కలది అనగా ఆత్మ ప్రకాశం కలది అని అర్థం. అట్టి శరభంగాశ్రమమును సాధకుడు చేరుకొన్నాడు. అనగా, అహంకార నాశంతో (విరాధ వధతో) ముక్తిమార్గం సుగమము కావడంవల్ల ముక్తి సాధనలకు సాధకుడు ఉపక్రమించేడు అని అర్థం. అప్పుడాతనికి ఒక ఆశ్చర్యమైన విషయం ద్యోతకమయింది అదేమంటే :—

శ్లో॥ విభ్రాజమానం వపుషాం సూర్య వైశ్వాన రోపమమ్
అవరుహ్య రథోత్సంగాత్ సకాశే విబుధానుగమ్
అసంస్పృశంతం వసుధాం దదర్శ విబుధేశ్వరం
సుప్రభాభరణం దేవం విరజోఽంబరధారిణం
తద్విధైరివ బహుభిః పూజ్యమానం మహాత్మభిః
హరిభి ర్వాజిభి ర్యుక్తం అంతరిక్ష గతం రథమ్
దదర్శ దూరత స్తస్య తరుణాదిత్య సన్నిభం
పాండు రాభ్ర ఘనప్రఖ్యం చంద్రమండల సన్నిభం
సహసంభాషమాణే తు శరభంగేణ వాసవే
దృష్ట్వా శతక్రతుం తత్ర రామో లక్ష్మణ మబ్రవీత్
రామోఽథ రథ ముద్దిశ్య లక్ష్మణాయ ప్రదర్శయన్॥

సూర్యుడిలాగ, అగ్నిలాగ ఉండే దేహంతో ప్రకాశిస్తున్న ఇంద్రుడు రథంనుండి దిగేడు. అతణ్ణి విబుధులు అనుసరించి

నడుస్తూన్నారు. అతడు భూమిని తాకకుండా నడుస్తూన్నాడు. అతడు చక్కని కాంతిగల ఆభరణాలు ధరించాడు. అతడు విరజోఽంబరధారియై యున్నాడు. సరిగ్గా అతణ్ణి పోలివున్న ఎందఱో అతణ్ణి పూజిస్తూన్నారు. అతడెక్కిన రధం హరుతైన వాజులచేత కట్టబడివుంది. ఆరధం భూమి నానకుండా అంతరిక్షమందే వుంది. అది బాల సూర్యునివలె ఉంది. తెల్లని పెద్ద మేఘంలాగ, చంద్ర మండలంలాగ వుంది. అట్టి రధాన్ని దూరాన్నుంచి రాముడు చూచేడు. ఇంద్రుడు శరభంగునితో కలిసి మాట్లాడుతూండగా చూచి, రాముడు, లక్ష్మణునికి రధాన్ని చూపించాడు.

రాముడు శరభంగాశ్రమంలో ఒక మహాద్భుతాన్ని చూచేడు. 'అద్భుతం' అంటే ఇదివరకు ఎన్నడూ చూచినదీ, విన్నదీ కాదన్న మాట. శరభంగాశ్రమం అంటే, ముక్తి సాధనా మార్గం అనికదా చెప్పుకొన్నాం. అమార్గంలో సాధకునకు, ఇంతకు పూర్వం ఎఱుగని ఒక ఆశ్చర్యకరమైనవిషయం ద్యోతకమయిందని, దానికిఅర్థం. ఆఅద్భుతం ఏమిటంటే, — సూర్యుడిలాగ, అగ్నిహోత్రుడిలాగ వెలుగుతూన్న ఇంద్రుడు రధాన్నుండి దిగాడు. సూర్యుడిలాగ, అగ్నిలాగ, అంటే పరిశుద్ధమై, అపరిశుద్ధములను దహించివేసే స్వభావం కలదిగానున్న తన మనస్సు సాధకునకు గోచరించింది అన్నమాట. ఇంద్రుడంటే, మనస్సు, రధం అంటే జీవుడు, రధ్యాలంటే మార్గం, రధ్యమందలిది రధం, వాసనామార్గంలో ఉండేది జీవాత్మకాన అది రధ పదానికిఅర్థం. ముక్తిని పొందడానికి ముఖ్యంగా కావలసిందేమంటే అత్యంతం పరిశుద్ధమైన మనస్సు. అది అగ్నిలాగ మలినాన్ని తేజస్సుగా మారుస్తుంది. సాధకుడు అట్టి మనస్సును పొందాలి అనే సంగతి సాధకునకు గోచరించింది; అన్నది ఇందలి అంతరార్థపరమైన భావం. అతడు దేవతలకు రాజు; అంటే, ఆమనస్సు ప్రకాశవంతములైన ఇంద్రియాలకు అధిపతి అని అర్థం. అతణ్ణి విబుధులు అనుసరిస్తూన్నారు; అంటే, విబుధులు అంటే, విజ్ఞాన వృత్తులు. అవిమనస్సునంటి వుంటున్నవి

అన్నమాట. విబుధ పదానికి మిక్కిలి తెలిసిన అనే అర్థంతో విజ్ఞానులన్న అర్థంవుంది. అతడు భూమిని తాకకుండా నడుస్తున్నాడు; అంటే, పరిశుద్ధమనస్సు భూ సంబంధమైన కోరికలను వేటినీ కోరకుండా వుంటుందన్నమాట. ఇంతకు పూర్వం చెప్పిన సూర్యోపమానంతో తమోరహితంగా ఉన్నదన్న అర్థం వస్తుంది. ఇక అతడు విరజోఽం బరధారియై యున్నాడు. దుమ్ములేని ఆకాశంలోఉన్నాడని వాచ్యార్థం. రజోగుణంలేని మాయావరణం కల్గినది అనగా సాత్త్విక మాయకల్గినది అని మనస్సు పరమైన అంతరార్ధం ఇందు కన్పిస్తుంది. అంబరపదం వస్త్రపర్యాయంగా మాయ అని అర్థం ఇస్తుంది. దీనివల్ల మనస్సు ఉన్నంతవరకు మాయ తప్పదు అనికూడ గ్రహించాలి. అతణ్ణిపోలి వున్న ఎందఱో అతణ్ణి పూజిస్తున్నారు. అంటే, మనస్సు పరిశుద్ధత పొందడంతో ఇంద్రియ వృత్తులు పరిశుద్ధములై ఆమనస్సునుపోలి ఆవరించి వున్నాయని దీనికి అర్థం. అతడెక్కిన రథం హరులైన వాజులచేత కట్టబడివుంది. మనస్సుచే అధిష్ఠించివున్న వాసనలే జీవుణ్ణి లాగుకొనిపోయేవి. అవే హరులైన వాజులు, పచ్చని గుఱ్ఱాలవి. వాజం, అంటే ఆహారం, దేహానికి ఆహారం. హరి అంటే, హరించేది, లేక నశింపు చేసేది, హరిభిః వాజిభిః అంటే, హరించిపోయిన శక్తి కలవైయున్న కర్మవాసనలన్నమాట. వేయించిన విత్తనాలవలె కర్మ వాసనలు వాని శక్తి నశించి, నిమిత్త మాత్రంగా జీవుని వహిస్తూ వున్నాయి అని దాని భావం. ముక్తావస్థను పొందే జీవుడు వేయించిన విత్తనాలు మొలకరించే శక్తిని కోల్పోయినట్లు, జనన మరణ శక్తిని కోల్పోయిన కర్మవాసనలచే నిమిత్తమాత్రంగా బద్ధుడై వుంటాడు. అసలు హరి అన్నా వాజి అన్నా గుఱ్ఱమనే అర్థం. అట్లాంటప్పుడు హరిభిః, వాజిభిః అని రెండు సమానార్థకాల నుపయోగించినపుడు, వానికి యౌగికార్థంతో అర్థం చెప్పుకోవాలి. ఇది వాల్మీకి కావాలని చేసిన అంతరార్థ ప్రయోగం.

ఆ రథం అంతరిక్షంమీదనే వుంది. అంటే, వాసనా రాహిత్యమైన జీవి భూ సంబంధ వాంఛలు విడిచి ముక్తిమార్గంలోనే సాధన చేస్తూ ఉంటాడు అని అర్ధం. అది చంద్రమండలంలాగ, బాలసూర్యుడిలాగ ఉన్నది. అంటే, ఆజీవి ఎంతో శాంతంగా, ఆనందంగా, జ్ఞాన జ్యోతిని ప్రకాశింపజేస్తూ అజ్ఞాన తమస్సును పోగొట్టుతూ ఉంది అని అర్ధం. అందున్న ఇంద్రుడు శరభంగుడితో సంభాషిస్తూండగా రాముడు లక్ష్మణునికి రథాన్ని చూపిస్తూ పల్కాడు; అంటే, సాధకుడు పరిశుద్ధమైన మనస్సు జనన మరణ రాహిత్యాన్ని పొందుతుందన్న సంగతితో స్పష్టంగా తాను ఆత్మలో ముక్తి మార్గాన్ని దర్శించి తనలోని వాసనా బద్ధుడైన జీవునికి దానిసంగతిని గుర్తింపజేస్తున్నాడని అర్ధంగ్రహించాలి.

శ్లో॥ అర్చిష్మంతం శ్రియాజుష్ట మద్భుతం పశ్య! లక్ష్మణ!
ప్రతపంత మి వాదిత్య మంతరిక్షగతం రథం
యే హయాః పురుహూతస్య పశ్య శక్రస్య స శ్రుతాః
అంతరిక్ష గతాః దివ్యాః త ఇమే హరయో ధ్రువం
ఇమే చ పురుషవ్యాఘ్రాః యే తిష్ఠం త్యభితో రథం
శతం శతం కుండలినః యువానః ఖడ్గపాణయః
రూపం బిభ్రతి సౌమిత్రే! పంచ వింశతి వార్షికం
ఏత ద్ధి కిల దేవానాం వయో భవతి నిత్యదా
ఇహైవ సహ వైదేహ్యా ముహూర్తం తిష్ఠ లక్ష్మణ!
యావ జ్జానా మ్యహం వ్యక్తం క ఏష ద్యుతి మా నితి
త మేవ ముక్త్వా సౌమిత్రి మిహైవ స్థీయతా మితి
అభిచక్రామ కాకుత్స్థః శరభంగాశ్రమంప్రతి॥

లక్ష్మణా! చూడు; ప్రకాశవంతమై శ్రీమంతమై ఎంత అద్భుతంగా ఉందో ఆరథం! అది ఆకాశంపైన ప్రకాశించుతున్న సూర్యుడిలాగ ఎలాగ ఉందో! ఇంద్రుడికి ఏగుఱ్ఱాలు ఉన్నాయని మనం లోగడ విన్నామో అవే గుఱ్ఱాలు ఆరథానికి కట్టబడి వున్నాయి. రథంలో అంతటా చుట్టూవున్న ఆ మహాపురుషులు వందలాది మంది కుండలులుగా వున్నారు. వారు యువకులు, ఖడ్గాలు ధరించి వున్నారు. అందఱూకూడ ఇరువదియైదేండ్ల వయస్సులో వున్నారు.

ఈ వయస్సు దేవతలకు ఎల్లప్పుడూ వుండేదికదా! వైదేహితో కూడ నీవు ఇక్కడే ఒక్క క్షణం వుండు. నేను అరథం నుండి దిగిన దివ్యపురుషుడెవడో, అతడి సంగతి సందర్భాలేమిటో స్పష్టంగా చూచివస్తాను. అని లక్ష్మణునితో తిరిగి ఇక్కడే ఉండుసుమా! అని హెచ్చరించి రాముడు శరభంగుడి ఆశ్రమంవైపు వెళ్ళేడు.

సాధకుడు అంతర్దృష్టితో ముక్తి మార్గాన్ని సమీపించడమే శరభంగుని ఆశ్రమాన్ని సమీపించడం అంటే. ఆ అంతర్దృష్టిలో దర్శించినది తన జీవాత్మకు తాను ప్రబోధించడమే లక్ష్మణునితో రాముడు చెప్పడమంటే. అప్పుడు అతనికి కనపడ్డ రథాన్ని, అంటే, జీవస్వరూపాన్ని, ఆ రథంమీద ఉన్న అధిపతిని, పరివారాన్ని, మనస్సును, అంటే, ఇంద్రియ వృత్తుల్ని రథానికి కట్టిన గుఱ్ఱాల్ని అంటే, కర్మ వాసనల్ని సాధకుడు వివరిస్తాడు. లక్ష్మణుడు జీవుడే; రథము జీవాత్మయే. జీవునకు జీవాత్మనుగూర్చి చెప్పడమంటే సాధకునిలోని జీవాత్మకు అసలు జీవుడెట్లు పయనిస్తాడో ప్రబోధించడమే ఇచ్చట అర్థంగా చెప్పాలి.

రథం సూర్యుడిలాగ వెలిగిపోతూంది; అంటే, జీవస్వరూపం జ్ఞానప్రకాశంతో నిండి ప్రకాశిస్తూ వుందన్నమాట. ఆరథానికి కట్టిన గుఱ్ఱాలు పూర్వం తాను విన్నట్టుగానే వున్నవే అంటాడు. అంటే, 'వేచిన విత్తులవలె జనన మరణ శక్తిని కోల్పోయిన కర్మవాసనలు జ్ఞాన ప్రకాశంపొందివున్న జీవుణ్ణి నడిపిస్తూ వుంటాయనీ, జీవన్ముక్తి స్థితిలో కర్మవాసనలు నిమిత్తమాత్రంగా వుంటాయి అనీ శాస్త్రములో చెప్పబడ్డట్టుగానే సరిగ్గా అంతర్దృష్టికికూడ గోచరిస్తున్నాయని అర్థం. రథంమీది దివ్యపురుషులు వందలాది మంది వున్నారు. వారు కుండలులు, ఖడ్గపాణులు, ఇరవై అయిదు సంవత్సరాల ప్రాయంవారు; అంటే, ఇంద్రియ వృత్తులు వేలకొలది వుంటాయని, అవి ముక్త పురుషునిలో దివ్యత్వాన్ని పొంది వుంటాయని

కుండలులు అంటే, జీవునిలోని కుండలినీ శక్తికి సంబంధించినవై వుంటాయనీ, ఖడ్గాన్ని ధరించి వుంటాయి అంటే, అవి జ్ఞానఖడ్గంతో రక్షణ చేసుకుంటూ వుంటాయనీ, అవి అన్నీ ఇరవై అయిదు ఏండ్ల వయస్సులోవి; అంటే ఇరువై అయిదు ప్రకృతి తత్త్వాలకు, సంబంధించివున్నవనీ అంతరార్థం. ఇంద్రియ వృత్తులు పంచ భూతాల్ని, పంచతన్మాత్రల్ని, దశేంద్రియాల్ని, అంతరంగచతుష్టయాన్ని జీవాత్మనూ కలసి మొత్తం ఇరువదైదింటితో కూడుకొని వుంటాయనీ అర్థం దేవతలు ఎప్పుడూ ఈవయస్సులోనే వుంటారుకదా! అంటాడు రాముడు. ఇక్కడే వాల్మీకి మనకు అంతరార్థ ప్రదర్శకుడుగా స్పష్టంగా కన్పిస్తాడు. దేవతలు త్రిదశులుగదా! 'త్రి + దశ' అంటే మూడు పదులు, ముప్పై ఏండ్ల వయస్సు కలవారు అయినప్పుడు, ఇరువై అయిదేండ్లవారు అంటాడేమిటి వాల్మీకి? అయిదేండ్లు వారికి తగ్గించాడు. ఇరువై అయిదు తత్త్వాల్ని చెప్పడానికి త్రిదశులు అంటే సరిపడదు కనుక, స్వతంత్రించి తాను దేవతలకు ఐదేండ్లుతగ్గించాడు. 'నిరంకుశాః కవయః, అన్నారుగదా! తన ఉద్దిష్టార్థాన్ని నెరవేర్చడానికి స్వతంత్రుడైన కవి ఇటువంటి మార్పులు చేస్తూ వుంటాడు. ఎక్కడైనా కవి మార్పు చేసినపుడు, ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి చేస్తాడు. ఇక్కడ వాల్మీకి కవి అంతరార్థ దృష్టితో రామాయణాన్ని వ్రాసేడని మనకు దీనివల్ల స్పష్టంగా తెలుస్తూంది.

'నీవు వైదేహితో ఇక్కడే వుండు. నేను శరభంగుడితో, ఇంద్రుడేమంటున్నాడో సంగతి సందర్భాలు తెలుసుకొని వస్తాను. ఇక్కడే వుండునుమా! అని తిరిగి తిరిగి అంటాడు రాముడు లక్ష్మణునితో.

వైదేహితో అంటే విదేహ భావ వృత్తితో అన్నమాట. అంటే, దేహాత్మభావం లేకుండా, ఈ దేహం నేను కాను అన్న భావంతో ఉండాలి అని జీవుణ్ణి హెచ్చరించడమన్నమాట. 'ఇక్కడేవుండునుమా!' అని మళ్ళీ మళ్ళీ హెచ్చరించడంలో, 'ఇదే ముక్తికి మార్గం; దీన్ని

కాదని విడిచి దాటి వెళ్ళకూడదు సుమా!' అని హెచ్చరించడమే దాని అర్థం. జన్మరాహిత్యం కావాలనే అతి తీవ్రమైన తపన అంటే, ముముక్షుత్వము ఉండాలనడమే వైదేహితో ఇక్కడే ఉండు అని పదే పదే హెచ్చరించడంలోని భావం. ఆ తపన వుంటేనే ముక్తి మార్గం కన్పిస్తుందన్నమాట ముముక్షుత్వం సాధనా చతుష్టయంలో ఆఖరుది.

విదేహ భావంతో అంటే ముముక్షుత్వంతో ఉంటే ఆతర్వాత ముక్తికి మనస్సుతో జరిపే సాధనలు ఏవి అవసరమో తెలిసికోవడం సులభమౌతుంది.

శ్లో॥ తత స్త మభిగచ్ఛంతం
ప్రేక్ష్య రామం శచీపతిః
శరభంగ మను జ్ఞాప్య
విబుధా విద మబ్రవీత్॥

శరభంగుని ఆశ్రమంలోకి వస్తూన్న రాముణ్ణి చూచి ఇంద్రుడు శరభంగుడివద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోతూ అక్కడవున్న దేవతలతో ఈవిధంగా పల్కేడు.

మనస్సు ఆనందాంశ తన్ను వెంబడిస్తూ ముక్తి మార్గంవైపునకు లాగికొని వస్తున్న సమయంలో మనస్సు అదృశ్యమౌతుంది. బ్రహ్మానందస్థితి రాబోతూన్నప్పుడు అమనస్కత సిద్ధిస్తుంది; అన్నది రాముడు రాబోతూన్నప్పుడు జరిగిన ఇంద్రనిష్క్రమణానికి అంతరార్థం. అమనస్కత కల్గినప్పుడే బ్రహ్మానందానుభవం కల్గడం అనే సాధనా రహస్యం ఇంద్రుడు తాను రాముడు రాబోతూంటే అదృశ్యుడయ్యాడన్నదానిలో ఇమిడివుంది.

శ్లో॥ ఇ హోపయాన్యతో రామః యావ న్మాం నాభిభాషతే
నిష్ఠాం నయతు తావత్తు తతో మాం ద్రష్టు మర్హతి
జితవంతం కృతార్థం చ ద్రష్టా హ మచిరా దిమం
కర్మ హ్యనేన కర్తవ్యం మహ దన్యైః స్సుదుష్కరం
నిష్పాదయిత్వా త త్కర్మ తతో మాం ద్రష్టు మర్హతి॥

రాముడు ఇచ్చటికి వచ్చుగాక. 'ఆతడు నన్నుగూర్చి మిమ్ము అడగకుండా వుండడానికి మీరు మౌనం నటించి, నిష్ఠను నటించండి. అతడిప్పుడు కాక, నన్ను తర్వాత మఱొకప్పుడు చూడగలడు. అతడు జయంపొందేక, కృతార్థుడయ్యేక త్వరలోనే, నేనే అతణ్ణి చూస్తాను. ఎవ్వరూ చెయ్యలేని దశకంఠ రావణ సంహారం అనే మహత్కార్యం అతడు చెయ్యవలసి వుంది. ఆపని నెఱవేర్చేక అతడు నన్నుచూచినా చూడవచ్చు, అంటాడు ఇంద్రుడు అక్కడవున్న విబుధులతో.

ఆనందం ముక్తిమార్గంలో ప్రవేశించిందంటే అప్పుడిక మనస్సనేదే వుండదు. మనస్సునుగూర్చి అది ముందుగా తెలిసికోకూడదు. అది పూర్తిగా ఇంకాదశేంద్రియ విజయం (దశకంఠ రావణ సంహారం) జరిపించవలసినపని మిగిలివుంది. ఆనందప్రవేశంతో దశేంద్రియ ప్రవృత్తి అందు విలీనం కావాలి. ముక్తికి. అంత కన్న మఱోవిధానం ఏమీ లేదు. దశేంద్రియ విజయం సర్వ సంపూర్ణంగా జరిగేక సాధకుడు కృతార్థుడౌతాడు. అప్పుడు మనస్సుతో వున్నా అది అతణ్ణి ఏమీ మాయలో పడవెయ్యలేదు. అప్పటిదాకా సాధకుడు మనస్సును స్వతంత్రంగా వదలి పనిచెయ్యనియ్యనే కూడదు. ఆతర్వాత మనస్సు పనిచేయవచ్చు. పరమాత్మ సంబంధమైన సంపూర్ణానందానుభవం కల్గినప్పుడు, మనస్సు నిమిత్తమాత్రంగా ఉంటుంది. జీవన్ముక్తస్థితిలోనూ మనస్సు ఉండక తప్పదు. అంతవరకూ, మనస్సును సాధకుడు గుర్తించగూడదు. అందుకే ఇంద్రియవృత్తులు కదలకుండా (నిష్ఠలో) ఉండాలి. అని పై వాక్యాలకు అంతరార్థం.

ఇంద్రుడు శరభంగుడి అనుజ్ఞను తీసికొని వెళ్ళిపోతాడు. ఇంద్రుడు సపరివారంగా వెళ్ళిపోవడంతో శరభంగుణ్ణి రాముడు, సీతాలక్ష్మణులతో కలిసి దర్శించి నమస్కరిస్తాడు. తర్వాత ఇంద్రుణ్ణి గూర్చి రాముడు శరభంగుణ్ణి అడుగుతాడు. అప్పుడు శరభంగుడు 'ఇంద్రుడు నన్ను బ్రహ్మలోకానికి తీసికొని వెళ్ళడానికి వచ్చేడన్నీ,

ఇంత తపస్సు చేసి నేను నువ్వు నాకోసం వస్తూంటే, నిన్ను చూడ కుండా బ్రహ్మలోకానికి వెళ్ళడానికి ఒప్పుకోలేదని చెప్పి నాతపస్సు యొక్క ప్రభావంచేత, నే నెన్నో లోకాలు సాధించాను. అవి నీకు ఇస్తాను. స్వీకరించు' మని రామునితో అన్నాడు.

పరమాత్మ సంబంధమైన ఆనందం సాధకునిలో ప్రవేశించడం, ప్రారంభించడంతోనే సాధకునిలోని మనస్సు ముక్తిమార్గానికి ఆటంకం లేకుండా తొలగిపోతుందనీ, అప్పుడు సాధకుడు తనలోని ప్రకృతితోను జీవునితోను గూడి ముక్తి మార్గాన్ని ప్రవేశిస్తాడనీ, ఇంద్రనిష్క్రమణం, సీతారామలక్ష్మణుల శరభంగాశ్రమప్రవేశం, అన్నవి అంతరార్థ పరంగా అర్థం అవుతున్నాయి. ముక్తిమార్గాన్ని సాధకుడు పూర్తిగా సాధించకుండా, సాధకుని మనస్సు సాధకునకు ప్రలోభాలు కల్గించ డమే, ఇంద్రుడు శరభంగుడికి బ్రహ్మలోకాన్ని ఇవ్వడానికిసంకల్పించి రావడంలోని అంతరార్థం. శరభంగుడు రామ దర్శనం తనకు కల్గు తోందని బ్రహ్మలోకాన్ని అంగికరించకపోవడం, పరమాత్మ సంబంధ మైన ఆనందం త్వరలోనే లభిస్తుందనే ధృఢవిశ్వాసం, సాధకునికి కల్గడం అన్న విషయాల్ని తెల్పుతూన్నాయి. బ్రహ్మలోకాన్నికాదని రామదర్శనం శరభంగుడు కోరడంఅంటే, బ్రహ్మాదిలోకాలు పరానం దానుభూతి నివ్వజాలవని ముక్తిని కోరే సాధకులు పరానందంకోసం స్వర్గాది సర్వలోకాల్ని తృణప్రాయంగా త్యజించి పారవేస్తారని అంతరార్థ పరంగా ఊహించాలి.

శరభంగుడు రామునికి తన తపశ్శక్తివల్ల సంపాదించినలోకాలు ఇస్తాననడం, రాముడు వద్దనడంకూడ పైవిధంగానే ముక్తిమార్గంలో పయనించే ఏసాధకుడూ ప్రలోభాలు కల్గించినా వానికి లొంగడని చెప్పడమే అని గ్రహించాలి.

శరభంగుడు రాముణ్ణి, తాను అగ్నిప్రవేశంచేసి బ్రహ్మ లోకానికి పోయేదాకా ఉండి వెళ్ళవలసిందంటాడు రాముడు ఆవిధంగా చేస్తాడు. అగ్నిప్రవేశంతో శరభంగుణ్ణి బ్రహ్మదేవుడు స్వయంగా

స్వాగతంచెప్పి బ్రహ్మలోకానికి తీసుకుపోతాడు. రాముణ్ణి, తన అగ్ని ప్రవేశం జరిగేదాక ఉండుమంటాడు. రాముడంటే ఆనందం అర్థం. ఆ ఆనందాన్ని తన శరీరనాశం జరిగేదాకా ఉంచుకోవాలన్న కోర్కెయే దానికి అర్థంగా భావించాలి. ఆరోహణా క్రమంతోనే ముక్తిపొందేవారు తాము తిరిగి జీవించియుంటే కర్మలు చేయడంవల్ల తిరిగి వాసనలు అంటుకుంటాయేమో అని సాధన ముక్తావస్థకు రాగానే ఆ ఆనందంతో శరీరాన్ని బలవంతంగా అగ్నిప్రవేశంతో నాశం చేసుకుంటారు. అప్పుడు వారు ఆనందరూప బ్రహ్మజ్ఞానంతోనే శరీరాన్ని విడిచిపెడ్తారు. కనుక జనన మరణ పరిభ్రమణాన్ని కల్గించే వాసనలు వారికుండవు. ఆకారణంచేత శరీరనాశనంతో వారు ముక్తిని పొందుతారు అని పైదానికర్థం ఇచ్చట బ్రహ్మదేవుడు అంటే పరమాత్మ, బ్రహ్మలోకం అంటే ముక్తి అని అర్థం చెప్పాలి పరిపూర్ణజ్ఞానంపొంది ముక్తావస్థ పొందేక తిరిగి ఆ జ్ఞానాన్ని మనస్సులోనికి ఇంద్రియవృత్తులలోనికి ప్రవేశపెట్టి జీవించియే ముక్తులై (జీవన్ముక్తులై) మరణపర్యంతమూ లోకవృత్తులతోనే అసంగవృత్తితో ఉండడం అనేదాన్ని అవరోహణామార్గం అంటారు ఆరోహణ, అవరోహణా మార్గాలు రెండూ సాధించడం పూర్ణ యోగలక్షణం. దాన్ని సాధించినవారు భగవదైక్యంపొందే అవతారపురుషులుగా భావింపబడుతారు. శరభంగుడు తనతపస్సుచే సాధించిన స్వర్గాది లోకాల్ని ఆతడిస్తానన్నా రాముడు పుచ్చుకోలేదు. అంటే ఇక్కడ రాముడు (సాధకుడు) పూర్ణయోగసాధన కోరేవాడుగా మనం గ్రహించాలి. శరభంగసాధన. 'అహం బ్రహ్మాస్మి' అన్న ఆరోహణామార్గ పాక్షిక సాధన. ఈ సాధనాంతమున సాధకులు అగ్ని ప్రవేశంతో కాని, భృగుపాతంతోకాని శరీరాన్ని విడుస్తారు. " యాంతే మతి స్సాగతిః " అని యున్నదికాన అహం బ్రహ్మాస్మి అన్న భావంతోనే ప్రాణం బలవంతంగానైనానరే విడుస్తే అంతకాలమున బ్రహ్మభావననుండి ముక్తి అంటే జన్మరాహిత్యం పొందవచ్చునని ఆ సాధకుల విశ్వాసం. కాని ప్రాణోత్క్రమణ సమయంలో బ్రహ్మభావన వస్తుందన్న దృఢవిశ్వాసం లేదనీ సర్వం ఖ ల్విదం బ్రహ్మసాధనలో

అన్నీ బ్రహ్మయే అన్నభావం వుంటోంది కాన ఆసాధనతో ప్రాణం విడుస్తే విధిగా ముక్తి వస్తుందని అహం బ్రహ్మాస్మి సాధనతర్వాత సర్వం ఖల్విదం బ్రహ్మ సాధనకూడ చేసి పూర్ణయోగం కోరుతారు కొందరు. రాముడు శరభంగుణ్ణి తనకు అరణ్యంలో అనుకూల ప్రదేశాన్ని నిర్ణయించవలసిందిగా కోరినప్పుడు శరభంగుడు సుతీక్ష్ణాశ్రమాన్ని నిర్దేశిస్తాడు.

సుతీక్ష్ణ ఆశ్రమం అంటే సు - మంచినిగూర్చి అనగా ముక్తిని గూర్చి, తీక్ష్ణ - తీవ్రమైన, స్థితికి అనగా ఆరోహణ, అవరోహణా మార్గాలతోడి పూర్ణయోగానికి, ఆశ్రమం - స్థానమైనది. తాను సాధించిన ఆరోహణా మార్గంతో కాక ఉన్నత స్థాయిలోనిదైన అవరోహణా మార్గంతో పూర్ణయోగాన్ని సాధించాలంటే ఇంకా మిక్కిలి తీక్షణంగా ఇంద్రియాలలో నిశ్చలతను సాధించాలని సాధకునికి పూర్ణయోగ ముక్తిమార్గాన్ని తెలియజెయ్యడమే శరభంగుడు సుతీక్ష్ణాశ్రమాన్ని నిర్దేశించడంలోని అంతరార్ధం. ఇక్కడ సు - మిక్కిలి, తీక్ష్ణ - తీవ్రమైన, అన్న అర్ధం కూడ చెప్పుకోవచ్చు. 'శరం' అంటే నశించేది, శరీరం. దాన్ని, అగ్ని ప్రవేశంతో భంగంచేసి ముక్తిని పొందిన ఆరోహణాముక్తిని చెప్పే కథగా శరభంగమహర్షి కథను మనం అన్వయించుకోవాలి. శరభంగాశ్రమం వదలి రాముడు సుతీక్ష్ణాశ్రమం ప్రవేశించగోరేడనడంలో రాముడు అంటే సాధకుడు పూర్ణయోగాన్ని ఇష్టపడినాడని అర్ధం చెప్పుకోవాలి.

## రక్షోవధకు ప్రతిజ్ఞ.

శరభంగుడు బ్రహ్మలోకానికి వెళ్ళేక పంపానదీ తీరవాసులు, మందాకినీనదీ తీరవాసులు, చిత్రకూట నివాసులు అయిన మహర్షులు, తాము రాక్షసులచేత పడుతూన్న బాధల్ని చెప్పి, వానిని తొలగించవలసిందిగా రాముణ్ణి కోరుతారు. రాముడు వారికి రక్షోవధ చేస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు.

పంపానదీ తీరవాసులు అంటే భక్తిమార్గంలో సంచరించే సాధకులు పం - పాలించేవానిని, పా - రక్షించేది దేవత లేదా ధర్మము ధర్మో రక్షతి రక్షితః అని ఉంది. అంటే తన్ను ఆరాధించే వానిని తాను రక్షిస్తుంది. 'పంపా అంటే ఇదే అర్థం. ఇది ఉపాసనా మార్గాన్ని చెప్తుంది. మందాకిని తీరవాసులు అంటే కర్మమార్గపరులైన సాధకులు. మంద + అకినీ - మెల్లగా నడిచేది. అది కర్మమార్గ ప్రవృత్తి. కర్మ మనశ్శుద్ధిని, మనశ్శుద్ధి జ్ఞానాన్ని, జ్ఞానం ముక్తిని క్రమంగా కల్గిస్తాయి. ముక్తి సాధనకు కర్మమార్గం ప్రప్రథమమార్గం. ఈ మార్గం నెమ్మదిగా పిపీలికాక్రమంతో ముక్తిని సాధిస్తుంది. ఇది క్రమముక్తికి ప్రప్రథమ సాధనం నెమ్మదిగా నడుస్తుంది అనే వ్యుత్పత్యర్థంతో మందాకిని పదం కర్మ మార్గాన్ని చెప్తుంది. చిత్రకూట వాసులు అంటే జ్ఞానమార్గంలో సాధన చేసేవారు. చిత్ + త్ర + కూటం - జ్ఞానంతో కల్గిన నిశ్చలస్థితి సాధించేవారు. ఇది జ్ఞానమార్గంలో చివరి సాధన.

ఈ విధంగా కర్మ, ఉపాసనా, జ్ఞానమార్గాలలో పయనంచేసే సాధన లన్నిటిలోనుకూడ విఘ్నాలు ఎదురౌతాయనీ వానిని పరిశీలించి నాశం చెయ్యాలనీ సాధకునకు ప్రబోధం కల్గడమే, పంపానదీతీర వాసులు, మందాకినీ తీరవాసులు, చిత్రకూటవాసులు అగు మహర్షులు తమ్ము రాక్షసులు బాధిస్తున్నారని చెప్పడంలోని అర్థం. సాధకుడు తెలుసుకొని వానిని నివారిస్తానని తాను తనలో సుతీక్ష్ణమార్గంలో దృఢ దీక్ష వహించడం అనేది రాముని రక్షోవధా ప్రతిజ్ఞలోని అంతరార్థం.

## సుతీక్ష్ణాశ్రమము.

రాముడు శరభంగుడు చెప్పినప్రకారం సుతీక్ష్ణ మహర్షియొక్క ఆశ్రమం చేరుకొన్నాడు.

శ్లో॥ అయ మే వాశ్రమో రామ! గుణవాన్ రమ్యతా మిహ
ఇమ మాశ్రమ మాగమ్య మృగసంఘాః మహీయసః
అహత్వా ప్రతిగచ్ఛంతి లోభయిత్వా ఽ కుతోభయాః
నా న్యో దోషో భవే దత్ర మృగేభ్యో ఽ న్యత్ర విద్ధి వై॥

ఇదే నా ఆశ్రమం. చక్కని గుణములు కలిగి వున్నది. ఇక్కడ ఆనందించవచ్చు. ఈ ఆశ్రమానికి పెద్ద పెద్ద మృగాల గుంపులు వచ్చి పోతూంటాయి. అవి ఎవరికీ హాని చెయ్యవు. వాటికి ఇచ్చట ఏమీ భయం లేదు. ప్రలోభాన్ని కల్గించిపోతాయి అంతే. ఈమృగాల ప్రలోభ బాధ తప్ప మఱోబాధ ఇక్కడ ఏమీ లేదు అంటూ సుతీక్ష్ణ మహర్షి రామునకు స్వాగతం చెప్తాడు.

రాముడు సుతీక్ష్ణాశ్రమం చేరేడు అంటే, ముక్తి సాధన తీవ్రం చేసాడన్నమాట. ఆ తీవ్రసాధన చాలమంచిదని, ఆసాధన ఆనందాన్నిస్తుందని, ఈ సాధనలోకూడ పెద్దవిగా అవరోధాలు చాల కనిపించినా అవి ఏమీ బాధించేవి కావని, అవి ప్రలోభాలుమాత్రం కల్పిస్తూ పోతూంటాయని ఇంతకన్న ఇక్కడ చెప్పకోతగ్గ దోషం ఏమీ లేదని సుతీక్ష్ణ మహర్షి రామునితో పైన చెప్పినదానికి అంతరార్ధంగా గ్రహించుకోవాలి.

సాధన, తీవ్రస్థాయిలో జరిగినప్పుడు ప్రత్యేకంగా బాధించి క్షోభ పెట్టే ఆటంకాలు ఏమీ ఉండవనీ, భయంలేకుండా ప్రలోభాలకు సంబంధించిన భావాలుమాత్రం వస్తూ పోతూంటాయనీ అవి తప్ప మరే ఇబ్బందులూ రావనీ ఈ సుతీక్ష్ణ సాధన మనకు చెప్తూంది.

'అహత్వా ప్రతిగచ్ఛంతి లోభయిత్వా ఽ కుతోభయాః' అన్న వాక్యం ప్రత్యేకంగా అంతరార్ధపరంకోనమే వ్రాయబడింది అనిపిస్తుంది. అందుకోనమే కావాలని ఇచ్చట 'లోభయిత్వా' అనే పద ప్రయోగం చెయ్యబడింది కేవలం వాచ్యార్థం మాత్రమే ఇందు ఉద్దేశించివుంటే, ఆప్రయోగం జరిగివుండేదికాదు. మృగాలు ప్రలోభపెట్టి పోవడం ఏమిటి? వాచ్యార్థం సరిగాలేదు. వాల్మీకియొక్క అంతరార్ధహృదయం ఇటువంటి ప్రయోగాల్లోంచి మనకు స్పష్టపడుతుంది,

రాముడు సుతీక్ష్ణుడితో ఇట్లాగు అంటాడు.

శ్లో॥ తా నహం సుమహాభాగ! మృగసంఘాన్ సమాగతాన్
హన్యాం నిశితధారేణ శరే ణాశని వర్చసా
భవాన్ త త్రాభిషజ్యేత కిం స్యాత్ కృచ్ఛ్రతరం తతః
ఏతస్మి న్నాశ్రమే వాసం చిరం తు న సమర్థయే.

దానికి రాముడు ఇట్లా అంటాడు. అవిధంగా వచ్చే మృగాల్ని పిడుగులాంటి పదునైన నాబాణంతో చంపివేస్తాను. మీరుంటారు గదా! ఇక పెద్ద శ్రమ ఏముంది? నేను ఈ ఆశ్రమంలో చాలకాలం నివసించ వలసి వుంటుందనుకోను". రాముడు ప్రలోభ పెట్టే మృగాల్ని చంపుతా నంటాడేమిటి? అవి ఎవరినీ చంపకుండా పోతూంటా యన్నప్పుడు వానినిచంపుతాననడం, మీరుంటారుకదా అనడందేనికి?

సాధకుడు సుతీక్ష్ణ సన్నిధానంలో సాధనలో అతితీవ్రసాధనలో సులభంగానే ప్రలోభాలను త్రోసివేయ గల్గుతాడనీ, సాధనలో తీక్ష్ణత ఉన్నంతవరకు విఘ్నాలవల్ల శ్రమ ఏమీ వుండదనీ, ఈసాధన ఎంతో కాలం చెయ్యవలసిన పని కూడా వుండదనీ పైవాక్యాలకు అర్థం సులభంగానే బోధపడుతుంది ఈ సుతీక్ష్ణకథ సాధనాపరంగా కాకపోతే ఈ ఆశ్రమంలో ఎంతోకాలం వుండవలసి వుంటుందనుకోను అనే 'ఏతస్మి న్నాశ్రమే వాసం చిరంతు న సమర్థయే' అని చెప్పడం జరుగదు. వాచ్యార్థంలో అయితే మీ ఈ ఆశ్రమంలో ఎంతోకాలం ఉండవలసిన పని లేదనడం ఔచిత్యం కాదుకదా! సుతీక్ష్ణునితో రాముడు మీరు ఉంటారుగదా! ఇక కష్టమేముంది? 'భవాన్ త త్రాభిషజ్యేత కిం స్యాత్ కృచ్ఛ్రతరం తతః' అన్నాడు. అంటే సాధన మిక్కిలి తీక్ష్ణంగా ఉండేటప్పుడు విఘ్నాలకు భయపడవలసిన పని లేదని అంతరార్థం గ్రహించాలి.

అక్కడనుంచి వెళ్ళిపోయేటప్పుడు రామ లక్ష్మణులు సుతీక్ష్ణ మహర్షికి సాష్టాంగపడి నమస్కరిస్తారు. సుతీక్ష్ణముని వారిని కౌగ లించుకుంటాడు. 'మీరు దండకారణ్యానికి వెళ్ళే మార్గం ఇదే. దారిలో ఎన్నో ఆశ్రమాలు మీకు స్వాగతం ఇస్తాయి. అవి చాలా సుందరంగా

ఉండి అన్ని సౌకర్యాలతోనూ మీకు ఆనందం కల్గిస్తాయి. మీరు ఈ ఆశ్రమానికి మళ్ళీ మళ్ళీ వస్తూండాలిసుమా!'అనిచెప్పి సాగనంపుతాడు.

సాధకుడు సుతీక్ష సాధనయం దానక్తి చూపడమే రామలక్ష్మణులు సుతీక్ష్ణ మునికి సాష్టాంగ నమస్కృతి నెరపడం అంటే. సుతీక్ష్ణ సాధన సాధకునిలో గట్టిగా చోటు చేసికొనడమే సుతీక్ష్ణుడి కౌగిలింత కర్థం. దండకారణ్యానికి అనగా ప్రశాంత శిక్షణకు ఇదే దారి అంటే, సుతీక్ష్ణ సాధనలో నడవడమే అవసరం అని అర్థం. దారిలో ఆశ్రమాలు సుందరంగా వుండి అన్ని సౌకర్యాలతో ఆనందం ఇస్తాయంటే, ఈ సుతీక్ష్ణ మార్గంలో చేసే సాధనలు ఆనందాన్నిస్తాయని అర్థం. మళ్ళీ మళ్ళీ ఇక్కడకు రావాలిసుమా! అనడంలో సాధనల్లో ఏవిఘ్నాలు వచ్చినా సాధనా తీవ్రతను విడవకుండా తిరిగి తిరిగి తీక్ష్ణతర సాధన చేస్తూనే ఉండాలిసుమా అని సాధకునకు చేసే హెచ్చరికగా ఇది అన్వయించుకోవాలి.

## సీతకు కల్గిన ధర్మసందేహము రాముని నివారణము.

దండకారణ్యానికి వెళ్ళే దారిలో సీత రామునితో 'మీరు ప్రత్యక్షంగా మీ కపకారం చెయ్యని రాక్షసుల్నీ, మృగాల్నీ చంపుతానని, సుతీక్ష్ణ ఆశ్రమ మార్గంలో, ప్రతిజ్ఞ ఎందుకు చేసారు? మీ జోలికి రానివాటిని చంపడం సముచితమేనా?' అంటుంది.

దానికి రాముడు, 'నేను శస్త్రధారిని, అపకారంచేసే లక్షణం కలవారిని ఎవరినైనాసరే కనిపిస్తే చాలు వారిని శస్త్రంతో నాశంచేసి తీరడం శస్త్రధారినైన నాకు కర్తవ్యం' అంటాడు. రాక్షసులు, మృగాలు మనకు ఇప్పుడు అపకారం చెయ్యకపోయినా అవి ఉండడం ఎప్పటికైనా అనర్థకమే కాన వాటిని చంపితీరాలని రాముడు గట్టిగా చెప్తాడు.

సాధకుడు విఘ్నాలు రాకుండా, ఎప్పుడూ కనుగలిగి వుండాలనీ, విఘ్నాలుచేసే ప్రతిపక్శక్తులు తన లోపల అసలు ఉన్నాయంటేనేచాలు

అవి ఎప్పుడైనా తలెత్తి సాధకుడు పరాకుగా నున్నపుడు విజృంభిస్తాయి కాన వానికి తనలో చోటు అసలు లేకుండానే చెయ్యడానికి వానిని వెదకి వెదకి నాశం చెయ్యాలనీ పైవానికి అర్థం. "మృగ్యంతే ఇతి మృగాః" అన్న వ్యుత్పత్త్యర్థంలో దాగివున్నవానిని వెదికితేనేకాని తెలియబడని ప్రతిపక్షులే మృగాలని అవే అంతశ్శత్రువులనీ ఇక్కడ చెప్పుకోవాలి.

రాక్షసులంటే, 'రాక్ష + స' అనే వ్యుత్పత్త్యర్థం చెప్పాలి. 'రక్ష' అనేదే స్వార్థంలో 'రాక్ష' అవుతుంది. 'స' సే అంత కర్మణి అనే ధాతువు వల్ల 'చంపునది' అనే అర్థం కలది కాన, రాక్షసులు పదానికి రక్షణను నాశం చేసే ప్రతిపక్షులు అనే అర్థం చెప్పుకోవచ్చు.

## పం చా ప్స ర స్తీ ర్థ ం.

శ్లో॥ అగ్రతః ప్రయయౌ రామః
సీతా మధ్యే సుమధ్యమా
పృష్ఠత స్తు ధనుష్పాణిః
లక్ష్మణో ఒను జగామ హ॥

రాముడు ముందు నడుస్తున్నాడు. మధ్య సీత నడుస్తోంది. చివర లక్ష్మణుడు ధనుష్పాణియై నడుస్తున్నాడు.

పరమాత్మకూ జీవాత్మకూ మధ్య ప్రకృతి వుంటుందనీ, పరమాత్మయొక్క అడుగు జాడలలో ప్రకృతిని నడిపించడానికి ఎట్టి అవరోధాలు రాకుండా కనిపెట్టుకొనివుండాలనీ, సాధనారహస్యం ఇందులో ద్యోతక మౌతుంది.

పరమాత్మను దర్శించడానికి జీవునకు ప్రకృతి అనగా వాసన అడ్డుగా వుంటుందనీ, జీవుడు ఆ ప్రకృతిని పరమాత్మతో లీనంచేసి ప్రకృతి పురుషులు ఒక్కటే అనే భావనను అలవరచుకొనడానికి అటంకంగా వచ్చే ఇతర భావనలను జాగ్రత్తగా కనిపెట్టికొని వానిని సంహరిస్తేంటేగాని, పరమాత్మ దర్శనం దొరకదనీ ఇందు గ్రహించవలసిన రహస్యం.

కథ :— చాలదూరం నడిచివెళ్ళేక, వారికి యోజనాయత మైన తటాకం కన్పించింది. దానినుండి సంగీతవాద్యాలు వినిపించేయి. అవి విని రామలక్ష్మణులు కౌతూహలం కల్గి అక్కడవున్న ధర్మభృతుడు అనే మహర్షిని అదేమిటని అడిగేరు. ధర్మభృతుడు వారికి ఇట్లా చెప్పేడు.

శ్లో॥ ఇదం పంచసరోనామ తటాకం సార్వకాలికం
నిర్మితం తపసా రామ మునినా మాండకర్ణినా
స హి తేపే తప స్తీవ్రం మాండకర్ణి ర్మహామునిః
దశవర్ష సహస్రాణి వాయు భక్షో జలాశ్రయః
తతః ప్రవ్యథితా స్సర్వే దేవా స్సాగ్ని పురోగమాః
అబ్రువన్ వచనం సర్వే పరస్పర సమాగతాః
అస్మాకం కస్యచిత్ స్థానం ఏష ప్రార్థయతే మునిః
ఇతి సంవిగ్నమనసః సర్వే తే త్రిదివౌకసః
తత్ర కర్తుం తపోవిఘ్నం దేవై స్సర్వై ర్ని యోజితాః
ప్రధానాప్సరసః పంచ విద్యుచ్చలిత వర్చసః
అప్సరోభి స్తత స్తాభిః వ్యానిర్దృష్ట పరావరః
నీతో మదనవశ్యత్వం సురాణాం కార్యసిద్ధయే
తటాకే నిర్మితే తాసాం అస్మి న్నంతర్హితే గృహే
తథై వాప్సరసః పంచ నివ సంత్యో యథా సుఖం
రమయంతి తపోయోగా న్మునిం యౌవన మాస్థితం
తాసాం సంక్రీడమానానాం ఏష వాదిత్ర నిస్వనః
శ్రూయతే భూషణోన్మిశ్రో గీత శబ్దో మనోహరః॥

ఇది పంచసరస్సు అనే పేరుగల తటాకము ఇది ఎప్పుడూ వుండేది (సార్వకాలికం). మాండకర్ణి అనే మునిచే నిర్మింపబడింది. అతడు వాయు భక్షకుడుగా, జలాశ్రయుడుగా, దశవర్ష సహస్రములు తీవ్రంగా తపస్సు చేసేడు. దానివల్ల దేవతలలో కలవరం ఏర్పడింది. 'ఇతడు మనలో ఎవరిదో స్థానం తనకు కావాలని తపస్సును చేస్తూ వుంటాడు' అనుకొని దేవతలు అతణ్ణి తపోభ్రష్టుణ్ణిగా చెయ్యడానికి

అయిదుగురు ప్రధానాప్సరసలను పంపేరు. ఆ అప్సరసలు మాండకర్ణిని ఆకర్షించి అతణ్ణి మదనాతురుణ్ణి చేసి క్రీడిస్తున్నారు. వారి కోసం ఈ తటాకంలో ఇల్లు నిర్మింపబడింది. వారి క్రీడావ్యాపారంలో ఈ గీతవాదిత్ర నిస్వనం మనోహరంగా వినబడుతూంది' అని ధర్మభృతుడు చెప్పేడు.

రాముడు చాలదూరం నడిచి వెళ్ళేక యోజనాయతమైన తటాకాన్ని చూచేడు — అంటే సాధకుడు చాలదూరంగా సాధన సాగిస్తూంటే, అతనికి ఆలోచనలో ఎదుట ఒక దుఃఖాన్ని కల్గించే ఐహికవాసనాదృశ్యం కన్పించింది అని దాని అంతరార్థం. అది పంచ సరస్సు అను పేరుగల తటాకం. పంచ అంటే పంచేంద్రియముల యొక్క సరస్సు అంటే, ప్రవాహం కలది అని దేహానికి అర్థంచెప్పాలి.

తట + అకం, తట = తీరమందు (భూమియందలి) అకం = దుఃఖము (కం = సుఖము. అకం=దుఃఖము); యోజన + అయతం = ఒకదానితో మరొకటిగా ఆలోచనలు జతగూడుటచే పెద్దదైనది అని అంతరార్థం. ఎనిమిదిమైళ్ళ వైశాల్యం కలది అని వాచ్యార్థం. అప్పుడు యోజనం అంటే ఎనిమిది మైళ్ళ దూరం అని అర్థం.

సాధకుని ఆలోచనలు ఒకటొకటే క్రమంగాసాగినప్పుడు అతని ముక్తి ప్రయత్నానికి కలిగే ఐహికదుఃఖరూపవిఘ్నాలు అతని ఆలోచనలో ఒకదాని తర్వాత ఒకటిగా ఎదుటబడ్డాయి. ఆవిఘ్నాలే గీతవాదిత్రనిస్వనంగా పోల్చబడింది. ఆ విఘ్నాలు ఎక్కడినుండి ఏవిధంగా సాధకుని సాధనను దిగజారుస్తాయో మాండకర్ణి పంచాప్సర స్సీర్థం కథలో వివరింపబడింది. ఈ వివరణం ధర్మభృతునివల్ల జరిగింది అంటే, ధర్మాన్ని భరిస్తూన్నవాడిచే అంటే, ధర్మాచరణంలో ఉన్నమనోవృత్తిచేత ఈవివరణం ద్యోతకమౌతుందని అర్థంచెప్పుకోవాలి.

ఇది పంచాప్సరస్సరస్సు అనే సార్వకాలికమైన తటాకం అంటే దేహం. ఇది అయిదు ఇంద్రియాలతో మాయతో సంచరించే దేహం. పంచ = ఐదింద్రియాలచే, అప్ సరస్ = నీటితో తిరిగే అనగా మాయతోకూడి, సరః = ప్రవహించునది సార్వకాలికమైనది. అంటే, భూతభవిష్యద్వర్తమాన కాలాలన్నిటిలోనుకూడా ఉండేది. తటాకం అంటే భూసంబంధమైన దుఃఖవాసన. అది యోజనాయతము, అంటే, ఒకదాని తర్వాత ఒకటిగా జతపడి విశాలమైనది.

మాండకర్ణిమునిచే ఇది నిర్మింపబడ్డది. అంటే, మాండ+క+ఋణి; మాండ = అలంకారము కొఱకు (విలాసము కొఱకు) — మండ అంటే అలంకారము. 'మండ' అనునదే స్వార్థమందు 'మాండ' అని కాగలదు. క = సుఖమును, ఋణి = ఎరువుగా తెచ్చుకొన్నవాడు ( ఋణముగా తీసుకొన్నవాడు ) అంటే, విలాసానుభవంకోసం అశాశ్వతసుఖాలను కోరుకొనే జీవుడు అని అర్థం. అట్టి సుఖాలు కావాలని కోరిక గలవాడు మాండకర్ణి అనబడుతాడు. దశవర్ష సహస్రములు తపస్సు చేసేడు అంటే, పది ఇంద్రియాలవృత్తులతో అనేక విధాల సుఖాలకోసం జీవుడు శ్రమపడేవాడుగా ఉంటాడు అన్నమాట. వాయుభక్షకుడు అంటే ప్రాణవాయువును వ్యర్థంగా హరింపజేసికొన్నవాడని అర్థం. అంటే ప్రాణాలను త్యజించి సుఖాలకు కృషిచేసినవాడని అర్థం. అట్టివాడు జలాశ్రయుడు. జల + ఆశ్రయుడు. లేదా 'ల,డయోరభేదః' అన్నదానివల్ల జడ + ఆశ్రయుడు అన్నా అనవచ్చు. జడాశ్రయుడంటే మూర్ఖుడన్నమాట. జలాశ్రయుడు అంటే, మాయ యొక్క ఆశ్రయము కలవాడు. మాయలో పడినవాడు అని జలాశయుడు అన్నపదానికి అర్థం. జలంలో దిగితే శరీరం కన్పించదు అట్లే, మాయలో మునిగితే స్వస్వరూపం మరుగుపడుతుంది. కాన జలపదం, దాని పర్యాయ పదాలుకూడ, వస్త్రపదం వలెనే, మాయకు సంకేతంగా వాడబడుతున్నాయి. గోపికాజలక్రీడలలో జలపదానికి మాయ అనే చెప్పబడింది.

ప్రధానపంచాప్సరసలు అంటే మాయలోపడ్డ ప్రధాన పంచేంద్రియాలు అని అర్థం. ఈవిధంగా మాయలోపడ్డజీవుడు, శాశ్వతమైన మోక్షాన్ని వదలుకొని అశాశ్వతములైన సుఖాభిలాషలు తీర్చుకోవడంకోసం పదిఇంద్రియాలను ఓడ్చి చాల శ్రమపడి ప్రయత్నం చేసి ప్రధానములైన పంచజ్ఞానేంద్రియముల సుఖములకు ఆరాటపడుతాడు అనే అర్థం ఇందు కన్పిస్తూంది.

దేవతలు వాని తపస్సును చూచి, వీడు మనలో ఎవరి స్థానమో ఆక్రమిస్తాడని భయపడి అయిదుగురు ప్రధానాప్సరసలను తపో విఘ్నానికి నియమించి తాము వెళ్ళిపోయేరు. అప్సరసలు వానిని వలలో వేసికొని గీత వాద్యాలతో క్రీడిస్తూవుంటారు.

అంటే జీవునిలోని సాత్త్వికభావాలు ఆతనిలోని అశాశ్వత సుఖాభిలాషకోసం యత్నపడే తపనను చూచి తమ వినాశానికి భయపడి అవి పంచేంద్రియ భోగాలతో మఱింత ఆతని యత్నానికి సాయపడి ద్రోహదంచేసి తాము తప్పుకొంటాయి. ఇహలోకసుఖాలకోసం తాపత్రయ పడేవాడిని వానిలోని సాత్త్విక భావాలు వాడివల్ల తాము నశించకుండా వాడిని ఇంద్రియ లోలతకై ప్రధానపంచేంద్రియాలకు అప్పగించి తాము అదృశ్యమౌతాయని సాధకునకు తాము ఉండాలని బలమైన కోరిక వుంటేనే వానిలో ఉంటాయనీ, లేకపోతే, ఆ సాత్త్విక భావాలు వాడిలోని తామసిక భావాలను పంచేంద్రియాలకు అప్పగించి అవి మరి కనిపించకుండా అఱగిపోతాయని అధ్యాత్మికభావరహస్యం స్పష్టంచెయ్యడాన్ని అంతరార్థ పరంగా చెప్పబడింది అని చెప్పాలి. మనోహర గీత వాదిత్ర నిస్వనాలు అంటే పంచేంద్రియ వృత్తులు అని సులువుగానే గ్రహింపవచ్చు. ఇదంతా సాధకుని ఆలోచనతో పొత్త గట్టిందన్నమాట. ఈకథ సాధకులకు సాధనలో జాగ్రత్త కల్గించడం కోసం వాల్మీకిచేత కావాలని సృష్టించబడిందనక తప్పదు.

## దశవర్షఖండము.

తదా తస్మిన్ స కాకుత్స్థః శ్రీమ త్యాశ్రమ మండలే
ఉషిత్వా తు సుఖం తత్ర పూజ్యమానో మహర్షిభిః
జగామ చాశ్రమాన్ తేషాం పర్యాయేణ తపస్వినాం
క్వచిత్తు చతురో మాసాన్ పంచష ట్చాపరాన్ క్వచిత్
అపర త్రాధికం మాసా దప్యర్ధ మధికం క్వచిత్
త్రీన్ మాసా నష్టమాసాంశ్చ రాఘవో న్యవస త్సుఖం
రమత శ్చానుకూల్యేన యయు స్సంవత్సరాః దశ
పరివృత్య చ ధర్మజ్ఞో రాఘవ స్సహ సీతయా
సుతీక్ష్ణస్యాశ్రమం శ్రీమాన్ పునరే వాజగామహ.

దండకారణ్యాశ్రమాలలో సుఖంగా రాముడు పదిసంవత్సరాలు గడిపేడు. ఒకదానితర్వాత ఒకదాన్నిగా ఆ ఆశ్రమాలలో నాల్గుమాసాలు, అయిదు మాసాలు, ఆరు మాసాలు, మూడు మాసాలు, ఎనిమిది మాసాలు, ఒకచోట మాసం పైగా కొన్నాళ్ళు, ఒక్కొక్కచోట మాసంలో సగంరోజులు, మరొకచోట అంతకన్నా ఎక్కువ రోజులు గడిపి, సీతాలక్ష్మణులతో, ధర్మజ్ఞుడైన రాముడు సుతీక్ష్ణుని ఆశ్రమానికి తిరిగి చేరేడు. ఈవిధంగా సుఖంగా పది సంవత్సరాలు గడిచేయి.

దశవర్షం (పది సంవత్సరాలు) అంటే పది ఇంద్రియాల వ్యాపారాన్ని, ద్రవింపజేసి, ఓడ్చివేసి నాశంచేసివేయడం అన్నమాట. ఒక్కొక్క సాధనా భాగాన్ని ఒక్కొక్క ఆశ్రమంగా మనం పేర్కొనాలి. నాల్గు మాసాలు అంటే బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్యాస ములు అనే ఆశ్రమ చతుష్టయం అనీ, మూడు మాసాలు అంటే గుణ త్రయం అనీ, అయిదు మాసాలు అంటే, పంచభూత ప్రకృతులు అని, ఆరు మాసాలు అంటే అరిషడ్వర్గం అనీ, ఎనిమిది మాసాలు అంటే అష్టధాతువులనీ, ఏకమాసం అంటే అహంకారం అనీ మాసార్థం అంటే మమకారం (అహంకారంలోని సగభాగం) అనీ, చెప్పాలి, ఈవిధంగా మనోవృత్తులన్నిటిని ద్రవింపజేసి పది ఇంద్రియాలలోను చాంచల్యం

లేకుండా ఉండేస్థితిని సాధకుడు సాధించేడు అనీ, అసాధనలను తిరిగి తిరిగి తీవ్రస్థాయిలో జరిపిస్తూండాలనీ, అంతరార్థాల్ని పైశ్లోకాలకు చెప్పుకోవాలి.

మాసాని = మానములు అని వాచ్యార్థం. మా + న అంటే ప్రకృతిని నాశం చేయునది. 'మా' అంటే లేనిది అనగా ప్రకృతి, 'న' అంటే 'సే' అంత కర్మణి ధాతువు వల్ల అంతమునుచేయుట అని అర్థం. ఈవిధంగా వ్యుత్పత్త్యర్థం చెప్పి, గుణత్రయాన్ని, చతురాశ్రమాలను, పంచభూతాల ప్రకృతులను, అరిషడ్వర్గమును, అష్టధాతువులను, అహంకారమమకారములను మాయాప్రకృతి లేనివానినిగా చెయ్యడమే ఆ ఆశ్రమాలలో ఉండడానికి అర్థంగా చెప్పుకోవాలి.

## అగ స్త్యా శ్ర మ ద ర్శ న ం.

"నాకు అగస్త్య మహర్షిని దర్శించాలనీ, ఆయన్ని సేవించాలనీ వుంది. ఇక్కడే ఆయన ఆశ్రమం వుందని విన్నాను. ఎక్కడ వుంది"? అని రాముడు సుతీక్ష్ణుడిని అడిగేడు. అప్పుడు సుతీక్ష్ణ మహర్షి రామా! నేనే నీకు అగస్త్యుణ్ణి దర్శించుకొమ్మని చెప్పుదామని అనుకుంటున్నాను. నీవే అడిగేవు. సంతోషం. ఈ ఆశ్రమానికి *నాల్గు యోజనాల దూరంలో అగస్త్యాశ్రమం వుంది. దానికి దక్షిణంగా యోజనం వెడితే అగస్త్యభ్రాతయొక్క ఆశ్రమం తగులుతుంది. అక్కడ సీత, లక్ష్మణుడు బాగా ఆనందిస్తారు, అక్కడ ఒక రాత్రి గడిపి వెళ్ళండి' అని సుతీక్ష్ణుడు చెప్తాడు.

'అగస్త్య' అని వ్రాస్తూంటారు. కాని ఇక్కడ అది సరికాదు. 'అగస్త్య' అన్నది సరైంది. 'అగ' అంటే 'న, గచ్ఛతి ఇతి అగః అంటే

---

* అగస్త్య ఆశ్రమం ఇక్కడకు నాల్గు యోజనాల దూరంలో వుంది అంటే అది పురుషార్థాలలో నాల్గవది అగు మోక్షపురుషార్థం అని అర్థం. అది పరమాత్మస్థానం. 'యోజనం' అంటే కూడిక అని అర్థం. నాలుగు పురుషార్థాల కూడిక మోక్షపురుషార్థం.

చలనం లేని స్థితి అని అర్థం. 'స్థ్య' అంటే ఉండదగినది. నిశ్చల స్థితిలో ఉండేది స్వ స్వరూపజ్ఞానం; అంటే పరమ ఆత్మస్థితి అని అర్థం. దానికి ముందు జీవాత్మయొక్క స్థానం ఉంది. అదే అగస్త్యభ్రాతయొక్క ఆశ్రమం. దాన్ని ముందు చూస్తేనే (అగస్త్య అంటే) పరమాత్మయొక్క దర్శనం దొరుకుతుంది. జీవాత్మ అంటే అహంస్ఫూర్తియే కాన అగస్త్య భ్రాత అంటే జీవాత్మయే కాన వాసనావృత జీవరూప పరమాత్మయేఅది. కాన దానికి వేరుగా నామకరణం లేదు. జీవాత్మ వాసనావృతమై మాయావరణంతో వుంటుంది. మాయతో కూడినది జీవాత్మ అవుతుంది. మాయనువీడినది పరమాత్మఅవుతుంది. పరమాత్మకు జీవాత్మ యోజనం దూరంలోఉందంటే అదే అర్థం. అవి రెండూ ఒకటే పరమాత్మకు జీవాత్మతో సోదర సంబంధం చెప్పబడింది. ఆ జీవాత్మయే 'అహం' స్ఫురణం అన్నమాట. అగస్త్యభ్రాత అంటే అహం స్ఫురణం అని చెప్పు కోవాలి. యోజనం అంటే ఇక్కడ కలయిక అనే అర్థం చెప్పుకొని ఆలో చిస్తే జీవాత్మయే పరమాత్మగా చూడవచ్చునని అర్థం అని చెప్పు కోవచ్చు.

అహంస్ఫురణం హృదయకోశానికి దక్షిణంగా వుందని రమణ మహర్షులవారు సెలవిచ్చారు. 'అహం' అనేదానిని తెలిసికొంటే ఆత్మ అదే తెలియబడుతుంది అని ఆయన చెప్పారు. 'అహం సః' అనునదే 'సో ఽ హం' అయింది, అంటే 'అహం' అనునదే సః = ఆ పరమాత్మ అని అర్థం. కలిపి చూస్తే నిజానికి రెండూ ఒకటే. మాయావృతంగా వున్న అహంను పరమాత్మగా తెలిసికొనుటే మాయ తొలగడమంటే, అదే పరమాత్మ సాక్షాత్కారానికి మార్గం. మాయ తొలగించుకోవడమే దారి. అది తప్ప ప్రత్యేకంగా నిర్గుణ, నిరంజన, నిర్వికార, నిశ్చల తత్త్వమైన పరమాత్మను తెలిసికొనడం శక్యమేకాదు. ఆ అహంకార మాయారూపాన్ని మాయావరణంలోనే వుండి, గ్రహించినపుడే బోధ పడుతుంది. రాత్రినిమాయావరణంగా పోల్చడం కలదు. కాన, 'ఒక్క రాత్రి అక్కడ గడపండి' అన్నమాటకు మాయయొక్క తత్త్వాన్ని

తెలిసికొని అహం స్ఫురణను పొందాలి అని సాధకునకు ఆత్మసాక్షాత్కృతికి మార్గం చెప్పడమే సుతీక్ష్ణుడు అగస్త్యాశ్రమ, అగస్త్యభ్రాత ఆశ్రమములకు మార్గం చెప్పడమంటే. సుతీక్ష్ణుడంటే, ముక్తినిగూర్చె తీవ్రమైన సాధన అనికదా! చెప్పుకున్నాం. ఆ తీవ్రత కల్గినపుడు మాయావరణాన్ని ఛేదించి సాధకుడు 'అహం' స్ఫూర్తితో ఆత్మ సాక్షాత్కృతిని పొందుతాడు అన్న ఆధ్యాత్మిక రహస్యాన్ని అగస్త్యాశ్రమ ప్రసంగం వల్ల బోధపఱచుకోవాల్సివుంది. "సీతాలక్ష్మణులు అగస్త్య భ్రాతయొక్క ఆశ్రమంలో బాగా ఆనందిస్తారు" అనడంలో ప్రకృతి యైన సీత, జీవుడు అయిన లక్ష్మణుడు ఇరువురూ మాయారూపాలేకాన వారిస్వస్థానం అహంకారమే కనుక ఆ స్వస్థానంలో వారుండడానికి ఇష్టపడుతారు; అని దానికి అంతరార్థంగా కనిపిస్తుంది. పరమాత్మ అగోచరుడు కాన నిశ్చల స్థితితో ప్రకృతినుండి, జీవునినుండి, అహంకారములో నుండియే, మాయనుండియే (ఇవన్నీ ఒకేదానికిపేర్లు) పరమాత్మను చూడ్డం నేర్చుకోవాలి అన్నసంగతి అగస్త్యభ్రాత ఆశ్రమంచేరి సీతాలక్ష్మణుల కానందం కల్గించి ఆపైననే అగస్త్యాశ్రమం చేరుకొమ్మని అన్నదానికి అంతరార్థంగా గ్రహించాలి.

## ఇ ల్వ ల వా తా పు ల క థ.

రాముడు ఇల్వల వాతాపుల కథనూ, 'వింధ్య' గర్వాపహరణ కథనూ చెప్పి అగస్త్యమహర్షియొక్క మహిమను లక్ష్మణుడికి ఈవిధంగా వివరించి చెప్తాడు.

ఇల్వల వాతాపులనే రాక్షసు లిద్దఱు ఈ అరణ్యమార్గంలో పయనిస్తూ వచ్చే పోయే మహర్షులను భోజనానికి పిల్చి వాతాపిని 'మేషం' గా (మేకగా) మార్చి, ఆ మేషమాంసం వండి వారికి భోజనంపెట్టి, వారు తిని కూర్చున్నతర్వాత వాతాపీ! రా! అని పిలిచే వాడు. అంత ఆమునుల పొట్టల్లోని మేకమాంసం వాతాపి రాక్షసుడుగా మారి వారి పొట్టలు చీల్చుకొని బైటకు వచ్చేవాడు. తర్వాత వారిద్దఱూ

కలిసి ఆ చనిపోయిన మునుల మాంసాన్ని పీక్కొని తినేవారు. ఈవిధంగా చాలాకాలం గడిచేక, అది తెలిసి. అగస్త్యుడు ఆమార్గంలో పయనించడం, అతనినిగూడ అందఱివలెనే మోసగించడానికి మాంస భోజనం పెట్టడం, జరిగింది. భోజనమైన వెంటనే అగస్త్యుడు వాతాపి మాంసాన్ని తన పొట్ట చేతితో నిమిరి జీర్ణం చేసివేసెయ్యడంవల్ల, మాంసనాశంతో వాతాపి రాకపోవడంతో ఇల్వలుడు, అగస్త్యుని మహిమ తెలిసి పారిపోయాడు. అది చూచి, అగస్త్యుడు వానిని కంటి చూపుతోనే దగ్ధం చేశాడు. ఈవిధంగా మునులకు ప్రాణ రక్షణం కల్గింది ఇల్వలుడు అంటే 'ఇలతే ఇతి ఇలః వలతే ఇతి వలః ఇలవలః' అని వ్యుత్పత్త్యర్థం. ఇలతే = స్థిరముగానున్నది, వలతే = చుట్టుకొనియున్నది. అని మాయకు అర్థము. ఇలవలుడే ఇల్వలుడు. ఇల్ అనే ప్రకృతికి భూమి అనే అర్థం చెప్పవచ్చు. 'ఇల్' ప్రకృతి. దానిపై స్త్రీ ప్రత్యయం 'టాప్' చేస్తే 'ఇలా' అవుతుంది. అప్పుడు భూమి అర్థం ఇల్ అనునది భూమి అను అర్థం చెప్పే ధాతువు. అది ప్రాతి పదిక. స్థిరమైనది అని అర్థం. వలతే=చుట్టుకొనునది అనే అర్థంలో 'వలః' అవుతుంది. స్థిరమైనదీ భూమిని చుట్టుకొని వుండేదీఇల్వలుడు అనగా మాయాప్రకృతి అనికూడ చెప్పవచ్చు. వాతాపి అనగా జనన మరణాలపరిభ్రమణం అని అర్థం. వాత + ఆ + పి = వాతాపి. వాత = గాలిని (ప్రాణవాయువును) ఆ = సమంతాత్ అనగా సంపూర్ణంగా; పియతే ఇతి పిః, పిః అంటే త్రాగివేయు నది అని అర్థం. ప్రాణవాయువును పూర్తిగా హరించునది; మరణం. వాతం ఆప్నోతి ఇతి వాతాపి అనగా ప్రాణవాయువును పొందునది. జననం అనికూడ దాని కర్థం. ఇల్వలుడు వాతాపిని మేషంచేసి ఆ మేషాన్ని వండిపెట్టి మునులు మేషమాంసభోజనం చేసాక, వాతాపిని పిలిచి తపస్వులను మోసగిస్తున్నాడు. అంటే, మాయా ప్రకృతితో సాధకులు, మేషాన్ని అంటే మా + ఈషా, అంటే ప్రకృతి యందు కోరిక గలది మేషం అవుతుంది. ప్రకృతియందు కోరిక వాతాపికి లక్షణం. దానిని తింటే అంటే కోరికలతో వుండే మరణానికి

జననమరణ పరిభ్రమణానికి పాల్పడుతున్నారు. అగస్త్యుడు వాతాపి ఇల్వలుల నిద్దర్నీ నాశంచేసాడు. అంటే, అగస్త్య భావంయొక్క అంటే నిశ్చలతత్త్వంయొక్క సాక్షాత్కారం కల్గినప్పటినుండి మాయావృత్తులచేత జననమరణపరిభ్రమణం లేక సాధకులు ముక్తులౌతారని అర్థం. అగస్త్యదర్శనం అంటే, నిశ్చలతత్త్వం వల్ల సాధించిన బ్రహ్మసాక్షాత్కారమనీ, అగస్త్యదర్శనమైనప్పుడే కోరికలు నశించి ముక్తిమార్గంలో జననమరణనాశంతో సాధకుడు సిద్ధుడౌతాడనీ ఇల్వలవాతాపుల నగస్త్యుడు నాశంచేశాడన్న కథలోని అంతరార్థ సారాంశం.

## వింధ్యగర్వాపహరణం.

వింధ్యపర్వతం తాను అన్ని పర్వతాలకంటె ఉన్నతంగా ఉండాలని ఆకాశంతో సమంగా ఎత్తునకు పెరగడం ప్రారంభించింది. అప్పుడు సూర్యగతి ఆగిపోయింది. ఆ సంగతి తెలిసి అగస్త్యుడు అదారిని వెడుతూ వింధ్య పర్వతం దగ్గరకు వచ్చేడు. వింధ్యపర్వతం అగస్త్యునకు వంగి నమస్కరించింది. "నేను తిరిగి వస్తాను. అంత వరకూ ఇట్లాగే వంగి ఉండు" మని అగస్త్యుడు వింధ్యను ఆజ్ఞాపించేడు. అప్పటినుండి నేటివరకు వింధ్యపర్వతం తలెత్తలేదు. అగస్త్యుని రాకకు ప్రతీక్షిస్తూ అల్లాగే వుండిపోయింది. అగస్త్యుడావైపునకు రానేలేదు.

'వింధ్య' కాదు 'వింద్య' అని దానిని చెప్పాలి. 'వింద్యతే ఇతి వింద్యా' అనగా తెలియదగినది అని విత్ అనే ధాతువుయొక్క రూపం. తెలియదగినది అంటే, తార్కికహేతువాదజ్ఞానం అన్నమాట. ఈ హేతువాద తర్కజ్ఞానం దేవునిగూర్చి చెప్పే వాదాలన్నిటిని ఖండింపగల సమర్థత కలది. ఈ హేతువాదాన్ని ఒక్క అనుభవజ్ఞానం మాత్రమే మించగలదు. ఆ అనుభవం అంటే, నిశ్చలస్థితిలోని పరమాత్మయొక్క సాక్షాత్కారానుభవం అన్నమాట. వింద్య, అన్ని పర్వతాలను మించాలని పెరిగిపోతూంది; సూర్యగతిని నిరోధించింది.

అంటే అన్నిశాస్త్రాలను కాదని తర్కశాస్త్రం లోకంలో నాస్తిక తత్త్వాన్ని ప్రచారం చెయ్యడానికి పూని, పెరిగిపోయిందనీ అది భగవత్తత్త్వాన్ని మరుగుపరుస్తూ వుందని,అంతరార్థం. అగస్త్యుడు వచ్చేటప్పటికి 'వింద్య' వంగి నమస్కరించింది అంటే, బ్రహ్మసాక్షాత్కారనిశ్చల తత్త్వానుభవాన్ని చెప్పే వేదం వచ్చి దానియెదుట నిలబడేటప్పటికి అది అనగా తార్కికబుద్ధి అనగా వింద్య తల వంచింది అన్నమాట. వేదం అనుభవ జ్ఞానాన్ని చెప్పేది. దానిని తార్కిక బుద్ధితో శంకింప కూడదు. దానిముందు తార్కిక జ్ఞానం నమ్రతను చూపించవలసిందే. ఆస్తిక మతం వేదప్రమాణంచేతనే వ్యాప్తినొందుతూ వచ్చింది. ఆతర్వాత సూర్యగతి మామూలుగా జరుగుతూంది అంటే, భగవత్తత్త్వం వ్యాప్తి నందుతూంది అన్నమాట. వేదం ఉన్నంతవరకూ తర్కబుద్ధితో నాస్తిక తత్త్వం వ్యాపించలేదు, అన్న సంగతి పై వింధ్యగర్వాపహరణ కథకు అంతరార్థంగా చెప్పవచ్చు. అగస్త్య పదం ఇచ్చట నిశ్చల తత్త్వాన్ని చెప్పే వేదమతం అన్న అర్థాన్నిస్తుంది.

సాధకునకు, ఆత్మసాక్షాత్కారం వేదవిశ్వాసంతోనే గాని రాదనీ, అప్పుడుగాని ఆస్తిక్యబుద్ధి నిలబెట్టబడదనీ పైకథలు హెచ్చరిస్తున్నాయి.

అగస్త్య ఆశ్రమాన్ని ఎవరు చేరగలరో, ఎవరు చేరలేరో, ఇక్కడ వాల్మీకి ఈ క్రింది విధంగా చెబుతున్నాడు.

> అగస్త్య స్యాశ్రమ శ్శ్రీమాన్ వినీత జనసేవితః
> అస్మి న్నిలిగతా నేష శ్రేయసా యోజయిష్యతి
> నాఽత్ర జీవన్ మృషావాదీ క్రూరో వా యది వా శఠః
> నృశంసః కామవృత్తో వా ముని రేష తథావిధః॥

శ్రీమంతమైన అగస్త్యాశ్రమాన్ని అంటే నిశ్చలతత్త్వంతో కలిగే బ్రహ్మ సాక్షాత్కారానుభవాన్ని-ప్రకృతి పురుషుల ఐక్యానుసంధానంవల్లకల్గే అనుభవాన్ని వినీతజనులు మాత్రమే అనగా సాధనచే శిక్షితులైనవారు

మాత్రమే చేరడానికి అర్హులు. ఇచ్చట చేరినవానికి అనగా నిశ్చలతత్త్వ సాధన చేయుచున్నవానికి మోక్షమును భగవంతుడే చేకూరుస్తాడు. ఈ నిశ్చలతత్త్వాన్ని అసత్యవాది కాని, క్రూరుడుగాని, శఠుడుగాని నృశంసుడుగాని కామవ్యాపారలోలుడుకాని, ఎంతటి మునివేషధారులైనప్పటికీ పొందలేరు. అసత్యాలు పలకడం, క్రూరంగా ఉండడం, మోసంతో సంచరించడం, దుర్మార్గంలో నడవడం, కామాంధుడు కావడం ఇవి తప్పకుండా వాసనలకు కారణమౌతాయి. అట్టివారికి మనోనిశ్చలత శక్యంకాదు; అన్న అంతరార్థం ఇందులో విస్పష్టంగానే తోస్తూంది.

సత్సంగంవల్లనే నిశ్చలతత్త్వం వస్తుంది దానివల్లనే జీవన్ముక్తి కల్గుతుంది. ఈసంగతినే శ్రీ ఆదిశంకరులుకూడ భజగోవింద శ్లోకాల్లో చెప్పేరు.

శ్లో॥ సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః॥

జీవన్ముక్తికి నిశ్చలతత్త్వం సాధించాలనీ, దానికి సత్సంగత్వం మొదటి సోపానమనీ సత్ - ఎల్లపుడూ ఉండే పరమాత్మతత్త్వంతో, సంగం - కలయిక; అనీ ఆధ్యాత్మిక సోపాన మార్గాన్ని ప్రవచించేరు.

కథ :— సీతారామలక్ష్మణులు అగస్త్యాశ్రమం చేరుకొంటారు. అగస్త్యముని రాముని చూచి 'దిష్ట్యా రామ! చిర స్యాద్య ద్రష్టుం మాం సముపస్థితః, 'చాలాకాలంక్రితమే రావలసినవాడవు. ఇప్పుడైనా అదృష్టంవల్ల నన్ను చూడ్డానికి వచ్చేవు' అంటాడు.

అంటే, సాధకుని తరింపజెయ్యడానికి పరమాత్మ ఎదురు చూస్తూంటాడని చెప్పడమే దీని అర్థం.

రాముడు, తర్వాత అగస్త్యుని ఆశ్రమం అంతా తిరిగిచూస్తాడు. అక్కడ అతడు బ్రహ్మస్థానం, అగ్నిస్థానం, విష్ణుస్థానం, మహేంద్ర స్థానం, భాస్కరస్థానం, సోమస్థానం, భగస్థానం, కుబేరస్థానం, ధాతృ

విధాతృల స్థానం, వాయుస్థానం, నారాయణస్థానం, అనంతస్థానం, గాయత్రీస్థానం, వసుస్థానం, పాశహస్తస్థానం, కార్తికేయస్థానం, ధర్మస్థానం చూస్తాడు. ఈ స్థానాల్ని చూస్తూండగానే అగస్త్యుడు కూడ అక్కడకు వస్తూండడం రాముడు చూచి, లక్ష్మణునికి అగస్త్యుని చూపి 'ఈ అగస్త్యుడు ఇచ్చటినుండి నిష్క్రమించకుండానే ఆతనిని ఉదారంగా నేనే వెళ్ళి చేరుకుంటాను.' అని చెప్పి సర్వ తపస్సులకు నిధానమై సూర్యవర్చస్సుకల ఆ అగస్త్య మహామునియొక్క పాదాల్ని సీతాలక్ష్మణులతోకూడ కలసివెళ్ళి గట్టిగా పట్టుకొంటాడు.

అంటే, పరమాత్మ సకల దైవ స్వరూపుడని సాధకుడు గుర్తించి తనలోని, జీవప్రకృతులకు ఆ పరమాత్మతత్త్వాన్ని తెలిపి ఆ జ్ఞాన తత్త్వంకంటె, అన్యం శరణ్యం లేదని పూర్తిగా దానిని విశ్వసించి, శ్రద్ధా భక్తులతో విడువకుండా సాధన సాగిస్తాడన్నది పైదానికిఅర్థం పైన చెప్పిన దేవతలకు సగుణపరంగానేకాక, నిర్గుణపరంగాకూడ అర్థాలు వున్నాయి. ఆ అర్థాలు అన్నీ జ్ఞానమార్గంలో ఆ పరమాత్మ తత్త్వాన్నే వివరించేవి. కనుకనే, ఆదేవతలందఱూ అగస్త్యాశ్రమంలో సాధకునకు పొడగట్టినట్లూ, ఆ పొడగట్టే సమయంలోనే అగస్త్యుడు (నిశ్చలతతో నివసించే పరబ్రహ్మతత్త్వం) అక్కడకు వచ్చినట్లూ, తనలోని జీవప్రకృతులతోసహా సాధకుడు ఆ తత్త్వాన్ని ఆకళించుకొన్నట్లూ అంతరార్థపరంగా చెప్పడం జరిగింది. ఆయాదేవతలను నిర్గుణపరంగా చెప్పాలంటే, బ్రహ్మ అంటే వేదం అంటే జ్ఞానం, 'అగ్ని' అనేది 'అగ్రి అనే పదానికి సంకేతంగా ఉపయోగింప బడిందని, అగ్రి అంటే మొదటివాడనీ, అనగా ఆదిపురుషుడనీ అగ్ని పద వివరణం భారతీ నిరుక్తి అనే వేదార్థం చెప్పిన గ్రంథంలో వ్రాయబడి వుంది. అంటే పరమాత్మయొక్క ఆదితత్త్వం అగ్ని అన్నమాట. తేజస్స్వరూపమనికూడ అగ్నిపదానికి అర్థం. భాస్కర అంటే ప్రకాశాన్నిచ్చేవాడు, జ్ఞానజ్యోతిని ప్రసాదించేవాడు అని అర్థం. సోమ అంటే స + ఉమ = సోమ అవుతుంది. ఉమతో కూడిన (ఉమ అంటే

ప్రకృతి సంపద, ఉ = ప్రకృతియొక్క మ = సంపద). 'భగ' అంటే షడ్గుణైశ్వర్యసంపన్నత, అనగా షడ్గుణములతో అనగా పుట్టుట, పెరుగుట, స్థిరపడుట, వంగుట, పతనస్థితి, నాశస్థితి, అను షడ్భావ వికారాలతో నున్న ప్రకృతియొక్క ఐశ్వర్యం అంటే పరిపాలించు తత్త్వం ఈశ్వర భావం, ఇదే భగస్థానం అనబడుతుంది. నారాయణ = నార + అయన, 'నార' అనగా, జ్ఞానం దానిని 'అయన' అనగా నడుపునది, జ్ఞానాన్ని నడిపే తత్త్వం. అదే 'ధియో యో నః ప్రచోదయాత్' అనే గాయత్రీ మంత్రంలోని నారాయణస్థానం, విష్ణుస్థానం అంటే సర్వవ్యాపకతత్త్వం, కుబేరస్థానం అంటే, కు = భూమికి సంబంధించిన బేర = దేహము, భూసంబంధమైన శరీరతత్త్వం కుబేర స్థానానికి అర్థం. 'ధాతృ విధాతృ' స్థానం అంటే, ధాత అంటే కూర్చువాడు, విధాత అంటే విడదీయువాడు (వి అంటే విగతమైన అన్న అర్థం వుంది) అనగా జననమరణతత్త్వం అన్నమాట. ఇది జంట తత్త్వం. మహేంద్రస్థానం అంటే అంతము అనేది లేనిది (అవినాశ తత్త్వం). గాయత్రీస్థానం అనగా 'గాయంతం త్రాతి ఇతి గాయత్రీ' అనే వ్యుత్పత్త్యర్థంలో గాయత్రీ అంటే తన్ను జపించినవానిని రక్షించే మంత్రతత్త్వం. అది జ్ఞానతత్త్వం; వసుస్థానం అంటే ప్రకాశ తత్త్వం ( విజ్ఞానప్రకాశతత్త్వం ); పాశహస్త స్థానం అంటే 'పాశ' అనగా త్రాడు (కర్మపాశాలు – వాసనలు) హస్తమందు కలవాడు; కర్మలను అనుసరించి జీవులను నడిపే వాసనాతత్త్వం; కార్తికేయ స్థానం = కృతకం అంటే చేయబడినది అనగా కర్మ; దానికి సంబంధించినది కార్తికేయ అవుతుంది (కృత్ + తా = కృత్తా, కృత్తా లేక కృత్తిక) కర్మతత్త్వం, కార్తికేయ స్థానం. ఇది వాసనాతత్త్వానికి కారణమై వుంటుంది. 'ధర్మస్థానం' అంటే 'ధృ' ధాతువునకు ధరించడం అన్నది అర్థం. ధరించునది ధర్మం. సహజంగా దానంతట అది జరిగే సహజధర్మతత్త్వం. దైవస్వభావతత్త్వమే ధర్మస్థానంఅంటే. ఇవన్నీ అగస్త్యునిలో అంటే నిశ్చలతత్త్వంలో లీనమైయున్నవే అని గ్రహించుకోవాలి.

ఈవిధములైన పరమాత్మతత్త్వాలన్నీ అగస్త్యస్థానం అంటే మనోనిశ్చలస్థితిలో ద్యోతకమయ్యే పరమాత్మతత్త్వంలో చోటు చేసుకొనే వున్నాయి. ఆపరమాత్మను చెప్పే విభిన్నరూపాలే పై తత్త్వాలన్నీ. ఏ తత్త్వాన్ని అంటే ఏదేవతాస్థానాన్ని ఆరాధించినా సరే సాధకుడు అగస్త్యుణ్ణి ఆరాధించినవాడే అవుతాడు. ఆ తత్త్వాలన్నీ అగస్త్యతత్త్వాలే కనుక ఈవిధంగా సాధకుడు సర్వతత్త్వమయుడైన వానినిగా పరమాత్మను అర్థం చేసుకొన్నాడు అనేదే ఈ దేవతాస్థానదర్శనంలోని అంతరార్థ రహస్యం. సగుణరూపం వాచ్యార్థంతో చెప్పినా అన్నిటినీ అంతరార్థపరంగా జ్ఞానమార్గంలో నిర్గుణ తత్త్వాలుగా అర్థం చేసికోవాలి

కథ :— అగస్త్యుడు అగ్నికి హోమంచేసి అర్ఘ్య పాద్యాదులతో రామునికి పూజ చేసాడు.

అగ్ని అంటే సర్వశ్రేష్ఠమైన జ్ఞానప్రకాశం అని చెప్పుకొన్నాం. దానికి హోమంచేసి దానికి తన్ను సమర్పించుకొని అని అర్థం. ఆతేజస్సును ప్రజ్వలింపజేసి అంటే సాధకునిలోని ఆత్మజ్ఞానతత్త్వాన్ని వృద్ధిచేసి అని అర్థం రామునకు (ఆనంద స్వరూపానికి — ఆత్మజ్ఞాన వికాసంతో సాధకునిలో ఆనందం వెల్లివిరియడమన్నదే రాముడు) పూజ చేసాడు; ఆనందస్వరూపం భగవత్స్వరూపమే కనుక అగస్త్యునికి దానికి భేదంలేదు. రామతత్త్వమే అగస్త్యతత్త్వం వాంఛించేది. కాన రామునకు అగస్త్యుడు పూజచేశాడన్నదానిలో తప్పులేదు. అద్వైత స్థితిని సాధకునిలో పొదుకొల్పడమనేది అగస్త్యుడు రామునకు పూజ చేసాడన్నదానిలోని అంతరార్థరహస్యం. అగస్త్యుడు, రాముడు నిజానికి ఒక్కటే తత్త్వం అని చెప్పడమే అనగా నిశ్చల స్థితియొక్క ధర్మమే ఆత్మానందం అని చెప్పడమే ఇచ్చట అగస్త్యునిచే రామపూజ వాల్మీకి జరిపించడంలోని ఉద్దేశ్యం. ఇచ్చట రాముడు పూర్ణానందానికి ప్రయత్నించే ఆనందాంశగల సాధకుడుగా చెప్పుకోవాలి.

కథ :— అగస్త్యుడు రామునకు దివ్యమైన వైష్ణవ మహా (ధనుస్సు) చాపము ఇస్తూ 'ఇది విశ్వకర్మ నిర్మించేడు అమోఘమైనది. సూర్యసదృశమైనది' అంటాడు.

విశ్వకర్మ అంటే సమస్త కర్మలకు స్థానభూతకర్మవాసన. అదే జీవతత్త్వం. ఈ జీవతత్త్వం అమోఘమైనది. ఇది వ్యర్థంకానిది. దీని తత్త్వం ఊరికే ఉండేదికాదు, అనీ, దీనితో నిత్యమూ సర్వకాలమూ సర్వప్రకృతీ తనలో భగవంతుని ధరిస్తూ నడక సాగిస్తుంది అనీ జీవ తత్త్వాన్ని చెప్తూ ఇది సూర్యసదృశమైనది అంటాడు. అంటే సూర్యునివలె తమస్సును ఛేదించుకుంటూ ప్రకాశించేది. వాసనావృతం తొలగించు కొన్న నిర్మల జీవాత్మయొక్క తత్త్వం, పరమాత్మతత్త్వమేఅని చెప్పడమే ఆధనుస్సునిగూర్చి చెప్పడమంటే ధనుస్సు శత్రునాశంచేసేస్థానం అట్టి నిర్మలతతోకూడిన (మాయావాసనావృతంకాని) జీవాత్మను సాధకుడు తనవశంచేసికొంటే, అతనిని ఏదుష్టశక్తులూ ఇక ఎదురించలేవు అనీ, అట్టి తత్త్వాన్ని సాధకునకు ప్రసాదించడమే అగస్త్యుడు వైష్ణవ చాపమును రామునకు ప్రసాదించడంలోని అంతరార్థమనీ గ్రహించాలి 'వైష్ణవ' మంటే, సర్వ వ్యాపకధర్మం కలది అని వ్యుత్పత్త్యర్థం. అదిపరబ్రహ్మ ధర్మమూ, జీవధర్మమూకూడ. జీవంలేనిదీ, పరమాత్మలేనిదీ ఏదీ లేదనీ, పరమాత్మయే జీవం అనీ చెప్పడమే వైష్ణవచాపం అని చెప్పడం లోని అర్థం. భావి కిష్కింధాకాండలో రామలక్ష్మణుల పాత్రలను ఈ వైష్ణవచాపంగా చెప్పడం వాల్మీకి ఉద్దేశంగాకూడ గ్రహించాలి. ఇది కథలో లక్ష్మణుడుగా చెప్పవచ్చు. సీతావియోగదుఃఖాన్ని రామునకు లక్ష్మణుడు పోగొట్టాడు అన్నది ధనుస్సుతో తమస్సు పోగొట్టి జ్యోతిస్సు రాబట్టడం అంటే.

కథ :— ధనుస్సుతోకూడ భాస్కరతేజస్సుకల శరములు అక్షయ తూణీరద్వయము, వెండి ఒరలో పెట్టియుంచిన సూర్య తేజస్సుగల ఖడ్గంకూడ 'వీనిని నీవిజయంకోసం స్వీకరించు' అని రామునకు అగస్త్యుడు ప్రసాదించేడు.

'శౄహింసాయాం' ధాతువువల్ల శరములు అంటే, చంపేవి అని అర్థం. తమోనాశకములైన వేద ధర్మములు. అవి, భాస్కర తేజస్సు కలవి అని చెప్పబడ్డాయి. అక్షయ తూణీరద్వయం అంటే, ఎప్పుడూ నాశకంకాని వేదములు, వేదాంతములు అన్నమాట. వేదమునకు కర్మపరంగాను, జ్ఞానపరంగానుకూడ అర్థంవుంది. ఇవి ముందు కథలో వచ్చే జటాయువు, సంపాతి అను అన్నదమ్ములైన గ్రద్దలు 'నీకు రావణ విజయంలో తోడ్పడుతాయి' అని భావికథాపరమైన సూచకములుగా కూడ కన్పిస్తాయి. ఇవి రెండూ, వేదవేదాంతాల స్వరూపాలుగా అంతరార్థంలో చెప్పబడ్డాయి. శరములు సాత్త్విక ధర్మాలుగా చెప్పినప్పుడు అవి కల తూణీరములు వేద వేదాంతాలుగా చెప్పడం సముచితంగానే వుంటుంది. భావికథాసూచకంలో వానరులే ఈ శరాలంటే, ఖడ్గం వెండి ఒరలో పెట్టబడివుంది. వెండి తెల్లనిది అంటే బుద్ధి తత్త్వంలోని సత్త్వం అన్నమాట. సత్త్వగుణాన్ని తెలుపుతో పోలుస్తారు, ఈ వెండి ఒరయే భావి కథా సూచనలో ఆంజనేయుడు. ఆ సత్త్వ గుణంలో ఉండే విశుద్ధత్వమే ఆ వెండి ఒరలోని ఖడ్గం అంటే. భావి కథాసూచనలో ఈఖడ్గమే అంటే విశుద్ధతత్త్వమే సుగ్రీవుడంటే. విశుద్ధతత్త్వం యోగపరంగా షట్చక్రాలలోని విశుద్ధచక్రం. అది గ్రీవా స్థానం కలది. కాన, సు - చక్కని గ్రీవం కలది అని సుగ్రీవపదానికి అర్థం. ఖడ్గాన్ని కాపాడే వెండి ఒర అంటే బుద్ధి తత్త్వంలోని సత్త్వ గుణం. సుగ్రీవుణ్ణి అంటే విశుద్ధతత్త్వాన్ని కాపాడే మంత్రి ఆంజనేయుడు. అంటే, నిర్మల బుద్ధితత్త్వ సత్త్వ స్వరూపం. ఖడ్గం సూర్యతేజస్సుకలది. సుగ్రీవుడు సూర్యపుత్రుడుగా సూర్యతేజస్సు కలవాడు 'కిష్కం' అంటే చెడ్డను అంటే మాయను అని అర్థం. దధాతి అంటే ధరించునది కిష్కం దధాతి అస్మిన్ ఇతి కిష్కింధా, మాయను ధరించేది వాలి రాజుగాగలది కిష్కింధ అనివ్యుత్పత్త్యర్థంలో వాలి రాజుగా కలది కిష్కింధకాన వాలిని అనగా మాయను సంహరించుటకు అగస్త్యముని ఇచ్చిన దివ్యఖడ్గంగా

* వలతే ఇతి వాలీ మనస్సును చుట్టుకొనియుండే మాయకే వాలి అని పేరు. అతడు కిష్కింధకు రాజు. అనగా చెడ్డకు అధిపతి మాయ అన్నమాట.

సుగ్రీవుడు చెప్పబడ్డం చాలనజబుగానేవుంది. సుగ్రీవుడంటే విశుద్ధత. అది ఖడ్గంలాగుపనిచేసి వాలి అనే మాయాతమస్సును ఛేదింపిస్తుంది. వాలిని తనుచంపించి సుగ్రీవుడు రాక్షసనాశానికి రామునికి తోడ్పడ్డాడు. అంటే ఆనందరూపపరబ్రహ్మతత్త్వాన్ని ప్రకాశింపజేసే విశుద్ధతత్త్వం సుగ్రీవుడన్నమాట. ఆ విశుద్ధతత్త్వాన్ని, అంటే నిశ్చలతత్త్వాన్ని సాధకునకు ప్రసాదించేడు అగస్త్యుడు. ఇదే, అగస్త్యుడు రామునకు ఖడ్గాన్ని ప్రసాదించాడు అన్నదానికి అంతరార్థం. ఈఖడ్గమే భావి కథలోని సుగ్రీవుడు.

రాముడు, అంటే, సాధకుడు, ఇంకా పూర్ణతకై సాధన చేయవలసి వుందని, ఆతనికి అదూరభవిష్యత్తులోనే సీతావియోగం, అంటే ప్రకృతితో దశేంద్రియ ప్రాబల్యం చేత సంబంధం తెగిపోవడం జరుగుతుందని అప్పుడు సాధకుడు తిరిగి సాదనచేసి దశేంద్రియ విజయం సంపూర్ణంగా సాధించి తననుండి వేరువడిన ప్రకృతిని స్వవశం చేసుకోవలసి వుంటుందని అగస్త్యుడు సాధకునకు ఆసందర్భంలో సాధనకు కావలసిన సాధనాసామగ్రిని సమకూర్చడమే, వైష్ణవ చాపం, అక్షయ తూణీరాలు, అందలి శరములు, వెండి ఒరతో దివ్య ఖడ్గం ప్రసాదించేడన్నదానికి అంతరార్థం మనం చెప్పకోవాలి. నిశ్చలత్వ రూప భగవంతుడు సాధకునకు 'ఎప్పుడూ భవిష్యత్తులో సాయపడే సాధన సంపత్తిని ఇస్తాడని ఇందలి రహస్యంగా గ్రహించాలి.

## పంచవటీప్రవేశం

రాముడు తమ నివాసానికి ఎచ్చట అనువుగా వుంటుందో చెప్పవలసిందని అగస్త్యుణ్ణి అడిగేడు.'ఇక్కడకు * రెండు యోజనాల దూరంలో 'పంచవటి' అనే ప్రదేశం వుంది. మంచిగాలి, చల్లనినీరు,

* రెండు యోజనాలలో అంటే ఇక్కడ సుఖ దుఃఖాది ద్వంద్వ స్థితిలో అని అంతరార్థం చెప్పకోవాలి.

కందమూల ఫలాలు కల్గి పుష్పపక్షిసౌదర్యంతో అది కలకల లాడుతూ వుంటుంది. అక్కడ నీవు నీ పితృవాక్యాన్ని పాలించడానికి బాగుంటుంది. సీతండ్రిగారు పెట్టిన గడువు దగ్గఱకు వచ్చింది. నీవు త్వరలో రాజువు కాబోతున్నావు. నీ తండ్రి దశరథునియందు గల ప్రేమచేత, నా తపః ప్రభావంచేత నీలోని అభిప్రాయం తెలుసు కొన్నాను. ఇక్కడే నాతో వుండాలని నీకు వుందని నాకు తెలుసును అందుకే నేను నిన్ను పంచవటికి వెళ్ళమని ఆదేశిస్తున్నాను. సీత అక్కడ బాగా ఆనందిస్తుంది. గోదావరీ సమీపంలో సీత సంతోష పడుతుంది (గోదావర్యాః సమీపేతు మైథిలీ తత్ర రమ్యతే) భార్యతో కూడినవాడవై నీవుకూడ ఆమెతోకూడి ఆమె రక్షణమందు సమర్థుడవు కాగలవు. (భవానపి సదారశ్చ శక్తశ్చ పరిరక్షణే)" అని చెప్పి మార్గం చూపించేడు. ఆ మార్గం పట్టి వెళ్ళి సీతారామ లక్ష్మణులు పంచవటిని చేరుకున్నారు.

రాముడికి అగస్త్యాశ్రమంలోనే వుండాలని వుంది. ఆసంగతి అగస్త్యుడు ముందే తన తపశ్శక్తిచేత తెలిసికొని 'నీవు గోదావరీతీరంలో పంచవటిలో వుండు; నీతండ్రి దశరథునిమీద ప్రేమతో నేను ఆదే శిస్తున్నాను. సీతకు గోదావరీ తీరంలో పంచవటిలో బాగుంటుంది.' అని అగస్త్యుడు పంచవటికి పంపించడంలో ఏమిటి వుద్దేశ్యం? మనసులో రామునికి అగస్త్యాశ్రమంలోనే వుండాలని వున్నా, రాముని క్షేమం కోసమే రామునిమీద దశరథుని పుత్రుడుగా ఉన్నవాత్సల్యం చేతనే పంచవటికి వెళ్ళమంటున్నాడుట అగస్త్యుడు. ఏదో ఇందులో మహాప్రయోజనం రాముడికి వుండాలి, ఏమిటది ?

దశరథుని పుత్రుడు రాముడు. అతడిపుడు సీతతో గోదావరీ తీరంలోని పంచవటిలో ఉండాలని అగస్త్యుని ఆదేశం.

రాముడు దశరథుని పుత్రుడు; అంటే దశేంద్రియాల నిగ్రహ సాధనచే తీర్చిదిద్దబడిన సాధకుడు. సీత అంటే ప్రకృతి. అది ఇంద్రియములచే రెచ్చగొట్టబడి ప్రలోభంతో చిక్కుకొన్నప్పుడు అని

అర్థం. ఆ ప్రకృతిని తిరిగి స్వాధీనంలోకి తెచ్చుకోవడం అనేది ఇంద్రియ వశీకరణంలో గొప్ప సాధన. అది చేస్తేనే సాధన పూర్తి యైనట్లు.' 'నీవు చాలవరకు తండ్రి పెట్టిన గడువు చేరుకొన్నావు' అంటే దశ ఇంద్రియ విజయ సాధనతో దశేంద్రియాలను జయించి చాలవరకు సాధన పూర్తిచేశావు; అని తెలిసికోవాలి.

సీత గోదావరీ తీరంలో, పంచవటిలో సంతోషపడుతుంది అంటే, గో + ద + అవరి = గోదావరి. గో = ఇంద్రియవ్యాపారాన్ని, ద = ఇచ్చునట్టి, ఆ = అంతట వ్యాపించినట్టి, ఆవరి = ఆవరణము (మాయ) కలది అని అంతరార్థం. * పంచవటి అంటే, అయిదు మఱ్ఱి చెట్లు కలచోటు. మఱ్ఱి చెట్టు క్రిందనుండి వ్రేళ్ళు తన్నుకొని పైనుండి ఊడలు దిగి గట్టిగా నిలబడి వుంటుంది. అలాగే పంచేంద్రియాలు లోపల వాసనాబలంతో బైట పంచభూత ప్రకృతి బలంతో నిలద్రొక్కుకొని వుంటాయి. ఈ విధంగా ఉండే పంచేంద్రియ కూటమే పంచవటిగా చెప్పబడింది.

సీత అంటే సాధకునిలోని ప్రకృతి. సీత 'సంతోషపడుతుంది' అంటే, పంచేంద్రియకూటంతో ఆ ఇంద్రియవ్యాపారం విజృంభింపజేసే పరిసరాలలో ప్రకృతి ఉండటానికి ఉబలాటపడుతుంది, అని అంతరార్థం. 'నీ భార్యను, సీతను కూడ అక్కడ నీవు ఆపెను రక్షించుటకు శక్తుడవు' అంటే, సాధకునిలోని ఐహికప్రకృతి పంచేంద్రియకూటంలో ఇంద్రియవ్యాపారానికి దోహదంచేసే పరిసరాలలో ఆనందిస్తూన్నప్పుడు, సాధకుడు ఆ ప్రకృతిని ఇంద్రియ వశం కానీకుండా కాపాడుకొని స్వవశంలో ఉంచుకొనడమనే గొప్ప సాధన అనగా detached attachment సాగించవలసివుంది. దానితో నీవు సిద్ధుడ వౌతావు, అని సాధకునకు పరమాత్మ చేసే హెచ్చరిక అంతరార్థపరంగా ఇందు కన్పిస్తూంది.

---

* వటము = వటతి వేష్టయతి మూలైః స్వస్థాన మితి వటః = వట వేష్టనే అను ధాతువు. ఊడలతో స్వస్థానమును చుట్టుకొని యుండునది మఱ్ఱిచెట్టు.

రాముడికి అగస్త్యాశ్రమంలోనే వుండాలని వుంది; అయినా అగస్త్యుడు రాముణ్ణి పంచవటిలో ఉండుమన్నాడు; అంటే, భగవత్సాక్షాత్కారానుభవం పూర్ణంగా శాశ్వతంగా కల్గడం అన్నది ఇంద్రియ విజయంతో చాలదు. ప్రకృతి వశీకరణం సంపూర్తిగా జరిగినప్పుడే అది కల్గుతుంది. ఇంతవరకు తాత్కాలికభగవత్సాక్షాత్కారం మాత్రమే కల్గింది. అది ఆభాస మాత్రమే అవుతుంది ఇంద్రియ చాంచల్యం ఏమాత్రం ఉన్నా, ప్రకృతి తన స్వాధీనంలో ఏమాత్రం లేకపోయినా జీవన్ముక్తిస్థితి రాదు. ముక్తావస్థకు పూర్వం కల్గే సాక్షాత్కారాలు తాత్కాలికాలే కాన వానిని నమ్ముకొని సాధన మానకూడదు' అనేదే అగస్త్యుడు రామునకు తన ఆశ్రమంలో ఉండడానికి అనుమతించక పంచవటిని నిర్దేశించడంలోని అంతరార్థ రహస్యంగా గ్రహించాల్సి వుంది.

'దశవర్ష ఖండం' అంటే, పది సంవత్సరాల కథ చెప్పే భాగం అని వాచ్యార్థం. పది ఇంద్రియాలను వర్షింపించి ఓడ్చి ద్రవింప జేయడం అన్నది అంతరార్థం. దశేంద్రియాలను నిగ్రహించడమే జరిగింది కాని, ఆ ఇంద్రియ వ్యాపారాన్ని ఆత్మ స్వరూపంలో విలీనం చెయ్యడం ఇంకా జరుగలేదు, అంతవరకూ ఎంత నిగ్రహింపబడినా ఇంద్రియ వ్యాపారం ప్రకృతిని వశం చేసికోడానికి యత్నిస్తూనే ఉంటుంది. కాన, ఇంద్రియ వ్యాపారాన్ని రెచ్చగొట్టే పరిసరాల్లో తనలోని ఐహిక ప్రకృతిని విహరింపజేసి ఇంద్రియాలను రెచ్చగొట్టి, సాధకుడు పైకి విజృంభించిన ఆ ఇంద్రియవ్యాపారం ప్రకృతిని వశపరచుకోకుండా ఉండేటట్లు కనుగలిగి చూచుకొనే ఒక తీవ్ర మహా సాధనను ఇంకనూ చెయ్యవలసియే వుంది. కనుకనే గోదావరీతీరంలో పంచవటిలో సీత ఆనందించడమూ, సీతను రాముడు దశేంద్రియ ప్రాబల్యంనుండి రక్షించుకోవడమూ జరగాలని అగస్త్యుడు పంచవటిని నివాసంగా నిర్దేశించాడు. అంటే, పంచేంద్రియములను (ప్రధాన ఇంద్రియములు అయిదే, కర్మేంద్రియములని జ్ఞానేంద్రియములనీ

విభజించి పదిగా చెప్పబడ్డాయి) రెచ్చగొట్టే పరిసరాల్లో తనలోని ఐహిక ప్రకృతిని విహరింపజేసి, సాధకుడు జాగ్రత్తతో ఆప్రకృతిని ఇంద్రియాలు వశం చేసికోకుండా కాపాడుకుంటూ, సాధన జరిపించాలని సాధకునకు ఆత్మ ప్రబోధం జరిగింది; అని సాధనాపరమైన అంతరార్థాన్ని అగస్త్యోపదేశంలో గ్రహించాలి. 'త్వరలో నీవు రాజువు కాగలవు నీవు సీతను రక్షించుకొంటావు' అన్న అగస్త్యుని మాటలకు 'నీవు సాధనలో తప్పక త్వరలోనే సిద్ధుడవు కాగలవు జీవన్ముక్తి పొందగలవు' ప్రకృతిని శాశ్వతంగా వశపరచుకొంటావు. అనేది అంతరార్థంగా గ్రహించాలి.

అగస్త్యుడు తిరిగి యుద్ధకాండలో ఆఖరున వచ్చి రావణుని రాముడు వధించడానికి ఆదిత్య హృదయాన్ని ఉపదేశిస్తాడు. ఆదిత్య హృదయంలో భగవత్తత్త్వం సర్వసంపూర్ణంగా వివరింపబడింది. ఇట్లాగు రెండుసార్లు రామాయణంలో వచ్చిన మహర్షుల్లో భరద్వాజ మహర్షియొకడు. భరద్వాజుడు యోగమార్గాన్ని, అగస్త్యుడు జ్ఞాన మార్గాన్ని చెప్పినవారు. సుతీక్ష్ణమహర్షికూడ రెండు మూడు సార్లు వస్తాడు. యోగ జ్ఞాన మార్గాలు సుతీక్ష్ణంగా మళ్ళీ మళ్ళీ జరిపించాలనడమే ఈముగ్గురి పునః పునః ప్రవేశంలోను ఉన్న ముఖ్యోద్దేశం. రామాయణంలో అంతరార్థపరంగా ఈ మూర్తిత్రయంయొక్క విలువ అనంతం.

## జ టా యు వు.

పంచవటికి వెళ్ళే దారిలోనే జటాయువును రాముడు చూచేడు. రామునికి జటాయువు తన్ను ఎఱుక పఱచుకొంది.

'ఉవాచ, వత్స మాం విద్ధి వయస్యం పితు రాత్మనః
ద్వౌ పుత్రౌ వినతాయా స్తే గరుడోఽరుణ ఏవ చ
తస్మాత్ జాతోఽహ మరుణాత్ సంపాతి స్తు మ మాగ్రజః
జటాయు రితి మాం విద్ధి శ్యేనీపుత్ర మరిందమ!
సోఽహం వాసనహాయ స్తే భవిష్యామి య దీచ్ఛసి'

బిడ్డా! నేను నీతండ్రికి స్నేహితుడను. వినతయొక్క బిడ్డలైన గరుత్మంతుడు, అరుణుడు అనువారిలో సంపాతీ, నేనూ అరుణుని బిడ్డలము. నేను జటాయువను పేరుగలవాడను. నాతల్లి శ్యేని (గ్రద్ద). నేను నీకు పంచవటీనివాసంలో సహాయుడనుగా వుంటాను.

జటాయువు అంటే, జట + ఆయువు అని విడదీయాలి. జట, ఘన అనేవి వేదాధ్యయనమార్గ విధానాలు. 'జట' యే ఆయువుగా గలది జటాయువు అవుతుంది; అనగా జట అను అధ్యయనమార్గము వేదాన్ని నిలబెట్టుతూంది, కాన జటాయువు అన్న పదానికి 'వేదం' విజ్ఞానం అని అర్థం. జటాయువు దశరథునకు మిత్రుడు. దశరథుడు అంటే, దశేంద్రియాలను అదుపులో పెట్టే సాధన. ఆ సాధన వేద విజ్ఞానం మీదనే ఆధారపడివుంది. వేదములోని కర్మకాండ విజ్ఞానం ఇంద్రియ నిగ్రహానికే ఉద్దేశించబడింది. కాన, జటాయువు దశరథ మిత్రుడుగా చెప్పబడింది. ఇక్కడ ఇంకోవిధమైన అర్థంకూడ చెప్పవచ్చు. అదేమంటే —

'మాం విద్ధి వయస్యం పితు రాత్మనః' పితుః = జగత్పితయైన, ఆత్మనః=పరమాత్మకు, మాం = నన్ను, వయస్యం = మిత్రునిగా, విద్ధి= తెలిసికో అనే అర్థంకూడ చెప్పినప్పుడు, పరమాత్మను చేర్చేది వేద విజ్ఞానం అని అర్థం అవుతుంది. అప్పుడు జటాయువు వేద విజ్ఞానం అన్న అర్థం స్పష్టం చేస్తుంది. అంతే కాకుండా గరుత్మంతుడు ఛందో మయుఁడు అని ప్రసిద్ధి వుండనే వుంది. అంటే, గరుత్మంతుడు సర్వ వేదమూర్తి అన్నమాట. అతని వంశములోనిదే జటాయువు, కాన ఇంద్రియనిగ్రహసాధనమైనకర్మకాండను చెప్పే వేదభాగంగా జటాయుపదానికి అర్థం చెప్పవచ్చు. మఱొక ముఖ్యవిషయ మేమంటే,

"సోఽహం వాస సహాయ స్తే భవిష్యామి య దీచ్ఛసి" అన్న వాల్మీకి మాటల్లోనే యదీచ్ఛసి = నీవు కోరినట్లైతే, తే = నీకు

"సోఽహం" వాన సహాయః = 'సోఽహం' అనే సాధన నిలబడడానికి సహాయకుడనై. భవిష్యామి = కాగలను. అని 'సోఽహం' అన్నదానికి అర్థం చెప్పకోవచ్చు. అంటే, కర్మకాండ పరమైనదే ఐనా వేదం, 'నేను పరమాత్మను' అనే ఆత్మజ్ఞానానికి, వేదోక్తకర్మభాగం మనశ్శుద్ధిద్వారా సహాయపడుతుంది. అనగా, కర్మకాండవల్ల మన శ్శుద్ధి మనశ్శుద్ధివల్ల ఆత్మజ్ఞానం కల్గుతాయన్నమాట. ఈవిధంగా కూడ జటాయువు అన్నపదమునకు ఇంద్రియనిగ్రహ సాధనకు, ఆత్మ జ్ఞాన సాధనకు సాధకునకు తోడ్పడే వేదం అన్న అర్థం సిద్ధిస్తూంది.

రాముడు జటాయువును పూజిస్తాడు

శ్లో॥ జటాయుషం తం పరిపూజ్య రాఘవః
ముదా పరిష్వజ్య చ సన్నతోఽభవత్
పితు ర్హి శుశ్రావ సఖిత్వ మాత్మనః
జటాయుషా సంకథితాః పునః పునః॥

రాముడు జటాయువును పూజించి కౌగలించుకొన్నాడు. దానికి వినమ్రుడైనాడు. తర్వాత తన తండ్రితో జటాయువునకు గల చెలిమినిగూర్చిన సంగతులు మాటి మాటికి అడిగి విన్నాడు; అంటే, సాధకుడు వేదమార్గంలోని దశేంద్రియ నిగ్రహకారణమైన కర్మ కాండ సాధనతో జ్ఞానమార్గాన్ని భక్తితో ఎంతెంతో తెలిసికొని అవగాహనం చేసికొన్నాడని అంతరార్థం ఇందులో కన్పిస్తుంది.

'పితు ర్హి శుశ్రావ సఖిత్వ మాత్మనః'

అన్న పాదంలో పితుః = జగత్పితయైన, ఆత్మనః = పరమాత్మ యొక్క సఖిత్వం = మిత్రత్వంగూర్చి, జటాయుషా = వేదముచేత, పునః పునః = మాటిమాటికి కథాః = సంగతులను, శుశ్రావ = వినెను. అనే విధంగాకూడ అర్థం చెప్పకోవచ్చును. అప్పుడు వేదములోని కర్మభాగంలోకూడ ఆత్మజ్ఞానానికి స్థానం ఎట్లా ఎట్లావుందో ఆయా

కర్మరహస్యాలను సాధకుడు తెలిసికొన్నాడు; అన్న అంతరార్థాన్ని వాల్మీకి స్పష్టపరచినట్లు మనకు కన్పిస్తుంది. జటాయువుతో పంచవటిలోనే మైత్రి కల్గడం సాధకునకు ఇంద్రియ నిగ్రహానికి వేదం యొక్క తోడ్పాటు జరిగిందని అర్థం.

## శూర్పణఖ.

సీతారాములు పంచవటిలో గోదావరీతీరంలో విహరిస్తూవుండగా 'శూర్పణఖ' అక్కడికి వచ్చింది. అంటే, ఇంద్రియవ్యాపారాన్ని రెచ్చగొట్టే పంచేంద్రియ వ్యాపారంలో ప్రకృతిలో సాధకుడు నిశ్చల సాధనలో ఉన్నాడని అర్థం. అక్కడికి శూర్పణఖ వచ్చింది అంటే రాముని అనగా సాధకుని ఇంద్రియ నిశ్చలత్వ సాధనను చెడగొట్టే విఘ్నం ఎదురైంది అని అర్థం.

శ్లో॥ సుముఖం దుర్ముఖీ రామం కృశమధ్యం మహోదరీ
విశాలాక్షం విరూపాక్షీ సుకేశం తామ్ర మూర్ధజా
ప్రీతి రూపం విరూపా సా సుస్వరం భైరవస్వరా
తరుణం దారుణా వృద్ధా దక్షిణం వామ భాషిణీ
న్యాయవృత్తం సుదుర్వృత్తా ప్రియ మప్రియదర్శనా॥

'శూర్పణఖ' అంటే, (శూర్ప + నఖ) చేటలవంటి గోళ్ళు కలది' అని వాచ్యార్థం.

సుముఖుడు రాముడు; దుర్ముఖి శూర్పణఖ. సన్నని నడుము కలవాడు రాముడు. లంబోదరి శూర్పణఖ. విశాలములైన కన్నులు కలవాడు రాముడు; చిన్నవైన చికిలి కళ్ళుగలది శూర్పణఖ. చక్కని జుట్టుగలవాడు రాముడు; రాగి రంగుగల పీచువంటి జుట్టుగలది శూర్పణఖ. చూడ ముచ్చటైనవాడు రాముడు; భయంకర వికృతరూపంగలది శూర్పణఖ. మంచి యౌవనంలో నున్నవాడు రాముడు; అసహ్యంగా ఉండే ముసలి వాలకంకలది

శూర్పణఖ; సర్వ సమంగా చక్కగా మాట్లాడేవాడు రాముడు; స్వార్థంతో వక్రంగా మాట్లాడేది శూర్పణఖ. న్యాయప్రవర్తన గలవాడు రాముడు; చాల దుర్మార్గం గలది శూర్పణఖ. అటువంటి సర్వ గుణాభిరాముణ్ణి ఇటువంటి వికారవిరూపిణి శూర్పణఖ చూచింది.

అంటే, సాధకునిలోని పరాప్రకృతిని సాధకునిలోనిదేయైన అపరా కృతిప్ర వీక్షించిందన్నమాట. పరా, అపరాప్రకృతులు రెండూ సాధకునిలోనివే. రెండూ పరస్పర విరుద్ధ లక్షణాలతో నిత్యమూ ఒకదాన్ని మఱొకటి లోబరచుకోడానికి తీవ్రయత్నాలు సాగిస్తూనే వుంటాయి. ఇక్కడ వాల్మీకి రాముడి విశేషణాలకూ, శూర్పణఖ విశేషణాలకూ పరస్పర వైరుధ్యం చెప్పడంలోనే పరా అపరాప్రకృతుల విరుద్ధ వృత్తుల సంఘర్షణను ప్రదర్శించడం జరిగిందని అంతరార్థపరంగా గ్రహించాలి. రాముణ్ణి శూర్పణఖ చూచిందంటే, సాధకునిలోని పరాప్రకృతిని, అపరాప్రకృతి తన వశంచేసికోడానికి తలపడింది అన్నమాట. ఇంతవరకూ ఆవిధంగా అపరాప్రకృతి విజృంభింపక ఇప్పుడు విజృంభించి తలపడిందంటే, సాధకునిలోని ఐహిక ప్రకృతిని ఇంద్రియవ్యాపారాలు రెచ్చగొట్టే సమయం ఇప్పుడు లభించింది, అన్నమాట. పంచవటిలో గోదావరీతీరంలో సీతతో రాముడు విహరిస్తూండగా శూర్పణఖ చూచిందన్నదానికి పైని చెప్పినది అంతరార్థం.

'ఖ' అంటే ఇంద్రియము. 'న, ఖ' అంటే ఇంద్రియవ్యాపారం లేనిస్థితి అన్నమాట. అంటే ప్రశాంతస్థితి అని అర్థం. 'శూర్ప' అంటే చెఱిగివేసేది అని అర్థం ఈ వ్యుత్పత్త్యర్థంలో శూర్పణఖ (శూర్ప నఖ పదంలోని 'న' కారానికి 'రషాభ్యాం నో ణ స్సమానపదే' అనే సూత్రం వల్ల 'ణ' త్వం వచ్చింది) అంటే నిశ్చలమైన ఇంద్రియ ప్రవృత్తిని తూర్పారబట్టే అపరాప్రకృతియే శూర్పణఖ అని అర్థం చెప్పుకోవచ్చు.

ఈవిధంగా సాధకునిలోని పరా, అపరా ప్రకృతులకు సంఘర్షణ ప్రబలంగా రేగిందని శూర్పణఖ ప్రవేశం వల్ల తెలిసికోవచ్చు.

శూర్పణఖను చూచి రాముడు 'నీవెవతెవు?' అని అడుగుతాడు అప్పుడు శూర్పణఖ 'నాపేరు శూర్పణఖ' దండకారణ్యవాసులను భక్షిస్తూ తిరుగుతూంటాను. నా అన్న దశకంఠ రావణుడు. రాక్షసులకు రాజు. ఇంకో సోదరుడు 'కుంభకర్ణుడు'. ఎప్పుడూ నిద్రపోతూంటాడు. ఇంకో తమ్ముడు విభీషణుడు. రాక్షసగుణాలేవీ వాడికిలేవు. ఖర దూషణులనే ఇంకో ఇద్దరు సోదరులున్నారు నాకు. వారు జన స్థానంలో ఉంటారు తపస్వులను భక్షిస్తూ. నేను నిన్ను నావాణ్ణిగా చేసికొని నీతో భోగించి ఆనందించాలని వచ్చాను. అంటుంది.

'నేను శూర్పణఖను, దండకారణ్యవాసులను భక్షిస్తాను' అంటే సాధనతో శిక్షితమైన ఇంద్రియ నిశ్చల ప్రశాంత స్థితిని చెరిగి పారేసే ఒకానొక నీచ అపరాప్రవృత్తిని నేను అని అంతరార్థం. ఆపె అగ్రసోదరుడు దశకంఠ రావణుడు. అంటే పది ఇంద్రియాల నిత్య ఘోష. ఆ అపరావృత్తికి అది తోడు అన్నమాట. కుంభకర్ణుడు మఱొక సోదరుడు. (కుంభ + క + ఋణుడు) అంటే, యోగమార్గంలోని కుంభక ప్రాణాయామంతో . కొంత ముక్తిసుఖానుభవంపొందే మనో వృత్తి. ఆ అపరా ప్రవృత్తికి అది మరొకతోడు, (యోగంలో కుంభకాన్ని బ్రహ్మానందానుభవానికి కాక సిద్ధులకొఱకు అభ్యసించడం అనేది నీచ ప్రవృత్తిలోని ఒక భాగం అని తెలిసికోవాలి. ఆ నీచప్రవృత్తికి కుంభకర్ణుడని పేరు) విభీషణుడు ఒకసోదరుడు. వాడికి రాక్షస లక్షణాలు లేవు. వి + భీ + ఈషణుడు అనే వ్యుత్పత్త్యర్థంలో ఈషణత్రయ వివర్జితుడు అని అర్థం వస్తుంది. ఈషణత్రయం లేని కారణంచేత క్రూరకృత్యాలు చేయని సాత్త్వికవృత్తి విభీషణవృత్తి ఈవృత్తి పరాప్రవృత్తికి సంబంధించిందే. అయినా అపరాప్రకృతి యొక్క ప్రవృత్తిలోకూడ ఆదుర్వృత్తిని కొంత నిగ్రహంలో ఉంచడానికి ఇటువంటి కొన్ని సద్వృత్తులు ఆ అపరావృత్తితో కలిసి వుంటాయి. ఈవిధంగా అపరావృత్తితో సద్వృత్తికి సోదరసంబంధంవుంది. 'ఖరు' డంటే తీవ్రతగల ఇంద్రియప్రజ్వలన వృత్తి. 'దూషణుడు' అంటే

అన్నిటినీ దూషిస్తూ తన గొప్పతనం నిలుపుకోవాలనే ఒకరకం తామసికదురహంకారదువ్వృత్తి ఈరెండూ అపరావృత్తికి సహాయకారులు అనడమే శూర్పణఖకు సోదరులుగా చెప్పడంలోని అర్థం. 'జనస్థానంలో వుంటారు' జనస్థానం అంటే పునర్జన్మ కారణములైన వాసనాకేంద్రం అన్నమాట. పునః పునః జననం కల్గించే కర్మలు చేయడం అపరావృత్తికి సంబంధించింది. నిన్ను నాభర్తగా చేసికొనడానికి వచ్చేను' అంటే పరాప్రకృతిని నాశంచేసి దానిని అపరాప్రకృతిగా మార్చేందుకు వచ్చిన శూర్పణఖావృత్తి అన్నమాట. అపరాప్రకృతియొక్క యావల్లక్షణం, పై శూర్పణఖావాక్యాల్లో అంతరార్థపరంగా వివరింపబడిందిగా మనకు కన్పిస్తూంది. నీచవృత్తిలో కూడ కొంతవరకు సద్వృత్తులు మిశ్రితములై వుంటాయన్న ప్రకృతి రహస్యం ఇందు వెల్లడౌతూంది

కథ:— రాముడు లక్ష్మణుని వద్దకు శూర్పణఖను పంపుతాడు. లక్ష్మణుడు శూర్పణఖయొక్క ముక్కూ చెవులూ కోసివేస్తాడు.

సాధకుడు తనలోని జీవాత్మచేత అపరాప్రకృతిని నాశం చేయించాలి. జీవాత్మ వాసనాసంబంధం కలది కాన, దానిచేతనే దుష్టవాసనాభూయిష్టమైన అపరాప్రకృతిని నాశం చేయించడం జరగాలి. దానివల్ల జీవాత్మలో వాసనల ప్రాబల్యాన్ని నాశం చెయ్యడం జరుగుతుంది అని చెప్పడమే లక్ష్మణునివద్దకు శూర్పణఖను రాముడు పంపడంలోని అర్థం.

ముక్కూ చెవులూ ముఖానికి అందమిచ్చేవి. అవి కోసివేసినప్పుడు రూపం వికృతిని పొందుతుంది. ఆ రూపంతో ఎవరికంట బడడమూ ఇష్టం వుండదు. అపరావృత్తిలోని దుష్టాహంకారాన్ని తొలగించివేసి ఆ అహంకారం తిరిగి తలెత్తకుండా చెయ్యడానికి దాని రూపాన్ని వికృతం చెయ్యడమే అవసరం. కాని దానిని పూర్తిగా నాశం చెయ్యనక్కర్లేదు. జీవాత్మకు అది శక్యంకాదుకూడ. అదే

శూర్పణఖకు విరూపకరణంచేసి వదలివేయడంలోని అంతరార్థం. ముక్కు రెండు ద్వారములు కలది. చెవులు రెండు సంఖ్య కలవి. ఇవి తామసికరాజసిక ద్వంద్వాలుగా చెప్పవచ్చుకూడ. ఆరెండు గుణాలలోని ద్వంద్వాలను నాశంచేసాడన్నది ముక్కుచెవులు కోశాడన్నదాని అర్థంగాకూడ చెప్పవచ్చు.

## ఖరదూషణాదుల వధ.

### ఖరక్రోధం

శూర్పణఖ, ముక్కూ చెవులూ కోయబడ్డంతో సోదరుడైన ఖరుడి దగ్గరకువచ్చి తనపరాభవంగూర్చిచెప్పుకొని యేడ్చింది. అదివిని ఖరుడు మండిపడిపోయేడు. అతనివద్ద చతుర్దశ సేనాపతుల అధీనంక్రింద చతుర్దశ సహస్ర సంఖ్యగల రాక్షససేనవుంది. సేనాపతుల్ని పిలిచి వారివారి సేనలతో విజృంభించి సీతా రామ లక్ష్మణుల వెచ్చని రక్తంతో శూర్పణఖకు దాహం తీర్చాలని ఆదేశించాడు వారు వెళ్ళి యుద్ధం చేసారు. చివరకు రామలక్ష్మణులచేత అందరూ నాశనమయ్యారు.

'శూర్పణఖ' అంటే ఇంద్రియ నిశ్చలతను చెరిగివేసే దుష్టశక్తి. 'ఖరుడు, అంటే, ఖ = ఇంద్రియము, ర = అగ్ని కాన అగ్నివంటి ఇంద్రియవ్యామోహం అన్నమాట. శూర్పణఖ పరాభవాన్ని విని ఖరుడు మండిపడ్డాడు అంటే ఇంద్రియనిశ్చలతను చెరిగివేసేశక్తి వ్యర్థమైపోవడంతో సాధకునిలోని అపరాశక్తి ఇంద్రియాగ్నిని ఉద్రేకింపజేసిందన్నది దాని అంతరార్థం. కర్మేంద్రియాలు అయిదు, జ్ఞానేంద్రియాలు అయిదు, అంతఃకరణ చతుష్టయం నాలుగు. మొత్తం పద్నాలుగు ఇంద్రియాలు. ఇవే ఖరుని పదునాల్గురు సేనాపతులు. ఒక్కొక్కరి అధీనం క్రింద వెయ్యేసిమంది సైనికులున్నారు అంటే సాధకునిలోని ఒక్కొక్క ఇంద్రియం అనేక విధములైన వృత్తులు కల్గి వుందన్నమాట. అవిఅన్నీ ఉద్రేకించడమే ఇక్కడ ఖరుడు మండిపోయి సేనానులకు ఆదేశించాడన్నదాని అర్థం. చివరకు ఖరుని సేనల్ని రామునిచేత నాశంచేసి

వేయబడ్డాయి అంటే సాధకునిలోని ఆనందాంశచేత ఆ 14 వేల ఇంద్రియ ప్రవృత్తులు నాశనం చేసివేయబడ్డాయన్నమాట.

కథ :— తరువాత ఖరుడే యుద్ధానికి బయలుదేరాడు. ఇక్కడ వాల్మీకి ఖర సన్నాహాన్ని 21, 22, 23 మొత్తం మూడు సర్గలలో, ఖర సంధుక్షణం, ఖర సన్నాహం, ఖర ప్రస్థానంలో ఉత్పాత దర్శనం అనే విషయాలు సవివరంగా వర్ణించేడు. ఈ వివరణ చూస్తే రాముని మీద ఖరయుద్ధం అంటే సాధకునిమీద ఇంద్రియాగ్ని ప్రజ్వలనం ఎంతగా సాగుతుందో ఊహించుకోవచ్చు.

రాముడు లక్ష్మణునితో ఖర సన్నాహాన్ని గూర్చి చెప్పి గుహలో నీవు చేతిలో బాణం పెట్టుకొని ధనుర్ధరుడవై కాచుకొని వుండుమంటాడు.

> తస్మా ద్గృహీత్వా వైదేహీం
> శరపాణి ర్ధనుర్ధరః
> గుహా మాశ్రయ శైలస్య
> దుర్గాం పాదప సంహితాం॥

ఖర సన్నాహం కారణంగా వైదేహిని తీసుకొనివెళ్ళి చెట్ల చాటున వున్న పర్వత గుహలో నీవు బాణం సిద్ధంగా చేతిలో పెట్టుకొని ధనుర్ధరుడవై కాచుకొని వుండు; అంటాడు లక్ష్మణునితో రాముడు.

'గుహ' అంటే హృదయ కుహరం. 'గు' అన్నదానికి అంధ కారం అని అర్థం. 'హ' అంటే నాశనం చెయ్యడం అని అర్థం. ఈ వ్యుత్పత్త్యర్థంలో గుహ అంటే, అంధకారాన్ని అంటే అజ్ఞానాన్ని నాశం చేసే జ్ఞానవృత్తి అని అంతరార్థం. ఈజ్ఞానం దేహంలోని హృదయాంతరాళంలోనుండి ఉద్బుద్ధమౌతుంది అన్నదికూడ 'గుహ' పదం వల్ల తెలిసికోవాలి. వైదేహిని అంటే, విదేహ మనోవృత్తిని, అంటే ఈ దేహం ఆత్మ కాదు అనే జ్ఞాన భావనను పొంది వుండుట వైదేహీవృత్తి అవుతుంది. ఆవృత్తిని జ్ఞానావరణంలో ఉంచి రక్షించాలని జీవుని సాధకుడు ప్రబోధించడమే రాముడు లక్ష్మణుని సీతను పర్వతగుహలో నుంచి కాచుకొని వుండవలసిందని ఆదేశించడంలోని అర్థం. ఖరుడు

తీవ్రస్థాయిలో వస్తున్నాడు అంటే, ఇంద్రియాగ్ని పెద్దగా చెలరేగుతూంది అన్నమాట. ఇప్పుడు దానికి ఎఱకాకుండా వుండాలంటే, సాధకుడు తన ప్రకృతిలో-దేహాత్మ భావం లేకుండా ఈ దేహం తానుకాదు. దేహం లేని స్థితియే తనది, అనే జ్ఞానాన్ని ఆశ్రయించి జీవాత్మచేత జాగ్రత్త తీసుకోడం చేయించాలి, దేహాత్మ భావం ఉన్నప్పుడే ఇంద్రియ ప్రజ్వలనంవల్ల ముప్పు వస్తుంది. దేహాత్మభావం లేనప్పుడు (వైదేహీ స్థితి సాధకునిలో సురక్షితంగా ఉన్నప్పుడు) ఇంధనము లేకపోతే తనంతట తానుగా అగ్ని ఆరిపోయినట్లు ఇంద్రియవ్యాపారానికి సాధకునిలోని ప్రకృతియొక్క తోడ్పాటు లేకపోతే ఆ ఇంద్రియ వ్యాపారం దానంతట అదే అణగిపోతుందన్న రహస్యం పైశ్లోకంలో అంతరార్ధపరంగా వ్యక్తమౌతుంది.

కథ :— తర్వాత దూషణుడు అనే రాక్షసుడు రాముణ్ణి హతశేషమైన సేనను సమాయత్తపఱచికొనివచ్చి ఎదిరిస్తాడు. రాముడు ససైన్యంగా దూషణుణ్ణికూడ హతమారుస్తాడు.

దూషణుడు అంటే, దురహంకారం తాలూకు దుర్వృత్తి అని చెప్పికొనివున్నాం. ఇంద్రియాలు పద్నాలుగింటిలో ఇది చివరిదీ, బలమైనదీ, అన్ని ఇంద్రియ వ్యాపారాలకీ కారణభూతమైనది ఈదురహంకార తామసిక దుర్వృత్తియే. సాధకునిలోని జ్ఞానానందస్వరూపతత్త్వం ఈ దురహంకారాన్ని పటాపంచలు చేస్తుంది అన్నదే రాముడు దూషణుణ్ణి ససైన్యంగా హతమార్చేడు అన్నదానికి అర్థం.

కథ :— తరువాత త్రిశిరుడు వచ్చి ఎదుర్కొని రామునిచేత నిహతుడౌతాడు.

'త్రిశిరుడు' అంటే, మూడు తలలుగల రాక్షసుడు. మూడు తలలు అంటే త్రిపుటీ అని చెప్పాలి. త్రిపుటిఅంటే భేదబుద్ధిఅన్నమాట.

* త్రిపుటి అనగా మూడు భేదావస్థలను తెల్పే ఏకాకారం. ధ్యానం, ధ్యేయం, ధ్యేయం, ధ్యాత త్రిపుటి ఇల్లే కార్యం, కరణం, కర్త ఈ విధంగా భేదంగా కల్పించే మూడూ ఒకటే. అవి తెలిసికోవడమే త్రిశిర వధయొక్క సాధనా విశేషంగా తెలిసికోవాలి.

అది దూషణుని చంపిన తర్వాత రాముని చేతిలో అంటే అహం కారాన్ని నాశంచేసిన సాధకునిచేతిలో నశించింది. అహంకారం ఎప్పుడు లేదో అప్పుడు భేదబుద్ధికి చోటు లేనేలేదు అన్నది త్రిశిరవధలోని అంతరార్థం. ఈవిధంగా జనస్థాన రాక్షసులంతా రామునిచేత చంప బడ్డారు అంటే సాధకునిచేత ఈవిధంగా పునర్జనన కారణవాసనలు నశింపుచెయ్యబడతాయన్నమాట.

## రావణునకు అకంపనుని ప్రబోధము.

అకంపనుడనే హతశేషుడైన రాక్షసుడు ఒకడు జనస్థానంనుండి వచ్చి రావణుడికి ఖరదూషణాదుల వధ గూర్చి చెప్పి ఇట్లాఅన్నాడు.

శ్లో॥ న తం వధ్య మహం మన్యే సర్వైర్దే వాసురై రపి
అయం తస్య వధోపాయః తం మ మైకమనా శ్శృణు
త స్యాపహర భార్యాం త్వం ప్రమథ్య తు మహావనే
న, తయా రహితః కామీ రామో హాస్యతి జీవితం॥

"దేవతలు, రాక్షసులు అంతా కలిసి ఎత్తివచ్చినా, రాముణ్ణి చంపలేరు" అని నా కనిపిస్తోంది. అతణ్ణి చంపాలంటే ఒకటే ఒక ఉపాయముంది' నామాటమీద మనస్సుంచి విను. ఆ మహారణ్యంలో నీవు మోసంచేసి అతని భార్యను అపహరించుకొనిరా, ఆమెని ఆపెను విడిచి అతడు బ్రతుకలేడు. వెంటనే ప్రాణాలు విడుస్తాడు." అని బోధించాడు అకంపనుడు రావణునికి.

అకంపనుడు అంటే, అ + న కంపనుడు = అకంపనుడు; అ = విష్ణువునుండి (సర్వవ్యాపకమైన భగవంతునినుండి) కంపనుడు = (సాధకుని) కదలింపువాడు. అనగా సాధకునిలోని భగవత్పరమైన బుద్ధిని చలింపజేయు ఒక నీచవృత్తి అకంపనుడు. ఆ అకంపన నీచ వృత్తి రావణుణ్ణి (దశేంద్రియకేంద్రాన్ని), "సాధకుని సాధనను భ్రష్టం చెయ్యడం అనే పని ఏ ఇంద్రియానికీ, ప్రత్యక్షంగా శక్యం

కాదని, అతనినాశ్రయించివున్న భూసంబంధమైన ప్రకృతిని మోసగించి అపహరిస్తే అతడు ఆ వియోగాన్ని సహించలేక సాధననుండి భ్రష్టు డౌతాడు. కాన, ఆపనిని చెయ్యవలసింద" ని హెచ్చరించింది. ఆ హెచ్చరిక యే'అకంపనుడు రామవినాశానికి సీతాపహరణంఅవసరమని రావణునకు సలహా చెప్పేడు అన్నదానిలోని అంతరార్ధంగా భావించాలి.

తర్వాత శూర్పణఖ రావణునివద్దకు వచ్చి రాముడివల్ల జరిగిన పరాభవం చెప్పి సీతాపహరణానికి మఱింత ప్రోత్సాహం కల్గించింది. రావణుడు దాన్ని ఆమోదించాడు.

అంటే ఇంద్రియ నిశ్చలతను చెఱిగివేసే వృత్తి సాధకుడిమీద పని చెయ్యలేక విరూపం పొందడాన్ని తెలిసికొని దశేంద్రియ కేంద్రం సాధకుని సాధనను భ్రష్టం చెయ్యడానికి అతనినుండి ప్రకృతిని వేరుచేయడంతప్ప వేఱే మార్గం లేదని అందుకు సిద్ధపడిందని పైదానికి అంతరార్ధం.

కథ :— రావణుడు వెంటనే తనపనికి మారీచాశ్రమానికి వెళ్ళి మారీచుణ్ణి సహాయం అర్థించేడు.

'మారీచుడు' అంటే, అపరాశక్తి తాలూకు మాయాప్రవృత్తి అని అర్థం. మరీచి అంటే, ఎండమావులు. జలం లేనిదే జలం ఉన్నట్లుగా కన్పింపజేసే ఎడారులలోని ఎండయొక్క తళతళలు. ఇది మాయకు సంకేతంగా చెప్పబడింది. 'మరీచి' పదం నుండి పుట్టినదే మారీచ పదం. కాన మాయా ప్రవృత్తి మారీచ పదానికి అర్థం. దశేంద్రియ కేంద్రం మాయా ప్రవృత్తి యొక్క సహాయం అపేక్షించిందని రావణుడు మారీచ సహాయం అర్థించేడన్నదాని అంతరార్ధం.

## పాఠకుల సందేహం నివారణ.

ఇక్కడ మనం ఒక సందేహాన్ని ఎదుర్కొని విమర్శించి రహస్యం గ్రహించాలి.

పరమాత్మ, జీవాత్మ, ప్రకృతి, మాయ త్రిపుటి ఇంద్రియాలు, త్రిగుణాలు, విషయాలు ఇనన్నీ సాధకునిలోనివేకదా! దశేంద్రియ వృత్తియొక్క కేంద్రం మాయతో మాట్లాడడ మేమిటి? సాధకునిలోని ప్రకృతిని దాని సహాయంతో సాధకునకు తెలియకుండా దూరం వెయ్యడ మేమిటి? జీవాత్మ, పరమాత్మలు ప్రకృతిని విడిచి వుండడ మేమిటి? ఇవన్నీ ఒకేచోట ఒకనికే సంబంధించి ఒకనిలోనే వున్నప్పుడు ఒకదానిసంగతి ఒకదానికి తెలియకపోవడమేమిటి? ఒకదానితో ఒకటి వైరం, అపైని దాన్ని మోసంతో తెలియకుండా సాధించుకోవడం ఏమిటి? అసలు ఉన్నది సత్యపదార్థం ఒక్కటే అయితే, మఱి దాని చుట్టూ ఇన్ని రూపాలేమిటి? ఒక్కటే ఇన్ని రూపాలుగా, ఇన్ని కార్యాలు పరస్పర విరుద్ధంగా ఆచరించడమేమిటి? కొన్ని పనులు సాధకునికి సాయపడేవి, కొన్ని సాధకుణ్ణి భ్రష్టుణ్ణి చేసేవిగా ఒకే సాదకునిలో ఉండడమేమిటి? సాధకుడు ఒకసారి మాయను ఛేదించి బైట పడితే, మఱొకసారి తిరిగి మాయ ఆవరించడం ఏమిటి? ఒకసారి నశించినది తిరిగియెట్లా బ్రతికి వస్తుంది? ఒకసారి సాధకునిలో నశించిన మాయ తిరిగి తిరిగి వస్తూబాధించడం ఏమిటి? అట్లాగే అపరాప్రకృతియొక్క ప్రకృతులు సాధకునిలో నశించి మళ్ళీ రావడమేమిటి! ఇదంతా అర్థంకాని గందర గోళంగా కన్పిస్తోంది. ఈవిధంగా అనేక ప్రశ్నలు, సందేహాలు పాఠకులకు తోచడంసహజం. ఈ రకం అపోహాలు మొదటినుండీ ఈ అంతరార్థ రచన చదవడం పాఠకులకు తోచేవే. ఈ అపోహాల్ని ఎక్కడో ఒకచోట నివారించడానికి ప్రయత్నం చెయ్యా లనుకుంటూనే వున్నాను. ఇక్కడ రామరావణ వైరానికి అంకురార్పణం జరిగింది. కాన ఇక్కడే ఈ సందేహాల్ని విస్తృతంచేసి చెప్పడం వాటిని నివారణ చెయ్యడం అత్యవసరంగా భావిస్తున్నాను.

ఒక్కసారి మనం మన అంతరంగంలో నిత్యమూ జరుగుతూన్న భావ సంఘర్షణమూ దాని అనుకూల వ్యతిరేక వాతావరణాలూ, అవి

తిరిగి తిరిగి తలెత్తడాలూ, వాని ఫలితాలూ ఇవన్నీ సాక్షిమాత్రంగా చూచి పరిశీలిస్తే పైవిషయాల్ని అన్నిటిని గూర్చిన అపోహలూ తొలగిపోతాయి.

మనలో ఉన్నత పథానికి (జననమరణ రాహిత్యమైన ముక్తి మార్గానికి) తీసికొనివెళ్ళే 'పరా' ప్రకృతి (ఉచ్చైః (ప్రకృతి) ఒకటీ, జనన మరణాల పరిభ్రమణంలో తిరుగజేసే 'అపరా' ప్రకృతి నీచైః ప్రకృతి) ఒకటీ, రెండూ కూడ ఉన్నాయన్న సంగతి మనం ముందు బోధ పఱచుకోవాలి. పరస్పర విరుద్ధాలైన ఈ రెండు ప్రవృత్తులూ మనలో చోటు చేసికొని, ఒకదానితో ఒకటి యుద్ధం చేస్తూంటూనే వున్నాయి. ఉన్నత ప్రకృతిని సాధించడానికి ఉపయోగించేది సత్త్వ గుణం. నీచప్రకృతికి సాయపడేది తమోగుణం. రజోగుణానికి ప్రత్యేక లక్షణం అంటూ ఒకటి లేదు. ఇటు తమోగుణంతోనూ, అటు సత్త్వ గుణంతోనూ కూడా కూడి వానికి అహంకృతిని కల్పిస్తూవుంటూంటుంది సత్త్వ తమోగుణాలు రెండింటికీ కూడా ఇంద్రియ వృత్తుల పరివారం ఎంతో వుంది. అనేక రకాల మనోవృత్తులు ఈ రెండు తెగలకూ సంబంధించినవి మనలో ఎన్నో తమలో తాము సంఘర్షణ పడుతూ వున్నాయి. ఎంతో నిగ్రహంతో ఈ వృత్తుల సంక్షోభాలకి రెంటికీ అతీతంగా ఉండే మనస్సాక్షితో పరిశీలించుకుంటూ, ఉన్నత మార్గాన్ని సాధించడానికై సాధకుడు పతనం కాకుండా ఉండేటట్లు కనిపెట్టు కుంటూ వుండాలి. ఇటు పతనానికి దారితీసే దుష్టశక్తులను నివారించు కుంటూ, అటు ఉన్నత స్థితిని సాధించడానికి ఆరోహణాసోపానాలు నిర్మించుకుంటూ, సాధకుడు కనుగలిగి జీవితమంతా తీవ్ర సాధనతో గడపాలి.

"యాంతే మతి స్సా గతిః"

అంటే, మరణకాలంలో ఏ భావం నిలబడితే ఆ భావాన్ని అనుభవించడానికి తగ్గ జన్మ సిద్ధమౌతుందన్నది దాని అర్థం.

ఏభావమూలేని నిశ్చల మనోవృత్తిని మరణకాలంలో నిలబెట్టేటట్లయితే జన్మయొక్క అవసరం వుండదు కాన, జననం నుండి ముక్తి లభిస్తుంది. 'ముక్తి' అంటే పునర్జననవాసన మనల్ని విడిచిపెట్టడమే, అట్లా అంత్యకాలంలో నిశ్చలత నిలవడానికి జీవితమంతా మనోనిశ్చలతను సాగించడం అభ్యసించాలి. ఇదే ముక్తి రహస్యం.

స్వార్థపరత్వంతో అధమమార్గ ప్రవృత్తి ఆవిర్భవిస్తుంది. దానితో తమోగుణంలో ప్రవర్తించడం, జనన మరణ పరిభ్రమణంలో పడడం జరుగుతుంది. ఎన్నివేల జన్మలకో తమోవృత్తి సత్త్వవృత్తిగా మారడం, ఆ సత్త్వవృత్తి నిశ్చలవృత్తిగామారి ముక్తస్థితికి రావడం జరుగుతుంది. ఎప్పటికో ఒకప్పటికి ప్రతిజీవి ముక్తుడు కాకతప్పదు. ఇది పరిణామ సిద్ధాంతంమీద ఆధారపడిన నిజం. సాధకుని సాధనా ప్రయత్నంవల్ల ఈమార్గం సుగమమై దగ్గఱ అవుతుంది. తీవ్రసాధకుడు ఒకే జన్మలోనే ముక్తిని పొందుతాడు. సంఘర్షణలతో గూడిన ఈ సాధనా ప్రయత్నమే రామాయణం రామరావణయుద్ధంగా చెప్పబడింది. అంతరార్థంతో దాన్ని ప్రత్యక్షంచేసి తెలుసుకోవాలి. ఆత్మానందాంశయైన రాముడు, జీవాంశయైన లక్ష్మణుడు, భూమ్యంశయై ప్రకృతియైన సీత, దశేంద్రియ తామస వృత్తులకు కేంద్రమైన రావణుడు, ఆ వృత్తికి తోడ్పడే మాయయైన మారీచుడు ఒకే మనుష్యుడిలోని విభిన్న తత్త్వాలుగల విభిన్న వృత్తులు. (వ్యాపారాలు)

ఆత్మానందాంశతో జీవుడూ, జీవునిలో వాసనాప్రకృతీ, ఆ వాసనా ప్రకృతితో మాయ, ఆ మాయతో ఇంద్రియ వ్యాపారమూ, అనుసంధింపబడుతూ వున్న ఒకే కూటమిగా గ్రహించాలి. ఇందులో చిట్టచివరిది ఇంద్రియవృత్తి. మొట్టమొదటిది ఆనందరూప పరమాత్మ. నిజానికి ఆ పరమాత్మయొక్క లీలలే మిగిలినవన్నీకూడ, ఇంద్రియ వృత్తినుండి మాయను తప్పించి, మాయనుండి వాసనాప్రకృతిని తప్పించి, వాసనా ప్రకృతినుండి జీవుని తప్పించి, చూస్తే చివరకు ఆనందరూప పరమాత్మ మిగిలి మనకు సాక్షాత్కరిస్తుంది. ఈవిధంగా

ప్రకృతిని పరమాత్మలో కలిపి చూడడమే (ప్రకృతి పురుషుల ఐక్యాను సంధానమే) ముక్తి సాధన. ఈ సాధనలో 'పరా' ప్రకృతికి సంబంధించిన వృత్తులు పైకి, అపరాప్రకృతికి సంబంధించిన వృత్తులు క్రిందకి సాధకుణ్ణి ఆకర్షిస్తూ క్షోభ పెడుతూ వుంటాయి. ఈ సంఘర్షణను సాక్షిమాత్రంగా చూడగల సాధకుడు గమ్యాన్ని సులువుగా చేరుకోంటాడు.

సత్వవృత్తులూ, తమోవృత్తులూ అన్నీ చివరకు అనందరూప పరమాత్మతో ఐక్యపడడానికే ఇష్టపడతాయి. కాని మధ్యలోమాత్రం ఒకదానిని ఒకటి చంపుకోవడానికి తలపడుతూ వుంటాయి. ఈ సంఘర్షణ పూర్వజన్మకర్మవాసనాప్రాబల్యాన్నిబట్టి హెచ్చు తగ్గులుగా ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధంగా వుంటూంటుంది. వాసనా బద్ధంగా కర్మలు జరగడం నిజమే అయినా, సాధనవల్ల వాసనలు బలహీనపడి మార్గం సుగమమౌతూ, జన్మపరంపర తగ్గుతూ, గమ్యస్థానం దగ్గఱపడుతూ వుంటుందన్నదికూడ నిజమైన విషయమే.

ఇక్కడ మారీచుడు రావణుడు, రాక్షసులందఱూ కూడా రాముని చేతిలో నశించి అతనిలో కలిసిపోవడమే (ఆత్మైక్యం పొందడమే) చివరకు జరిగింది. మధ్యలో సంఘర్షణ సాగుతూనే ఆ ఐక్యానుసంధానం జరిగింది. ఈ సంఘర్షణను సక్రమంగా నడిపించుకోవడమే సాధనా ప్రయత్నం అంటే.

మన నిత్యానుభవంలోంచి చూద్దాం. మనం ఒక పనిని సమర్థించాలనుకుంటూనే అంతలోనే మారిపోయి తద్విరుద్ధమైన పనిని సమర్థిస్తూ వుంటాము. ఒకసారి మంచిని సమర్థిస్తూ మఱొకసారి తద్విరుద్ధంగా చెడ్డను సమర్థిస్తాము. అన్యోన్యం విరుద్ధములైన మనోవృత్తులతో, జీవితం నడుస్తూండడం తప్పనిసరౌతూంటుందికూడ. ఒక్కొక్కప్పుడు మనోవృత్తులు క్షణక్షణం మారిపోతూంటాయి. ఇదంతా సాక్షిమాత్రంగా ఉన్నప్పుడే మనం చూడగల్గుతాం అదే

మనలోని పరా అపరా ప్రకృతుల పరస్పరయుద్ధం. రామాయణంలోని పాత్రలతో కథగా పరోక్షం చెయ్యబడింది.

అధి + ఆత్మ - అధ్యాత్మ అవుతుంది. ఆత్మయందు జరిగేది అని అర్థం. ఈవిధమైన ఆధ్యాత్మిక మార్గాన్ని పరిశోధించుకుంటూ, జీవితం ఉన్నత మార్గంలో నడుచుకుంటూ చేసే ప్రయత్నమే సాధనా సరణి అంటే. ఈ ఆధ్యాత్మిక సరణిని అర్థంచేసికుంటే,మనకు అపోహాలు ఉండవు. ఈ సంగతులను అనుభవంలోనుండి పరిశీలించవలసిందిగా పదేపదే పాఠకులకు విజ్ఞప్తి చేస్తున్నాను. వట్టిమాటల విమర్శతో ఇది తేలేదికాదు.

## మారీచోపదేశం.

కథ :— మారీచుడు రావణునితో సీతాపహరణ ప్రయత్నం లాభం లేదని చెప్తూ

శ్లో॥ న రామః కర్కశ స్తాత నావిద్వాన్ నా జితేంద్రియః
అన్నతం దుష్కృతం చైవ నచత్వం వక్తు మర్హసి
రామో విగ్రహవాన్ ధర్మః సాధు స్సత్యపరాక్రమః
కథం త్వం తస్య వైదేహీం రక్షితాం స్వేన తేజసా
ఇచ్ఛసి ప్రసభం హర్తుం ప్రభా మివ వివస్వతః
రామాగ్నిం సహసా దీప్తం న ప్రవేష్టుం త్వ మర్హసి

నాయనా! రావణా! రాముడు కఠినాత్ముడుకాడు. అవిద్వాంసుడు కాడు. అజితేంద్రియుడూ కాడు. అనృతంగాని, దుష్కృతంకాని ఈ విషయంలో చెప్పడం పనికిరాదు, అతడు తన తేజస్సుతో రక్షించుకొంటూన్న వైదేహిని నువ్వు ఎట్లాగు అపహరిస్తావు? అతడు ధర్మస్వరూపుడు. సాధువు సత్యపరాక్రముడు. నీవు సూర్యుని నుండి కాంతిని వలె అతని భార్యను బలాత్కారంగా అపహరించడానికి కోరుతున్నావు రాముడనే అగ్నిలో నీవు తొందరపడి ప్రవేశించవద్దు.

రాముడు అగ్నిహోత్రంవంటివాడు. అందులో పడితే నీవు నాశమౌతావు. సూర్యుణ్ణుండి కాంతిని ఎట్లా లాగివేయలేమో! రాముణ్ణుండి అతను రక్షిస్తూన్న వైదేహిని నీవు వేరు చెయ్యలేవు అనడానికి వాల్మీకి మారీచుని చేత చెప్పించిన కారణాలు ఏమిటంటే, 1 రాముడు కఠినాత్ముడు కాడు; 2 అవిద్వాంసుడు కాడు; 3 అజ్ఞాని కాడు; 4 ఇంద్రియనిగ్రహం లేనివాడు కాడు; 5 ధర్మస్వరూపుడు; 6 సాధువు; 7 సత్యపరాక్రముడు అన్నాడు అంటే, "కఠినాత్ముణ్ణి, అజ్ఞానిని, ఇంద్రియజయంలేనివానిని, అధర్ముణ్ణి, అసాధువును, సత్య పరాక్రముడు కాని వానిని మాత్రమే రావణుడు మోసం చెయ్యగలడు." అన్నది మారీచుని మాటలలో ద్యోతకమౌతుంది మనకు.

రావణాది రాక్షసులు అనేక వేలమంది తపస్సు చేసికొనేవారిని నిత్యమూ హింసిస్తూన్నారుకదా! అయితే ఆ తపస్వులు అంతా కఠినాత్ములూ, అజ్ఞానులూ, ఇంద్రియజయంలేనివారూ, అధర్ములూ, అసాధువులూ, అసత్యపరాక్రములూ అయినవారే కావాలి. అవును తపస్సు చేసేవారంతా మృదుచిత్తులు కాకపోవచ్చు. జ్ఞానులూ కాకపోవచ్చు. ఇంద్రియనిగ్రహం కలవారూ కాకపోవచ్చు. సాధువులూ కాకపోవచ్చు. కర్మమార్గంలోను యోగమార్గంలోనూ తపస్సును పైగుణాలతో సంబంధం లేనివారూ చేయవచ్చు. అప్పుడే రాక్షసులు వారిని బాధించగలరన్నమాట. రాక్షసులు జ్ఞానమార్గంలోఉన్న మృదుచిత్తుల్ని, జ్ఞానుల్ని, సాధువుల్ని, జితేంద్రియుల్ని బాధించనే లేరన్న మాట. రాక్షసులంటే, తామసిక రాజసిక వృత్తులు. అవి జ్ఞానుల్ని బాధించలేవు. జ్ఞానం ఉన్నచోట అవి ఉండనే వుండలేవుగదా! స్వార్థంతో తపస్సు చేసేవారు జ్ఞానులుకారు. ముక్తిమార్గంలో తపస్సు చేసే జ్ఞానుల్ని రాక్షసులు ఏమీ బాధించలేరు. పై మారీచవచనం వల్ల రావణపాత్రను వాల్మీకి పట్టి దుర్మార్గుణ్ణిగాకాక, అంతరార్థ పరంగా దశేంద్రియ వృత్తికి కేంద్రంగా మాత్రమే సృష్టించదలచినట్లు

తోస్తూంది. రాముడు అగ్నివలె రావణుణ్ణి కాల్చివేయడానికిగల సామర్థ్యం ఆతనికి రావడానికి ఆతనిలోనున్న మృదుచిత్తత, జ్ఞానమూ ఇంద్రియ నిగ్రహమూ, సాధుత్వమూ, సత్యపరాక్రమమూ, ధర్మ స్వరూపమూ కారణములన్నమాట. ఇట్టి గుణాలున్నవారి వద్ద దుర్మార్గుల దుర్మార్గం పనిచేయదు. తపస్సు జ్ఞానమార్గంలో సాగి నప్పుడే జ్ఞానంతో ఇంద్రియనిగ్రహాదు లుంటాయి. ఇంద్రియ నిగ్రహాది గుణాలు లేనిదే జ్ఞానమార్గంకాదు. జ్ఞానమార్గసాధన ఎప్పుడూ భ్రష్టంకాదు. కర్మయోగమార్గాలతో తపస్సుచేసి స్వార్థాలను పూరించు కొంటారు. ఇంద్రియ నిగ్రహం సాధుత్వం వగైరా జ్ఞాన సంబంధం లేకుండాకూడ కర్మయోగమార్గాలలో తపస్సాధన నడిపించవచ్చు. స్వార్థంతో రావణుడూ హిరణ్యకశిపుడూ మొదలైనవారు తపస్సుచేసి దేవతలను మెప్పించారు. అట్టివారి సాధన భ్రష్టం కావడానికి తప్పక అవకాశం ఉంది. వారి తపస్సు ముక్తికి కాదు రామునిది ముక్తిసాధన. జ్ఞానమార్గంతో ముక్తిసాధన జరగాలి. జ్ఞానమార్గంతో ముక్తిసాధన నాశనం కాదు. కాన రావణుడు అతనిని సమీపిస్తే అగ్నిలోపడిన శలభంగా నశిస్తాడు. మారీచుడు చెప్పిన మాటల్లో నున్న జ్ఞానమార్గసారాంశము ఇదే.

## బంగారులేడి — సీతాపహరణం.

కథ :— మారీచునిబోధ రావణుడు వినలేదు. ఆతణ్ణి బలవంతంచేసి తనకు సాయపడడానికి ఒప్పించాడు రావణుడు. మారీచుడు, బంగారులేడి రూపం ధరించి సీతకు భ్రమనుకల్గిస్తాడు. సీత రాముణ్ణి ఆ లేడిని పట్టుకొని తెమ్మంటుంది లక్ష్మణుడు 'అది మాయలేడి' అని చెప్పినా, రాముడు అత్రిమహాముని సీతకోరినకోర్కె తప్పక తీర్చవలసిందిగా ఆదిలోనే చెప్పినమాట గుర్తుంచుకొని లేడిని పట్టుకోడానికి తాను వెడతాడు. బంగారులేడి రాముణ్ణి దూరంగా తరలించుకుపోతుంది. రాముడికోసం లక్ష్మణుడు వెడతాడు. భిక్షు వేషంతో వచ్చి రావణుడు నిజరూపం చూపించగానే మూర్ఛపడిన

సీతను మెడక్రింద, కాళ్ళక్రింద తన చేతుల నానించి లేవనెత్తి రథం మీదికి తీసికొనిపోయి, తనఒడిలో పెట్టుకొని అపహరించుకు పోయేడు.

మారీచుడంటే మాయగా చెప్పుకున్నాం. సీత అంటే భూప్రకృతిగా చెప్పుకొన్నాం. ప్రకృతిని మాయ బాగా ఆవరించింది; అన్నదేక్షి లేడి సీతను ఆకర్షించిందన్నదానికి అర్థం. లక్ష్మణుడు మాయలేడిని గుర్తించాడంటే, విశుద్ధమైన జీవాత్మ మాయను గుర్తించ గలిగిందన్నమాట. 'అత్రి' అంటే, ఈషణత్రయరహితస్థితి అని చెప్పు కొని వున్నాం. ముక్తినిపొందేవాడు వానన అంటకుండా మనసులోని కోర్కెలు అసంగతత్త్వంతో తీర్చుకోవడం (Detached attachment) జరిపించాలి. అత్రి రామునకు సీతకోర్కెలను తీర్చవలసిందని చెప్పడం అంటే, ప్రకృతి చెప్పుచేతలలో నుంటూనే అసంగత్వమును పొందే సాధన చెయ్యవలసిందని హెచ్చరిక చెయ్యడమే. అదే ఇక్కడ రాముడు, లక్ష్మణుడు చెప్పినా వినక సీత మాటప్రకారం మాయలేడిని పట్టడానికి వెళ్ళడంలోని కారణం.

ప్రకృతి బలవంతపెట్టినప్పుడు, జీవాత్మ ప్రకృతి చెప్పిన ప్రకారం చెయ్యకపోతే తన నడక నడవదన్నదే సీత ఆజ్ఞప్రకారం లక్ష్మణుడు రాముని వెదకడానికి వెళ్ళడన్నదానిలోని అంతరార్థం. దశేంద్రియకేంద్రశక్తి సాధకునిలోని ప్రకృతిని సాధకునకు తెలియ కుండానే దూరంచేస్తుంది. ఇది సాధకునకు కలిగే చివరి విఘ్నం. సీతను భిక్షువేషంతో రావణుడు రామునినుండి విడదీసి అపహ రించడంలో అదే జరిగిందన్నమాట. మాయలేడికి భ్రమసిన సీత మాటచే రాముడు సీతకు దూరమైనప్పుడు మాత్రమే రావణుడు సీతను అపహరించగలిగేడు అంటే, పరమాత్మను దశేంద్రియవృత్తిచే భ్రమసిన ప్రకృతి దూరంచేసికొన్నప్పుడే దశేంద్రియకేంద్రం ఆ ప్రకృతిని అపహరించగల్గుతుందనీ పరమాత్మతో కూడినప్పుడు అది ప్రకృతినేమీ చేయలేదని అంతరార్థపరంగా గ్రహించాలి. రావణుని

నిజవేషంచూచి మూర్ఛపడిందిసీత అంటే, తామసిక దశేంద్రియశక్తి ఒక్కసారి విజృంభించి విఱుచుకుపడ్డంతో ప్రకృతి హఠాత్తుగా చలించిందన్నమాట. ఇంతవరకు ప్రకృతి ఆత్మానందసాన్నిధ్యంలో (సాధకునివశంలో) హాయిగా నిశ్చలస్థితిలో వుంది. సాధకుడు దశేంద్రియ తామసవృత్తులను సాత్త్వికవృత్తిలోనికి మార్చి ఆ సాత్త్వికవృత్తిని నిశ్చలస్థితిలోనికి మార్చి ప్రకృతిని వశమందుంచుకొని ఆనందింపజేస్తున్నాడు అన్నది దశరథపుత్రుడై కౌశల్యానంద వర్ధనుడైన రాముడు అరణ్యావానంచేసి సీతతో గోదావరీ తీరంలో హాయిగా విహరిస్తున్నాడు అన్నదానికి అంతరార్థం.

ఈవిధంగా సాత్త్వికగుణం సాధించిన నిశ్చలతతోనున్న ప్రకృతికి తామసిక దశేంద్రియకేంద్రవృత్తులను ఒక్కసారి హఠాత్తుగా చూచేటప్పటికి చలించి పడిపోవడం సహజమే అని గ్రహించాల్సివుంది

రావణుడు సీతను స్పృశిస్తే ఆమె పాతివ్రత్యప్రభావంవల్ల దగ్ధమైపోతాడు కనుక ఆమె మూర్ఛపడివుండగానే ఆమెను తన చేతితో తాకకుండా ఆమె పడివున్నభూమిని గడ్డగా పెకల్చి ఆగడ్డను రథంమీద పెట్టేడని, కొన్ని రామాయణాల్లో కవులు కల్పించివ్రాశారు. వాల్మీకిమాత్రం స్పష్టంగా సీత మెడను ఒక చేతితోను, రెండుకాళ్ళు ఒకచేతితోను రావణుడు ఎత్తిపట్టుకొని రథంమీద తనఒడిలోనే పెట్టుకొని వెళ్ళేడని వ్రాసియున్నాడు. వాల్మీకి రచనలోనే అంతరార్థపరంగా సీత ప్రకృతి అనీ దశకంఠుడు దశేంద్రియప్రకృతి అని స్పష్టంగా ద్యోతకం కాగలదు. కేవల పాత్ర పోషణకోసమే అయితే వాల్మీకి కూడ సీత పాత్రకు పాతివ్రత్య మాహాత్మ్యాన్ని ముడిపెట్టియుండేవాడే వాల్మీకి రచనలో దోషం ఆపాదించుకొని కొందఱు కవులు ఇటీవల మార్పులు చేర్పులువేసి రామాయణంలోని అంతరార్థాన్ని తాము తెలియలేకపోవడమేకాక ఇతరులకు ద్యోతకం కాకుండాకూడచేశారు. వ్యాస వాల్మీకులవంటి బ్రహ్మవేత్తల రచనలకు దోషం ఆపాదించి

మార్చే శక్తి తాము పొందలేమని వారు అనుకోలేకపోయారు. "వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షా ద్రామాయణాత్మనా" అని రామాయణం సాక్షాత్తు వేదమే అని చెప్పబడివుంది. తప్పైపట్టి వేదాన్ని మార్చడానికి ఎవరికి అధికారం వుంది?

## అశోకవనం.

రావణుడు సీతను లంకలోని అశోకవనంలో ఉంచాడు.

'అశోక' అంటే, 'అ + శ + ఉక' అని విడదీయాలి. 'ఉ' అంటే ఐహిక ప్రకృతి 'ఉ' అనేదానిపైని స్వార్థమందు 'క' ప్రత్యయం చేస్తే 'ఉక' అవుతుంది. 'ఉక' అంటే ప్రకృతి అని అర్థం. 'అ' అంటే సర్వవ్యాపకుడైన విష్ణువు. 'శ' అంటే శయనించి వుండడం

అ = విష్ణువునందు, శ = శయనించి వుండునట్టి ఉక = ఐహిక అంటే, భగవంతునియందే ఉంచిన ఐహిక అని అర్థం. భగవద్భావనలో ఐహికప్రకృతిని చూచే మనోవృత్తి, అశోకపదానికి అర్థంగా చెప్పకోవచ్చు. అట్టి మనోవృత్తియందు సీతను (భూసంబంధమైన ప్రకృతిని) దశకంఠుడు అంటే దశేంద్రియకేంద్రము ఉంచింది అనగా దశేంద్రియప్రకృతి తాను సాధకుని నుండి సాధనావస్థలో అపహరించిన ప్రకృతిని తాను అనుభవింప శక్యం కానిదగుటచే తనలో దానిని ఇముడ్చుకొనలేక, దాని స్వభావము ప్రకారము భగవద్భావనలోనే ఉంచింది అని సీతను రావణుడు అశోకవనంలో ఉంచాడన్నదానికి అంతరార్థంగా చెప్పకోవాలి.

సాధకుడు ప్రకృతిని వశీకరించుకొని, ప్రకృతియొక్క కోరికలు తీరుస్తూ సాధన చేస్తూండగా ప్రకృతిని అతనిలోని దశేంద్రియ ప్రవృత్తి సాధకుని నుండి దూరం చేస్తుందని, అప్పుడు ప్రకృతి దశేంద్రియవృత్తిచే సాధకునినుండి దూరమైనా తాను సాధకుని యందే చేరివుండాలని తపిస్తూంటుందని పైదాని అర్థం.

## సీతా విరహం.

కథ :— రాముడు సీతను కోల్పోయినందుకు ఎంతగానో దుఃఖిస్తాడు. ఇంతింతగాని విరహవేదనను అనుభవిస్తాడు. తనజీవిత సర్వస్వాన్నే కోల్పోయినట్లు వ్యథ చెందుతాడు. ప్రకృతిని విడిచిన సాధన సాధనకాదు. అది దశేంద్రియవశమై తన్ను తప్పిపోయినప్పుడు సాధనలో లోపము గల్గినందుకు సాధకుడు వ్యథ చెందుతాడన్నది పైదానిఅర్థం. సాధకుడు తనవశమై తనవల్ల వుండడానికి ఇష్టపడి తనతో సుఖపడుతూన్న ప్రకృతితో తనకు విరహం కల్గినందుకు వ్యథ పడుతాడు. ఆ ప్రకృతి కోరిన కోరికలు తీరుస్తూ సర్వేంద్రియ నిశ్చల తతో వాసనలు అంటకుండా ప్రకృతితో సంచరించడం ముక్తిసాధనకు అత్యవసర సాధనగా భావిస్తూ పూర్ణయోగములో చిరకాలం సాధన సాగించిన సాధకునకు తెలియకుండానే ఒక్కసారిగా ఉభైత్తుగా అతని లోని దశేంద్రియ కేంద్రవృత్తి మోసంతో హరించి తనతో వేఱు చేయడంతో సాధకునకు ఇన్నాళ్ళూచేసిన సాధన వ్యర్థమైనందుకు వ్యథ కల్గడం సహజం. అంతేకాదు. ఆ వ్యథ ఇంతింతనరానిదిగా ఉండడం మఱీ సహజం. ఈ సాధనా విచ్ఛిత్తికి సాధకునికి జీవిత సర్వస్వం కోల్పోయినట్లుండడం అనేది భార్యావిరహబాధగా వాల్మీకి చేత వ్యంగ్య పద్ధతిలో చిత్రించబడింది.

ప్రకృతి దశేంద్రియవశమైనపుడు సాధకునకు దుఃఖాన్ని కల్గిస్తుంది. ఆత్మాకర్షితమైనపుడు సుఖాన్ని కల్గిస్తుంది. ఇన్నాళ్ళూ సాధకుడు ఇంద్రియాకర్షిత స్థితినుండి ఆత్మాకర్షిత స్థితిలో ఉంచాడు. ఇప్పుడు సాధకుని మోసగించి ఒక్కసారిగా దశేంద్రియాలు, ప్రకృతిని ఆకర్షించాయి. ఇది సాధనలోని ప్రముఖవిఘ్నం. అందుచేత సాధకుడు దుఃఖాన్ని పొందేడు. సీతా విరహానికి, రాముడు పడిన పరితాపానికి సంబంధించిన వాల్మీకి రచన నంతనూకూడ జాగ్రత్తగా అంతరార్థ పరంగా అన్వయించి పరిశీలిస్తే ప్రకృతి ఎంత శాంతి పొందించినా

దశేంద్రియాలు సాధకుని మోసగించడంతో కల్గిన విరహం సాధకున కెంత బాధకల్గిస్తుందో అంతరార్థపరంగా మనకు తోస్తుంది. సీత రాముని కోసం రాముడు సీతకోసం పలవరిస్తూ కలవరపడడం సాధకునిలోని జీవన్ముక్తి కాంక్షతో జతపడాలని ప్రకృతియు, ప్రకృతితో కలసి యుంటూనే ముక్తావస్థను పొందాలని సాధకుని మనోవృత్తియు కలవర పడుతూంటాయని గ్రహించాలి.

కథ :— మారీచుని చంపి తిరిగివచ్చిన రాముడు ఆశ్రమంలో సీతను కానక శోకిస్తాడు. మారీచపదం మాయనుచెప్పేదే. దాన్ని చంపడం అంటే మాయను నశింపుచెయ్యడం అని కాదు. మాయ సాధకుని మోసపుచ్చి తాను కన్పించకుండా పోయిందని అర్థం. మూలప్రకృతిని సాధకునకు కన్పించకుండా సాధకునిలోనే దశేంద్రియప్రాబల్యంతో దాచివేసి మాయ తాను కన్పించకుండా పోతుంది. అదే రావణుడు సీతను లంకలో దాచేడన్నదానికి మారీచుడు రామునిచేత చచ్చేడన్నదానికి అంతరార్థం.

శ్లో॥ స దీనో క్షీణయా వాచా లక్ష్మణం వాక్య మబ్రవీత్
అపి గోదావరీం సీతా! పద్మా న్యానయితుం గతా?
ఏవ ముక్త స్తు రామేణ లక్ష్మణో పున రేవ హి
నదీం గోదావరీం రమ్యాం జగామ లఘు విక్రమః
తాం లక్ష్మణ స్తీర్థవతీం విచిత్వా రామ మబ్రవీత్
నైతాం పశ్యామి తీర్థేషు క్రోశతో న శృణోతి మే॥

రాముడు, దీనుడై సన్నని కంఠధ్వనితో 'సీత గోదావరికి పద్మాలు తేవడానికి వెళ్ళిందేమో' అన్నాడు. ఆమాటలు విని లక్ష్మణుడు మళ్ళీ గోదావరికి నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి అన్నిరేవుల్లోనూ వెదకి వెదకి తిరిగి వచ్చి "రేవుల్లో ఎంత అరచినా నాకు ఏమీ సమాధానం లేదు. ఆమె ఎక్కడా నాకు కన్పించలేదు.' అన్నాడు.

'పద్మాలు' పత్ + మా, పతనశీలమైన సంపదలు కలవి పద్మాలు. అంటే, అశాశ్వతములైన సుఖభోగాలన్న అర్థం ఇస్తుంది.

గోదావరి అంటే, ఇంద్రియవ్యాపారాన్ని కల్గించే అవరణం అనే అర్థాన్ని మనం వ్యుత్పత్త్యర్థ ప్రదర్శనతో చెప్పుకొనివున్నాం. సీత అంటే భూప్రకృతి. ప్రకృతి ఇంద్రియ వ్యాపారావృతమై జననమరణవాసనలకు కారణమైన అశాశ్వతభోగాలను అనుభవించడానికి ఆరాటంపడుతుంది. దానిని జీవుడు తెలిసికోగలడు. జీవునిద్వారా తనలోని ప్రకృతియొక్క పనులను సాధకుడు తెలిసికోవాలి. ఈ సాధనా రహస్యాన్ని రాముడు లక్ష్మణుణ్ణి 'సీత పద్మాలకోసం గోదావరికి వెళ్ళిందేమో వెదకిమాడు' అన్నమాటలో అంతరార్థపరంగా వాల్మీకి వ్యక్తం చేస్తున్నాడని గ్రహించాలి.

వాల్మీకి ఈ క్రింది సందర్భంలో సున్నితమైన కవితాశిల్పాన్ని ప్రదర్శించడంతోపాటు అంతరార్థాన్ని జోడించడం మానలేదు చూడండి.

శ్లో॥ భూతాని రాక్షసేంద్రేణ వధార్హేణ హృతా మపి
సీతాం న శంశూ రామాయ తథా గోదావరీ నదీ
రావణస్య చ తద్రూపం కర్మాణి చ దురాత్మనః
ధ్యాత్వా భయా త్తు వైదేహీం సా నదీ న శశంస తాం॥

సీతను అపహరించినందుకు నిజానికి రాక్షసరాజైన రావణుడు చంపివేయదగ్గ నేరంచేసినవాడే అయినా గోదావరి నదిగాని ఇతర భూతములుగాని, రామునకు సీతజాడ తమకు తెలిసినా చెప్పనేలేదు. ఏమంటే, రావణుని ఉగ్రరూపమూ, భయంకరకర్మలూ తలచుకోడంతో వాడంటే భయంవేసి అవి వైదేహి జాడ చెప్పలేదు.

గోదావరినది కాని, ఇతర భూతాలుకాని చూచే శక్తి కలవికావు గదా! వాటికి రావణుడంటే భయం ఏమిటి? ఇదొక మనోహరంగా అసత్యాన్ని సత్యంగా చిత్రించే కవితా శిల్పం. ఇందులోకూడ ఆధ్యాత్మికమైన అంతరార్థం ఉంది.

గోదావరి అంటే ఇంద్రియ వ్యాపారావరణం. భూతాలు అంటే, పుట్టినవి. ఆ ఆవరణంలో పుట్టిన మానసికవృత్తులు అన్నమాట. రావణుడంటే అరపించేవాడు. పది ఇంద్రియాలయొక్క ఆరాటములే అరవులంటే ఆ ఇంద్రియాల అరవులయొక్క అధీనంలో వుండి పాలింపబడేవే గోదావరీ భూతాలు. ఇంద్రియ వ్యాపారాలను వృద్ధి పఱచే మానసిక వృత్తులూ వాని ఉపవృత్తులూ తమకు రాజైన దశేంద్రియ కేంద్రవృత్తిని గూర్చి తెలుపడం ఎట్లా? (రాక్షసేంద్రుడు రావణుడు. రాక్షసులు అంటే, రాక్ష + స = రక్షణమును నశింపుచేసేవి. ఇంద్రియాల అరవులు. జీవునకు ఉన్నతస్థితిని అంటే ముక్తిని నశింపు చేస్తాయి) గోదావరి భూతాలు అంటే ఇంద్రియ వ్యాపారాన్ని వృద్ధి చేసే ఆవరణలో పుట్టిన ఉపవృత్తులు. ఇవి దశేంద్రియవృత్తికి బానిసలు. బానిసలు రాజుగారు రహస్యంగా చేసిన చెడుపనులు తమకు తెలిసినా భయంచే చెప్పరు. జీవుడు ఎంత ఇంద్రియావరణలో వానివృత్తులను ఉపవృత్తులను పరిశీలించినా ప్రకృతియొక్క జాడ తెలియబడదన్న ఆధ్యాత్మిక రహస్యం లక్ష్మణునిద్వారా రామునకు గోదావరీ నదిగాని, భూతములుగాని రావణ భయంచేత చెప్పలేదన్నదానిలోని అంతరార్థం. ఈవిధంగా రాము విరహ సందర్భం అంతా సాధకునికి కల్గిన ప్రకృతి విరహపరంగా చెప్పుకోవాలి. గ్రంథ విస్తరభీతిచే పైరెండు ఉదాహరణలతో విరమిస్తున్నాను.

కథ :— మృగాల్ని అంటే, లేళ్ళను 'జానకి ఎట్లా వెళ్ళింది?' అని రాముడు శోకాతురుడై అడిగితే అవి జాలిపడి నోటితో చెప్పక దక్షిణ దిశగా చెంగున గెంతి పరుగుతీశాయి. ఈ కవితా శిల్పంలో వాల్మీకి, జానకి దక్షిణదిశగా తీసికొనిపోబడింది అనేసంగతిని మృగాలు దక్షిణంగా గెంతి పరుగెత్తేయన్నదానిలో స్ఫురింపజేసాడు.

మృగాలకు రాముని మాటలు అర్థంకావుగదా! రావణుడెవరో సీతఎవరో అవి గుర్తింపలేవుగదా! దక్షిణదిక్కేదో ఉత్తరదిక్కేదో వాటికి

తెలియవుకదా! గ్రహణశక్తికాని, భావనాశక్తిగాని వాటికి లేదుకదా! ఇదంతా ఏమిటి? అభూతకల్పన. ఇందులో వాల్మీకి అంతరార్థాన్ని ప్రవేశపెట్టేడు అని చెప్పక తప్పదు.

'మృగ్యంతే ఇతి మృగాః' వెదకబడేవి వెదికేవి అనికూడా మృగపదానికి అర్థములే. ఇక్కడ మృగాలంటే సాధకుని లోలోపల విషయాలను వెదకి తెలిసికొనే ఆలోచనా శక్తులు. ఇక్కడ సాధకుడు ఆలోచనా శక్తుల్ని ఉపయోగించి తనలోని ప్రకృతి ఎచ్చట ఇప్పుడు ఉందో తెలిసికోవడానికి ప్రయత్నించడమే మృగాల్ని రాముడు 'సీత జాడ చెప్పండి' అని అడగడంలోని అర్థం. అవి దక్షిణదిశగా గెంతి పరుగెత్తేయి అన్నదానికి దేహంలోని దక్షిణభాగం అంటే అధోభాగం. ఆభాగం లోనిదే మూలాధారం, అది తమోగుణానికి నిలయం. అదే లంక అని జ్ఞానమార్గపరమైన అంతరార్థం, తమోనిలయమై వాసనా వాసమైన మూలాధారచక్రం అని యోగమార్గపరమైన అర్థం. సీత అంటే కుండలినీశక్తి అదే ప్రకృతి. దశేంద్రియశక్తి చేత ఆకర్షించబడింది. ఈవిధమైన ఆలోచన సాధకునకు తోచి అంతలో మాయమైంది అన్న అంతరార్థం మృగాలు గెంతి పరుగెత్తేయి అన్నదానిలో ధ్వనిస్తూంది. భూగోళశాస్త్రంలో పటానికి (Map) అధోభాగాన్ని దక్షిణదిక్కుగా చెప్తారు. కాన దేహపటానికి అంటే శరీరానికి అధోభాగం దక్షిణ దిక్కుగా చెప్పవచ్చు.

## జటాయు మరణం.

జటాయువు దశరథుడికి మిత్రుడుగా రామునకు ఆప్తుడు. ఆ కారణంచేత రావణుడు సీతను ఎత్తుకొనిపోతూంటే ఆపని కూడదని వాదించింది. వినకపోతే రావణుడితో యుద్ధంచేసి రెండు రెక్కలూ తెగిపోవడంతో పడిపోయింది. సీతాన్వేషణలో రాముడు జటాయువును చూచేడు. జటాయువు సీతను రావణుడెత్తుకొని పోయిన సంగతిని చెప్పి ప్రాణాలు విడిచింది. రాముడు జటాయువునకు తండ్రికి పుత్రుడు చేసినట్లు దహన సంస్కారం జరిపేడు.

జటాయువు అంటే వేద విజ్ఞానం అని, వ్యుత్పత్త్యర్థంతో లోగడ చెప్పుకొని వున్నాం. దశేంద్రియాల ఉద్రేకాన్ని తగ్గించడానికి వేదంలోని కర్మకాండయొక్క విధానం సాధకునకు తోడ్పడుతుంది. కాన దశ రధుడికి అంటే దశేంద్రియ నిగ్రహసాధకుడికి జటాయువు అనగా వేదం మిత్రుడు. వేదంలోచెప్పిన దశ ఇంద్రియనిగ్రహం ఆత్మానందసిద్ధికి మూలకారణం. రాముడు దశరధపుత్రుడుగా జటాయువునకు అప్తుడు అన్నదాని అర్థం అదే. దశగ్రీవుడికి జటాయువు తప్పుపని చేస్తున్నావని బుద్ధి చెప్పింది అంటే, రాక్షసుల్లోకూడ అగ్నిహెూత్రా రాధన వేదాధ్యయనం, కర్మాచరణం ఉంది. అయితే ముక్తికోసమూ, ఇంద్రియ నిగ్రహాన్ని సంపాదించడంకోసమూ వారు దానిని వినియో గించరు. దేవతానుగ్రహంతో వరాల్ని పొంది స్వార్థాల్ని పూరించు కోవడం కోసం వుపయోగిస్తారు.

'అగ్నిహోత్రాణి వేదాం శ్చ
రాక్షసానాం గృహే గృహే'

అని వాల్మీకి లంకాపురవర్ణనలో చెప్పేడు. ఈవిధంగా వేదంతో సంబంధం వున్న కారణాన దశగ్రీవుడికి జటాయువు బుద్ధి చెప్పింది అంటే, "వేద పరమార్థం ప్రకృతిని అపహరించడం కాదు. ప్రకృతియొక్క ఆరాధనతో ముక్తిని పొందాలి సుమా!" అని సాధ కునిలోని వేదవిజ్ఞానం దశేంద్రియవృత్తికి చెప్పింది అన్నమాట. తమోగుణ విశిష్టమైన దశేంద్రియవృత్తి దానిని వినలేదన్నదే రావణుడు జటాయువును రెక్కలు తెగగొట్టేడన్నదాని అంతరార్థం. జటాయువు యొక్క రెక్కలు అంటే వేదంలోని ఉపాసనా కర్మకాండలుగా భావిం చాలి. రామునకు జటాయువు సీతాపహరణంగూర్చి చెప్పిందంటే, సాధకునిలోని వేదవిజ్ఞానం వేదవిహితంగా దశేంద్రియ సాధన చేసి యున్న సాధకునకు అతనిలోని దశేంద్రియకేంద్రంచేత ప్రకృతి అప హరింపబడింది, అనేదాన్ని అతనికి తెలిపిందన్నమాట. జటాయువునకు తండ్రికివలె అగ్ని సంస్కారం చేశాడంటే, దశేంద్రియ నిగ్రహ సాధ

నకు తోడ్పడిన వేద విజ్ఞానానికి తేజస్సు కల్గించేడు అన్నమాట అంటే సాధకుడు తనలో బాగా ప్రసారం పొందించేడు అని అర్థం. ఈవిధంగా దశేంద్రియ కేంద్ర వృత్తి యొక్క ప్రాబల్యాన్ని సాధకుడు గ్రహిం చేడు. ఇచ్చట తంత్రి పదం ఇంద్రియనిగ్రహసాధనను తెల్పేది. 'అగ్ని సంస్కార' పదం జ్ఞాన ప్రకాశాన్ని, సంస్కారపదం ఆప్రకా శాన్ని పొందడాన్ని తెల్పుతుంది. జటాయువు పదం వేదాన్ని తెల్పుతుంది.

## అ యో ము ఖి క థ.

కథ :— సీతాన్వేషణం చేస్తూ రామలక్ష్మణులు అరణ్యంలో నడుస్తూండగా పాతాళ సదృశమైన లోతుగల ఒక పెద్ద పర్వతగుహ కనుపడింది. అది తమస్సుతో ఆవరింపబడివుంది. ఆ గుహ దగ్గరకు వారు వెళ్ళగానే అల్ప సత్వములకు భయం కల్గిస్తూ, వికృతమైన నోరు కలిగిన అయోముఖి అనే ఒక రాక్షసి కన్పించింది.

రాముడు, చూస్తూండగానే కామోద్రేకంతో అది లక్ష్మణుడిమీద పడింది. వెంటనే లక్ష్మణుడు దాని ముక్కూ చెవులూ స్తనాలూ కోసివేశాడు.

ప్రకృతిని కోల్పోవడంతో విరహంవల్ల సాధకుణ్ణి, తమోవృత్తి బాగా ఆవరించింది అనీ, దానిని జీవాత్మ తొలగించిందనీ అయోముఖి కథకు అంతరార్థం చెప్పవలసి వుంటుంది.

మూలాధారంలో కుండలిని తమస్సుచేత ఆవరింపబడివుంటుంది. పాతాళ సమమైన పర్వతగుహ అంటే, దేహంలో అధోభాగంలో వాసనామూలమైన మూలాధారచక్రం. 'అయోముఖి' అంటే, ఇనుప ముఖం కలది అని అర్థం. అంటే, వాచ్యార్థంలో అతి కర్కశ మైనది అని దాని అర్థం. తమోగుణం అని అంతరార్థం. లక్ష్మ ణునిమీద కామోద్రేకంతో పడింది అంటే, తమోగుణం, జీవాత్మను

తన్ను అనుభవించడానికి, అంటే, పునర్జన్మనిచ్చే కర్మలను ఆచరించ డానికి ప్రోత్సహించిందని అర్థం. రెండుద్వారాలుకల ముక్కు, చెవులు రెండు తామసిక రాజసిక ద్వంద్వాలయొక్క ఇంద్రియ వృత్తులకు ఉప లక్షకములు. రెండు స్తనములూ సాత్వికద్వంద్వాలకు ఉపలక్షకములు సాత్త్వికద్వంద్వాలవృత్తులు హృదయగర్భంలో పుట్టేవి. అవే గుండెపైని ఉన్న స్త్రీ స్తనాలుగా పోల్చబడ్డాయి. సాధకునికి ప్రకృతి విరహంతో తీవ్రమై త్రిగుణాత్మక ద్వంద్వవృత్తులు జీవాత్మకు ఆవ హిస్తాయనీ, వానిని సాధకునిలోని జీవుడు తనలోని ఆత్మాంశ ప్రభా వంచేతొలగించుకుంటాడనీ రాముడు చూస్తూండగా అయోముఖిని లక్ష్మణుడు ముక్కూ,చెవులూ,స్తనాలూకోసేడన్నదానిలోని అంతరార్థం స్పష్టంగానే కన్పిస్తూంది. శూర్పణఖకు స్తనాలు కోయలేదు. అయోముఖికి స్తనాలు కూడ కోశాడు. మొదట తామసిక రాజసిక ద్వంద్వాలే విజృంభించాయి. ఇప్పుడుసాత్త్వక ద్వంద్వంకూడ విజృం భించిందని అర్థం చెప్పాలి. స్తనము అనగా ధ్వని అని అర్థం వుంది. స్తన ద్వంద్వం అంటే ద్వందములయొక్క ధ్వనులు అనే అర్థంవస్తుంది.

వాచ్యార్థంలో ఈ అయోముఖి కథకు అసలు మూలకథతో ప్రసక్తి కన్పించదు. అంతరార్థపరంగా సాధకునిలో ప్రకృతి దూరమై నప్పుడు కలిగే జీవాత్మయొక్క పరిణామాలను, వానిని సాధకుడు ఎట్లు ఎదుర్కోవాలో ఆ ఉపాయములను చెప్పవలసిన అవసరం ఉండడంవల్లనే ఈకథను వాల్మీకి వ్రాసాడు. ఇదేవిధంగా కబంధ వధ, శబరీదర్శనం, అనే కథలుకూడ అంతరార్థంతో సాధనల్ని వివరిస్తున్నాయి.

## కబంధవధ.

రామలక్ష్మణులు క్రౌంచారణ్యంలో సంచరిస్తూండగా కబంధు డనే రాక్షసుని హస్తాల్లో చిక్కుకున్నారు. కబంధుడనేవాడు తలలేని మొండెం మాత్రమే వున్న ఒక రాక్షసుడు. తల లేకపోయినా అతని

* గుండెలోనే నోరూ కళ్ళూ ఉన్నాయి. ఆతనికి యోజనం పొడవైన చేతులున్నాయి. వానితో తడివి అడివిలోని జంతువుల్ని లాగుకొని భక్షిస్తూ కుక్షి నింపుకుంటున్నాడు. రామలక్ష్మణులు ఆకబంధ హస్తాల్లో చిక్కుకొన్నారు. వారిని మ్రింగడానికి సిద్ధంగా ఉండగా రామలక్ష్మణులు వాడి రెండుచేతులూ ఖండించివేసారు. దానితో వాడు ప్రాణాలు విడుస్తూ తన కథ చెప్తూ తనకొక శాపంవుందనీ, తన చేతుల్ని నరికినప్పుడు తనకు శాపవిముక్తి కల్గుతుందనీ ఇంద్రుడు చెప్పిన మాటలు చెప్తాడు. రాముడు వానికి అగ్ని సంస్కారంచేసి ముక్తిని కల్గిస్తాడు.

కబంధుడు అంటే, 'క' అంటే సుఖం. 'బంధం' అంటే 'కర్మ బంధం' అర్థం. ఈవ్యుత్పత్త్యర్థంలో సుఖ రూప వాసనాబంధం 'కబంధ' పదానికి అర్థం. ఇది ముక్తికిప్రతిబంధకంఅనే అర్థం ఆ కబంధ పదంలోనే వుంది 'క' అంటే సుఖం, ఆ సుఖం ఆత్మానందసుఖం. దానికి బంధం అంటే దాన్ని అడ్డగించే ప్రతిబంధకం. ఈవిధంగాకూడా మోక్ష ప్రతి బంధకమైన సుఖవాసనాబంధంఅని 'కబంధ' పదానికి అర్థంచెప్పవచ్చు. వాడు యోజనా యామబాహుడు. ఆబాహువులతోనే ప్రాణుల్ని కుక్షిలో చేరుస్తున్నాడు. రెండు బాహువులు సుఖ దుఃఖాలకు, ద్వంద్వాలకు ఉపలక్షకం. సుఖ దుఃఖరూపంలో బహుత్వం ద్యోతకంచేసే మనోవృత్తి 'కబంధ' వృత్తి. ఈబహుత్వ ద్వంద్వ దృక్పథం మోక్ష ప్రతిబంధక మైనది.

'ఏక మే వా ద్వితీయం బ్రహ్మ'

అని బ్రహ్మవేత్తలు బ్రహ్మపదార్థాన్ని చెప్తారు. సర్వమూ ఏకరూపమైన బ్రహ్మగా తెలియబడాలి.

---

*ఎవరిచేతనైనా సత్యం చెప్పించాలన్నప్పుడు గుండెమీద చెయ్యివేసికొని చెప్పు అంటారు. దుర్మార్గం చేసినప్పుడు గుండె లేకుండా చేసేడు అంటారు గుండె సత్యవృత్తికి స్థానమని ఈ ఉదాహరణ.

'సర్వం ఖ ల్విదం బ్రహ్మ' అన్నదికూడ ప్రకారాంతరంలో పైదాన్నే చెప్తూంది.

ఈవిధంగా సర్వమూ బ్రహ్మపదార్థంగా కన్పించకపోవడానికి సుఖ దుఃఖ మనోవృత్తులు కారణం. ఆవృత్తుల్ని నాశంచేసి ద్వైత దృష్టి లేకుండా సాధకుడు చెయ్యడమే, కబంధ బాహుచ్ఛేదంలోని అంతరార్థం. అయోముఖి కథ తర్వాత ఈ కబంధ బాహు విచ్ఛేద కథ చెప్పడంలో ఔచిత్యం కన్పిస్తుంది. తమోవృత్తిని ఛేదించుకొంటేనే బహుత్వద్వైతదృష్టిని నాశం చెయ్యడం జరుగుతుంది. సాధకుని సాధనా ప్రణాళికలోని అనుక్రమణికలో ఈ రెండు కథలకు క్రమాన్ని గుర్తించవచ్చు. రాముడు కబంధ దేహానికి అగ్నిసంస్కారం చెయ్యడం, కబంధుడు శాపవిముక్తుడై స్వర్గలోకానికి చేరడం అన్నది సుఖదుఃఖద్వైత్వ దృష్టి పోగానే సాధకునిలోపల జ్ఞానప్రకాశం ఇనుమడిస్తుందనీ, ఆపైని ముక్తిమార్గంలో జేగీయమానంగా నడుస్తూండడమూ జరుగుతుందనీ ఈకథలు చెబుతున్నాయి.

## శబరి కథ.

రామలక్ష్మణులు శబరి అనే తాపసిని దర్శిస్తారు.

శ్లో॥ అద్య ప్రాప్తా తపస్సిద్ధిః తవ సందర్శనా దిహ
అద్య మే సఫలం తప్తం గురవ శ్చ సుపూజితాః
అద్య మే సఫలం జన్మ స్వర్గ శ్చైవ భవిష్యతి
త్వయి దేవవరే రామ! పూజితే పురుషర్షభ!
చక్షుషా తవ సౌమ్యేన పూ తాస్మి రఘునందన!
గమిష్యా మ్యహ మక్షయ్యాన్ లోకాన్ త్వాన్ త్వత్ప్రసాదతః
చిత్రకూటం త్వయి ప్రాప్తే విమానై ర్న్యాతులప్రభైః
ఇత స్తే దివ మారూఢాః యా నహం పర్యచారిషం
తై శ్చాహ ముక్తా ధర్మజ్ఞైః మహాభాగై ర్మహర్షిభిః
ఆగమిష్యతి తే రామః సుపుణ్య మిమ మాశ్రమం

న తే ప్రతిగృహీతవ్యః సౌమిత్రిసహితో ఒతిథిః
తం చ దృష్ట్వా వరాన్ లోకా నక్షయ్యాన్ త్వం గమిష్యసి
మయా తు వివిధం వన్యం సంచితం పురుషర్షభ
తవార్థం పురుషవ్యాఘ్ర! పంపాయా స్తీరసంభవం
ఏవ ముక్త స్స ధర్మాత్మా శబర్యా శబరీ మిదం
రాఘవః ప్రాహ విజ్ఞానే తాం నిత్య మబహిష్కృతాం
దనో స్సకాశా త్తత్త్వేన ప్రభావం తే మహాత్మనః
శ్రుతం ప్రత్యక్ష మిచ్ఛామి సందృష్టుం యదిమన్యసే
ఇ త్యుక్తా జటిలా వృద్ధా చీర కృష్ణాజినాంబరా
తస్మిన్ ముహూర్తే శబరీ దేహం జీర్ణం జిహాసతీ
అనుజ్ఞాతా తు రామేణ హుత్వా త్మానం హుతాశనే
జ్వలత్పావక సంకాశా స్వర్గ మే హ జగామ సా

నీదర్శనంవల్ల ఇప్పుడు నాతపస్సు సిద్ధిపొందింది. ఇప్పుడు తపస్సు సఫలమైంది. నాగురువులు పూజింపబడ్డవారైనారు. నాజన్మ సార్ధకమైంది. ఇక నాకు స్వర్గమే రాగలదు. దేవశ్రేష్ఠుడవైన నీవు నాచే పూజింపబడ్డంవల్లనూ, నీసౌమ్యములైనచూపులు నాపైని పడ్డం వల్లనూ నేను పవిత్రురాలనయ్యాను. నీదయవల్ల అక్షయపుణ్య లోకప్రాప్తి నాకు కల్గుతుంది. నీవు చిత్రకూటం చేరగానే ఇంతకు పూర్వం స్వర్గం పొందిన నాగురువులైన మహర్షులు విమానాలమీద వచ్చి నాకు 'ఈ నీపుణ్యమైన ఆశ్రమానికి రాముడు సౌమిత్రితో నీకు అతిధిగా లభింపగలడు అతణ్ణి దర్శించినతర్వాత నీవు అక్షయ పుణ్యలోకాలు పొందుతావు, అని చెప్పేరు.

'రామా! పంపాతీరసంభవమైన వివిధమైన వన్యమును నీకోసం సంపాదింపబడింది' అని శబరి పలికింది. రాముడు, ఎంతమాత్రమూ విజ్ఞానంలో త్రోసివేయడానికి వీలులేని శబరితో 'దనువు వల్ల నీప్రభావంయొక్క యాధార్ధ్యంగూర్చి తెలిసికొనియే వున్నాను. ఆ విన్నది ఇప్పుడు ప్రత్యక్షంలో చూస్తున్నాను' అని చెప్పేడు.

కృష్ణాజినమును, నారబట్టను ధరించివున్న శబరి అక్షణంలోనే తనదేహత్యాగానికి సంకల్పించి రాముని అనుజ్ఞపొంది అగ్నిలోదూకి తనను ఆహుతి చేసికొంది. అగ్నిహోత్రంలో లీనమై ఆమె స్వర్గాన్ని చేరుకొంది.

శబరి పంపాతీర వన్యఫలాన్ని రామునకు అర్పించాలని చిరకాలంనుంచి సంపాదించి వుంచింది. అది ఇప్పుడు సమర్పించింది. రాముడు దానిని స్వీకరించాడు. దీనినే కవులు శబరి ఎంగిలిఫలాల్ని దాచి యిచ్చిందనీ రాముడు వానిని తిన్నాడనీ వర్ణించేరు. ఆవిధంగా శబరిని కవులంతా మూఢ భక్తురాలుగా చిత్రించారు. శబరిని రాముడే

" విజ్ఞానే తాం నిత్య మబహిష్కృతాం "

అన్నాడు, అంటే, విజ్ఞానమందు ఆమె ఎప్పుడూ ముందేవుంది. వెనుకబడిలేదు. అని దాని అర్థం. వాల్మీకి కంఠోక్తంగా ఈవిధంగా జ్ఞానపంతురాలుగా రామునిచేతనే అనిపించిన శబరిని ఎంగిలిపళ్ళు రామునకు యిచ్చిందనీ, మూఢురాలుగానున్న భక్తురాలుఅనీ తరువాతి కవులు అనాలోచితంగా వ్రాసేరు.

" మయా తు వివిధం వన్యం
సంచితం పురుషర్షభ!
తవార్థం పురుషవ్యాఘ్ర!
పంపాయా స్తీర సంభవం "

అన్నదాన్ని పుచ్చుకొని 'వన్యం' అన్నదాన్ని చిరకాలంనుంచి చెట్లనుండి సంపాదించిన పండ్లుగా ఎంగిలివిగా చిత్రించారు. శబరిని నిషాదస్త్రీ అన్నారు. అందుచే మూఢత్వం కలదికాన రుచిచూడడానికి కొరికి ఎంగిలి చేసిందన్నారు. నిజానికి అందులో ఎంగిలిమాట లేనే లేదు. ఎంగిలిచేసి తింటేనేకాని మంచివి ఏవో తెలియవని మూఢభక్తితో ఆవిధంగా కొరికి చూచింది కిరాతస్త్రీ అని ఏదేదో గొప్పభక్తిని చిత్రించి నట్లు పూర్వకవులు కొందఱు అనువాదాల్లో చిత్రించడం జరిగింది. తన

భక్తురాలు కనుక ఎంగిలివైనా అప్యాయంగా దేవుడుఅరగించేడని, భక్తి పరాకాష్ఠను కవితాశిల్పంలో చూపించేరు. అదిసరికాదు. వాల్మీకిమాటలే ఆధారంకదా! వాల్మీకిలో ఎంగిలిమాట లేనే లేదుగదా! అ వన్యం, పంపా తీర సంభవ మని వుంది. అది చిరకాలంనుంచి సంచితము అని వుంది.

'పంపా' అంటే, తన్ను రక్షించువానిని రక్షించేది. అనగా ధర్మబుద్ధి, అని జ్ఞానపరంగానూ, లేక తన్ను రక్షించిన వానిని అంటే సేవించినవానిని రక్షించే దేవత అని, భక్తిపరంగానూ లోగడ అంతరార్థపరంగా చెప్పుకొని వున్నాం. శబరి పంపాతీరమందు మతంగాశ్రమంలో చిరకాలం మతంగమహర్షిని సేవించి తపస్సాధన చేసింది. మతంగమహర్షి శబర్యాశ్రమం వెళ్ళవలసిందిగా రామునకు చెప్పివున్నాడుకూడ. ఆపె మతంగాశ్రమంలో పంపాతీరంలో చిర కాలం భక్తితో చేసిన ఉపాసనయే ఆపె సంపాదించిన వన్యం అన్న దానికి అర్థం అవుతుంది. వనంలో సంపాదించింది వన్యంఅని చెప్ప వచ్చు. అంతేకాని ఎంగిలిపండ్లు అన్న అర్థం ఎక్కడా వాల్మీకి మాటల్లో లేదు. 'వన్యం' అంటే వనసంబంధమైనది; వనంలో పుట్టింది అనిఅర్థం. 'వన' పదానికి అడవి అనేకాక, 'జలం' అనే అర్థంకూడ వుంది. వనా నికి సంబంధించింది 'వన్యం'. అంటే జలసంబంధమైనది అని అర్థం. కాన వన్యం అనగా భగవత్సంబంధమైనశక్తి అనే అర్థం వస్తుంది. దశరధునకు అగ్నిదేవుడు పాయసం ఇచ్చేడన్నప్పుడు మొట్టమొదటి పుత్రకామేష్టి భాగంలో 'పాయసం' అంటే, పయస్సుకు సంబంధించిం దని, అంటే, జలమునకు సంబంధించింది అనీ పాయసమునకు భగవ త్సంబంధమైన శక్తి అనీ అర్థం ఉందని మనం చెప్పుకొన్నాం. అదే అర్థం ఇప్పుడుకూడా 'వన్యం' అనగా జలమునుండి సంభవమైనది. అది భగవత్‌శక్తి అని మనం చెప్పుకోవాలి.

" అప ఏవ ససర్జాదౌ తాసు వీర్య మపాసృజత్ " అని సృష్టి క్రమం చెప్పేటప్పుడు చెప్పబడివుంది. అంటే, భగవంతుడు సృష్టి క్రమంలో మొట్టమొదట నీటినే సృష్టించాడనీ, తర్వాత, దానిలో తన

శక్తిని ప్రవేశపెట్టేదనీ దానికి అర్థం. నీటిలో భగవత్‌శక్తి వుంది అనే దానికి ఇది ఉదాహరణం. ఇంతకంటే, నీటిలో పుట్టిన భగవత్‌శక్తికి మఱొకటి ఉదహరించనక్కరలేదు. ఇప్పుడు 'వన్యం' అనే పదం జల సంబంధమైనది అనే అర్థంలో వాడబడిందని చెప్పుకోవచ్చు. అది జల సంబంధమైనది కనుకనే దానికి 'పంపాతీర సంభవం' అని అనడంలో ఔచిత్యం కనిపిస్తూందికూడ. 'నీరు పంపానదీతీర సంభవమైంది'; అని దాని వాచ్యార్థం. భగవత్ శక్తి, దేవతా భక్తివల్లగాని, ధర్మానురక్తి వల్లగాని వస్తుంది. 'పంపా' అన్నదానికి 'దేవత' అని ధర్మానురక్తి అనీ కూడ వ్యుత్పత్త్యర్థంలో మనం పైనిఅర్థం చెప్పుకొన్నాం. ఈవిధంగా అంతరార్థం చెప్పినపుడు ఇక 'శబరి'ని 'కిరాత స్త్రీ'ని గా చెప్పడానికి వీల్లేదు. 'శవరి' అనేదే 'శబరి'గా మారింది అనాలి. సంస్కృతంలోను వంగ భాషలోనుకూడ 'వ' 'బ' యోరభేదః అని వుంది. 'వ'కార 'బ' కారాలకు బేదం లేదు అని దానికి అర్థం. ఈవిధంగా 'శబరి' ని 'శవరి' అని చెప్పడం తప్పుకాదు. 'శవరి' అంటే 'శేతే, వరే' ఇతి శవరీ' వరే=శ్రేష్ఠునియందు అంటే సర్వశ్రేష్ఠుడైన భగవంతునియందు శేతే=శయనించి వుండేది అని 'శవరీ' పదానికి (వ్యుత్పత్త్యర్థం చెప్తే) భగవంతునిగూర్చియుండే నిరంతరమానసికవృత్తి 'శవరీ' పదానికి అర్థంగా చెప్పవచ్చును. నిత్యమూ భగవంతుని భావించే మనోవృత్తి శవరీ వృత్తి అన్నమాట. శబరి మతంగముని శిష్యురాలు. మతం గచ్ఛతి, ప్రాప్నోతి ఇతి మతంగః'. మతమును అంటే, అందరకు ఇష్టమైన సనాతనధర్మమును 'గ' అంటే పొందియుండునది అన్నది మతంగ పదానికి అర్థం. ఈవిధంగా మతమును ఆశ్రయించివుండే శవరి అంటే భగవద్భావన అన్నమాట. భగవద్భావన సనాతన ధర్మమును ఆశ్రయించినప్పుడే వృద్ధి పొందుతుంది, అన్నది 'మతంగ మహర్షి సేవతో శబరి తరించింది' అన్నదానికి అంతరార్థం. ఈవిధంగా శబరి అంటే సనాతన ధర్మపరమయిన భగవద్భావనావృత్తిగా చెప్పుకోవాలి. ఇప్పుడు పై శ్లోకాలకు సరైన అర్థంతో మనం ఈక్రింది విధంగా శబరి మాటలకు అర్థం గ్రహించవలసి వుంటుంది.

రామసందర్శనంతో "శవరి' ఇప్పుడు నాజన్మ సఫలమైంది" అంటుంది. రామపదానికి 'రమంతే యోగినః అస్మిన్ ఇతి రామః' అని నిర్విషయానందం అర్థంగా చెప్పికొనియున్నాం. సనాతన వేదమతాన్ని సేవించి వృద్ధినందిన భగవద్భావనకు విషయాలతో సంబంధంలేని ఆత్మానందం లభిస్తుందని మతంగుని సేవించిన 'శవరి'కి రామదర్శనం లభించిందని అంతరార్థంతో చెప్పుకోవాలి. ఆత్మానం దానికి సనాతనవేదధర్మప్రవర్తనతో భగవద్భావనను వృద్ధి చేసుకోవాలన్నమాట. ఈ రహస్యం ఇందులో ద్యోతకమౌతుంది. ఇప్పుడు నాగురువులు పూజింపబడ్డారు.' అంటే, గురుసేవకు అనగా మతంగ సేవకు, అంటే సనాతవ ధర్మ ప్రవర్తనకు ఫలితం లభించిందన్నది అర్థం. 'నీవు చిత్రకూటంలోనికి రావడంతో స్వర్గాదిలోకాలతో తరించిన మతంగాశ్రమమహర్షులు వచ్చి 'రాముడు వస్తున్నాడు. అని నాకు చెప్పేరు' అని శవరి అంది. అంటే ఏమిటంటే చిత్+త్ర+కూటం, అంటే, జ్ఞానముతో తరింపజేసే నిశ్చల ప్రశాంతస్థితి దాని వల్ల ఆత్మానందాన్ని అనుభవించినవారు నాకు నీవు వేరే ప్రయత్నం చెయ్యనక్కరలేకుండానే నీవద్దకు ఆ ఆత్మానందం తనంతతాను వస్తుంది. కాచివుండు, అని శబరియొక్క సాధనను తెలిసికొని అభినందించేరు, అని అర్థం. అందుచేత చిరకాలమునుండి పంపాతీరసంభవమైన వన్యం నీకోసం సంపాదించివుంచాను'. అంటే, ఆత్మానందంకోసం చిరకాలం నుండి, భగవద్భావనతో కల్గిన వన్యాన్ని అంటే భగవత్ శక్తిని నీకోసం అంటే, ఆనందానుభూతికోసం సాధించివుంచేను అని అర్థం. ఆ వన్యాన్ని, నీకు సమర్పిస్తున్నాను అనడమూ, రాముడు దానిని స్వీకరించడమూ, భగవత్‌శక్తిని ఆత్మానందంలో లీనం చేయడం అనే అర్థాన్నిస్తున్నాయి, రాముడు 'నేను పూర్వం విన్నది ఇప్పుడు ప్రత్యక్షంగా చూడదలచాను. (శ్రుతం ప్రత్యక్ష మిచ్ఛామి). అన్నాడు'. అంటే నిశ్చలప్రశాంతస్థితివల్ల ఆత్మానందం వస్తుంది, అన్న ప్రమాణవాక్యం అనుభవంలో రూఢమైంది, అని సాధకుడు భావించేడు అని అర్థం. అప్పుడే శవరి దేహం చాలించడానికై రాముణ్ణి

చూస్తూ అగ్నిప్రవేశంచేసి స్వర్గానికి పోయింది, అంటే, స్వయం ప్రకాశంతో ఆత్మానందానుభూతితో దేహత్యాగం తర్వాతనే ముక్తిని పొందడం జరగాలి అన్న సాధనారహస్యాన్ని వాల్మీకి శబరీ వృత్తాంతంలో మనకు అంతరార్థపరంగా చెప్పేడని భావించాలి. ఈ శబరికధ కావాలని వాల్మీకి సృష్టించినకధ. దీనితో అరణ్య కాండను ముగింపజేసాడు వాల్మీకి. అరణ్యం అంటే, ప్రశాంతస్థితి అని అనుకొన్నాం కాన, ప్రశాంతస్థితియొక్క ఫలితమైన ముక్తిప్రాప్తిని గూర్చిన శబరికధతో అరణ్యకాండను పూర్తిచెయ్యడంతో గొప్ప ఔచిత్యంకూడ కన్పింపజేసాడు వాల్మీకి.

అరణ్యకాండ పరిసమాప్తిచేస్తూ వరుసగా వాల్మీకి చిత్రించినవి ముఖ్యంగా మూడుకధలు.

అయోముఖికధ, కబంధవధ, శబరికధ.

ఈ మూడు కధలు తామసగుణం నాశంచేసి (అయోముఖి కధ) సుఖవాసనలు విడచి (కబంధవధ కధ) భగవత్‌శక్తిని పొంది (శబరికధ) ముక్తిని పొందాలి, అనే అర్థంలో క్రమ సాధనా సారాంశాలుగా అంతరార్థపరంగా కన్పిస్తున్నాయి. ఇవి సాధకులకు గొప్ప ప్రయోజనం కల్గించేవిగా ఉన్నాయి. ఈవిధంగా ప్రశాంత స్థితి సాధనలకు రామాయణంలో అరణ్యకాండకు విశిష్టస్థానంవుంది.

# అంతరార్థ రామాయణము.

## కిష్కింధా కాండ.

'కిమ్ కిమ్ దధాతి ఇతి కిష్కింధా' అని శబ్దకల్పద్రుమ గ్రంథంలో 'పారస్కరాదిత్వాత్ పూర్వస్య కిమః మలోపః, సత్వం, షత్వంచ నిపాతనాత్ అని వ్యుత్పత్తి ప్రదర్శనం చెయ్యబడింది. 'కిమ్ కిమ్' అంటే ఏదో యేదో అనిర్వాచ్యమైనదానిని దధాతి అంటే ధరించునగరి అని అర్థం. అంతరార్థంలో మొదటి 'కిమ్' అనేదానికి కొంచెము అని, రెండవ 'కిమ్' అనేదానికి కుత్సార్థం, అనగా చెడ్డఅనీ అర్థం చెప్పి, కొంచెం చెడ్డకలది అని అర్థంలో సాధకునకు ప్రకృతి విరహంవల్ల కొంచెం చెఱుపు కల్గించే మనోవృత్తి అనే అర్థం చెప్పాలి. కిష్కింధలో రాముడు సీతా వియోగంతో బాధపడి వర్షర్తువు వెళ్ళేవరకు గడిపినాడు. అదే సాధకుడు ప్రకృతి విరహంలో కొంత బాధ ననుభవించినాడు అని అంతరార్థపరంగా చెప్పుకోవాలి. ఈ కిష్కింధ వానరులకు రాజధాని.

'వన' పదానికి జలం అర్థం. 'వాన' అంటె జలసంబంధమైన భగవత్ శక్తి. దానిని గ్రహించువారుకాన, వానరులు అంటే సాత్త్విక సంబంధమైన వృత్తులు అని చెప్పుకోవాలి. అప్పుడు కిష్కింధకు సాత్త్విక వృత్తులు నివసించే పట్టణం అని అర్థం చెప్పవచ్చు. అప్పుడు మాయతో కలిసినప్పటికీ, నిస్సంగత్వంతో సంచరించే సాధకునిసాత్త్విక వృత్తులకు నిలయంగా 'కిష్కింధ' ను చెప్పుకోవచ్చు. సాధకుడైన రాముడు ఈకాండలో మాయావరణంలేని శుద్ధమైన జ్ఞానమార్గంతో ప్రకృతియైన సీతయొక్క వియోగాన్ని, సాత్త్వికవృత్తుల సాయంతో పోగొట్టుకుంటాడు.

### వా లి వ ధ.

కిష్కింధను మొదట వాలి తర్వాత సుగ్రీవుడు పాలించారు. వారిరువురు అన్నదమ్ములు.

వలతే—చుట్టుకొనుచున్నది, లేక ఆవరించుచున్నది అనే అర్థంలో 'వాలి' అవుతుంది. అప్పుడు మనస్సును చుట్టుకొనియుండే 'మాయ' అని 'వాలి' పదానికి అర్థం వస్తుంది. వాలి ఇంద్రపుత్రుడు. ఇంద్ర పదానికి మనస్సు అర్థంగా చెప్పివున్నాం కాన మనస్సునుండి పుట్టిన మాయ వాలి పదానికి అర్థంగా చెప్పడం సమంజసమే. సుగ్రీవుడు అనగా విశుద్ధ తత్త్వం అని చెప్పుకొన్నాం. దేహంలోని షట్చక్రాలలోని విశుద్ధ చక్రం గ్రీవా స్థానానికి సంబంధించింది. కాన సుగ్రీవపదంవల్ల సు-చక్కని గ్రీవ-కంఠస్థానము గలదిగా విశుద్ధచక్రం చెప్పబడుతుంది. ఈ విశుద్ధ చక్రంద్వారానే ఆజ్ఞాచక్రంలోకి సాధకుడు ప్రవేశిస్తాడు. ఈవిధంగా బుద్ధియొక్క విశుద్ధ తత్త్వం అని సుగ్రీవపదానికి అర్థం చెప్పుకోవచ్చు. సుగ్రీవుడు సూర్యపుత్రుడు. సూర్యుడు మన బుద్ధి వ్యాపారాలలోని విశుద్ధతను ప్రచోదన చేసేవాడుగా. గాయత్రీ మంత్రార్థం చెప్తూంది. కాన సుగ్రీవపదానికి భగవద్విజ్ఞానంచేత కలిగే విశుద్ధ తత్త్వం అనే అర్థం చెప్పవచ్చు. అది మాయావృతమైవుంటుంది. సుగ్రీవుడు వాలిచేత అజ్ఞాతంగా వుంటాడు అన్నదానికదే అర్థం. అజ్ఞానం వాలి అయితే, విశుద్ధ తత్త్వం సుగ్రీవుడు. రెండూ ఒకే, అంటే, ఒకే భగవంతుని నుండి పుట్టినవే కాన మాయావిశుద్ధతత్త్వాలు రెండూ సోదరులుగా చెప్పబడుతూన్నాయి. వాలి సుగ్రీవుల తండ్రులు వేరైనా, తల్లి ఒక్కతెయే.

విశుద్ధజ్ఞానాన్ని ఆవరించి, మాయ వుంటుంది. కాని, ఎప్పటికైనా భగవత్సహాయం లభించి, ఆమాయను ఛేదించుకొని విశుద్ధ జ్ఞానం బైట పడుతుంది. రామునిచేత వాలి వధింపబడ్డతర్వాత సుగ్రీవుడు రాజ్యానికి వచ్చేడు. అంటే మాయావరణం తొలగినంతనే విశుద్ధ తత్త్వం ఆజ్ఞాచక్రంలోనికి అంటే పూర్ణజ్ఞానంలోనికి ప్రవేశిస్తుందని దాని అర్థం.

"రాముడు చెట్టును చాటు వేసికొని వాలిని వధించేడు". అంటే, మాయకు యుద్ధంలో ఎప్పుడూ, ఎదురు పడకూడదు. ఎదురు పడితే ఆ మాయా ప్రభావంవల్ల ఎదుటివాడి మనోబలం సగం నశిస్తుంది.

మాయను, ఎదురపడకుండానే చాటుననుండి సాధించాలి. అందుచేతనే 'శఠే శాఠ్యం ప్రకల్పయేత్' అని 'శఠుని విషయంలో శాఠ్యాన్నే ప్రయోగించాలి' అన్నది యుద్ధనీతియైయుండికూడ. మాయ భగవంతుని కూడ ఆవరించగలదు. కావుననే భగవంతుడు యోగమాయచే పరివేష్టింపబడివుంటాడంటారు. రాముడు వాలికి తాను కనపడకుండా చెట్టును చాటుచేసికొని వధించేడు; అన్నది మాయను సాధకుడు చాటుగానుండి దానిని తొలగించుకోవాలన్న అంతరార్థాన్ని చెప్తూందిగా గ్రహించాలి.

## మహిషాసుర దుందుభి.

కథ:— సుగ్రీవునికి తాను వాలిని చంపగలనని నమ్మకం పుట్టించడానికి రాముడు, వాలి ఎప్పుడో చంపి ఋష్యమూకపర్వతం పైకి పడవేసిన మహిషాసురదుందుభియొక్క కళేబరాన్ని పాదాంగుష్ఠంతో ఎగురదన్నేడు. అంతేకాదు వాలి చేతులతో ఊగిసలాడించిన సప్త తాళములను ఒక్క బాణంతో నేలమీదికి పడగొట్టేడు.

'మహ్యాం శేతే' ఇతి మహీశః, అనే వ్యుత్పత్తిలో భూమిని ఆశ్రయించియుండే, అంటే, ఐహిక సంబంధమైన కోరికలకు సంబంధించిన వ్యామోహం అని మహీశాసురుడు అన్నదానికి అర్థం చెప్పుకోవచ్చు. ఆ ఐహికవ్యాపారం మాయాప్రాబల్యానికి వశపడి వుంటుంది. * మహీశాసురుడే, మహిషాసురుడు.

'దుందుభి' అన్నపదం గట్టిగా ధ్వనించే ఒక వాద్యాన్ని చెప్తుంది. మహిషాసురుడే దుందుభి అంటే, భూమిని అంటిపెట్టుకొని ఉండే వాంఛలను మ్రోగింపజేసే మాయాపరివారంలోని మనోవృత్తి. అని అర్థాన్ని చెప్పుకోవచ్చు.

అహీనక్రతువు అనే యాగంలో 'భూమి దుందుభి మాఘ్నంతి' అని వేదంలో వున్నది. అదే మహిషాసురదుందుభి. దాని మ్రోతభూసంబంధవాంఛల ప్రోతయే అని అర్థం చెప్పాలి. భూమిని గొయ్యిగా తీసి అగోయియొక్క ముఖమును తోలుతో మూయించి దుందుభిగా చేసి

ఆ యజ్ఞంలో వాయింపిస్తారు. దానిమ్రోతలు భూసంబంధమైనవి కాన అవి భూమినావరించిన వాసనలుగా అంతరార్థం చెప్పుకోవచ్చు. ఈయజ్ఞ ప్రక్రియతో మహిషాసురదుందుభి అన్నపదానికి ఇచ్చట భూసంబంధ వాంఛలమ్రోతలని అంతరార్థం చెప్పుకోవచ్చు.

మహిషాసుర దుందుభి కళేబరాన్ని వాలి ఋష్యమూకంమీది మతంగాశ్రమం పైకి చిమ్మివేశాడు. దాన్ని రాముడు పాదాంగుష్ఠంతో ఎగురదన్నేడు. దానితో సుగ్రీవునకు రాముని బలంమీద దృఢ విశ్వాసం కల్గి వాలిని చంపగలవాడు రాముడని సంతోషించేడు.

'ఋష్యమూకం' అంటే ఋషుల సంబంధమైన నిశ్చలస్థితి అన్నమాట. దానిమీద 'మతంగాశ్రమం' అంటే సనాతన వేదధర్మస్థితి వుంది. దానిలో వాలి ప్రవేశించలేడు, అంటే మాయ అక్కడకు చేరలేదు అన్నమాట, వాలి మహిషాసుర దుందుభిని చంపి అక్కడకు ఎగరదన్నేడు, అంటే, ఐహిక వాసనల మ్రోతలను పటుత్వములేని వానినిగా చేసి ఆమనో నిశ్చలతపై మాయ విరజిమ్మిందన్నమాట.

రాముడు, అంటే, భగవదానందయుక్తుడైన సాధకుడు. అంగుష్ఠంతో, అంటే, శరీరంలో వున్న భగవత్ శక్తితో, * అంగు-శరీర మందు స్థ-ఉన్నది, శరీరం ఆధారం చేసికొని వున్న భగవత్ శక్తి అని అర్థం. ఎగరదన్నేడు; అంటే, భగవదానంద యుక్తునకు ఐహిక వాసనలు దూరంగా తొలగిపోతాయని అర్థం. కాలి వ్రేలితో మీటి పారవేసేటంత తేలికగా, వానిని సాధకుడు ఎగురగొట్ట గలడు. అని దాని అంతరార్థం.

## సప్తతాళ భంజనం.

సప్త తాళాలు అంటే, శరీరంలోని సప్త ధాతువులుఅని అర్థం. భగవదంశ సప్తధాతువులకు అతీతంగా ఎనిమిదవ అంశగా ఉండేది. సప్తధాతువులు కల శరీరం మాయావశంగానే ఉంటుంది.

---

'అంగు' అన్నది * అంగుళీయకమునకు వ్యుత్పత్త్యర్థం చెప్పడంలో సుందరకాండలో మరికొంత వివరింపబడింది,

అష్టమాంశయైన భగవదంశ దానిని అతిక్రమించి దానిలోనే వుంటుంది. భగవదంశను ఏడు ధాతువులను వేరుగాచూచి అష్టమాంశగా ప్రదర్శనము చెయ్యడమే ఇచ్చట రాముడు (సాధకుడు) సప్త తాళభంజనం చేశాడన్నదానిలోని అంతరార్థం. దేవకీ వసుదేవులకు పుట్టిన ఏడుగుర్ని చంపినతరువాత అష్టమ గర్భంలో శ్రీకృష్ణభగవానుడు అవతరించేడు, అన్నప్పుడుకూడ సప్త ధాతువులకు అతీతమై అష్టమాంశగా భగవచ్చైతన్యం వుంటుందని అన్నది, అంతరార్థపరంగా భాగవతకథలో కూడ చెప్పుకోవల్సివుంది.

మహిషాసురుడైన దుందుభిని వాలి చంపడం అంటే, ఐహిక భోగవాంఛలను మాయ, తనతో వుండేటట్టుగా వానిని తన ఇష్టంవచ్చినట్లు, ఇతరులపైన ప్రయోగించేట్లు స్వాధీనం చేసికొంది అని అర్థం. చంపేడనడంవల్ల దానిని నాశంచేశాడని అర్థం మాత్రంకాదు. స్వాధీనం చేసికొందన్నదే అర్థంగా చెప్పాలి.

ఋష్యమూకంపైని మతంగమహర్షియొక్క ఆశ్రమప్రాంతంలో మహిషాసురుని కళేబరంనుండి రక్తం స్రవించింది. మతంగమహర్షి ఆకళేబరాన్ని ఎవడు చిమ్మి పడవేసినాడో వాడు ఋష్యమూకంమీది ఆ ఆశ్రమ ప్రాంతానికివస్తే తల బ్రద్దలై చస్తాడని శాపం ఇచ్చాడు. అది కారణంగా వాలి ఆపర్వతంమీదికి వెళ్ళడు. కనుకనే సుగ్రీవుడు వాలితో యుద్ధాన్ని తప్పించుకొనేందుకు ఋష్యమూకంమీద ఆంజనేయాది పరివారంతో మకాంపెట్టేడు.

'ఋష్యం' అంటే ఋషి సంబంధమైనది; అనగా భగవద్ధ్యానం లేక తపస్సు అని భావం. మూకం అంటే, మూగస్థితి. అంటే, మౌనం, అనగా భావ నిశ్చలత మతంగుడు అంటే, "మతం గచ్ఛతి ఇతి మతంగః" అంటే, సర్వ సమ్మతమైన వేద, సనాతన జ్ఞానమార్గమును పొందువాడని అర్థం. తపస్సుతో నిశ్చల స్థితిలో నున్న జ్ఞానం ఋష్యమూకం. దానిమీద మతంగాశ్రమమంటే వేదవిజ్ఞానం. అక్కడ

మహిషాసురుడైన దుందిభిరక్తం వాలి చిమ్ముకట్లు చేసాడంటే, సాధకునిలోని మాయ, ఐహికవాసనలవల్ల కలిగే భయాన్ని నిశ్చల స్థితిలో నున్న వేదవిజ్ఞానమార్గంలో ప్రసరింపజేసింది అని అంతరార్థం. మతంగుడు వాలిని శపించడం అన్నది మాయ తాను జ్ఞానాన్ని నిశ్చలతను నాశం చెయ్యడానికి యత్నిస్తే ఆ మాయయే వేదవిజ్ఞానంవల్లా నశిస్తుంది అన్న అంతరార్థాన్ని చెప్తూంది. సుగ్రీవుడు వాలి భయంతో ఋష్యమూకంమీది మతంగాశ్రమంలో మకాంపెట్టేడు, అంటే విశుద్ధ తత్త్వం తపస్సుతోడి నిశ్చలస్థితితో కలసి వుంటుంది అని అర్థం. ఆంజనేయుడు, అంటే భగవదన్వేషణాబుద్ధి యొక్క తత్త్వం. దానికి సంబంధించిన సాత్త్వికవృత్తులు జ్ఞానంతో కలిసి వుంటాయి అన్నది ఆంజనేయుడు మఱికొన్ని వానరములు సుగ్రీవునితో ఉన్నాయన్నదాని అంతరార్థం.

## తార. రుమ

కథ :— 'తార' వాలి భార్య. 'రుమ' సుగ్రీవుని భార్య. వాలి సుగ్రీవుని పారద్రోలి అతని భార్యనురుమను తాను భార్యగా చేపట్టేడు. తర్వాత అన్నగారగు వాలిని రామునిచే చంపించి సుగ్రీవుడు తన భార్యను తిరిగి స్వీకరించడమే కాక వాలి భార్యను తారనుకూడ తాను భార్యగా చేసికొన్నాడు.

ఏమిటీ అక్రమ ప్రవర్తనలు!. 'తార' మహాపతివ్రతల కోవలోనిది. పంచకన్యలలో ఒకతెనుగా ప్రాతస్మరణీయనుగా చెప్తారు. తమ్ముడైన సుగ్రీవుని భార్యను వాలి స్వీకరించడమేమిటి? దానికి ప్రతిక్రియగా అన్నను చంపించడమేమిటి? అన్న భార్యను, మాతృ సమానురాలిని, భార్యగా చేపట్టడమేమిటి? దీనికంతకూ రాముడు కారణం కావడ మేమిటి? ఇట్టి అశ్లీలప్రవర్తకుల కథలకు వేదతుల్యమైన రామాయణంలో స్థానమేమిటి?

పై శంకలకు వాచ్యార్థంలో సమాధానం దొరకనే దొరకదు,

అంతరార్థ పరంగా పై సంగతులను మలచి అర్థం చేసికొంటే, ఆధ్యాత్మిక సాధనలలో, ఉన్నతోన్నత సాధనలుగా అవి మనకు గోచరిస్తాయి.

'వాలి' అంటే మాయ. సుగ్రీవుడంటే విశుద్ధతత్త్వం. రెండిటికీ ఒకటే జన్మస్థానం అయినా, రెండూ ఒకటి వుంటే, మరొకటి బ్రతికి వుండలేదు. అంతటి బద్ధవైరం వాటి రెండిటికీ.

'రుమా' అంటే ప్రకృతి సంపద. రకారం అగ్నిబీజం. రు అంటే ప్రకృతి (ర్ + ఉ) అంటే అగ్నివలె ఆశ్రయించినవానిని దహించే ప్రకృతియొక్క; మా-సంపద. ఈవిధంగా రుమ ప్రకృతిసంపదకు ప్రతీక. అది సుగ్రీవుని భార్య. అది విశుద్ధతత్త్వంతో అంటే పరమాత్మ తత్త్వంతో నిత్య సన్నిహితంగా ఉంటుంది. ఆప్రకృతిసంపదను అజ్ఞానం అంటే, మాయ తాను అనుభవించడానికిగాను స్వవశం చేసికొంటుంది కాని, అది దానివద్ద నిలవదు. పూర్తిగా ప్రకృతి ఎప్పుడూ మాయకు వశపడదు. అది విశుద్ధతత్త్వానికే వశపడి ఉంటుంది. సరిగ్గా ఇదేవిధంగా రాముని భార్య సీత ప్రకృతి. దశకంఠ రావణుడు ఇంద్రియ ప్రాబల్యం. ప్రకృతిని ఆ ఇంద్రియ ప్రాబల్యం అంటే రావణుడు వశపఱచుకోవడానికి తీసుకొనివెళ్ళుతాడు. చివరకు ప్రకృతిమాత్రం పురుషుని (రాముని) చేరికొంటుంది.

రాముడు, తనభార్యను రావణుని నుండి తీసికొని రావడానికి, సుగ్రీవుని కోరడం, ఆతనికి తనవలెనే కల్గిన ఇబ్బందిని తాను తీర్చడం అన్నది రామసుగ్రీవుల మైత్రికి సమసాదృశ్యకారణంగా కన్పిస్తూంది. ఈ రామసుగ్రీవుల భార్యల కథావిషయాలు ప్రకృతి మాయ వశంలో ఉండదనీ, అది చివరకు జ్ఞానానికే వశపడుతుందనీ, అంతరార్థాన్నిస్తున్నాయి.

'తార' అంటే, తరించాలి, అనగా జనన మరణరహితమైన ముక్తిని పొందాలి అని ప్రతిజీవియొక్క మనసులోను ఉండే ఒకానొక

నిత్యమైన పవిత్ర మనోభావన. మాయావరణాన్ని విడువలేక దానితోనే తరించాలనే దానికి మొదట వుంటుంది. కాని, ఆకోర్కె అంటే తారాస్థితి (తరించాలనే కోర్కె) మాయతో తరించలేదు. మాయాశక్తికి వశపడి పోయి మాయనుండి బయట పడడానికి దారి తెలియక దానినే నమ్ముకొని వుంటుంది. మాయకు, తార సంబంధంవల్ల, కొన్ని దైహిక సిద్ధులు, అంటే అణిమాదులుమాత్రం కల్గుతాయి, అదే వాలికి తారకు పుట్టిన అంగదుడంటే. అంగ + ద - శరీరమునకు ఇచ్చు సిద్ధులగు అణిమాదులను ఇచ్చు శక్తి. తాను కోరిన ముక్తి లక్షణాలు లేకపోయి నను, మాయాసిద్ధులను కల్గినందుకే తృప్తిపడి, స్వవృత్తినుండి జారి పోయి మాయతోనే ఉండిపోతుంది తార (తరించాలనే మనోవృత్తి); అదే అంగదునితో, తార, వాలిని నమ్ముకొని వుండడం అంటే. వాలిని చంపినందుకు తార రాముణ్ణి ఉపాలంభం చేసింది. వాలివధ తర్వాత రాముడు, తాను వాలిని చంపడాన్ని సమర్థిస్తూ చేసిన హితబోధవల్ల తిరిగి స్వవృత్తి ఏమిటో గుర్తించుకొని తరించడానికి, తార సుగ్రీవుని అండను అంగదునితోకూడా చేరింది. అంటే, సాధకునిలోని తరించాలనే చిరకాల వాంఛ మొదట్లో సరియైన మార్గంలో చరించలేక సిద్ధుల వశంలో చిక్కుపడిపోయినా చివరకు జ్ఞానమార్గంలోనే ప్రవేశిస్తుంది, అనే జ్ఞానమార్గ రహస్యాన్ని తెల్పుతూందిగా గ్రహించాలి. తార ముందు వాలి భార్యయై తర్వాత సుగ్రీవునకు భార్యయైనది. తరించా లనే వాంఛ ఉంటే, సాధకుడు మొదట్లో చిక్కులుపడ్డా చివరకు తరి స్తాడని ఈ తార కథయొక్క అంతరార్థం. ఇప్పుడు తారకథ పతితు రాలి కథగా కాక ఆధ్యాత్మిక సాధనలలో ఉన్నతస్థాయినందుకొన్న గొప్ప సాధనగా మనకు స్పష్టపడుతూంది. కనుకనే తారానామ స్మరణం ముక్తిదాయకంగా చెప్పబడింది.

## ఆంజనేయుడు.

కథ :— సుగ్రీవుని మంత్రి ఆంజనేయుడు. ఆంజనేయుడు శ్రీరామునికి సుగ్రీవునకూ మైత్రిని సంఘటించినవాడు.

ఆంజనేయుడంటే, భగవదన్వేషణాపరమైన బుద్ధి. అం = సర్వ వ్యాపకుడైన విష్ణువును, జనయతి ఇతి, పుట్టించునదికాన అంజనా అవుతుంది. "అంజనాయాః అయం ఆంజనేయః. అంజనకు సంబంధించినవాడు అనగా, సర్వవ్యాపక భగవత్తత్త్వమును ఉపాసించేవాడు, ఆంజనేయుడు. అదే బుద్ధితత్త్వం బుద్ధి నిశ్చయాత్మకం. కాన, మనసు యొక్క సంశయాత్మక మాయను విసర్జింప జేసి విశుద్ధతత్త్వముతో అంటివుండేది బుద్ధితత్త్వం. అహంస్థితి బుద్ధిది ఇదం స్థితి మనస్సుది ఆనందానికి, విశుద్ధ తత్త్వానికి అనుబంధం కల్గించేది. భగవదన్వేషణా పరమైన బుద్ధి. అది విశుద్ధతత్త్వంతో వుంటుంది అన్నదే రామునకూ సుగ్రీవునకూ మైత్రిని కలిపినవాడు ఆంజనేయుడన్న కథా వాక్యానికి అంతరార్థంగా గ్రహించాలి,

వాలి సుగ్రీవులలో రాజైన వాలిని విడిచి సుగ్రీవుని అంటి ఆంజనేయుడు ఉన్నాడు అంటే మనసు తాలూకు మాయను విడిచి విశుద్ధతత్త్వమును బుద్ధిఅంటివుంటుంది అన్న అంతరార్థాన్ని గ్రహించాలి. ఈబుద్ధి విశుద్ధతకూ, భగవంతునికీ మధ్య సంయోజక శక్తిగా పని చేస్తుంది. అదే రామునకు, సుగ్రీవునకు ఆంజనేయుడు మైత్రిని సంఘటింప జేసాడన్నదానిలోని అంతరార్థం.

## స్వయంప్రభ.

కథ:— స్వయంప్రభ అనే ఆమె, సీతాన్వేషణచేస్తూ చీకటిగుహలో ప్రవేశించి దిక్కు తెలియని వానరులను, హఠాత్తుగా బైటపడవేసింది.

స్వయంప్రభా వృత్తాంతం కేవలం అంతరార్థపరంగా అన్వయించుకోతగ్గది. తన గుహలో చీకటిలో చిక్కుకొన్న వానరులకు స్వయంప్రభ తాను తోడ్పడ్డం అన్నది జరిగిన కథగా కన్పించదు. ఆ స్వయంప్రభయొక్క వృత్తాంతం మరి ఎక్కడా కన్పించదు. కావాలని వాల్మీకి సృష్టించిన పాత్రయే ఇది. 'స్వయం ప్రభ' అంటే, తనంతట తానుగా సాధకునిలో పుట్టిన ప్రకాశం. అంటే, స్వయంగా కల్గిన భగవత్ ప్రకాశం అన్నమాట. సాత్త్వికవృత్తులు ప్రకృతిని

అన్వేషించడానికి పూనుకొని బయలుదేరినపుడు అంతలోనే తమస్సు ఆవరించి తిరిగి అంతలోనే స్వయంప్రకాశమైన జ్ఞానం కల్గుతుందనీ, సాత్త్విక వృత్తులతో భగవదన్వేషణ చేసే సాధకులకు ఎదురయ్యే సంసారికబాధలు, హఠాత్తుగా మాయమైపోతాయి; అన్న జ్ఞానమార్గ రహస్యం, స్వయంప్రభా వృత్తాంతంలో అంతరార్థపరంగా స్పష్టంగానే కన్పిస్తూంది.

## సంపాతి కథ.

సముద్రతీరంలో వానరులు ప్రాయోపవేశంచేసి చనిపోవడానికి కృతనిశ్చయులై కూర్చుండి తమలో తాము 'సీతను రక్షించడానికి రావణునితోపోరి ప్రాణాలు విడిచిన జటాయువు మనకంటే ఎంతో ఘనుడు' అనుకుంటూంటే, అక్కడే రెక్కలు కాలిపోవడంవల్ల ఎగర లేక పడివున్న 'సంపాతి' అనే ముసలి గ్రద్ద విని దేకుకుంటూ వారి వద్దకు వచ్చి తన తమ్ముడైన జటాయువుయొక్క మరణవృత్తాంతం వారివల్ల సంపూర్ణంగా విని దుఃఖించింది.

గరుత్మంతుడూ, అనూరుడూ అన్నదమ్ములు. కశ్యపునివల్ల వినతకు కల్గిన బిడ్డలు. అనూరుడికి సంపాతి, జటాయువు అనువారు బిడ్డలు. వీరు చిన్నతనంలోనే తమశక్తిని పరీక్షించుకొనేందుకు పోటీపడి సూర్యుణ్ణి మ్రింగడానికి ఉద్దేశించి ఆకాశంపై కెగిరారు. సూర్యుణ్ణి సమీపించిన జటాయువు సూర్యకిరణాల వేడికి రెక్కలు మాడిపోయే స్థితిలో ఉండగా, సంపాతి సూర్యతాపం తన తమ్ముడికి తగలకుండా తన రెక్కల్ని, జటాయువుకి గొడుగుగా పట్టి నిల్చింది. దానితో జటాయువు బ్రతికేడు. సంపాతి రెక్కలు మాడి ప్రాణావ శిష్టుడై దక్షిణ సముద్రతీరంలో పడిపోయేడు.

సంపాతి, వానరులవల్ల తన తమ్ముని సంగతిని విని ప్రాయోప వేశం చేస్తూన్న వానరులపై జాలిపడి తన నిశితమైన చూపును లంక మీదికి ప్రసరింపజేసి లంకలో రావణుడు సీతను దాచడం, సీత రాక్షస స్త్రీలమధ్య బాధ పడుతూండడం చూచి వారికి ఆసంగతి

చెప్పేడు. అట్లా చెప్పడంతోనే ఆశ్చర్యంగా అతని రెక్కలు తిరిగి మొలిచేయి.

కశ్యపునకు పుట్టిన గరుత్మంతుడూ, అనూరుడూ అనువారు అన్నదమ్ములు. అంటే భగవంతునివల్ల పుట్టిన వేదమూ, వేదాంతములు (ఉపనిషత్తులూ) నమముల్తై అన్నదమ్ములవంటి సాదృశ్యం కలిగినవి, అన్నది అంతరార్థంగా చెప్పాలి. గరుత్మంతుడు ఛందోమయుడు అని ప్రసిద్ధి వుండనేవుంది. కాన గరుత్మంతుడు అంటే కర్మ భక్తి ఉపాసనాసేవాదిరూపమైన యావద్వేదము అనేది అంతరార్థం. 'అనూరుడు' అంటే, అను + ఉరుః; ఉరు అంటే గొప్పవాడు అనగా భగవంతుడు, అనుసరించిన ఉరువు కలవాడు అనూరుడు అవుతాడు. అంటే, భగవంతుని అనుసరించివుండే ఉపనిషద్భాగం, అనగా, వేదాంత భాగం అనూరు పదంవల్ల వ్యక్తమౌతుంది. అనూరునికి పెద్దకొడుకు సంపాతి. సమ్యక్ + పాతి ఇతి సంపాతిః లెస్సగా పడేది అనగా ఊహించగల శక్తి సంపాతి అని పిలవబడుతుంది. ఆ సమ్యక్ శక్తి ఉపనిషద్విజ్ఞానం వల్లనే ఏర్పడుతుంది, కాన అనూరుని కొడుకు సంపాతి అన్నమాటకు ఉపనిషత్తుల వల్ల కల్గిన విజ్ఞానం అనీ, అది భగవంతుని సూటిగా చెప్పగలదనీ చెప్పుకోవాలి. సంపాతి అంటే ఉపనిషద్విజ్ఞానమనీ, జటాయువు అంటే కర్మపరమైన వేదవిజ్ఞానమనీకూడ చెప్పుకొనియున్నాం. ఉపనిషద్వేదాంతఉపనిషద్విజ్ఞానం, ప్రకృతినిగూర్చి దశేంద్రియ ప్రవర్తనను గూర్చి లెస్సగా తెలుపగలది అన్న అంతరార్థాన్ని సంపాతి లంకలోని సీతనుగూర్చి, రావణుని గూర్చి తన గృద్ధచూపుతో (నిశిత దృష్టితో) చూచి చెప్పేడు అన్న మాటవల్ల మనం ఊహించుకోవచ్చు.

తమ బలాబలాలను పరీక్షించుకోవడంకోసం, జటాయువూ, సంపాతీ సూర్యుని పట్టుకోవడానికి ఎగిరేరు. సూర్యుడంటే విజ్ఞాన

* ఉరుక్రముడు భగవంతుడనే అర్థంలో విష్ణు సహస్రనామ స్తోత్రంలో వుంది. గొప్ప క్రమంగలవాడని అర్థం.

రూపప్రకాశంగల భగవంతుడు. జటాయువూ, సంపాతీ అంటే, వేదమూ వేదాంతమూ అనగా ఉపనిషత్తులూ, ఆ పరమాత్మ స్వస్వరూపాన్ని తెలుపడానికి రెండూ యత్నం చేశాయి అని పైదాని అంతరార్థం. జటాయువును సంపాతి రక్షించేడంటే, కర్మఉపాసనా సేవా మార్గాలు, జ్ఞానమార్గంచేత పరిరక్షింపబడవలసినవే తప్ప అవి స్వయంగా పరబ్రహ్మను చూచేశక్తి కలవికావనీ, జ్ఞానమార్గం వానిని నిలువరిస్తుందనీ అర్థం. సంపాతి రెక్కలు మాడిపడిపోయి తిరిగి సీతావృత్తాంతంచెప్పి రామదూతలకు సాయపడ్డంతో రెక్కలు యథాప్రకారం పొందేడు అంటే, జ్ఞానమార్గం అనగా ఉపనిషత్తులు భగవంతుణ్ణిగూర్చి ఎంత చెప్పినప్పటికీ భగవంతునిగూర్చి అజ్ఞాన మార్గంతో ప్రకృతిని ఇంద్రియాలను తెలిసికొని సాత్త్విక వృత్తులను పోషించుకుంటూ సాధనలో భగవదన్వేషణ జరిపినప్పుడే ఆఉపనిషత్తుల విజ్ఞానం అనుభవంతో చరితార్థం అవుతుందనీ, కేవలం జ్ఞానం మాత్రం చాలదని. తెలిసినదానిని సాధనలో ఉంచడమే ప్రధానమనీ పై కథాభాగం మనకు అంతరార్థాన్ని ద్యోతకం చేస్తూంది. సంపాతికథకు అంతరార్థంగాతప్ప బాహ్యార్థంలో ప్రాధాన్యంలేదు. సీతసంగతి చెప్పడానికి అది అంత అవసరంకాదు.

## ఆంజనేయుని జనన వృత్తాంతం.

కథ ;— సముద్రం దాటడానికి ఆంజనేయుడు మాత్రమే సమర్థుడని ఆంజనేయుణ్ణి ప్రస్తుతిస్తారు. వానరులు అంతా. ఆంజనేయుడికి జాంబవంతుడు స్వస్వరూపజ్ఞానాన్ని గుర్తింపజేస్తాడు. "నీవు పుట్టినప్పుడే సూర్యుణ్ణి మ్రింగాలని ఎగిరినాడవు, అప్పుడు నీమీద ఇంద్రుడు వజ్రాయుధాన్ని ప్రయోగించేడు. ఆదెబ్బకునీవు భూమిమీద పడిపోయేవు" అంటాడు జాంబవంతుడు.

ఆంజనేయుడంటే, భగవదన్వేషణాపరమైన బుద్ధి తత్త్వంగా చెప్పుకొని యున్నాము.

బుద్ధి పుట్టినది పుట్టినదిగా ఉంటే, అంటే మాయావరణప్రభావం ఇంకా మీదపడని స్థితిలో వుంటే, భగవదన్వేషణాపరమైన ఆబుద్ధి భగవంతుని సూటిగా గ్రహించే శక్తివంతంగా వుంటుంది అన్నదే ఆంజనేయుడు పుట్టినప్పుడే సూర్యుణ్ణి పట్టుకోవడానికి ఎగిరేడన్నదాని అంతరార్థంగా గ్రహించాలి. సూర్యుడంటే భగవంతుడే. గాయత్రీ మంత్రంలోను, ఆదిత్యహృదయంలోనూ సూర్యుణ్ణి భగవంతుడుగానే చెప్పడం జరిగింది. 'ధ్యేయస్సదా సవితృ మండల మధ్యవర్తీ నారాయణః' అనికూడ వున్నది.

ఇంద్రుడు వజ్రాయుధాన్ని ప్రయోగించి దెబ్బతీయడంతో ఆంజనేయుడు భూమిమీద పడ్డాడు. అంటే, సంశయాత్మకమైన మనస్సు ఇంద్రపదానికి అర్థంగా చెప్పుకొనే వున్నాం. సంశయాత్మక మనస్సు అంటే, మాయావృతమైన మనస్సు భగవంతుని సూటిగా తెలిసికొనాలనే బుద్ధిమీద దెబ్బతీస్తుంది అన్నదే ఇంద్రుడు వజ్రాయుధంతో ఆంజనేయుణ్ణి కొట్టేడన్నదానికి అంతరార్థం. ఇంద్రపదానికి మనస్సుఅనేఅర్థం లోగడ చెప్పుకొన్నాం. అప్పుడు ఆంజనేయుడు భూమిమీద పడ్డాడు; అంటే, తన్ను భగవంతుణ్ణి చేరడానికి ఆటంకం కల్గించిన మాయను అర్థంచేసికొని మాయాతత్త్వాన్ని గ్రహించడానికి భూజాతయైన ప్రకృతిని అన్వేషించడానికి బుద్ధి పూనుకుంటుంది; అన్నది అంతరార్థంగా గ్రహించాలి. ఇప్పుడు భూజాతయైన ప్రకృతి రూపిణిని సీతను సముద్రందాటి తెలిసికొనడానికి నీకంటె సమర్థులు లేరు; అని ఆంజనేయుణ్ణి స్తుతించారంటే బుద్ధి యొక్కటే ప్రకృతి నన్వేషణ చేయగలదని దానికి ఆవరించిన సంశయాత్మక మాయావరణాన్ని ప్రకృతితత్త్వపరిశీలనతో ముగించుకొనడంవల్ల ప్రకృతి దర్శనం లభించగలదని, అంతకుమినహా మరోమార్గం లేదని జ్ఞానమార్గ రహస్యం చెప్పడమే ఆంజనేయుడు సూర్యుణ్ణిమ్రింగడానికి యత్నించిన కథను జాంబవంతుడు చెప్పడంలో వాల్మీకి ఉద్దేశం, అంతరార్థంగా మనకు స్పష్టపడుతూంది.

'యో బుద్ధేః పరత స్తు సః' అన్నది భగవద్గీతావాక్యం. బుద్ధి ప్రకృతిని దాటితే భగవత్ప్రకృతి బోధపడుతుంది; అని దాని అర్థం. రామాయణంలో ఆంజనేయపాత్రతో ప్రకృతిపరిశీలన జరిగింది. తద్వారా ప్రకృతిపురుషుల సమైక్యం జరిగింది. ఇదిసాధనలకో మనలో సాధించడమే ప్రకృతి పరిశీలనలో భగవంతునిలో ఐక్యపడడమన్నా ముక్తిమార్గం పొందడమన్నా.

బుద్ధీంద్రియానికి అవల భగవంతుడున్నాడు అనిభగవద్గీతచెప్తుంది. ఆంజనేయుడు ప్రసన్నుడైనతర్వాతనే శ్రీరాముడు ప్రసన్నుడౌతాడు, శ్రీరాముడు ఆంజనేయుని తన గృహద్వారమందుంచి అతని అనుమతి మీదనే భక్తులకు తాను దర్శనమిస్తాడని ఒక రామాయణంలోఉంది. అంటే బుద్ధీంద్రియముద్వారానే ఆనందరూపభగవానుని దర్శించడం జరుగుతుందని దాని అంతరార్థం. ఆంజనేయుడులేని రామప్రతిష్ఠ ఎచ్చటాఉండదు. శ్రీరాముని సన్నిధిలోనో లేక ఎదురుగానో ఆంజనేయ మూర్తి ఉండితీరాలి. యో బుద్ధేః పరతస్తుసః అన్నదాని అర్థాన్ని రామాంజనేయ ప్రతిష్ఠ చెప్తుంది.

భగవద్గీతలో ఇల్లా వుంది,

**శ్లో॥ తేషాం సతత యుక్తానాం భజతాం ప్రీతిపూర్వకం**
**దదామి బుద్ధియోగం తు యేన మా ముపయాంతి తే॥**

ఎవరైతే నన్ను ప్రీతిపూర్వకంగా నిరంతరం కలిసివుండి సేవిస్తారో వారికి నన్ను చేరుకోవడానికి బుద్ధియోగాన్ని ఇస్తాను. అని భగవంతుడు చెప్తూన్నాడు అని దాని అర్థం.

దీన్నిపట్టి చూస్తే మోక్షంకోరేవాడు నిరంతరం భగవంతునితో కలిసి వుండాలని, అభగవంతుని సంతోషంతో సేవిస్తూ ఉండాలని, అట్లా ఉండేవారికే భగవంతుడు ముందుగా బుద్ధియోగాన్ని ప్రసాదిస్తాడనీ, అబుద్ధియోగంద్వారా సాధన చేస్తేనే వారు ముక్తిపొందుతారని తాత్పర్యం. ఇదే రామాంజనేయుల అవిహతసాన్నిధ్యానికి అంతరార్థంగా గ్రహించాలి.

# సుందరకాండ - యుద్ధకాండలు.

## ఇంద్రియ విలీనీకరణ సాధన.

## సుందర కాండ.


| ప్రవచన క్రమము. | విషయసూచిక. | సాధనాసూచిక | పేజీ. |
|---|---|---|---|
| 1 | నామనిర్వచనం | — | 1 |
| 1. | ఆంజనేయుని సముద్రలంఘనం | — బుద్ధియోగం దైవ యాథార్థ్యాన్ని సాధించుయత్నం | 4 |
| 2. | మైనాక దర్శనం | — అణిమాది సిద్ధులను దర్శించుట | 15 |
| 3. | సురస ఆంజనేయుని బలపరీక్ష చేయుట, | — జన్మవాసనలు బుద్ధియోగమును పరీక్షించుట, | 17 |
| 4. | ఛాయాగ్రాహి నిగ్రహం | — తేజస్సు కృంగజేయు దుష్టశక్తి వినాశం చేయుట. | 18 |
| 5. | లంకిణీ విజయం | — తమోగుణాన్ని నశింపచేసుకొనుట | 20 |
| 6. | ఆంజనేయుని లంకాప్రవేశం | — బుద్ధి తమోలోకాన్ని పరిశీలించుట | 23 |
| 7. | మండోదరిని సీతగా భ్రమించుట | — ఇంద్రియ నిగ్రహవృత్తిని ప్రకృతి రూపంగా పొరపడుట. | 25 |
| 8. | త్రిజటాస్వప్నం | — దివ్యదృష్టి ప్రాప్తి | 28 |
| 9. | అంగుళీయక ప్రదానం | — భగవత్తత్త్వమును ప్రకృతితో చెప్పుట, | 29 |
| 10. | హనుమంతునితో సీత సంభాషించుట | — బుద్ధియోగంతో ప్రకృతియొక్క విమర్శ. | 31 |
| 11. | కాకాసురుని వృత్తాంతం | — ద్వంద్వస్థితిని వశంచేసికొనుట | 34 |

| | | | |
|---|---|---|---|
| 12. | సీతా శిరోమణి ప్రదానం | — ప్రకృతి తన తపనను భగవంతునకు చేర్చగోరుట | 37 |
| 13. | హనుమంతుని తిరుగు ప్రయాణం, రాక్షస వధ | — బుద్ధి ప్రకృతిని తెలిసికొని ఆనందాంశను చేరుకొను దారిలో తమోవృత్తులెదిరించుట, వానిని నాశం చేయుట. | 44 |
| 14. | రావణునకు హనుమంతుని గూర్చి ఆలోచన, | — ఇంద్రియ శక్తికి బుద్ధి సాధ్యపడేది కాదనిపించుట. | 46 |
| 15. | అక్షకుమారవధ | — ఇంద్రియ ప్రాథమిక వృత్తుల నాశం. | 47 |
| 16. | బ్రహ్మాస్త్రంతో ఇంద్రజిత్తునకు హనుమంతుడు లొంగుట | — బుద్ధి మనోవిజయశక్తిని గౌరవించుట | 47 |
| 17. | లంకాదహనం | — తమోగుణ కేంద్రమును ప్రవృతమంగా కాల్చివేయుట | 48 |
| 18. | మధువనప్రవేశం | — తమోగుణ దహనంలో సూక్ష్మోత్సవం. | 52 |

# యుద్ధ కాండ.


| వరుస క్రమము. | విషయసూచిక. | సాధనా సూచిక. | పేజీ |
|---|---|---|---|
| 1. | సేతు నిర్మాణం | – దేవతా యాథార్థ్య ధ్యానమునకు మార్గనిర్మాణ యత్నం | 59 |
| | | కర్మభక్తి యోగజ్ఞాన మార్గాల ద్వారా యాథార్థ్య ధ్యాన సాధన | 59 |
| 2. | రామలక్ష్మణులు వానరులతో లంకలో ప్రవేశించుట. | – బుద్ధియోగంద్వారా జీవ పరమాత్మలు తమోలోకం చేరుకొనుట. | 60 |
| 3. | లంకలోని రావణుని సన్నాహం | – ఇంద్రియ కేంద్రశక్తి ప్రతిఘటన | 62 |
| 4. | వానరుల లంకాప్రవేశం | – సాత్త్విక వృత్తులు తమోలోకం చేరుకొనుట. | 63 |
| 5. | ఇంద్రజిత్తు నాగాస్త్ర-ప్రయోగం | – నాస్తికత్వ మావరించుట | 64 |
| 6. | ఇంద్రజిత్తువలన లక్ష్మణుని మూర్ఛ. | – మనోవిజయ ప్రాబల్యానికి తాత్కాలికంగా జీవుడుకట్టుబడుట. | 66 |
| 7. | ఇంద్రజిత్తుయొక్క వధ | – పదినాల్గుఇంద్రియములలో కాంతి చేకూరినపుడు మాయాజాలం నశించుట. | 67 |
| 8. | కుంభకర్ణుని యుద్ధం | – సంపూర్ణమైన యోగంలోకి తాత్కాలికానందాంశను విలీనం చేయుట | 69 |
| 9. | లంకా పునర్దహనం | – తమోలోకం తిరిగి దగ్ధమగుట | 72 |
| 10. | రామ రావణ యుద్ధం | – పూర్ణానందాంశ సర్వేంద్రియ శక్తితో తలపడుట. | 73 |
| 11. | అగస్త్యునిచేత ఆదిత్య హృదయోపదేశం. | – విశ్వలతత్త్వం సాధకుని ఆనందాంశలో నిలబడుట. | 74 |
| 12. | గాయత్రి మంత్రం | – జపించువానిని తరింపచేయు మంత్రం. | 77 |
| 13. | ఆదిత్య హృదయం | – 'సర్వం ఖల్విదం' సాధనా పరిపూర్ణావిష్కృతి | 79 |
| 14. | రావణ వధ | – సర్వేంద్రియ శక్తి పూర్ణానందాంశలో లీనమైపోవుట. | 99 |

పదానికి విష్ణువును తెలిపే అనే అర్థంలో జ్ఞానం అర్థం. జ్ఞానానికి సంబంధించి యుండెది బుద్ధి. కాన ఆంజనేయుడంటే 'బుద్ధియోగం' అని అంతరార్థం. ఈ విధంగా జ్ఞానాన్ని కాంక్షించే సాధకునిలోని బుద్ధికే ఆంజనేయుడని పేర్కొనబడినది.

" అకారో బ్రహ్మ విష్ణ్వీశ కమఠే ష్వంగణేషు చ

అని నానార్థమాలా నిఘంటువు. అకారము విష్ణువు అను అర్థమును తెల్పును. 'అంజన' లోని 'అం' ద్వితీయా విభక్త్యంతము కాన 'అంజన' అనునది ద్వితీయా విభక్త్యంతముతో అలుక్సమాసముగ చెప్పవలెను. సీత, రాముడు, ఆంజనేయుడు పైవిధంగా ప్రకృతి, పురుషుడు, బుద్ధి రూపాలతో సాధకునిలో ఉన్నవిగా గ్రహింపవలెను

సుందరకాండ కథలో ఆంజనేయుడు నాయకుడు. సంశయాత్మకం మనస్సు అయితే నిశ్చయాత్మకమైనది బుద్ధి. ఆంజనేయుడు బంటుగా ఏర్పడ్డాక రామునికి మానసిక వ్యధలన్నీ పోయేయి. అంటే సాధకుడు బుద్ధియోగాన్ని అందుకుంటే అతనికి ఇక పతనస్థితి ఎన్నటికీ లేదన్నమాట. యోగ సాధనలో చెప్పబడ్డ షట్చక్రాలలో 'అనాహత' చక్రాన్ని చేరితే అదిపతనావస్థలేని యోగస్థితి అన్నమాట. న + ఆహతం = అనాహతం. పెద్దగా దెబ్బ ఏమీలేనిది అనాహతం అన్నదానికి అర్థం. అనాహత చక్రాన్ని చేరేవరకు సాధన చేసిన సాధకుడు ఇక పైకివెళ్ళడమే కాని క్రిందికి పెద్దగా పడిపోవడం అంటూ ఉండడు. ఇదే విధంగా బుద్ధి యోగాన్ని అందుకొన్న సాధకుడు క్రమంగా పరమాత్మలో చేరుకోవడమే తప్ప క్రిందికి దిగజారడం ఉండదుఅన్నది రాముడు ఆంజనేయునిద్వారా సీతను ఏ ఇబ్బంది లేకుండా దర్శించగల్గేడన్న దానిలోని అర్థం. ఇది మనకు అంతరార్థ పరంగా తెలుస్తూంది. బుద్ధి యోగస్థితి దాకా వచ్చిన సాధకుడు ఫలితాన్ని సాధించ గల్గుతాడు. సుందరకాండ పారాయణంచేస్తే సర్వ కామితములూ సిద్ధిస్తాయన్న సాంప్రదాయ వచనానికి ఇదే

కారణం. సుందర కాండకు పూర్వ కాండలలో సాధకునికి సాధనా విస్మృతిని కల్గించే ఎన్నెన్నో దుస్సంఘటనలు వచ్చాయి. సుందర కాండలో అట్టి దుస్సంఘటనలు లేవు. ఏవైనా ఉన్నా అవి అతి సులభంగా అతిక్రమించి వేయబడ్డాయి. కనుక సుందర కాండ సాధకునకు సాధన అన్నిటిలోనూ నిజంగా సుందరమైనదీ, సార్థక మైనదీ యని చెప్పాలి. సుందరకాండ యొక్క విశిష్టత అంతరార్థ పరంగా ఈవిధంగా ప్రకృతిని పరమాత్మలో జతపడడానికి బుద్ధి చేసే పనిగా మనం తెలుసుకోవాలి. ఈవిధమైన అంతరార్థపరంగా తప్ప కేవల వాచ్యార్థ పరంగా సుందరకాండకు విశిష్టత ఏమీ లేదు. వాచ్యార్థంలో కథా పరమైనది సర్వ కామితాల నిచ్చేటంత శక్తి గలది కానేరదు. సుందరకాండ పారాయణం అంతరార్థ పరంగా చేసినప్పుడు సాధకునిలో ముక్తి సాధనకు అడ్డు వచ్చే సుఖ వాసనలు అన్నీ ఫలించి అతనిలో వాసనా రాహిత్యం కల్గించి చివరికి ముక్తి మార్గాన్ని సుగమం చేస్తుంది. ముక్తి మార్గం సుగమం చేసుకోవడానికి ఒక సుందరకాండ మాత్రమే చాలినంత మంత్రశక్తి కలదిగా వుంది. మంత్రం అంటే ఆలోచన అని అర్థం. మంత్రశక్తి అంటే ఆలోచనాశక్తి. సుందరకాండలో ఆలోచనాశక్తితో (తదేక ధ్యానంలో) పారాయణంలో ప్రవేశించాలనీ, అట్లా చేస్తే అన్ని కామితాలు, నెరవేరుతాయనీ, ముక్తికూడా లభిస్తుందని అర్థం. రామాయణంలో ముక్తి సాధనా మార్గాలలో కెల్ల ఉన్నతోన్నతమైనది సుందరకాండసాధన. ఇదిఆంజనేయసాధనగా చెప్పబడింది. పద్నాల్గు ఇంద్రియాలలో ప్రశాంతిని సాధిస్తూన్న సాధకుని ఆత్మ వశంలో వున్న ప్రకృతిని, దశేంద్రియాలూ తమ శక్తినీ పుంజుకొని సంచరించి, మాయా ప్రాబల్యం యొక్క సాయంతో అపహరించడంవల్ల తాను ఎంతగా ఆత్మసాయుజ్యాన్నే కావాలని ఆప్రకృతి కోరుతూవున్నా అది దశేంద్రియ శక్తికి తాను ఖైదీ అయిపోక తప్పింది కాదు. ఆఖైదీని విడిపించి ఆత్మసాయుజ్యం చేకూర్చడానికి సాధకునిలోని బుద్ధి ప్రయ

త్విస్తుంది. ఆ బుద్ధి యోగం చేసే ప్రయత్నమే సుందరకాండ సాధన. అదే ఆంజనేయ సాధన. ఇది ఇంచుమించు చివరి సాధనయే. ఆతరువాత జరిగేది ప్రకృతి పురుషులసంయోగమే. రాముని అరణ్యవాసంయొక్క చివరి దశలో రావణుడు మారీచ సహాయంతో భిక్షుక వేషంలో సీతను అపహరించడం జరిగేక, సీతాన్వేషణకై ఆంజనేయుని సముద్ర తరణం, ముద్రికా ప్రదానం, అక్షాది రాక్షస వధ, లంకా దహనం వగైరా జరగడం అన్నది అంతా పై సాధనా క్రమాన్ని అంతరార్థపరంగా తెలియజేస్తూంది. వాచ్యార్థంలో, కథాపరంగా ఉన్నది ఏవిధంగా అంతరార్థపరంలో ఏభాగం ఏ సాధనను తెలుపుతూందో వివరంగా తెలిసికోడానికి ప్రయత్నం చేద్దాం. ప్రతిశ్లోకానికీ, ప్రతి పదానికీ, ఈసుందరకాండలో అంతరార్థ పరంగా అర్థంవుంది. అయినా గ్రంథ విస్తర భీతిచే కొన్ని ముఖ్యమయిన వాటిని మాత్రమే వివరిస్తూ చెప్తాను.

## ఆంజనేయుని సముద్రలంఘనం.

శ్లో॥ తతో రావణ సీతాయాః
సీతాయాః శత్రుకర్శనః
ఇయేష పద మన్వేష్టుం
చార ణాచరితే పథి॥

సుందరకాండలో మొదటి శ్లోకం ఇది. రావణునిచేత తీసుకొని పోబడ్డ సీతయొక్క జాడను వెదకి తెలిసికోడానికై, శత్రునాశనం చేసే రామదూత అయిన హనుమంతుడు, చారణులనే దేవతలచే సంచరింపబడే ఆకాశమార్గాన్ని పయనించడానికి నిశ్చయించుకొన్నాడు అని శ్లోకంలోని వాచ్యార్థం.

'రావణ' అన్నపదం 'ధ్వనింపచేయు' అనే అర్థం కలది. రావణసీతాయాః - అంటే దశ ఇంద్రియములను అరుచునట్లు చేయుటచేత అంటే ఇంద్రియాల ప్రోద్బలంచేత తీసికొని పోబడ్డ,

సీతాయాః = భూ సంబంధమైన ప్రకృతి యొక్క పదం = స్థానమును గూర్చి (వెదకుటకై)

చారణ + ఆచరితే పథి = చారణులచేత అంటే నడిపించేవారిచేత అనగా గురువులచేత ఆచరితే = బాగుగా నడువబడిన పథి = మార్గమందు, అనగా గురువులు అనుభవించి శిష్యులకు చూపిన జ్ఞాన మార్గమందు అని అర్థం. శత్రు కర్శనః = శత్రువులను కృశింపజేయువాడు అంటే విఘ్నములను తొలగించుకొను శక్తిని సాధించిన నిశ్చయాత్మకమైన బుద్ధియోగము అని అర్థం. సాధకుడు బుద్ధియోగములో, గురువులు నడిచి చూచి చెప్పిన మార్గంలో పయనించి, తనలోని దశ ఇంద్రియ సంచలనము, తనకు తెలియకుండా అపహరించిన ప్రకృతిని ఎక్కడ దాచియుంచినదో వెదకుటకు నిశ్చయించుకొన్నాడని అంతరార్థం. సాధకుడు పూర్వం 14 ఇంద్రియములందు (*దశ ఇంద్రియములు అంతరంగ చతుష్టయము) చలనం లేకుండా ఉండే వివిధ సాధనలు చేసియున్నప్పటికిని, అంతరాంతరములలో ఎక్కడెక్కడనో ఉన్న దశేంద్రియముల సంచలనం ఒక్కసారి పుంజుకొని సాధకుని మోసగించి అతనిలోని భూ సంబంధమైన ప్రకృతిని అపహరించి ఎచ్చటనో అతనికి తెలియనిచోటున దాచివైచింది. దానిని వెదకుటకై సాధకుడు బుద్ధి యోగంతో జ్ఞాన మార్గంలో యత్నించడానికి గురువులు నడిచిన మార్గంలో పయనం సాగించేడని పై శ్లోకానికి అంతరార్థం చెప్పవచ్చు.

---

కర్మేంద్రియములు 5. జ్ఞానేంద్రియములు 5 మొత్తం 10 + అంతరంగ చతుష్టయము : 1 మనస్సు, 2 బుద్ధి, 3 చిత్తము, 4 అహంకారము = 14.

కర్మేంద్రియములు : 1 వాక్కు, 2 పాణి, 3 పాదములు, 4 పాయువు (మలవిసర్జన మార్గము) 5 ఉపస్థ (మూత్ర విసర్జన మార్గము).

జ్ఞానేంద్రియములు: 1 త్వక్కు, (చర్మము) 2 జిహ్వ, 3 నేత్రములు, 4 శ్రోత్రములు, (చెవులు) 5 ఘ్రాణము (ముక్కు).

శ్లో॥ దుష్కరం నిష్ప్రతి ద్వంద్వం
చికీర్షన్ కర్మ వానరః
సముదగ్ర శిరోగ్రీవో
గవాం పతి రివాబభౌ.

తా॥ సాటిలేని దుష్కరమైన పనిని తలపెట్టిన ఆంజనేయుడు, తలను మెడను పైకి ఎత్తిపెట్టిన వృషభం లాగు ప్రకాశించేడు అని బాహ్యార్థం.

వానరః = వాన + రః = వాన అనగా వన సంబంధమైన (వన అనగా జలము) భగవత్ శక్తిని గ్రహించు సాధకుడు. నిష్ప్రతి ద్వంద్వం అంటే ప్రతి ద్వంద్వం లేకుండా, ద్వంద్వాతీత స్థితిని పొందిన విధంగా అని అర్థం. కర్మ చికీర్షన్ = కర్మను చేయదలచినవాడై, సాధకుడు తనయొక్క *హృదయ స్థానమైన అనాహత చక్రమును స + ముత్ + అగ్ర, శిరస్ + గ్రీవః + సముత్ = ఆనందముతో కూడిన, శ్రేష్ఠమైన శిరస్థానీయమైన సహస్రార చక్రముతోను గ్రీవాస్థానమగు విశుద్ధచక్రముతోను కూర్చిన వాడై, గవాం = ఇంద్రియములకు, పతిః ఇవ = ప్రభువగు పరమాత్మ వలె ( ఇంద్రియాతీత స్థితి కలవానివలె ) ఆ బభౌ = చక్కగా ప్రకాశించెను అని అంతరార్థం.

బుద్ధి యోగం అనాహత చక్రానికి సంబంధించినది. ఆ అనాహత చక్రం తర్వాత ఉన్నవి శుద్ధ, ఆజ్ఞా, సహస్రార చక్రములు మూడూ ఆనందముతో నిండి ఉంటాయి. బుద్ధి యోగంతో అనాహత చక్రంలో సంచరిస్తూన్న సాధకుడు తన పై భాగములో నున్న విశుద్ధ ఆజ్ఞాసహస్రార చక్రాల్లో ఉన్న ఆనందాన్ని అందుకొనడంతో పరమాత్మకు సదృశుడౌతాడు. ఇది యోగమార్గ పరమైన అంతరార్థం.

* హృదయస్థానము అనగా హృదయము స్థానముగా గలది అని అర్థం. హృదయము నిశ్చయాత్మకమైనది. అది బుద్ధి. బుద్ధి స్థానం హృదయమే. అది సత్య పరమైనది. ఆత్మకు హృదయమే స్థానము.

'గో' శబ్దానికి ఇంద్రియము అనే అర్థం వుంది. సముదగ్ర శిరో గ్రీవో-శిరస్సు, గ్రీవము అనే పదాలు వాని స్థానములైన సహస్రార, విశుద్ధ చక్రాలను తెల్పుతాయి. నిష్ప్రతి ద్వంద్వం అనేది ద్వంద్వాతీత స్థితిని తెల్పుతుంది. ఈవిధంగా సాధకుని యోగసాధనా ప్రయత్నాన్ని మనం అంతరార్థంలో చూడగలం. ఇంద్రియాతీతస్థితీ, ద్వంద్వాతీతస్థితీ కూడ జ్ఞాన మార్గానికి సంబంధించినవి. అవి రెండూ కూడ బుద్ధి సాధ్యములైయే యున్నవి. విశుద్ధ చక్రమూ, సహస్రార చక్రమూ యోగమార్గానికి సంబంధించినవి. ఈసంగతులు ఇందు తెలుస్తున్నాయి. ఇంద్రియాతీత స్థితీ, అనాహత చక్ర సంచారమూ ఆనందాన్నిస్తాయి. అది బ్రహ్మానందసదృశమై వుంటుంది అనికూడ ఇందుతెల్పబడుతూంది.

'గో' అంటే కిరణం అని కూడ అర్థం వుంది. ఆ కారణంగా గవాంపతి అంటే సూర్యుడనే అర్థంకూడ వస్తుంది. సూర్యునివలె సాధకుని బుద్ధి ప్రకాశించింది అనే అర్థం దానివల్ల వ్యక్తమౌతూంది సూర్యుడు బుద్ధిప్రేరకుడని గాయత్రీ మంత్రార్థం చెప్తూంది. కాన జ్ఞాన మార్గంలో, విజ్ఞాన దీప్తితో బుద్ధి సంచరించింది అనే అర్థం వ్యక్తమౌతుంది. యోగమార్గంలో అనాహత చక్రం లోనికి కుండలినీ శక్తిని నడిపించినపు డది 'తటిత్కోటి నిభా' అని పిలువబడుతుంది. అంటే కోటి మెరుపులకు సాటియై అని సూర్యసామ్యం చెప్పబడింది. యోగమార్గంలోకూడ.

శ్లో॥ స సూర్యాయ మహేంద్రాయ
*పవనాయ స్వయంభువే
భూతేభ్య శ్చాంజలిం కృత్వా
చకార గమనే మతిం॥

తా॥ అతడు సూర్యునకు, మహేంద్రునకు, గాలికి, స్వయంభువునకు, పరమాత్మకు, సర్వభూతములకు అనగా అన్ని ప్రాణులకు నమస్కరించి బయలుదేరేడు.

* పవనా యాత్మయోనయే అని పాఠాంతరం.

'ఆత్మయోనయే' అన్న పాఠాంతరంలో తనకు తండ్రియైన వాయుదేవునకు అని అర్థం.

స సూర్యాయ : బాహ్యార్థంలో సః, సూర్యాయ అని వ్యస్తంగా పదచ్ఛేదం అంతరార్థంలో స సూర్యాయ అని సమాన పరంగా పదచ్ఛేదం చేయాలి. అప్పుడు స సూర్యాయ అంటే సూర్యునితోకూడిన అనే అర్థం వస్తుంది. సూర్యుడంటే 'జ్ఞానప్రకాశం' అని అంతరార్థం. సూరి అంటే పండితుడు. పండితునకు సంబంధించినది సూర్య. అంటే జ్ఞానం. కాన జ్ఞాన దీప్తితో కూడిన అనే అర్థం వస్తుంది.

మహేంద్రాయ : ఇంద్ర అంటే 'మనస్సు' మహేంద్రుడంటే గొప్ప మనస్సు. మనస్సు జ్ఞాన ప్రకాశంతో కూడినది కనుక గొప్పదైనది. అట్టి జ్ఞాన దీప్తిగల మనస్సుకు మొకరిల్లింది సాధకుని బుద్ధి వృత్తి, అని జ్ఞానమార్గంలో అంతరార్థం.

స సూర్యాయ మహేంద్రాయ : సూర్యునితో కూడిన మహా మనస్సు కొఱకు అంటే సూర్యునిచేత ప్రచోదనం చేయబడిన ధీ వృత్తి కొఱకు అనే అర్థంకూడ వస్తుంది. "ధియో యో నః ప్రచోదయాత్" అనే గాయత్రి మంత్రంలో సూర్య తేజస్సు ధీవృత్తులను ప్రచోదనము చేస్తుంది అని వుంది.

స్వయంభువే పవనాయ ; సహజంగా పుట్టిన జీవరూప ప్రాణవాయువునకు అని, స్వయంభూ పదమును 'పవనాయ' అన్నదానికి విశేషణంగా చెప్పాలి. ఆత్మ యోనయే అనే పాఠాంతరములో ఆత్మ యొక్క నివాసమునకు కారణమైన జీవునకు అని అర్థం చెప్పుకోవాలి. భూతేభ్యః = పంచభూతాలకు అని అర్థం, అంజలింకృత్వా = దోసిలితో వినమ్ర స్థితిని పొంది, గమనే = పోవుటయందు సాధనామార్గ గమనమునందు, మతిం = బుద్ధిని, చకార = చేసెను.

యోగ మార్గంలో, 'స సూర్యాయ మహేంద్రాయ' అంటే ఉష్ణిమంతుడై, ఆనంద రూపుడై సహస్రార చక్రంలోనున్న పరమాత్మ కొఱకు అని అర్థం చెప్పవచ్చును. 'పవనాయ ఆత్మ యోనయే' అంటే తనకు కారణమైన వాయువుకొఱకు 'తనకు' అంటే కుంభకం చేసిన వాయువునకు అని, 'భూతేభ్యః' అంటే అనాహత చక్రంలోనుండి విశుద్ధ సహస్రార చక్రాల్లోకి పయనించే దారిలో పలగల పరాపరా శక్తులకొఱకు అనీ అర్థం యోగమార్గ పరంగా చెప్పాలి. యోగమార్గంలోని కుంభక ప్రాణాయామంలో అమనస్కత వల్ల పంచభూతముల యొక్క ప్రభావమూ నిరోధింపబడుతుంది. దానికి ఉపక్రమించేశు సాధకుడు అన్నది ఇక్కడ చెప్పకోవాలి.

శ్లో॥ తతో హి వవృధే గంతుం
దక్షిణో దక్షిణాం దిశం
వవృధే రామవృద్ధ్యర్థం
సముద్ర ఇవ పర్వసు

తా॥ రామునియొక్క సంతోషాభి వృద్ధి కొఱకై సమర్థుడగు ఆంజనేయుడు దక్షిణ దిక్కునకు వెళ్ళుటకు, పర్వ దినములందు సముద్రము పొంగిన విధంగా తన శరీరమును పెద్దదిగా పొంగునట్లు చేసి ఉత్సాహపడెను.

హృదయ కోశంయొక్క దక్షిణంవైపు పరమాత్మయొక్క ఉనికిగా యోగులు గుర్తించి వున్నారు. (శ్రీ రమణ మహర్షులవారు ఆవిధంగా చెప్పినారు) కాన 'ఆ స్థానమునకు యోగమార్గంలో పయనించడం జరుగుతుంది' అని దక్షిణాం దిశం' అన్నదానికి అంతరార్థం. *దేహ పటమునకు (చిత్రమునకు) దక్షిణమున అనగా దేహానికి అధో భాగమ్మున మూలాధార చక్రం ఉన్నది. దానిలో నున్న 'కుండలినీ శక్తిని నిద్రనుండి లేపి సహస్రారం లోనికి చేర్చుటకు కుంభకంతో

---

*భూగోళ శాస్త్రంలో దేశపటంయొక్క దిక్కులను గుర్తించేటప్పుడు ఆ బొమ్మయొక్క అధోభాగాన్ని దక్షిణదిక్కుగా చెప్తారు.

యోగులు మూలాధారం లోనికి బుద్ధిని ప్రవేశింపజేస్తారు అనికూడా 'దక్షిణాం దిశం' అన్నదానికి అంతరార్థంగా చెప్పవచ్చును. 'రామ 'వృద్ధ్యర్థం' అంటే ఆనందాభివృద్ధికొఱకు అని జ్ఞానయోగ పరముగా అంతరార్థం సాధకుడు రాముడుకాన అంతకుపూర్వము తానుఆనందం యొక్క అర్ధాంశం మాత్రమే కలవాడు అయినా ఇప్పుడు ఆ ఆనందానికి పూర్ణత్వాన్ని సాధించడానికే ఈ ప్రయత్నం అని, వృద్ధ్యర్థం పదానికి విశేషార్థం చెప్పవచ్చును. 'సముద్ర ఇవ' స + ముత్ + ర=సముద్ర, ముద్ర అంటే సంతోషమును గ్రహించువాడు (ముత్ సంతోషమును ర=గ్రహించువాడు) ఈవిధంగా 'సముద్ర ఇవ' పదం సంతోషంతో కూడినవాడువలె అనే అర్థాన్ని ఇస్తుంది. సాధకుడు బ్రహ్మానందం సాధించినవాడువలె ఉన్నాడు అని జ్ఞానపరమైన అంతరార్థం ఇందులో ఉంది. సముద్ర ఇవ పర్వసు : పర్వసు=కణుపులందు, అనగా బ్రహ్మదండముయొక్క (వెన్నుపూసయొక్క) కణుపులందు (గ్రంధులందు) అనగా మూలాధారంనుండి శిరస్సువరకు ఉన్న వెన్నెముకద్వారా వాయువును బంధించి కుండలినీశక్తిని లేపునపుడు దారిలోనున్న ఆవెన్నెముకలోని బ్రహ్మ గ్రంధి, రుద్రగ్రంధి, విష్ణు గ్రంధి అనే కణుపులందు ఆనందం నిండిపుంటుంది అన్నది యోగ పరమైన అంతరార్థం.

> శ్లో॥ సలిలం సంప్రసుస్రావ మదం మత్త ఇవ ద్విపః
> పీడ్యమానస్తు బలినా మహేంద్ర స్తేన పర్వతః
> రీతీ ర్నిర్వర్తయామాస కాంచ నాంజన రాజతీః

బలవంతుడైన హనుమంతుని పాద ఘాతములచేత పీడింపబడిన ఆమహేంద్ర పర్వతం ఏనుగు మదమును జార్చినట్లు జలమును జార్చుచు, బంగారు, వెండి, కాటుకల రంగులను బైటకు వెడలగ్రక్కెను అని బాహ్యార్థం.

సాధకునిలోని ఆంజనేయునిచేత అనగా భగవత్సాక్షాత్కార సంబంధమగు బుద్ధిచేత 'పర్వతః మహేంద్రః' 'మహేంద్ర పర్వతం'

అనగా మనస్సు, పర్వతము వలె కర్కశమైన మనస్సు, నిగ్రహింప బడ్డంవల్ల ద్రవత్వాన్ని పొందింది. అంటే అంతకు పూర్వం కర్కశమైన గొప్పదైన మనస్సు మార్దవస్థితిని పొందింది అని అంతరార్థం. ఆ మార్దవస్థితిని పొందేటప్పుడు బంగారు, వెండి, కాటుక రంగులు అనగా రాజసిక, సాత్త్విక, తామసిక గుణములు వెలికి వెడలి పోవడం జరిగింది అని జ్ఞానపరమైన అంతరార్థం. ఎరుపుకలిసిన పసుపురంగు బంగారు రంగు. అది రాజస గుణమునకు, వెండిరంగు తెలుపురంగు. అది సాత్త్విక గుణమునకు, కాటుక రంగు నలుపురంగు అది తామసిక గుణమునకు గుర్తులు. అవి వాటంతట అవే ఎగిరి పోయాయి. అనగా సాధకుడు తాను త్రిగుణాతీత స్థితిని నొందినాడని అర్థం.

మహా+ఇంద్రః, అంటే, గొప్ప మనస్సు అని అర్థం. ఇంద్ర పదానికి మనస్సు అనే అర్థాన్ని లోగడ చెప్పుకున్నాం. ఇక యోగ మార్గంలో 'పర్వతః' అంటే పర్వములనుండి అనగా కణుపులనుండి అనగా వెన్నెముక కణువుల (పూసల) నుండి అని అర్థం. పర్వ శబ్దమునకు పంచమ్యర్థంలో 'తసిల్' ప్రత్యయం వస్తుంది. గ్రంథుల నుండి సాత్త్విక, రాజసిక, తామసిక గుణాలు ద్రవించి కారిపోయాయి అని యోగపరమైన అర్థం చెప్పుకోవచ్చు. కుంభకయోగంతో కుండలినీశక్తి లేపబడ్డప్పుడు వెన్నెముకద్వారా ఆశక్తి పయనించడంతో త్రిగుణాలు నశిస్తాయి అనే యోగ రహస్యం ఇందు వ్యంగ్యం చెయ్యబడుతూంది.

శ్లో॥ గిరిణా పీడ్యమానేన పీడ్యమానాని సర్వతః
గుహాగతాని భూతాని వినేదు ర్వికృతైః స్వరైః॥

మహేంద్ర పర్వతం ఆంజనేయుని పాదఘాతములచేత పీడింపబడ్డంతో అందలి గుహల్లో ఉన్న జంతువులన్నీ భయంతో వికృతంగా కూస్తూ పారిపోయినవి అని బాహ్యార్థం.

సాధకుని బుద్ధి, మనస్సును నిశ్చలమగునట్లుగా నిగ్రహించడంతో, హృదయ గుహాంతరాలలోనున్న కర్మవాసనలన్నీ కదలింపబడి ఇంద్రియారావములతో శిథిలములై ధ్వనిస్తూపోయాయి అని అంతరార్థం.

శ్లో॥ దర్శయంతో మహావిద్యాం
విద్యాధర మహర్షయః
సప్రియా స్తస్థు రాకాశే
వీక్షాం చక్రుశ్చ పర్వతం॥

విద్యాధరులును, మహర్షులును భార్యలతోకూడి ఆకాశమందు నిలబడి హనుమంతుని గొప్ప తెలివిని ఒకరికొకరు చూపించుచున్నవారై పర్వతము వైపు చూశారు అని వాచ్యార్థం.

మహా విద్య, యనగా మోక్షప్రాప్తి కరమైన శ్రీవిద్య. ప్రకృతిని పరమాత్మలో లీనంచేసే సాధనలు గల విద్య 'శ్రీ విద్య' అను పేరున పిలువబడుతుంది. విద్యాధరులైన మహర్షులు అని కర్మధారయ సమాసం చేస్తే శ్రీ విద్యను ఉపాసిస్తూ సాధన చేస్తూన్న మహర్షులు; అంటే సాధకునిలోని పూర్వసాధనలు అని అర్థంవస్తుంది. అవి సాధకునిలోని క్రొత్త సాధనా విధానమును తాము అర్థం చేసికుంటూ హృదయ కోశంలో నిలిచి మనోగతులను తెలిసికొంటూన్నవి అంటే సాధకునిలోని పూర్వానుభవం ప్రస్తుతానుభవాన్ని ఆకట్టుకుంటోందని అర్థం.

శ్లో॥ సముద్రస్య పరం పారం
దుష్ప్రాపం ప్రాప్త మిచ్ఛతి
ఇతి విద్యాధరా శ్శ్రుత్వా
వచ స్తేషాం తపస్వినాం
తమప్రమేయం దదృశుః
పర్వతే వానరోత్తమం॥

ఇతడు ఎవ్వరూ చెయ్యలేని పని చేస్తున్నాడు. సముద్రం యొక్క అవలి గట్టుకి దాటుతున్నాడని అన్న తపస్వుల మాటలను విద్యాధరులు విని ఆ అప్రమేయుణ్ణి అంజనేయుణ్ణి పర్వతంమీద చూశారు.

'సముద్రం' అంటే ఆనందముతోగూడిన పరమాత్మను గ్రహించునది. (స + ముత్ + ర: సముత్ = ఆనందముతోగూడిన పరమాత్మను 'ర' రాతి గృహ్ణాతి ఇతి రః అంటే గ్రహించునది) అంటే పరమాత్మను గ్రహించే శ్రీ విద్య అని అంతరార్థం.

సముద్రం అంటే దేవతా యాదార్థ్య చింతనము అని వేదార్థాన్ని చెప్పే భారతీ నిరుక్తి అనే గ్రంథంలో వ్రాయబడివుంది. దేవత యొక్క అంటే ప్రకాశరూప పరమాత్మయొక్క యాథార్థ్యం అంటే నిజతత్త్వాన్ని, చింతనము అంటే పదే పదే ధ్యానించుట అని అర్థం. అదేఅర్థాన్ని సముద్ర పదంయొక్క వ్యుత్పత్త్యర్థంవల్ల చెప్పవచ్చును. సముద్రం యొక్క ఆవలియొడ్డును చేరటం అంటే దేవతా యదార్థ్య చింతనయొక్క సంపూర్ణ జ్ఞానమును పొందడం అన్నమాట. అంటే శ్రీవిద్యలో పరిపూర్ణతను పొందడం. ఇక్కడ సాధకునిబుద్ధి "శ్రీదేవి" యొక్క అనగా ప్రకృతియొక్క స్థానం ఎచ్చట వుందో దాని యాథార్థ్యాన్ని సంపూర్తిగా తెలిసికొనడానికి సంకల్పించింది. ఇది శ్రమ సాధ్యమైన పని కాన ఈ సాధకుడు అప్రమేయుడు. అని శ్రీవిద్యను తెలిసిన సాధకులు అనగా సాధకునిలోని పూర్వానుభవాలు ఆశ్చర్యంతో వరికించడం జరిగింది. 'వానరోత్తమం' అంటే శ్రేష్ఠమైన భగవత్సంబంధమైన శక్తిని గ్రహించిన సాత్త్విక వృత్తి అని అర్థం. వాన=వనసంబంధమైన అనగా జలసంబంధమైన అనగా భగవంతుడు జలములో ఆదికాలములో 'అప ఏవ స సర్జాదౌ తాసు వీర్యమపాసృజత్' అన్న ప్రకారం ఉంచిన శక్తి అని అర్థం. వాన+ర = జలసంబంధమైన భగవత్ శక్తిని గ్రహించునట్టి సాత్త్విక వృత్తి అని అర్థం.

శ్లో॥ యం యం దేశం సముద్రస్య
జగామ స మహా కపిః
స స త స్యోరు వేగేన
సోన్మాద ఇవ లక్ష్యతే॥

అంజనేయుడు సముద్రంలో ఏయే భాగాలవైపు ఎగిరి వెడుతున్నాడో ఆయా భాగాల్లో అతని తొడలయొక్క వేగానికి చలించినవై అలలు అందు పిచ్చెత్తినట్లు కల్లోలితములయ్యాయి అని బాహ్యార్థం.

సాధకుని బుద్ధి దేవతా యథార్థ్య చింతనంతో ఏ యే ఘట్టాలలో సంచరిస్తూందో ఆయా ప్రతి ఘట్టంలోనూ అతనిలోని భగవచ్చింతన యొక్క వేగంచేత, త స్యోరు వేగేన, తస్య+ఉరువేగేన — ఊరు అంటే భగవంతుడు, గొప్పవాడు అని అర్థం. ఉరుక్రముడనే పేరు భగవంతునికుంది. సోన్మాద ఇవ లక్ష్య తే (స+ఉత్+మా+ద = సోన్మాదః) అంటే స+ఉన్మాదః ఉత్ = గొప్పదైన, మా=ప్రకృతితో (శ్రీదేవితో) స= కూడినట్టి స్థితి, సోన్మా అవుతుంది. దఇవ=ఇచ్చు వానివలె కన్పట్టుచున్నది. గొప్పదైన శ్రీ పరదేవతా సాక్షాత్కార స్థితిని పొందినది వలె ఆ బుద్ధి కన్పట్టుచున్నది అని అంతరార్థం.

సాధకుని బుద్ధి సాధనలో ప్రవేశించిన ప్రతీ ఘట్టమునందు శ్రీ పరదేవతా సాక్షాత్కార స్థితిని పొందెనా అనిపించేటట్లు తన్మయతలోనున్న సంగతి స్పష్టమౌతూంది. అంతేకాక సాధకుడు సర్వ ప్రకృతిని పరబ్రహ్మ స్వరూపముగ చూడగల్గుచున్నాడు అని జ్ఞాన పరమైన మఱొక అర్థంకూడ కన్పిస్తున్నది,

యోగ పరమున — స+ఉన్మాదః ఇవ సోన్మాదః ఇవ = పిచ్చెత్తినవాడువలె కన్పట్టు చున్నాడు. పరదేవతా సాక్షాత్కార సమయంలో సాధకుడు ఇతరులకు పిచ్చెత్తినవాడు వలె కన్పిస్తాడని అర్థం. పూర్ణ జ్ఞానులు బాలోన్మత్త పిశాచములవలె ఉంటారని గ్రంథాలు చెప్తున్నాయి. శ్రీరామకృష్ణ పరమహంస కాళీ దేవతారాధనలో

ఒడలు మఱచి కాళీ దేవిమీద వేయవలసిన పూవులు తన నెత్తి మీదనే వేసికొనేవాడనీ, నైవేద్యం పిల్లికి పెట్టేవాడనీ ఆయనను గూర్చిన చరిత్రలో వ్రాసేరు. ఇది భక్తిపరమైన ఉన్మాదస్థితి.

'సో ఉన్మాద ఇవ' అని పూర్వ రూప సంధి చెప్పి సః+అత్ +మా +దః+ఇవ అని విడదీయవచ్చును. అప్పుడు సః = ఆ సాధకుడు, అత్ = భగవంతుని వలె ఆచరించుచున్న మా = ప్రకృతిని దః ఇవ = ఇచ్చువాడువలె కన్పట్టుచున్నాడు. అనగా ప్రకృతిని పర బ్రహ్మ స్వరూపంగా చూచు అనుభవం పొందిన వాడువలె కన్పట్టు చున్నాడు అనే భావంకూడ చెప్పుకోవచ్చు. 'అత్' అనుదానిలోని అకారమునకు 'అకారో బ్రహ్మ విష్ణ్వీశ కమఠే ష్వంగణేషుచ' అన్న నిఘంటువు వల్ల సర్వ వ్యాపకుడను అర్థమిచ్చే విష్ణువుగా అర్థం చెప్పవచ్చు. అ, అకారము మీద ఆచారార్థమున 'క్విప్' ప్రత్యయం చేస్తే 'అత్' అనే రూపం ఏర్పడుతుంది.

"ఏఙః పదాంతా దతి" అనే పూర్వ రూప సంధి సూత్రముచే సోఉన్మాదః అవుతుంది సః+అత్+ మా+దః అని పదచ్ఛేదం అప్పుడు సాధ్యమౌతుంది.

ఈవిధంగా సుందరకాండలోని ప్రతి శ్లోకానికీ, ప్రతి పదానికీ అంతరార్థం చెప్పడానికి వీలువుంది. అదంతా చెప్పడం ప్రారంభిస్తే సామాన్య పాఠకులకు విసుగెత్తుతుందేమో. దానివల్ల ఈగ్రంథాన్ని సాంతంగా చదవరేమో అనే భయంచేత శ్లోకాలు ఉదహరించటం చాలవరకు మానివేసి ఇకనుంచి కథా భాగం చెప్పి దాని అంతరార్థం చెప్తాను. బాగా అవసరమైనచోట శ్లోకాన్ని ఉదహరిస్తాను.

## మైనాక దర్శనం.

కథ :— సముద్రుని ఆదేశంతో మైనాకపర్వతం ఆంజనేయ మూర్తికి మార్గమధ్యంలోనే ఎదురుపడి తన మీద కొంచెంసేపు విశ్ర

మించి తన ఆతిథ్యాన్ని స్వీకరించి వెళ్ళవలసిందనీ, నీతండ్రియైన వాయుదేవుడు, ఇంద్రుడు పర్వతాల రెక్కలు తెగకొట్టి వేస్తున్నప్పుడు నన్ను ఇంద్రుని బారినుండి తప్పించి తన గొప్ప వేగంతో సముద్రంలో పడవేసి ఉపకారం చేశాడనీ, ఆ ఉపకారానికి ప్రత్యుపకారంగా అతని కుమారుడవైన నిన్ను సేవించడం నా ధర్మమనీ చెబుతుంది. తన బంగారు శిఖరాలమీదనున్న ఫల వృక్షాల నుండి ఫలాల్ని ఆరగించి వెళ్ళ వలసిందిగా ఆపర్వతం ఆంజనేయుణ్ణి ప్రాధేయపడి ప్రార్థిస్తుంది. ఆంజనేయు డందుకు ఒప్పుకోక ఆతని శిరస్సును చేతితో నిమిరి బుజ్జగించి వదలివేస్తాడు.

అంతరార్థం : ముక్తి సాధనలో ఎన్నో లాభాల్ని కలిగించే సిద్ధులు సాధకునికి తమంత తాము వశమౌతాయి. కాని సాధకుడు వానిని స్వీకరిస్తే వాటి ప్రలోభంలోపడి అసలు సంగతి మరచి భ్రష్టు డౌతాడు. అందుచేత వాటిని విడిచివేస్తాడు.

మే+నాకః (అలుక్సమాసం) మేనాక ఏవ మైనాకః స్వార్థే కః ప్రజ్ఞా+ద్యణ్ అనుదానివేత స్వార్థంలో అణ్ ప్రత్యయంద్వారా ఆది వృద్ధి వచ్చింది. అప్పుడు మేనాక అనునది 'మైనాక' అవుతుంది

మే+నాకః అంటే నాయొక్క స్వర్గం అని అర్థం. సాధకుని భ్రష్టుణ్ణి చెయ్యడానికి ఇదొక రకమైన లాభ ప్రలోభ విఘ్నం. సాధకుడు కోరిన లాభం కల్గించి వానిని సాధననుండి భ్రష్టుణ్ణిచేసే విఘ్నాలు ముందుగా ఎదురౌతాయి. 'నాయొక్క స్వర్గం అనిపించే అష్ట సిద్ధులు సాధకుణ్ణి 'నన్ను స్వీకరించు, నన్ను స్వీకరించు' అంటూ వెంటబడుతాయి. ఇచ్చట మైనాకుడు అన్న పదంలోని అంతరార్థం గ్రహించినప్పుడు, ఆంజనేయుని మైనాకుడు ఫలాలను స్వీకరించవలసిందని ప్రార్థించడం అనేది అష్టసిద్ధులు తమంత తాము సాధకునికి వశపడడం అని అంతరార్థ పరంగా చెప్పకోక తప్పదు. ఆసిద్ధుల్ని సాధకుడు సగౌరవముగా వదలివేయడమే మైనాకుని

ఆంజనేయుడు తల నిమిరి బుజ్జగించి విడువడంలోని అంతరార్థం. సాధకుని ప్రలోభపెట్టే విఘ్నాలుగా అష్ట సిద్ధుల్ని భావించాలి అన్న రహస్యం ఇందులో చెప్పబడింది.

## సురస ఆంజనేయుని బలపరీక్ష చేయుట.

కథ :— దేవతలు 'సురస' అనే నాగమాతను రాక్షసిరూపంలో ఆంజనేయుని బల పరీక్షకు పంపిస్తారు. ఆంజనేయుడు ఆపె తన్ను మ్రింగడానికి అది నోరు పెద్దది చేస్తే దానిలో పట్టకుండా ఉండేటంతగా తన దేహాన్ని పెద్దది చేసి చివరకు ఆపె చాల పెద్దదిగా నోరు తెరచి నప్పుడు హఠాత్తుగా ఆంజనేయుడు తాను సూక్ష్మరూపంలో అందులో ప్రవేశించి తిరిగి బైటకు వచ్చేస్తాడు. అప్పుడు సురస ఆశ్చర్యపడి ఆంజనేయుని మెచ్చుకొని తాను ఆంజనేయుని బలపరీక్షార్థం దేవతలచే పంపబడ్డ నాగమాతనని చెప్పి అతణ్ణి ఆశీర్వదిస్తుంది.

'సురస' అంటే సు=చక్కని — సుఖాన్ని కల్గించేటటు వంటి రస=రసములు అనగా జన్మ వాసనల ప్రవృత్తి, అది నాగమాత. దానిని దేవతలు పంపేరు. దేవతలు అంటే సాధకునిలోని దివ్యజ్ఞానానికి సంబంధించిన మనో వృత్తులు. అవి సాధకుని సాధనాబలాన్ని పరీక్షించడానికి పూనుకొని నాగమాతయైన సురసను పంపించేయి అన్నమాట.

నాగమాత — న+అగ = నాగ అవుతుంది. 'అగ' అంటే కదలనిది. అనగా నిశ్చలతత్త్వం. న+అగ = నాగ అంటే, నిశ్చలతత్త్వం లేకుండా చేసేది. నిశ్చలత్వానికి వ్యతిరేకములు అనగా నిశ్చలత్వాన్ని భంగంచేసే వాసనలకు సంబంధించిన మనోవృత్తులు నాగములు అనిపించుకుంటాయి. నాగములకు మాత సురస. అంటే, నిశ్చలతత్త్వాన్ని భంగింపజేసే నీచ మనో వృత్తులను సృష్టించే సుఖ వాసనలు కలది. అని అంతరార్థం.

సు=చక్కని; సుఖములను కల్గించే రస=వాసనలు కలది సురస. అంటే, సుఖముల నిచ్చే వాసనా వృత్తులను సృష్టించేది 'సురస' అవుతుంది. అది నాగమాత, అంటే, నిశ్చల తత్త్వమైన బ్రహ్మజ్ఞానాన్ని నాశంచేసేదన్నమాట. 'సురసాం నాగమాతరం' అన్న వాల్మీకివాక్యంలో, నాగమాతయైన సురస అనిదానికి అర్థం. సాత్త్విక గుణానికి సంబంధించిన వాసనలు సుఖములను కల్గిస్తాయి. దుఃఖాల్నిచ్చే వాసనలువలె ఈ సుఖవాసనలుకూడ బ్రహ్మజ్ఞానికి ప్రతిబంధకాలే. సంకెళ్ళు బంగారపువైనా ఇనపవైనా బంధించడంలో సమానమే కాన సాధకుడు దుఃఖములను వలె సుఖములనుకూడ విడిచివేస్తాడు. ఆత్మజ్ఞాన సాధకుడు ఎట్టి సుఖవాసనలకూ లొంగకుండా అంటే ఎంతెంత గొప్ప సుఖాలు వచ్చినా లొంగక వానిని విడచివేస్తాడు అన్నది సురస నోరు ఎంతగా తెరచినా ఆంజనేయుడు అది పట్టనంతగా శరీరాన్ని పెంచడంలోని అంతరార్థం. చివరకు దానినోట ప్రవేశించి తిరిగి నిర్గమించడం అన్నది వాసనలు తనలో చోటు చేసికొన్నా తన్ను అవి వశపరచుకోలేవని సాధకుడు నిరూపించడం అనే అంతరార్థాన్ని వెల్లడిస్తోంది. తాను అనుభవించినాకూడా వాసనల వల్ల కలిగే సుఖదుఃఖాలు తనకు అంటవు. అంటీ ముట్టకుండా అసంగయోగంతో (నిస్సంగత్వంతో) సుఖదుఃఖాల్ని అనుభవించడం అనే సాధనా రహస్యం సాధకుడు గ్రహించినట్లు ఇందులో ద్యోతక మవుతూంది.

## ఛాయాగ్రాహి నిగ్రహం

కథ :— 'సింహిక' అనే ఛాయాగ్రాహి తాను సముద్రంలో కనిపించకుండా ఉండి పైనుండి ఎగురుచున్న ఆంజనేయునియొక్క నీడను ఆక్రమించి అతని గమనాన్ని ఆపివేసింది. "సముద్రంలో సింహిక గమనాన్ని నిరోధం చేస్తుంది. జాగ్రత్త". అని సుగ్రీవుడు ఆంజనేయునికి బయలుదేరేముందు హెచ్చరిక చేసి పంపించేడు ఆంజనేయుడు దానికి ఏమీ కంగారుపడలేదు. సముద్రంమీదికి

దిగి ఆ ఛాయాగ్రాహిని ఒక తన్ను తన్ని దాన్ని నాశనంచేసి పైకెగిరి వెళ్ళిపోయాడు.

అంతరార్థం :—

సాధనలో ఇదొక హఠాత్తుగాజరిగే అపూర్వ విఘ్నం. సాధకునిలోని విశుద్ధ తత్త్వం ఈ విఘ్నాన్ని ముందే గుర్తించి హెచ్చరిక చేస్తుంది. అదే సుగ్రీవుడు ముందుగా ఆంజనేయుని హెచ్చరిక చెయ్యడమంటే.

సుగ్రీవుడు అంటే విశుద్ధ తత్త్వం. గ్రీవాస్థానం విశుద్ధ తత్త్వానికి సంబంధించింది.

ఛాయాగ్రాహి అంటే నీడను పట్టుకొని గమన వేగాన్ని ఆపివేసే గ్రహం అని వాచ్యార్థం. అంతరార్థంలో ఛాయా అంటే కాంతి. సాధకుని సాధనా తేజస్సునే 'ఛాయ' అనాలి. ఆ సాధనా తేజస్సును కుంచింపజేసే ప్రబలమైన ఆటంకమే ఛాయాగ్రాహి అంటే. అది హింసించేది కాన దానికి 'సింహి' అని పేరు.

'సింహి' అనే పదం మీద స్వార్థంలో 'క' ప్రత్యయం చేస్తే 'సింహిక' అవుతుంది. మూలరూపం సింహి. దీన్ని తలక్రిందుచేసి దీనికి వ్యుత్పత్త్యర్థాన్ని గ్రహించాలి. 'సింహి' పదాన్ని తలక్రిందుగా చదివితే 'హింసి' అవుతుంది. 'హింసి' అంటే బాధించునది అనిఅర్థం. సాధకుని బాధించే విఘ్నమే 'సింహిక' అని పేర్కొనబడింది.

సాధకుడు తనకు ఎదురైన ఆటంకాలను జ్ఞానదృష్టితో ఎదుర్కొని నివారించుకోవలెను. అనే సాధనా రహస్యం సుగ్రీవుని హెచ్చరికతో ఆంజనేయుడు సింహికను నిగ్రహించేడు. అన్నదానిలో ద్యోతకమౌతుంది.

**శ్లో॥ తత శ్శరీరం సంక్షిప్య మహా పర్వత సన్నిభం**
**పునః ప్రకృతి మాపేదే వీతమోహ ఇ వాత్మవాన్॥**

ఆంజనేయుడు సముద్రాన్ని దాటిన తర్వాత పర్వతంలాగున వున్న తన పెద్ద శరీరాన్ని చిన్నదిగా చేసి అజ్ఞానాన్ని విడిచి ఆత్మ వంతుడైన జ్ఞానివలె మామూలు శరీరస్థితిని తిరిగి పొందేడు అని శ్లోకానికి అర్థం.

ఆంజనేయుడు తాను పెంచిన పెద్ద శరీరాన్ని విడిచి తన మామూలు చిన్న శరీరాన్ని తిరిగి తాల్చేడు అని చెప్పినపుడు అజ్ఞానాన్ని విడిచిన ఆత్మజ్ఞాని లాగు తాను పెంచుకొన్న మాయను తానే విడిచివెయ్యాలన్న బోధతో ఉపమానం చెప్పడంలోనే వాల్మీకి తన కావ్యంలో జ్ఞాన విషయానికి ప్రాధాన్యం ఇచ్చి వున్నాడని స్పష్ట పడుతూంది. కాకపోతే కేవలం భౌతిక దేహం యొక్క మార్పునకు ఉపమానం ఆధ్యాత్మికంగా చెప్పడం దేనికి? భౌతికానికి సంబంధించిన వర్ణన భౌతిక వస్తువుల ఔపమ్యంతోనే ఉండడం సహజపద్ధతి. తన కావ్యంలోని భౌతికంలో ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని అంతరార్థంగానే నిక్షేపించి వున్నాడు కనుకనే వాల్మీకి ఇటువంటి ఉపమానాలవల్ల ఆవిషయం స్పష్టపరుస్తున్నాడని మనం గ్రహించాల్సి వుంటుంది.

## లంకిణీ విజయం

లంకా పట్టణం, రూపాన్ని ధరించి 'లంకిణి' అనే పేరుతో ఆంజనేయుణ్ణి చూచి,

" అహం రాక్షస రాజస్య రావణస్య మహాత్మనః
ఆజ్ఞా ప్రతీక్షా దుర్ధర్షా రక్షామి నగరీ మిమామ్॥ "

" నేను గొప్పవాడైన రాక్షసరాజగు రావణుని యొక్క ఆజ్ఞను పాలిస్తూ ఈ పట్టణాన్ని రక్షిస్తున్నాను. నన్ను ఎవ్వరూ ఎదుర్కొ లేరు " అంటుంది. అడ్డగిస్తుంది. వెంటనే అంజనేయుడు ఆమెను గట్టిగా ఒక్క చెంప పెట్టు పెట్టాడు. దానితో లంకిణి తల తిరిగి "లోగడ నాకు బ్రహ్మదేవుడు "నీవు అంజనేయుడిచేత దెబ్బ తిన్న

తర్వాత లంకలోని రాక్షసులకు వినాశకాలం వస్తుంది" అని చెప్పేడు. "ఇక నాకు సెలవు. నీవు స్వేచ్ఛగా లంకలోకి ప్రవేశించి నీపను అన్నీ చక్క పెట్టుకో. నీవు సీతాదేవిని చూడాలని వచ్చేవు. నీ ఇష్టం వచ్చినట్లు లంకంతా గాలించుకో." అని చెప్పి ఆ లంకాధిదేవత ఆంజనేయుడివద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోతుంది.

ఈ లంకాధి దేవత ఎవరు? పట్టణం, రూపాన్ని ధరించడం ఏమిటి? ఇది జరిగే పనేనా? పోనీ, రాజైన రావణుడు తన్ను లంక లోనికి ఎవరూ రాకుండా చూడుమని ఆజ్ఞాపిస్తే, దెబ్బ తిన్న వెంటనే బ్రహ్మదేవుడి మాట గుర్తుకు వచ్చి ఆంజనేయుడికి లంకాప్రవేశాన్ని అనుమతించడంఏమిటి? తాను రావణుని ఆజ్ఞానువర్తినియై యున్నప్పుడు తాను ఆంజనేయుణ్ణి అడ్డగించలేకపోతే వెళ్ళి రాజుతో చెప్పాలి. లేదా యుద్ధంచేసి చావాలి. అంతేకాని తానే ఇష్టపడి ఆంజనేయుణ్ణి లంకలో సీతను స్వేచ్ఛగా వెతుక్కోమని చెప్పడం ఏమిటి? ఇది భృత్య ధర్మ మేనా? తన ఇష్టం వచ్చినట్లు తాను చేయవచ్చునా? బ్రహ్మదేవుడు తనకు రాక్షస వినాశకాలం నిర్ణయించి ఎందుకు చెప్పవలసివచ్చింది? ఒకవేళ చెప్తే తాను ఆబ్రహ్మ మాటల్ని రాజైన రావణునితో లోగడనే చెప్పివుండవద్దా? తాను రాజుచేత పోషింపబడుతూన్నప్పుడు ఆరాజు యొక్క మంచి చెడ్డలతో తనకు పనిలేదా! నిజంగా అవిధంగా జరిగిందా? ఇటువంటి అసంబద్ధ విషయాలు చూస్తే ఇందులో అంత రార్థం ఏదో నిక్షేపింపబడి వుంటుందని అనిపిస్తోంది.

'లంకా' అనే పదాన్ని తలక్రిందుగా చదువుతే 'కాలం' అని అవుతుంది. కొన్నిపదాలకు వ్యుత్పత్త్యర్థం తలక్రిందుచేసి చెప్ప బడుతుంది. 'సింహ', 'కశ్యప' పదాలు ఇల్లాంటివే. 'కాలం' అంటే సమయం అనీ నలుపు అనీ అర్థాలు వున్నాయి. నలుపురంగు తమో గుణ సంకేతం. కాన 'లంకా' అన్నదానికి తమోగుణం అనేది అంత రార్థ పరంగా అర్థం చెప్పాలి. 'లంకాధి దేవత' అంటే సమస్త తమో గుణం యొక్క పూర్ణ స్వరూపం అన్నమాట. ఆంజనేయుడు అంటే,

భగవదన్వేషణా బుద్ధి అని వ్యుత్పత్త్యర్థం. భగవత్సంబంధమైన బుద్ధి. దాన్ని తమోగుణం తనలోనికి ప్రవేశింపనీయక అడ్డగిస్తుంది. ఏమంటే భగవత్సంబంధ బుద్ధి తమస్సులోకి చొఱబడిందంటే అందలి తమో వృత్తులు సర్వనాశనమై పోతాయి. తన నాశనానికి కారణమౌతుంది. కాన అది దానిని చేరనీయక అడ్డగిస్తుంది. అదే లంకాధిదేవత ఆంజనే యుని అడ్డగించడమంటే. తమో గుణానికి రాజు దశేంద్రియాలకేంద్రం. అది చాల ప్రబలమైనది. "మహాత్ముడైన దశగ్రీవ రావణుని ఆజ్ఞచేత "నేను ఇం దెవ్వరూ ప్రవేశించకుండా కావలి కాస్తున్నా"నని లంకిణి అన్నదానికి ఇంద్రియాలచేతపోషింపబడే తమోగుణం భగవత్సంబంధ మైన అన్వేషణా బుద్ధిని అడ్డగిస్తుంది అనే అంతరార్థం స్పష్ట మౌతుంది. "అహం రాక్షస రాజస్య రావణస్య మహాత్మనః అజ్ఞా ప్రతీక్షా దుర్ధర్షా రక్షామి నగరీ మిమాం" అన్న లంకాధి దేవతయొక్క మాటలలో అంతరార్థం పైవిధంగా మనం తెలిసికోగలం.

ఆంజనేయునివల్ల దెబ్బ తినడంతో లంకిణికి తిక్కతిరిగి బ్రహ్మ మాట గుర్తుకు వచ్చింది. ఆంజనేయుడు దెబ్బ తీయడం అంటే భగవదన్వేషణా బుద్ధి బలవంతంగా తమోగుణం లోపలికి ప్రవేశిం చడం అన్నమాట. బ్రహ్మ లంకిణికి చెప్పడం అంటే, భగవదన్వేషణా బుద్ధి బలాత్కారంతో తమోగుణంలోనికి ప్రవేశించడంతో జ్ఞానం కల్గడం అని అర్థం. బ్రహ్మ అంటే జ్ఞానం. తమస్సులో బలవంతంగా నైనా భగవద్వృత్తి ప్రవేశిస్తే బ్రహ్మ జ్ఞానం కల్గితీరుతుంది. జ్ఞానం ఎప్పుడు కల్గిందో అప్పుడు భగవద్వృత్తికి ఆ తమోగుణం పరమ మిత్రు డవుతుంది కాన స్వాగతం చెప్పడం స్వేచ్ఛా ప్రవేశమివ్వడం తనలోని తమోవృత్తులు నశించడానికి తాను ఇష్టపడడం అంటే తాను విముక్తి పొందడానికి ఇష్టపడడం సహజంగా జరుగుతుంది అని అర్థం. అదే లంకిణి ఆంజనేయుణ్ణి లంకలో ప్రవేశించుమనీ స్వేచ్ఛగా సీతను వెతుక్కోమనీ ఇంతటినుండి రాక్షస వినాశకాలం ఆరంభమైనదనీ చెప్పడంలోనిఅంతరార్థం. తర్వాత ఆంజనేయుడు లంకలో ప్రవేశించేడు.

శ్లో॥ కలాతీతా భగవతీ స్వయం సీ తేతి సంజ్ఞితా
తత్పరః పరమాత్మా చ శ్రీరామః పురుషోత్తమః॥

అని తారసారోపనిషత్తులో వుంది. దీనివల్ల సీతఅంటే, పరదేవత అయిన ప్రకృతి స్వరూపం అనీ, రాముడు అంటే, పరమ పురుషుడనీ అర్థం. లంక అంటే, తమోలోకం. అదే షట్చక్రాలలోని మూలాధార చక్రం. అందులో కుండలినీపరాశక్తి నిద్రిస్తూ వుంటుంది. అందులో విచారగ్రస్తయై సహస్రారంలోని భగవదైక్యంకోసం పరాశక్తి పరితపిస్తూవుంది. అదే సీత లంకలో రామానుగమనం కోసం పరితపిస్తూం దన్న కధకు అంతరార్థం.

## ఆంజనేయుని లంకాప్రవేశం.

శ్లో॥ విక్రమేణ మహాతేజాః హనుమాన్ కపిసత్తమో
ద్వారేణ స మహాబాహుః ప్రాకార మభిపుప్లువే॥

'అద్వారేణ' అని పూర్వరూపసంధిగ పదచ్ఛేదం చేసేరు వ్యాఖ్యాతలు. అంజనేయుడు లంకలోకి అద్వారమున ప్రవేశించాడని దాని అర్థం. ద్వారం కాని ద్వారం అద్వారం. అంటే, పెరటిగుమ్మం అన్నమాట. శత్రువు యొక్క ఇంటిని సింహద్వారము గుండా ప్రవేశించగూడదు. దొడ్డిదారిని ప్రవేశించాలి కనుక ప్రవేశించాడు. ఇది వాచ్యార్థం. "అద్వారేణ అభిపుప్లువే" అన్నప్పుడు అద్వారం అంటే న+ద్వారం అద్వారం అవుతుంది. ద్వారం అంటే, ద్వి+అరం=ద్వారం అవుతుంది. 'అరం' అంటే గడి ద్వ అంటే, రెండు. రెండు గడులు కలది ద్వారం అన్నమాట. ఈవలి ఆవలి రెండు భాగాలనుగ వేరు చేస్తూండేది ద్వారంఅనిపించుకుంటుంది. ఇక్కడ రెండు గడులు అన్న ద్వైత మార్గం అని ద్వార పదానికి అర్థం. అద్వారమనగా ద్వైతం కానిది, అద్వైతం అన్నమాట.

అంజనేయుడు అనగా సాధకుని బుద్ధి అద్వైతమార్గంలో తమోలోకంలో అంటే, లంకలో దశేంద్రియ ప్రవృత్తులు అరచేచోటుకు అంటే, దశకంఠ రావణుడుండే చోటుకు, అద్వారంలో ప్రవేశించేడు అంటే అద్వైత భావమును పొంది ప్రవేశించేడని అంతరార్థం చెప్పుకోవాలి.

"హనుమాన్ కపిసత్తమో ద్వారేణ" అన్నప్పుడు పూర్వరూప సంధిగా భావించినపుడు 'అద్వారేణ' అని పదచ్ఛేదం చేయవచ్చు. ఈవిధంగా పూర్వరూపసంధి చేయక 'కపిసత్తమో' అన్నదానిని కపిసత్తమః' అని మాత్రమే చెప్పినపుడు పూర్వరూప సంధిరాదు. అప్పుడు 'అద్వారేణ' అని రాదు. 'ద్వారేణ' అని మాత్రమే వస్తుంది. కొన్ని పుస్తకాలముద్రణలో 'కపిసత్తమః అనియే ఉంది. అప్పుడు అంజనేయుడు ద్వారము గుండా అంటే, సింహద్వారం గుండానే ప్రవేశించేడని వాచ్యార్థం చెప్పాలి. అప్పుడు అంతరార్థంలో 'ద్వారము' అంటే 'ద్వి + అరము' రెండు భాగములు కలది అనే వ్యుత్పత్త్యర్థంలో ద్వైతమతము అని చెప్పవచ్చు. అంజనేయసాధన ద్వైతంతో ప్రారంభించి అద్వైతంతో ముగుస్తుందని రెండురకాల పదచ్ఛేదం వల్ల పై శ్లోకానికి రెండు రకాలుగా భావం వస్తుంది. 'అద్వారేణ' అన్నప్పుడు 'అన్య-విష్ణోః, ద్వారేణ' అని తత్పురుష సమానం చేసి విష్ణు మార్గంతో అనగా వైష్ణవ మతం ద్వారా అని కూడ చెప్పవచ్చు. ఇది విశిష్టాద్వైత పరమైన అర్థం. ఈవిధంగా ఇచ్చట త్రిమతస్థులకు ఐక్యం చెప్పేడు వాల్మీకి.

అంజనేయుడు వాయుపుత్రుడు. అతడు లంకలో ప్రవేశించి సీతను కనుగొని రామునివద్దకు ఆమెనుచేర్చడానికి ప్రయత్నిస్తున్నాడు. అంటే, కుంభకంతో స్తంభింపచేయబడ్డ వాయువు మూలాధార చక్రంలో నిద్రిస్తూన్న కుండలినీ పరాశక్తిని ప్రబుద్ధంచేసి పైచక్రాల్లోకి ఆకర్షించి సహస్రారంలోనికి ప్రవేశం కల్పించడానికి సాధకుడు చేసే యత్నాన్ని చేస్తూంది అన్నమాట. ఇది యోగపరమైన అంతరార్థంగా గ్రహించాలి. మొదటిది జ్ఞానపరమైన అంతరార్థం. ఇట్లు జ్ఞాన యోగములు రెండూకూడా ఇందు అంతరార్థాలుగావస్తాయి. ప్రకృతియే కుండలినీ శక్తి. సీత అంటే, భూమిని దున్నేటప్పుడు ఏర్పడిన నాగటి చాలు. నాగటిచాలులో పడిన విత్తనం మొలకరించి ఫలితాన్నిస్తుంది. అదే విధంగా కుండలినీ పరాశక్తి తనలో పడిన వాసనలకు

ఫలితాన్నిస్తుంది. 'కుండలినీ' శబ్దం 'కుందళిని' అన్నదానిరూపాంతరమై యుండాలి. అప్పుడు 'కుం-భూమిని; దళిని-ఛేదించుకొని వచ్చినది' అనే వ్యుత్పత్త్యర్థంలో అలుక్సమాసం అవుతుంది. నాగటిచాలు అన్న అర్థం గల సీత అన్న పదానికి సరిపోతుంది. 'దడయో రభేదః' అన్న దానివల్ల కుండలిని అన్న రూపాన్ని సిద్ధింపజేయవచ్చును. కుండలం వలె గుండ్రంగా మూడున్నర చుట్టులు చుట్టుకొని కుండలినీ శక్తి నాగాకారంతో మూలాధారచక్రంలో ఉంటుందని యోగశాస్త్రం చెప్తూంది. "సార్ధ త్రివలయా కుండలినీ" అని యోగశాస్త్రంలో ఉంది. మూడు వలయాలు అంటే త్రిగుణములు అని అర్థం. అర్థ వలయం అంటే త్రిగుణాతీత అవస్థ యొక్క ప్రారంభస్థితి అని అంతశ్శార్థపరంగా చెప్పుకోవాలి.

## మండోదరిని సీతగా భ్రమించుట.

శ్లో॥ "గౌరీం కనక వర్ణాభా మిష్టా మంతః పురేశ్వరీం
కపి ర్మందోదరీం తత్ర శయానాం చారురూపిణీం
తర్కయామాన సీతేతి రూప యౌవన సంపదా"
"అవధూయ చ తాం బుద్ధిం బభూ వావస్థిత స్తదా
న రామేణ వియుక్తా సా స్వప్తు మర్హతి భామినీ
అ న్యేయ మితి నిశ్చిత్య పానభూమౌ చచార సః"

ఆంజనేయుడు రావణాంతఃపురంలో సీతకోసం వెదకుతూ తెల్లగా ఉన్నదీ, బంగారు కాంతి గలదీ, ఇష్టురాలుగా ఉన్నదీ అంతఃపురేశ్వరియై యున్న *మందోదరిని చూచి రూప యౌవన సంపద సమానంగా వున్న కారణములచే ఈమె సీతకాదుగదా! అనే సందేహములో మునిగి అంతలోనే ఆసందేహాన్నుండి తేరుకొని "రామునితో కాక మఱొకనితో ఆమె నిద్రింపదు" కాన ఈమె సీతకాదు; మరొకతె యెవతెయో అని నిశ్చయం చేసికొని పానశాలలో వెదకడం ప్రారంభించేడు అని పై శ్లోకాలకు వాచ్యార్థం.

*మందోదరి పదానికి మందమైన (వన్నవి) ఉదరము కలదని వాచ్యార్థం. మందోదరియే మండోదరి అని వాడబడుతూంది. "దడయోరభేదః"

మందోదరిని సీతనుగా అనుమానించడానికి పేర్కొన్న కారణాలు (1) గౌరవర్ణం కలది కావడం (2) బంగారు ఛాయ కలది కావడం (3) ఇష్టురాలుగా ఉండటం (4) అంతఃపురేశ్వరి కావడమూ అయివున్నాయి. సందేహ నివారణకు పేర్కొన్న కారణం.

రామునితో గాక సీత మరొకరితో నిద్రించడం జరుగదన్నది.

మందోదరి అంటే అంతరార్ధ పరంగా మంద + ఉత్ + అరి అని విడదీసిన, వ్యుత్పత్తి ప్రదర్శనలో పెద్దగా ఉన్న శత్రువులను తగ్గుముఖం పట్టించే మనోవృత్తి" అనే అర్థం చెప్పుకోవచ్చు. రావణుని లోని దశేంద్రియాలయొక్క ఆవేశాన్ని తగ్గించి అదుపులో ఉంచింది మందోదరి. సీతమీద రావణుని చెయ్యి పడకుండా చేసింది మందోదరియే. కాన సాధకునిలోని ఇంద్రియావేగం అనే పెద్ద శత్రువును అదుపులోఉంచే మనోవృత్తి మందోదరీవృత్తిగా అంతరార్ధంలో పేర్కొనాలి. అది 'గౌరి' అంటే తెల్లనిది; అంటే సాత్త్విక గుణంకలది అన్నమాట. అది 'కనక వర్ణాభ' అంటే బంగారు వన్నెకలది. బంగారం ఎఱుపు కలిసిన తెలుపురంగు గలది. రజోగుణం ఎఱుపునకు చిహ్నం: రజోగుణం పాలు కొంత కలిసిన సత్త్వగుణం మందోదరి లక్షణం అని చెప్పాలి. 'ఇక ఇష్టురాలు అంటే భగవంతుని ఇచ్ఛను నెరవేర్చేది. ఇంద్రియావేగం తగ్గించడం భగవంతుని అభీష్టం నెఱవేర్చడమే యౌతుంది. అంతఃపురేశ్వరి అంటే, పురమనగా దేహం దేహంలోని లోలోపలి భాగం అంతఃపురం. దానికి ఈశ్వరి. దేహంలోని లోలోపలివి వాసనలు. వానిని తగ్గించి అదుపులో ఉంచే సామర్థ్యం కలది మందోదరీ మనోవృత్తి. ఇక సీత అంటే ప్రకృతిగదా! పైని చెప్పిన ఇవే లక్షణాలు ప్రకృతికికూడాఉన్నాయి. ప్రకృతి సాత్త్వికగుణంతోనే భగవంతుని చేరుకొంటుంది. భగవంతుని చేరేటందుకు అది రజోగుణం యొక్క పాలును కొంత కలిపికొని వుంటుంది. ప్రకృతి పురుషునితో అంటే పరమాత్మయొక్క ఇచ్ఛాప్రకారం అతనితో ఐక్యానుసంధానం కోరుకొంటూ.

వుంటుంది. అందుకై దేహంలో లోలోపలనున్న మూలవాసనల నుండి బైటపడే యత్నం చేస్తూంటుంది. ఈనాల్గు లక్షణాలూ మండోదరీ మనోవృత్తిలోనూ ప్రకృతిలోనూ కూడా సమానాలుగానే ఉండడంచేత సాధకుని బుద్ధి ప్రకృతిని గూర్చి చేసే అన్వేషణలో మండోదరీ మనోవృత్తిని ప్రకృతినిగా భావించడం అనేది జరుగుతుంది. "న రామేణ వియుక్తా సా స్వప్తు మర్హతి" అని వెంటనే తోచింది. రామేణ అనగా ఆనందంతో, వియుక్తా=విడచినదై, సా=ఆ ప్రకృతి స్వప్తుం=నిద్రించడానికి, అంటే ఐక్యపడడానికి, న అర్హతి=తగినదికాదు అంటే, ఆనందంతో వినా ఐక్యంకాదు అని అంతరార్థం. మందోదరీ మనోవృత్తి మాత్రం పరమాత్మానందంలో కాక దశేంద్రియవృత్తిలోనే ఆనందించడానికి దానితో జతపడి వుంటుంది. ప్రకృతి ఎప్పుడూ దశేంద్రియ వృత్తికి అధీనంకాక ఆత్మానందవృత్తికోసం ఆరాటపడుతూ వుంటుంది అన్న అంతరార్థం పై శ్లోకాల్లో ద్యోతకమౌతూంది.

మందోదరి రావణుని కౌగలించుకొని పరుండి వుంది. అంటే మందోదరీవృత్తి ఇంద్రియావేగాన్ని అడచివేస్తూనే వున్నా ఆ ఇంద్రియాలతోనే సుఖిస్తూ వుంటుందన్నమాట. ప్రకృతియొక్క తపన అట్లుండదు. ప్రకృతి తాను ఇంద్రియాల ప్రాబల్యానికి ఖైదీ అయినా తాను ఆ ఇంద్రియాల ప్రాబల్యానికి లోబడక పురుషునితో అనగా ఆనందరూప పరమాత్మతో ఐక్యపడడానికే ఆరాటపడుతూంది. ఇక్కడ సాధన చేసేటప్పుడు సాధకునికి దానిని తప్పించడానికి కలిగే విభ్రమమూ, ఆ విభ్రమమును వెంటనే నివారించుకొనే వివేచనాదృష్టి అంతరార్థ పరంగా చెప్పబడింది.

సాధకునిబుద్ధి ఇంద్రియావేగం అణుస్తూనే ఇంద్రియాలతో సుఖపడి వుండటంవల్ల కూడా ముక్తి రావచ్చునని ముందుగా భ్రమించే లక్షణం గల్గి వుంటుందని తర్వాత ఆ సాధకునిబుద్ధి వివేచనా దృష్టితో పరిశీలించి ఇంద్రియ సుఖంకోసం ప్రాకులాడక కేవలం

ఆనందరూప పరమాత్మతో ఐక్యానుసంధానం జరిపించడాన్ని నిర్ణయించుకుంటుంది అనే సాధనారహస్యం మందోదరిని సీతగా భ్రమించడంలో తెలుస్తుంది.

## త్రిజటా స్వప్నం.

రాక్షసస్త్రీలు సీతను మాటలతో బాధిస్తూంటే త్రిజట అనే రాక్షసస్త్రీ తనకు "రావణుని జయించి రామ లక్ష్మణులు సీతను తీసుకొని విమానంలో వెళ్ళుచున్నట్లూ, రాక్షసులందఱూ నశించినట్లూ కల వచ్చిన" దని చెప్పింది. అంత వా రామాటలకు భయపడి అచటు నుండి వెళ్ళిపోయారు.

'త్రిజట' అంటే విడివిడిగా నున్న మూడు పాయలు ఒకదానిని మఱొకటి అల్లుకొని ఒక్కటిగా ఏర్పడిన జడ అని అర్థం. ఇక్కడ త్రిజట అంటే ఒకదానితో మరొకటి కలిసియున్న అవస్థాత్రయం అని అంతరార్థం. అనగా విశ్వము, తైజసము, ప్రాజ్ఞము అనునవి మూడు అవస్థలు. ఆమూడునూ ఒకటిగా ఏర్పడిన ఒకానొక సాధనా అవస్థనే ప్రాజ్ఞావస్థ అందురు. ప్రాజ్ఞావస్థ అనగా బాగుగా అన్నిటిని ఎఱుగునట్టి ప్రజ్ఞాన స్థితి. విశ్వము అనగా ప్రత్యక్షముగా కన్నుల ఎదుట కన్పించునది. తైజశము అనగా నిద్రించునపుడు స్వప్నములుగా కన్పించు మానసిక విభ్రమ స్థితి. 'ప్రాజ్ఞము అనగా సుషుప్తి స్థితి. కలలు లేని నిద్ర. మెలకువ వచ్చిన పిమ్మట తాను సుఖముగా నిద్రించితిననే భావము తెలియబడుతుంది. ఆభావాన్ని తెలిపేందుకు సుషుప్తిలోకూడ మేల్కొనియుండే ఒక జ్ఞాన అవస్థితికే ప్రాజ్ఞావస్థ అనిపేరు. విశ్వస్థితిని తైజన స్థితిలో కలిపి, తైజన స్థితిని ప్రాజ్ఞ స్థితిలో కలిపినచో అది త్రికాలములను చూడగలుగుతుంది. త్రిజట యనగా సాధకునిలోని మూడుస్థితులు కలిసి ఒకే ఒక వైపును ద్యోతకము చేసే ప్రాజ్ఞస్థితి. అది త్రికాలములలోను జరుగు అన్నిటిని చూడగలదు. విశ్వావస్థను, తైజసికావస్థలోనికి, తైజసికస్థితిని ప్రాజ్ఞ స్థితిలోనికి విలీనం చెయ్యడం జ్ఞానసాధనలో భాగం. ఆసాధనలో

ప్రజ్ఞావస్థ త్రికాల జ్ఞాత అన్నమాట. ఆస్థితిలో ప్రాజ్ఞావస్థను పర బ్రహ్మావస్థలోనికి సాధకుని బుద్ధి చేరుస్తుంది. "కుండలినీశక్తి సహస్రారంలో త్వరలోనే కలసి పోగల" దన్న భవిష్యత్తును చూడగల్గుతుంది అన్న యోగ పరమైన అంతరార్థాన్ని, ప్రకృతి పరమాత్మలో త్వరలోనే లీనం కాగలదన్న జ్ఞానపరమైన అంతరార్థాన్ని త్రిజటా స్వప్న వృత్తాంతంలో మనం చూడగల్గుతాము.

## అంగుళీయక ప్రదానం.

ఆంజనేయుడు సీతాదేవి తన్ను అనుమానిస్తూంటే సమీపించి

" రామ నామాంకితం చేదం
పశ్య దేవ్యంగుళీయకం "

అని అంటాడు 'ఇది రామనామాంకితమైన అంగుళీయకం చూడు' అని అంగుళీయకాన్ని సమర్పిస్తాడు. సీత దానితో హనుమంతుని రాముని బంటుగా విశ్వసిస్తుంది. 'అంగ' అనేది అకారాంతం 'అంగు' అనేది ఉ కారాంతం. రెండిటికీ అర్థం ఒకటే. అంగుం లాతి గృహ్ణాతి ఇతి *అంగులః అనే వ్యుత్పత్త్యర్థంలో శరీరాన్ని గ్రహించినది లేక శరీరంలో ఉండేది అన్న అర్థంలో పరమాత్మ అని అంగుల పదానికి అర్థం. అంగుల సంబంధమైనది అంగుళీయ్యము అది రామనామాంకితం అంటే భగవత్సంబంధంకలది. అదే సాధకునిలోని భగవదన్వేషణాబుద్ధి. భగవత్సంబంధ బుద్ధి యొక్క స్వరూపమే ఆంజనేయుడు

*అత్యతిష్ఠద్దశాంగులమ్ అన్న పురుష సూక్తంలోని 'దశ + అంగుల' పదం, పదింటితో (పది యింద్రియాలతో) కూడిన శరీరము కలది. జీవుడు అని అర్థం. అంగు=శరీరమును లః=లాతి ఇతిలః గ్రహించేది జీవుడు అట్టి జీవుణ్ణి అతి + అతిష్ఠత్ అతిక్రమించి యున్నవాడు పరమాత్మ అని అర్థం. దీనిలో అంగుల పదం జీవుణ్ణి తెలిపేదిగా స్పష్టమౌతూంది. జీవాత్మయే మాయావరణం లేనప్పుడు పరమాత్మ అనబడుతుంది. కావ అంగులీయక పదంలోని అంగుల పదానికి పరమాత్మ అనే అర్థమూ చెప్పుకోవచ్చు.

కాని ఆంజనేయుడు అంగుళీయాన్ని చూపించడం అంటే ప్రకృతికి పరమాత్మయొక్కరూపాన్ని ప్రదర్శింపజేయడమే. అది బుద్ధిసాధ్యము. అప్పుడు ప్రకృతి బుద్ధిని విశ్వసించి అది తన్ను పరమాత్మతో చేర్చ గలదనే అంతరార్ధం ఈ అంగుళీయక ప్రదానంలో కన్పిస్తుంది. సాధకుని బుద్ధి తాను పరమాత్మను చేర్చగలనని అతనిలోని ప్రకృతికి విశ్వాసం కల్పించడమే సీతకు అంగుళీయక ప్రదానంలోని అంతరార్ధం.

హనుమంతుడు సీతతో ఇట్లా అంటాడు;

శ్లో॥ త్వాం తు పృష్ఠగతాం కృత్వా
సంతరిష్యామి సాగరమ్
శక్తి రస్తి హి మే వోఢం
లంకా మపి స రావణాం॥

నేను నిన్ను నా వీపుపై నెక్కించుకొని సముద్రం దాటి రాముని యొద్దకు తీసికొని పోగలను. నాకు రావణసహితంగా లంకను పెల్లగించుకొని పోగల శక్తి ఉంది. అని సీతను తనతో తీసికొనివెళ్ళ డానికి సూచన చేస్తాడు.

అంటే మూలాధారంలోని కుండలినీశక్తిని కుంభించబడిన వాయు సహాయంతో సుషుమ్నానాడి గుండా సాధకుడు సహస్రా రానికి చేర్చడం అన్న సామాన్యమాత్రం, పై కథకు అంతరార్ధ పరంగా చెప్పదగి వుంది. ఆంజనేయుడు వాయుపుత్రుడు. కాన కుంభక వాయువుగా అతనికి అంతరార్ధంగా అర్ధం చెప్పవచ్చును. సీత మూలాధారంలోని కుండలినీ శక్తి ఆ కుంభక వాయు సహాయంతో సుషుమ్నానాడిగుండా కుండలినీశక్తిని సహస్రారంలోని పరమాత్మతో ఐక్యం చెయ్యడమే హనుమంతుడు తన వీపుమీద లంకలోనున్న సీత నెక్కించుకొని సముద్రం దాటి రాముని యొద్దకు చేర్చడమంటే. అప్పుడు హనుమంతుని వీపు సుషుమ్నా నాడిగా చెప్పాలి.

మూలాధారంలో నిద్రిస్తూన్న కుండలినీ శక్తిని లేపి వెన్నుముక ద్వారా కుంభకవాయువు స్వాధిష్ఠానంలోనికి మణిపూరంలోనికి అనాహతంలోనికి విశుద్ధంలోనికి తీసికొని వెళ్ళి సహస్రారంలోని పరమాత్మతో ఐక్యం చెయ్యడం చక్ర విద్యా యోగ సాధనలోని ఆరోహణా సాధనా పద్ధతికి చెందిన మార్గం. యోగ మార్గంలో సాధకులు సర్వసామాన్యంగా సాధన చేసే క్రమం ఇదే. 'వాలాగ్రం' అని హనుమంతుని రూపాన్ని వర్ణిస్తూ స్తుతించడంలో మూలాధారంలోని శిరోనిక్షిప్త కుండలినీ శక్తిని శిరస్సులోని సహస్రారంలో చేర్చడం అన్న భావం ఇమిడి ఉంది.

## హనుమంతునితో సీత సంభాషణం

కథ : సీత ఈవిధంగా అంటుంది:

శ్లో॥ యది రామో దశగ్రీవం
ఇహ హత్వా స బాంధవం
మా మితో గృహ్య గచ్ఛేత్ చేత్
త త్తస్య సదృశం భవేత్॥

రాముడు దశకంఠ రావణుని సబంధు మిత్రంగా వధించి ఇక్కడ నుండి తాను నన్ను తనతో తీసుకొని వెడితేనే అది అతనికి తగినదవుతుంది. అని దాని వాచ్యార్థం.

అంటే, సహస్రారంలోని ఆనందరూప పరమాత్మ క్రిందికి దిగువ చక్రాలగుండా అవరోహణా క్రమంలో మూలాధారంలోనికి వచ్చి అచ్చట ఆవరించియున్న దశేంద్రియకృత తమోవృత్తుల్ని తనలో విలీనంచేసి కుండలినీ శక్తిని తనతో తీసుకొనివెళ్ళి తనలో ఐక్యపరచుకోవడం అనే పూర్ణ యోగంలోని అవరోహణా క్రమాన్ని పై శ్లోకానికి అంతరార్థ పరంగా అర్థం చెప్పుకోవాలి.

జ్ఞానమార్గంలోనూ, యోగమార్గంలోనూకూడ ఆరోహణామార్గం, అవరోహణామార్గం అనే రెండు మార్గాలు ఉన్నాయి. ప్రకృతిని తమోమయ ప్రవృత్తి నుండి రజోమయ ప్రవృత్తిలోనికి మార్చి, ఆతర్వాత రజోమయ ప్రవృత్తినుండి సత్త్వమయ ప్రవృత్తిలోనికి మార్చి సత్త్వమయ ప్రవృత్తినుండి ఆనందధామంలోని పరమాత్మనుచేరడం అనేది జ్ఞానమార్గంలో ఆరోహణామార్గం అవుతుంది. భారతకథ అంతరార్థ పరంగా ఈ ఆరోహణా మార్గాన్ని చెప్తూంది. రామాయణకథ అవరోహణా మార్గాన్ని చెప్తూంది. పరమాత్మ తాను క్రిందికి దిగి సత్త్వంలోనుండి రజోగుణంలోనికి, అందులోనుండి తమోగుణం లోనికి దిగి తమోవృతమై యున్న ప్రకృతిని విశుద్ధం చేసి తనలో నైక్యపరచుకోవడం అనేది అవరోహణాక్రమం రామాయణ కథలోని సీతా స్వీకరణానికి అంతరార్థంగా తెలుస్తుంది. సీతాదేవి హనుమంతునితో నేను నీతో రాముని చేరడం కాదు. రాముడే తాను స్వయంగా లంకలోనికి వచ్చి దశకంఠ రావణుని సబంధుమిత్రంగా వధించి నన్ను తనతో తీసుకొని వెళ్ళడం యుక్తంగా ఉంటుందన్న దానిలోని అంతరార్థం ఇదే. ఈ అవరోహణా క్రమం ఎందుకు ఘనతరమైనదో సీత ఈ క్రింది మాటల్లో అంతరార్థ పరంగా స్పష్టం చేస్తుంది.

కథ :— "నీ వీపుమీద ఎక్కి నేను వచ్చేయెడల సముద్రం దాటడంలో నీవు అలసిపోయినపుడు, నీ వీపుమీదనున్న నేను క్రిందకు పడిపోయే ప్రమాదం ఉంది. అందుకే రాముడే స్వయంగా వచ్చి నన్ను తోడ్కొనిపోవడం మంచిది". అని సీత హనుమంతునితో అంటుంది.

అంటే చక్ర విద్యాయోగమార్గంలో ఆరోహణా క్రమంతో ప్రయాణం చేసే మూలాధారంలో సుషుమ్నానాడిలో బ్రహ్మద్వారమందు నిద్రిస్తూన్న కుండలినీ శక్తిని వాయు నిరోధంతో లేపి క్రమంగా స్వాధిష్ఠానాది పై చక్రాలలోనికి తీసికొని వెళ్ళేటప్పుడు సాధకుడు

ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పైకి వెడుతూ వెడుతూన్న కుండలిని జారి క్రిందకు పడిపోయి సాధకుణ్ణి భ్రష్టుణ్ణి చేసే అవకాశం ఉంది. ఇదే సీత హనుమంతుని వీపుపై నెక్కి రానని చెప్పడంలోని అంత రార్థం. హఠయోగంలో ఆరోహణా క్రమమే కాని అవరోహణా క్రమంలేదు.

జ్ఞానమార్గంలోనే పైనుండి క్రిందకు పరమాత్మ దిగివచ్చి ప్రకృతిని తనలో నైక్యం చేసికొనే వీలున్నది. సీత మాటల్లో ప్రకృతి తాను యోగమార్గం ద్వారా కాక జ్ఞానమార్గం ద్వారానే పరమాత్మలో చేరుటకు ఇష్టపడుతుందని కూడ మనకు అవగతమవుతూంది. అంతే కాక ఇది సర్వ శ్రేష్ఠమైన మార్గమని ఇందు సాధకుడు భ్రష్టుడు అయ్యే ప్రమాదం లేదనికూడ సీతవాక్యాలలో అంతరార్థంగా తెలుస్తూంది. సీత చేత ఈవిధంగా చెప్పించిన వాల్మీకి జ్ఞానమార్గం లోని అవరోహణా మార్గానికి ప్రాధాన్యం ఇచ్చేడన్నదీ, రామాయణం జ్ఞానమార్గ పరమైనదన్నదీ స్పష్టపడుతూంది. ఈ జ్ఞానమార్గంలోని అవరోహణమే "సర్వం ఖల్విదం బ్రహ్మ" అన్న సాధన. ఇది అన్ని సాధనలలోను శిరోమణి వంటిది.

మూలాధార స్వాధిష్ఠాన చక్రాలలో తమోగుణ వృత్తి, మణి పూరంలో రజోగుణవృత్తీ, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా చక్రాలలో సాత్త్విక గుణవృత్తీ సంచరిస్తూ ఉంటాయి. సహస్రారం త్రిగుణాతీత స్థితికి నిలయంగా ఉంటుంది.

అరవిందయోగి ఆరోహణా క్రమం, అవరోహణాక్రమం కూడ సాధించాలనీ అప్పుడే అది పూర్ణయోగం అవుతుందనీ, పూర్ణయోగ సాధనలో నిష్ణాతుడైన వాడు జీవన్ముక్తుడౌతాడనీ చెప్పేడు. మన పూర్వులు యాత్రల్లో కాశీనుండి రామేశ్వరంవెళ్ళి, తిరిగి రామేశ్వరం నుండి కాశీ రావాలనీ అది పూర్ణయాత్ర అవుతుందనీ చెప్పడంకద్దు. యోగమార్గాన్ని, జ్ఞాన మార్గంతో కలిపి చూస్తే దేహాంతశ్చక్రాలలో

సహస్రారం ఆనంద భూమిక. దానికి దిగువగానున్న ఆజ్ఞాచక్రం జ్ఞాన భూమిక. అనాహతచక్రం బుద్ధిభూమిక. మణిపూరచక్రం మనోభూమిక. స్వాధిష్టానచక్రం అహంకారభూమిక. మూలాధారచక్రం వాసనా భూమిక ఆనందభూమికనుండి వాసనాభూమిక వరకు దిగడం అవరోహణం అవుతుంది. వాసనాభూమికనుండి ఆనందభూమికకు ఎక్కడం ఆరోహణం అవుతుంది. వాసనలు మూల వాసనా స్థానం నుండి ఆనందస్థానం ముట్టి తిరిగి ఆనంద భూమిక నుండి వాసనా భూమికకు దిగి రావడం పూర్ణయోగం అనిపించుకుంటుంది. అంటే 'అహం బ్రహ్మాస్మి', అనే సాధన ఆరోహణాక్రమమౌతుంది.. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అన్న సాధన అవరోహణాక్రమమౌతుంది. జ్ఞాన మార్గంలో 'నేతి, నేతి' అని ప్రతివస్తువును ఇదిబ్రహ్మకాదు, ఇదిబ్రహ్మ కాదు అని నిషేధించుకుంటూ బ్రహ్మ పదార్థాన్ని తెలిసికోవడంలో 'అహం' అనేదేబ్రహ్మ అని చివరకు తెలిసికోవడం 'అహం బ్రహ్మాస్మి' అనే సాధనఅవుతుంది. జ్ఞానమార్గంలో ఇది ఆరోహణాక్రమం ప్రకృతి లోని ప్రతివస్తువును బ్రహ్మగానే గుర్తిస్తూఉండటం "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనే సాధన. ఇది అవరోహణాక్రమం లోనిది. ఈరెండు సాధనలు కలసి పూర్ణయోగం అవుతుంది. పూర్ణయోగి జీవించినంతకాలం నిస్సంగతత్వంతో లోకవృత్తం నడిపిస్తూ చివరకు జన్మరాహిత్యం పొందుతాడు. ఆరోహణాక్రమం లేనిదే అవరోహణాక్రమం సాధ్యం కాదు. కాన రెండిటినీ సాధకుడు అభ్యసించాలి.

## కాకాసుర వృత్తాంతం.

సీత రామునకు నమ్మకంకోసం అంతవరకూ తనకూ రాముడికీ తప్ప మఱెవ్వరికీ తెలియని కాకాసురవృత్తాంతాన్ని గుర్తుచేయవలసిందిగా హనుమంతుడికి చెప్పింది.

తానూ రాముడూ ఏకాంతంగా ఉండే సమయంలో ఒకప్పుడు తనతొడపైని రాముడు శిరస్సును పెట్టుకొని పరుండినప్పుడు ఇంద్ర పుత్రుడైన కాకాసురుడు (కాకి ఆకారంతోనున్న రాక్షసుడు) తనపైని

చీటికి మాటికి వ్రాలుతూ ముక్కుతో స్తనాలమధ్య పెదవులమీద పొడిచేడు. రాళ్ళతో ఎంత కొట్టి వారించినా వాడు తన పనిని మాన లేదు. రక్తం కారేటట్టు పొడుస్తూన్నాడు. మెలకువ వచ్చి అది చూచి రాముడు బ్రహ్మాస్త్రాన్ని మంత్రించి వానిపైని ప్రయోగించాడు. దానిని తప్పించుకోడానికి కాకాసురుడు మూడు లోకాలకు పరుగు లెత్తాడు. తన తండ్రియైన ఇంద్రుణ్ణికూడ ఆశ్రయించేడు. అతడు కూడ బ్రహ్మాస్త్రాన్ని తాను ప్రతిరోధించలేనన్నాడు. చివరకు కాకా సురుడు దిక్కులేక రాముని పాదాలమీదనే పడ్డాడు. రాముడు బ్రహ్మాస్త్రాన్ని ఉపసంహరించడం నాకుకూడా అశక్యమే కాని ఏదైనా అవయవాన్ని దీనికి ఇచ్చేస్తే దాన్ని ఖండించి అది పోతుంది. మిగిలిన దేహం రక్షింపబడుతుంది. అనిసలహాచెప్పేడు. అప్పుడు కాకాసురుడు తనదక్షిణాక్షిని (కుడికన్ను) బ్రహ్మాస్త్రానికి అర్పిస్తాడు. దానితో రక్షింపబడి కాకాసురుడు తాను తన దారిన పోతాడు. ఈ వృత్తాంతాన్ని చెప్పి, సీత

శ్లో॥ "మత్కృతే కాకమాత్రే తు
బ్రహ్మాస్త్రం సముదీరితం
కస్మా ద్యో మాం హరేత్ త్వత్తః
క్షమసే త్వం మహీపతే"॥

నాకోసం కాకిమీదనే బ్రహ్మాస్త్రాన్ని వేసిన నీవు నీనుండి నన్ను హరించినవాడిని ఎందుకు ఊరుకున్నావు మహానుభావా? అని రాముణ్ణి ప్రశ్నించినట్లుగా చెప్పమని హనుమంతుడికి చెప్పింది.

ఏమిటీ కథ? కాకి రూపం ఎత్తిన రాక్షసుడు ఇంద్రపుత్రుడా? ఇంద్రుడు దేవతలకు రాజుకదా! వాడికి రాక్షసుడు పుట్టేడా? కాకిమీద బ్రహ్మాస్త్రాన్ని వెయ్యవలసి వచ్చిందా? రావణుడి మీద ఎందుకు వెయ్యలేదు? ఇవి సీతకేకాదు. ప్రతి పాఠకుడికి కల్గే ప్రశ్నలే. ఇటు వంటి చోట్ల ఏదో అంతరార్థం వుండితీరాలి అనిపిస్తుంది.

కాకాసురుడు ఎవరు? ఇతడు ఇంద్ర పుత్రుడెట్లు? అదేమంటే 'కశ్చ అకశ్చ కాకః'అనే వ్యుత్పత్త్యర్థంలో క + అకః=కాకః; కః=అంటే సుఖం; అకః=అంటే సుఖం కానిది, దుఃఖం. సుఖదుఃఖాలను అనుభవించే తామసిక వృత్తి "కాకము" అనిపించుకుంటుంది. ఈ సుఖ దుఃఖాలు ఎక్కడనుండి ఉత్పన్నమౌతాయి? అంటే మనస్సు నుండి అని చెప్పాలి. 'మనస్సు' అంటే ఇంద్రుడు అన్నమాట లోగడ చెప్పుకున్నాం. కాకాసురుడు అంటే మనస్సులోనుండి పుట్టిన ఇంద్రియ ద్వంద్వ వ్యాపారం అన్నమాట. సీత అంటే ప్రకృతి కదా! ప్రకృతిని మనస్సుద్వారా సుఖదుఃఖాది ద్వంద్వాల్ని అనుభవింపజేయడం అన్నదే సీతను కాకాసురుడు స్తనాలమీద, పెదవులమీద పొడవడం అన్నదానికి అంతరార్థం.

సాధకుని మనస్సునుండి కల్గిన ఇంద్రియ ప్రవృత్తి సాధకుని లోని ప్రకృతి చెప్పినా వినక ఆ ప్రకృతిని అనుభవించడానికి యత్ని స్తుంది. ఇదే బెడ్డలు వేసినా పోక కాకాసురుడు సీతను రక్తం కారే టట్టు పొడిచేదన్నదానికర్థం. కాకాసురుడంటే సుఖదుఃఖముల ఇంద్రియ ద్వంద్వస్థితి అని చెప్పకున్నాం. ఇంద్రియస్థితియొక్క నాశనం జ్ఞానం వల్లనే కల్గాలి. కాకాసురుడిమీద (కాకిపై) బ్రహ్మాస్త్ర ప్రయోగం అంటే ఇంద్రియ స్థితియొక్క నాశనానికి జ్ఞానాన్ని ప్రవేశ పెట్టడమన్నమాట. కాకాసురుడు బ్రహ్మాస్త్రానికి దక్షిణాక్షిని అర్పణం చేసేడు. అప్పుడతనికి ఒక కన్ను మాత్రమే మిగిలింది. అంటే సంకల్ప వికల్ప ద్వంద్వమైన మనస్సు నిశ్చయాత్మక బుద్ధిగా మిగి లింది అని అర్థం. దక్షిణ అక్షి అంటే సమర్థమైన అనగా బలమైన ఇంద్రియ స్థితి అన్నమాట. దానిని బ్రహ్మాస్త్రానికి అంటే జ్ఞానానికి బలిగా చేసింది. అని చెప్పవచ్చును. అంటే జ్ఞాన ప్రవేశం వల్ల ఇంద్రియాల ప్రాబల్యస్థితిని కోల్పోతుంది అని భావం. బ్రహ్మాస్త్రమును కాకిమీదే వేసినపుడు సీతాపహరణం జరిగిన వెంటనే రావణునిమీద ఎందుకు వేయలేదు? అన్నదానికి అంతరార్థంలోనేగాని సమాధానంరాదు.

దశకంఠ రావణుడంటే దశేంద్రియాలకు వాసనా కేంద్రమన్నమాట. మూలవాసనలకు బ్రహ్మతత్త్వం అంత సులభంగా అంటదు. అందుకోసం బుద్ధియోగంతో సాధకుడు మూలవాసనలకు కేంద్రమైన తమోనిలయంలో సాధనలతో క్రమంగా మార్పులు తేవాలి. అట్లాగు తమోనిలయంలోని నీచవాసనలన్నిటిని క్రమంగా నాశం చేసేక అప్పుడు బ్రహ్మాస్త్ర ప్రయోగం చేస్తే సాధకునిలోని బ్రహ్మతత్త్వంలో ఆ మూలవాసనలు ఐక్యమైపోతాయి. ఇక అవి తలెత్తలేవు. అదే ముక్తి స్థితి అంటే. ఆంజనేయుడు లంకలో రాక్షస నాశంచేసి లంకాదహనం చేసిన తరువాత సేతు నిర్మాణంతో వానరులను లంకలో ప్రవేశపెట్టి, రావణానుచరులను అందరినీ సమూల నాశనంచేసి, ఆపైని అగస్త్యోప దేశంతో రాముడు బ్రహ్మాస్త్రాన్ని రావణునిమీద ప్రయోగించి సాధిం చేడు అన్న కథ పై అంతరార్థాన్ని తెలియజేస్తుంది. ఇంతపని ముందు ఉండగా కాకాసురునిమీద వలె రావణునిమీద బ్రహ్మాస్త్రప్రయోగం జరిగించడం ఎట్లాగు? అందుచేత రావణునిపైని బ్రహ్మాస్త్రం ముందుగానే వేయలేదని అంతరార్థపరంగా మనం గ్రహించాలి.

'కాకాసురుడు' ద్వంద్వప్రవృత్తికి సంబంధించిన అల్పాల్పమైన జీవాంశ. దానిని సులువుగానే బ్రహ్మతత్త్వంలో జీర్ణం చెయ్యవచ్చు. దశకంఠరావణుడు దశేంద్రియ ప్రాబల్యంతో సంపూర్ణమైన మాయా జ్ఞానానికి ప్రతీక. కాన కాకాసురునివలె రావణుని సులువుగా బ్రహ్మ తత్త్వంలో అనగా బ్రహ్మాస్త్రంలో లీనం చెయ్యడం శక్యం కాదని భావం.

## సీతా శిరోమణి ప్రదానం.

శ్లో॥ తతో వస్త్రగతం ముక్త్వా
దివ్యం చూడామణిం వరౌ
ప్రదేయో రాఘవా యేతి
సీతా హనుమతే దదౌ॥

వస్త్రంలో దాచివుంచిన దివ్యమైన చూడామణిని రాముడి కిమ్మని సీత హనుమంతున కిచ్చింది.

శ్లో॥ ప్రతి గృహ్య తతో వీరః
మణి రత్న మనుత్తమం
అంగుళ్యా యోజయామాస
న హ్యస్య ప్రాభవ ద్భుజః
సీతాం ప్రదక్షిణం కృత్వా
ప్రణతః పార్శ్వతః స్థితః
హర్షేణ మహతా యుక్తః
సీతా దర్శన జేన సః
హృదయేన గతో రామః
శరీరేణ తు నిష్ఠితః॥

ఉత్తమోత్తమమైన చూడామణిని అందుకొని హనుమంతుడు తన ప్రేలికి తొడుగుకొన్నాడు. కాని అతని చేయి దానికి సరిపడలేదు. తర్వాత, సీతకు ప్రదక్షిణం చేసి వినయంతో నమస్కరించి ప్రక్కన నిలబడ్డాడు. సీతను చూచిన సంతోషంతో కూడినవాడైనాడు. సీతాదర్శన సంతోషంతో మనస్సు రాముని చేరగా, వట్టి దేహం మాత్రమక్కడ నిలిచియుంది. అని వాచ్యార్థం.

హనుమంతుడు సీతను చూచినప్పుడు ఆమె శరీరంమీద కొన్ని ఆభరణాలను చూచేడు. సీత అప్పుడు శిరోమణిని వానితోపాటు ధరించి యుండలేదు. దానిని ఆమె వస్త్రంలో కప్పి దాచి వుంచింది. శిరోమణి అంటే తలమీద ధగ ధగలాడే మాణిక్యం. అనగా తలలో మెఱిసేది. భగవంతుని చేరాలనే తపన. సీత ప్రకృతిగదా! ఆమె తలలో మెరిసేది భగవంతుని సాయుజ్యాన్ని పొందాలనే ప్రకృతి యొక్క తపన అన్నమాట. ప్రకృతిలోనున్న అన్నిటిలోనూ, పరమాత్మ ఉన్నాడు. వ్యష్టిపరమాత్మను అనగా జీవాత్మను విశ్వవ్యాప్తమైన సమష్టి పరమాత్మతో చేర్చినపుడిక జన్మ యనేది ఉండదు. జన్మరాహిత్యం

కోసమే వ్యక్తిగత ప్రకృతిలోనున్న జీవాత్మ విశ్వవ్యాప్తమైన పరమాత్మలో కలవడానికి నిరంతరం తపన పడుతూ ఉంటుంది. ఆతపన ప్రకృతికి శిరోధార్యము. అంటే శ్రేష్ఠమైనది. సీత అంటే ప్రకృతి, రామునితో అంటే పరమాత్మతో, ఐక్యం కావడానికి పొందే తపనయే సీతా శిరోమణి అని అర్థం. ఎచ్చట భగవదైక్యం కోసం తపన ఉంటుందో ఆదే జ్ఞానం; దానిని ఆవరించి మాయ అనే యవనిక ఉండియే తీరుతుంది. అదే వస్త్రం అంటే. వ్యక్తిగత జీవప్రకృతి లోని ఐహిక వాసనారూపమాయయే వస్త్రం. వస్త్రం శరీరాన్ని ఆచ్ఛాదనం చేసేది కాన అది జీవ ప్రకృతిని ఆవరించియుండే మాయ అనేదానికి చిహ్నం అవుతుంది. ఆవస్త్రంలోన దాచివుంచిన శిరోమణిని విప్పి ఆంజనేయునికి సీత ఇచ్చింది అంటే, జీవప్రకృతి తనలోని భగవదైక్యం పొందాలనే తపనను మాయనుండి తొలగించి బుద్ధితత్త్వానికి ఆనంద తత్త్వాన్ని తన్ను చేరడంకోసం సమర్పించడమే ఆంజనేయుడికి శిరోమణి ప్రదానం అంటే. రామాంగుళీయక దర్శనంతో సీత వస్త్రగతమైన శిరోమణిని విప్పినది అంటే భగవత్ స్పర్శతో మాయను విచ్ఛిన్నంచేసినదన్నమాట.

వస్త్రపదం మాయకు చిహ్నంగా భాగవతంలోని గోపికా వస్త్రాపహరణ ఘట్టంలోని వ్యాఖ్యానంలో చెప్పబడింది. 'దుర్వాస' పదంలో దుర్ + వాస అనగా చెడ్డదైన వస్త్రం అని అర్థం. అదికూడ మాయాపరంగానే అంతరార్థం చెప్పబడింది. కుచేల పదంలోని 'చేల' అనే వస్త్ర పర్యాయపదంకూడా మాయ అనే అంతరార్థపరంగా చెప్పబడిందికాన వస్త్రపదం ఇచ్చటకూడ అదేవిధంగా మాయకుచిహ్నంగా చెప్పడం జరిగింది. 'దివ్యం మణిం' అన్నప్పుడు 'దివ్య' పదం దేవసంబంధమైన అనగా ప్రకాశయోగ్యమైనది అనే అర్థాన్నిచ్చేదిగా వుంది. దివ్ ధాతువునకు ప్రకాశం అర్థం.

హనుమంతుడు సీత ఇచ్చిన శిరోమణిని పుచ్చుకొన్నాడు దానిని 'అంగుళ్యా యోజయామాస' తన వ్రేలికి తొడుగుకొన్నాడు.

ఇక్కడ 'అంగుళి' అన్న పదానికి లోగడ అంగుళీయక ప్రదానంలోని లోగడ అంగుళి పదానికి చెప్పుకొన్న అర్థమే చెప్పుకోవాలి. అంగు= అంగమునందు, లీ=లీనమై యుండేది. అన్న ఈ వ్యుత్పత్త్యర్థంలో 'దేహాంతర్గత పరమాత్మ' అన్నది 'అంగుళీ' పదానికి అంతరార్థంగా చెప్పుకోవచ్చు. ఇంతకు పూర్వం రాముడి అంగుళీయకాన్ని తాను తెచ్చి సీత కిచ్చేడు. ఇప్పుడు సీత శిరోరత్నాన్ని ఆంజనేయుడు తన అంగుళికి తొడుగుకొన్నాడు. సీతకు అంటే ప్రకృతికి అన్నమాట. రామాంగుళీయకాన్ని ఇచ్చేడు. ఇప్పుడు ప్రకృతిలో నిగూఢమైయున్న భగవత్తత్త్వంలో లీనం కావాలనే తపనను బుద్ధిద్వారా పరమాత్మకు చేర్చే ప్రయత్నం జరిగింది అన్నదే, ఆంజనేయుడు సీతా శిరోరత్నాన్ని అంగుళికి తొడుగుకొన్నాడన్నదానికి అంతరార్థం. 'మణిరత్న మనుత్తమం' అన్నాడు వాల్మీకి. మణి అన్నా రత్నం అన్నా ఒకటే. ద్విరుక్తంగా మణిరత్నం అంటే శ్రేష్ఠమైన అనే అర్థాన్ని రత్నపదం ఇస్తుంది. 'అనుత్తమం' అనే మరో విశేషణం వేసేడు. 'న + ఉత్తమం యస్మాత్ తత్ అనుత్తమం' అని అవుతుంది. అంటే దేనికంటె ఉత్తమ మైనది లేదో అది అనుత్తమం అనిపించుకొంటుంది. అన్నిటికంటే శ్రేష్ఠమైనది సీతా శిరోమణి అని అర్థం. అన్నిటికంటే శ్రేష్ఠమైన తలలోని ఆలోచన ఏదో అదే భగవంతుణ్ణి చేరాలనే తీవ్రాకాంక్ష. అదే తపన అన్నమాట. ఈ విధంగా అర్థం విశేషణ సార్థక్యంతో చెప్పుకో వచ్చు. బుద్ధిద్వారా ఆనందరూప పరమాత్మకు ప్రకృతిలోని తపనను అందించడమే సీతా శిరోమణి ప్రదానంలోని అంతరార్థం. 'న హ్యస్య ప్రాభవ ద్భుజః' అస్య భుజః=అతని చేతి వ్రేలు, న ప్రాభవత్ = నరిపడలేదు, అంటే అతని చేతి వ్రేలు శిరోమణి రంధ్రమున పట్టలేదు. ఇక్కడి భుజపదానికి లక్షణా వృత్తితో 'వ్రేలు' అని అర్థం చెప్పాలి. అస్య భుజః=దాని అనుభవమునకు; న ప్రాభవత్=సమర్థుడు కాలేదు. అని అంతరార్థం. అంటే తపనను పూర్తిగా గ్రహించడానికి నిజానికి బుద్ధికి సామర్థ్యం చాలదు. అని చెప్పుకోవాలి. అయినా అది దానిని గ్రహించింది అని బుద్ధియొక్క విశేషాన్ని కొనియాడడం

జరిగిందిక్కడ "హృదయేన గతో రామః, శరీరేణ తు నిష్ఠితః". అంటే హృదయంచేత పొందబడిన రాముడు శరీరం చేత కూడ నిలుపబడ్డాడు. అని అంతరార్ధం. అంటే ఇంతకుపూర్వం సాధకుడు హృదయంలో ఆనందరూప పరమాత్మను 'అహం బ్రహ్మాస్మి' సాధన చేసి సాధించేడు. ఇది ఆంజనేయుడు రామాంగుళీయకాన్ని తీసికొని వచ్చినాడు అన్నదాని అంతరార్ధంగా స్ఫురిస్తుంది. ఇప్పుడు ప్రకృతి లోని జ్ఞాన తపనను మోసికొనిపోతున్నాడు. సీతయొక్క శిరోరత్నాన్ని తీసికొని వెళ్ళడం ప్రకృతిలోని తపనను పరమాత్మకు చేర్చడముకోనమే అని అర్ధమవుతుంది. శరీరం అన్నది ప్రకృతిని చెప్పేపదం కాన హృదయంతో పొందబడిన రాముడు అంటే పరమాత్మ ఇప్పుడు శరీరంతో నిలుపబడ్డాడు. అంటే ప్రకృతితో పరమాత్మకు ఐక్యాను సంధాన ప్రయత్నం బుద్ధిచేత చేయబడుతూంది. అనేది అంతరార్ధంగా చెప్పాలి అంటే ఈవిధంగా 'అహం బ్రహ్మాస్మి' అను సాధన 'సర్వం ఖ ల్విదం బ్రహ్మ, అను సాధనతో చేర్పబడుతుందన్నమాట.

'న హ్యస్య ప్రాభవ ద్భుజః' అతని చేతివేళ్లు శిరోమణిని తొడగడానికి పనికిరా లేదు. శిరోమణికి ఉన్న రంధ్రం అతని వేళ్లకి పట్టలేదని వాచ్యార్ధం. అంతరార్ధంలో ఇక్కడి 'భుజ' పదం అంగమునకు అంగికి అభేద భావంతో శరీరాన్ని చెప్తుంది. అతడు తన శరీరమును ఆనందరూప పరమాత్మగ భావించడానికి అతనికిసమర్ధత కలగలేదు అని అంతరార్ధం. అనగా సాధకునకు 'సర్వం ఖల్విదం' సాధన ఇంకను సిద్ధికి రాలేదని 'అహం బ్రహ్మాస్మి' సాధన మాత్రమే సిద్ధించినదనీ చెప్పుకోవాలి. 'అత్యతిష్ఠ ద్దశాంగుళమ్' అన్న పురుష సూక్తంలోని భగవత్స్వరూపాన్ని ఇక్కడ అన్వయించుకోవాల్సి వుంటుంది.

'అతి+అతిష్ఠత్+దశ+అంగు+లం' అని విడదీస్తే, పది ఇంద్రియాలను గ్రహించే శరీరమును (క్షేత్రమును) అతిక్రమించి వున్నవాడు క్షేత్రజ్ఞుడు, అతడే పురుషుడు అతడే పరమాత్మ అని

పిలువబడుతాడు. హృదయంలో నిలచియున్న ఈపరమాత్మనుగూర్చి 'నేతి' 'నేతి' అని ప్రకృతిలోని సర్వాన్నీ నిషేధిస్తూ అన్వేషణ జరుపగా జరుపగా 'అహం' ప్రత్యయముతో గోచరమైనవాడు అగును. ఇది 'అహం బ్రహ్మాస్మి' అనే సాధనచేత సాధించేది. ఈసాధన హృదయంలో భావనా బలంతో జరిగేది. కాన 'హృదయేన గతో రామః' అని చెప్పబడింది తర్వాత ఆ పరమాత్మను అనగా ఆ క్షేత్రజ్ఞుని క్షేత్రరూపంగా అనగా శరీర రూపంగా కూడ చూడాలి. అదే "సర్వం ఖల్విదం బ్రహ్మ అనే సాధనకు సంబంధించినది. అదే శరీరేణతు నిష్టితః' అన్న దాని అంతరార్థం. కాని ఇచ్చట ఆసాధనకు అస్య భుజః న ప్రాభవత్. (అస్య=సర్వవ్యాపక విష్ణువుయొక్క) పరమాత్మ యొక్క, భుజః, భుక్ అనే శబ్దం షష్ఠీ విభక్తిలో భుజః అని అవుతుంది. అప్పుడు 'భుజః' అంటే అనుభవమునకు అని అర్థం వస్తుంది. అనగా 'తానే విష్ణువు' అను అనుభూతికి అని అర్థం. ఆ అనుభవమునకు న ప్రాభవత్=సమర్థము కాలేదు. అంటే క్షేత్రాన్ని క్షేత్రజ్ఞుణ్ణికూడ ఒక్కటిగానే చూచే సాధనకు బుద్ధికి బలం చాలదు అని అర్థం. రావణ సంహారంతోనే పూర్తిగా వాసనలు నశిస్తాయి. కాన అప్పటి వఱకు క్షేత్ర క్షేత్రజ్ఞ సమైక్యం ఇంకా జరగదు అని సాధనాపరమైన రహస్యం ఇచ్చట ద్యోతకమవుతూంది.

శ్లో॥ మణిం తు దృష్ట్వా రామో వై
త్రయాణాం సంస్మరిష్యతి
వీరో జనన్యాః మమ చ
రాజ్ఞో దశరథస్య చ॥

మణిని చూచి రాముడు ముగ్గురిని తలచుకుంటాడు. ఒకరు ఆయనకు తల్లియైన కౌశల్య, రెండు నేను (సీత), మూడవవారు దశరథుడు అని సీత శిరోరత్నాన్ని యిస్తూ హనుమంతునితో పలికింది.

శిరోమణి అంటే భగవంతుని చేరే జ్ఞానతపనగదా! ఆ జ్ఞాన తపన కల్గడానికి ముగ్గురు కారణాలయి యున్నారు. కాన రాముడు

వారి ముగ్గురను తలుస్తాడు. ఒకరు కౌసల్య; కౌసల్యను కౌశల్యగా (కుశలస్యభావః=కౌశల్యం) మనం చెప్పి అది సాత్విక గుణాన్ని చెప్పేదిగా అంతరార్థం లోగడ చెప్పుకొన్నాం భగవంతుని చేరాలనే తపనకు సాత్విక ప్రవృత్తియే కారణం కనుక ఆ తపన సాత్త్విక గుణాన్ని జ్ఞప్తికి తెస్తుంది అన్నది శిరోమణిని చూచి రాముడు తన తల్లి యగు కౌశల్యను సంస్మరించడం జరుగుతుంది అన్నదానిలోని అంతరార్థం. రెండవది సీత. అంటే ప్రకృతి. ప్రకృతిలో సహజంగానే భగవదైక్యం పొందాలనే తపన వుంది కాన రాముడు సీతను సంస్మరిస్తాడనడంలోని అంతరార్థం ఏస్తుంది. మూడవవారు దశరథుడు. అంటే దశేంద్రియములను అదుపులో వుంచే సాధన భగవదైక్యం కావాలనే తపన ఇంద్రియ నిగ్రహం వల్లనే కల్గుతుంది. కాన దశరథుణ్ణి తలచడం, లోగడ జరిపిన ఇంద్రియనిగ్రహసాధనను సాధకుడు జ్ఞప్తికి తెచ్చుకుంటాడు. అన్న అంతరార్థాన్ని చెప్తూంది. ఈవిధంగా భగవదైక్యానుసంధానానికి ఈమూడూ కావలసియున్నా యనీ, అవి 1 సత్వగుణ సంసిద్ధి 2 ప్రకృతి వశీకారం 3 ఇంద్రియ నిగ్రహం అనీ పై శ్లోకానికి అంతరార్థ పరంగా అర్థం గ్రహించాలి.

'అభిజ్ఞానమభిజ్ఞాత మేత ద్రామస్య తత్త్వతః' అని అంటుంది సీత.

రామునియొక్క 'అభిజ్ఞానం' అంటే అభితః జ్ఞానం అవే వ్యుత్పత్త్యర్థంలో రామునకు సంబంధించిన సర్వ విజ్ఞానము అని అర్థం. తత్త్వతః=తత్వంలో, ఏతత్=ఇది, అభిజ్ఞాతం=నీచేత బాగా నాకు తెలియ జేయబడింది అంటుంది. అంటే ఆనందరూప పరమాత్మని చేరడానికి సంబంధించిన యావద్విజ్ఞానమూ నాకు బాగా తెలియజేయ బడింది అని సాధకుని బుద్ధి తత్త్వానికి సాధకునిలోనిదే అగు ప్రకృతి చేసే అభినందన అంతరార్థ పరంగా వస్తూందని శ్లోక పాఠాన్ని గ్రహించాలి. తర్వాత

" త్వ మస్మిన్ కార్య నిర్యోగే ప్రమాణం హరిసత్తమ "

అంటుంది సీత. అంటే ఈకార్యం నిర్యోగమందు నీవే ప్రమాణము అని అర్ధం. నిర్యోగమునందు అంటే నితరాం యోగం మిక్కిలి అనుసంధాన కార్యమందు అని అర్ధం. ప్రకృతికి పురుషునితో సంయోగం కూర్చడమే ఈపనియై యున్నది. అందుకు నీవు అర్హత కలవాడవు. అంటే బుద్ధితత్త్వం మాత్రమే ఈ ప్రకృతిపురుష సంయోగాన్ని జరిపించగల అర్హతను కల్గివుంది అని దీనిభావం.

## హనుమంతుని తిరుగు ప్రయాణం – రాక్షస వధ.

హనుమంతుడు సీతను వీడ్కొని రాముణ్ణి చేరుకోడానికి తిరుగు ప్రయాణం చేసినప్పుడు లంకలోని రాక్షసుల నెందరినో చంపివెళ్ళేడు. అంటే బుద్ధి తత్త్వం ప్రకృతిని అన్వేషించి ప్రకృతి యొక్క జ్ఞాన తపనను గుర్తించి ఆ తపనను ఆనంద స్వరూపమైన పరమాత్మవద్దకు మోసుకొని వెళ్ళేముందు తమో నిలయంలోని తమో వృత్తులను చాల వరకు పటాపంచలు చేసితీరుతుందని జ్ఞానమార్గపరమైన అంతరార్ధాన్ని గ్రహించాలి. కుంభక వాయువు మూలాధార చక్రంలోని కుండలినీ శక్తిని పైకి లేపి సహస్రారంలోని పరమాత్మతో ఐక్యం చెయ్యడానికై తనతో తీసుకొనిపోవునపుడు దారిలో మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర చక్రాల్లోని ప్రతిరోధ శక్తులను జయించి మరీ ముందుకు సాగుతుంది అనే యోగ మార్గపరమైన అంతరార్ధంకూడా హనుమంతుడు చేసిన రాక్షస వధలో మనకు ద్యోతకమవుతుంది.

కధ :— హనుమంతుడు వెడుతూ వెడుతూ రావణుని ప్రమదావనాన్నీ, చైత్య ప్రాసాదాన్నీ నాశం చేశాడు. దాన్ని కావలికాసే రాక్షసుల్ని చావగొట్టేడు. సేనాపతుల్ని ఐదుగుర్ని చంపేశాడు. ఏడుగుర్ని అమాత్య పుత్రుల్ని చంపేడు.

### లంకలోని ప్రమదావనం అంటే

ప్ర+మద+అవనం, మిక్కిలి మదాన్ని అంటే అహంకారాన్ని అవనం అంటే రక్షించేది అంటే తమో నిలయంలోని దుష్టశక్తి అని అర్ధం.

చైత్యప్రాసాదం అంటే చైత్య + ప్ర + స + అదము, అనగా చిత్ సంబంధమైన (భగవత్సంబంధమైనది) చైత్య అంటే జ్ఞానాన్ని ప్ర-ఎక్కువగా స-చంపునట్టిదిన్ని (సే-అంత కర్మణి అనే ధాతువువల్ల స అనగా చంపునది అని అర్థం వస్తుంది) అదతి ఇతి 'అదమ్'(అద భక్షణే అని ధాతువు) అదతి అనగా తినునది, చంపి తినునది. ప్రసాదమేస్వార్థమందు అణ్ ప్రత్యయం వచ్చి ప్రాసాదమౌతుంది. చైత్యప్రాసాదం అనగా జ్ఞానాన్ని నాశం చేసేది మాయాశక్తి అని అంతరార్థం చెప్పుకోవాలి. ఈవిధంగా అహంకారాన్ని మాయను ప్రకటించే దుష్టశక్తులను భగవత్సంబంధమైన తపనను మోసుకొనిపోయే బుద్ధి, నాశం చేస్తుంది అన్న విషయం ఆంజనేయుడు ప్రమదావనాన్ని చైత్య ప్రాసాదాన్ని నాశం చేసాడన్న దాని యొక్క అంతరార్థంగా చెప్పవచ్చు. పంచ సేనాపతులు, సప్త అమాత్య పుత్రులు అంటే పంచేంద్రియ దుష్టశక్తులు వానికి బలం చేకూర్చే సప్త ధాతు శక్తులు అన్నమాట. జ్ఞానమార్గంలో సాధకుని బుద్ధిబలంచేత అవి నివారింపబడ్డాయి; అన్నదే ఆంజనేయుడు పంచ సేనాపతులను, సప్త అమాత్య పుత్రులను వధించేడన్నదానికి అంతరార్థంగా చెప్పకోవాలి. ఈ అంతరార్థం స్ఫురించడం కోసమే పంచ, సప్త సంఖ్యలుగల సేనాపతులని అమాత్యపుత్రులని వాల్మీకి చెప్పడం జరిగింది. కాకపోతే అసంఖ్యలు అల్లాగే చెప్పివుండవలసిన పని లేదు. కుండలినీ శక్తిలో పరా అపరా శక్తులు రెండు వుంటాయి. పరాశక్తిని కుంభకవాయువుచే సాధకుడు పైకి లేపి తీసుకొని పోవునపుడు పంచ ఇంద్రియములవల్ల సప్త ధాతువులవల్ల కల్గే అపరాశక్తులు క్షీణిస్తాయి అన్న యోగమార్గపరమైన అంతరార్థంకూడా స్ఫురిస్తుంది. మూలాధారచక్రం వాసనా భూమిక, స్వాధిష్ఠానచక్రం అహంకార భూమిక, మణిపూరచక్రం మనోభూమిక. ఈమూడు భూమికలలోనూ సాధకుని సాధనను దిగజార్చే దుష్టశక్తులుంటాయి. సాధకుడు వీనిని జయించాలి. వానిని దాటి అనాహతచక్రంలోని బుద్ధి భూమికకు చేరితే ఇక ఆటంకాలు ఎదురయ్యేవిలేవు.

అనాహత చక్రంలోని బుద్ధి భూమిక మహత్తత్వానికి అనగా బుద్ధి యోగానికి సంబంధించినదే. ఆంజనేయుడు అంటే భగవత్సంబంధ మైన విజ్ఞానం కలవాడు, అనగా, బుద్ధి స్వరూపుడు కనుక క్రింది భూమికలలోని దుష్టశక్తుల్ని నివారించుకొని వెళ్ళగల్గేడు; అనే, జ్ఞాన యోగమార్గాల సంగమాలను ఇచ్చట పాఠకులు గ్రహించాలి. ఆంజ నేయుడు వాయు పుత్రుడు. కాన, కుంభక వాయువు ఆంజనేయునిగా యోగమార్గ పరంగా చెప్పవచ్చును కూడా.

## రావణునకు హనుమంతుని గూర్చిన ఆలోచన

కథ : రావణుడు హనుమంతుని పరాక్రమ చర్యలు తెలిసికొని ఇట్లా అనుకుంటాడు.

శ్లో॥ న హ్యహం తం కపిల మన్యే
కర్మణా ప్రతి తర్కయన్
సర్వదా త న్మహద్భూతం
మహా బల పరాక్రమం
మహత్ సత్త్వ మిదం జ్ఞేయం
కపి రూపం వ్యవస్థితం॥

ఇతడు చేసిన పనిని బట్టి ఆలోచిస్తే మాత్రం ఇతణ్ణి కపి మాత్రుడుగా తలచడానికి వీల్లేదు. మహా బల పరాక్రమంగల మహద్భూతంగా మహాత్సత్త్వంగా (మహాశక్తిగా) తెలిసికొనవలసినదే. ఈ మహాశక్తి కపిరూపం ధరించి వచ్చిందిగా అనుకోవాలి.

ఆంజనేయుడు మహత్‌భూతం, మహత్ సత్త్వం, అంటూ మహ తత్త్వంగా కంఠోక్తిగానే వాల్మీకి చెప్తూన్నాడు. ఇది జ్ఞానమార్గపరమైన గ్రంథం అని దీనివల్లనే తెలుస్తూంది. మహత్తత్త్వం అంటే బుద్ధితత్త్వం; బుద్ధియోగంఅన్నమాట ఈఅంతరార్థావబోధనయొక్క పనిలేకుండానే వాల్మీకిచేత ఇచ్చట వాచ్యంగానే చెప్పబడింది ఒక్కొక్కప్పుడు కవి తన హృదయాన్ని చాటుగా ముసుగులో ఉంచలేక అప్రయత్నంగా బహిర్గతంచేసి హృదయసత్యాన్ని తెల్పుకుంటూంటాడు.

## అక్షకుమారవధ.

కథ: రావణునికి ఆఖరు కుమారుడూ, ప్రేమ పాత్రుడూ అక్షకుమారుడు. రావణుడు అతణ్ణి ఆంజనేయుడు పైకి యుద్ధానికి పంపేడు. ఈ అక్షకుమారుడు ఆంజనేయుని చేతిలో చనిపోయేడు.

'అక్ష' అంటే ఇంద్రియము అని అర్థం. పంచ బాహ్యేంద్రియ శక్తినే కాక సర్వ ఇంద్రియశక్తినీ బుద్ధి తత్త్వం జయించి వేసింది అన్నది అక్షకుమార వధకు అంతరార్థంగా చెప్పాలి.

సూచన: అధోఽక్షజుడు అని భగవంతునికి పేరుంది. అక్షముల యొక్క అనగా బుద్ధీంద్రియము యొక్క లోలోపలి ప్రదేశమున, జనించినవాడు; అంటే ఇంద్రియాల లోలోపల అనగా బుద్ధీంద్రియములో దాగి ఉన్న పరమాత్మ అని అర్థం కాన, అక్షకుమార పదానికి ఇంద్రియముల యొక్క కుమార స్థితి అనగా బాల్య స్థితి అని అర్థం తెలియ వస్తుంది. దశేంద్రియప్రాబల్యం తనలోని స్వభావాంశాన్ని బుద్ధి నెదర్చడానికి పంపినదన్నమాట.

## బ్రహ్మాస్త్రంతో ఇంద్రజిత్తునకు హనుమంతుడు లొంగుట.

కథ :- ఇంద్రజిత్తు, బ్రహ్మాస్త్ర ప్రయోగం చేసాడు. ఆంజనేయుడు దానికి కట్టుబడిపోయేడు.

ఇంద్రజిత్తు అంటే ఇంద్రుని జయించినవాడు. ఇంద్రపదం మనస్సుకు అర్థంగా లోగడ చెప్పుకున్నాం. మనస్సును జయించిన వానికి అంటే మనో జయంవల్ల అష్టసిద్ధులు లభిస్తాయి. ఇంద్రజిత్తు అంటే మనో జయంతో ఆ సిద్ధులను పొంది స్వార్థానికి ఉపయోగించుకొన్నా ఆ యోగసాధన అది బుద్ధి తత్త్వం చేత కొంత వరకు గౌరవించదగ్గదే, ఆంజనేయుడు ఇంద్రజిత్తు యొక్క బ్రహ్మాస్త్రానికి లొంగినట్లు నటించాడన్నదానిలోని అంతరార్థంగా

గ్రహించాలి. ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రం ఆంజనేయుణ్ణి ఏమీ చేయలేదు. బ్రహ్మాస్త్రాన్ని గౌరవించడానికి ఆంజనేయుడే దానికి లొంగిపోయాడు అంతే. ఇచ్చట కొంత వివరిస్తాను. బ్రహ్మాస్త్ర పదంలోని బ్రహ్మపదం జ్ఞానమునే చెప్తున్నా ఇక్కడ ఆ జ్ఞానం పూర్ణ జ్ఞానం మాత్రం కాదు. పాక్షిక జ్ఞానం మాత్రమే. అష్టసిద్ధులకు లోబడిన యోగసాధన (మనోనిజయం) బ్రహ్మజ్ఞానాన్ని కొంతవఱకే తప్ప పూర్తిగా సాధించలేదు. ఆంజనేయుడు అనగా అనాహత చక్రంలోని బుద్ధి భూమికకు చెందిన సాధకుడగుట దానికి క్రింద స్థానం అయిన మణిపూరంలో కలిగే సిద్ధులను అతిక్రమించిన పూర్ణజ్ఞానం కల సాధకుడు కాన ఇంద్రజిత్తు యొక్క పాక్షిక జ్ఞానానికి సంబంధించిన బ్రహ్మాస్త్రం అంటే బ్రహ్మజ్ఞానం అతని మీద పని చేయలేదనే అంతరార్థ రహస్యాన్ని గ్రహించుకోవాలి. బ్రహ్మజ్ఞానం కోసం సిద్ధులను వదలి వేసిన వారిని, బ్రహ్మజ్ఞానం కోసమే ముందు యత్నం చేసినా తర్వాత సిద్ధులకు లొంగిపోయి వానితో తృప్తిపడి తాము సర్వశక్తులు పొందినవారమని విఱ్ఱవీగే వారేమీ చెయ్యలేరన్న యోగసాధనా రహస్యాన్ని ఇంద్రజిత్తు వేసిన బ్రహ్మాస్త్రం ఆంజనేయుణ్ణి ఏమీ చెయ్యలేదని, దాన్ని గౌరవించడానికే ఆంజనేయుడు దానికి లొంగి పోయేడనీ చెప్పిన కథకు అంతరార్థ పరంగా గ్రహించాలి. జ్ఞానులు సిద్ధులను గౌరవించడంవల్ల జ్ఞానులు సిద్ధులు పొందినవారికన్నా తక్కువ వారు గాదు. సిద్ధులను వదలివేయడంవల్ల జ్ఞానులే పైస్థాయికి చేరిన వారు. లోకులు యోగులు స్వార్థానికుపయోగించే సిద్ధులను చూచి వారు భగవంతులని భావిస్తారు. అదివారి మనోదౌర్బల్యానికి చిహ్నం మాత్రమే అవుతుంది.

## లంకాదహనం.

కథ :— హనుమంతుడు విభీషణుని గృహం మాత్రం విడిచి పెట్టి మిగిలిన లంకా పట్టణాన్నంతా కాల్చివేశాడు.

విభీషణుని గృహాన్ని ఎందుకు విడిచిపెట్టేడు? విభీషణుడు రావణసభలో 'దూత వధ' పనికిరాదని వారించి తనకు ఉపకారం చేసేడు కనుక ఆ అభిమానంతో హనుమంతు డాతని గృహాన్ని కాల్చ లేదు' అని చెప్పే సమాధానం వాచ్యార్థపరంగా చెప్పడం కలదు. కాని జ్ఞాన మార్గంలో అంతరార్థ పరంగా ఊహిస్తే విభీషణుడు అంటే వి + భీ + ఈషణుడు; వి=విగతమైన అంటే పోయిన, భీ=భయంగల, ఈషణుడు=దారేషణ, ధనేషణ, పుత్రేషణ అను ఈషణత్రయం క... వాడు అని అర్థం. అంటే, ధన దారాపుత్రుల విషయమైన భయం లేని వాడు అనిఅర్థం. అనగా ఈషణత్రయభయరహితుడని అర్థం. ఈషణ త్రయాన్ని గూర్చిన భయాన్ని విడిచి వేయడం జ్ఞానలక్షణం. హను మంతుడు బుద్ధి స్వరూపం. ఈషణత్రయరాహిత్యం అనేది జ్ఞాన లక్షణం అగుటవల్ల దానికి హాని కలిగే పనిని బుద్ధి చేయదు. అదే విభీషణ గృహాన్ని ఆంజనేయుడు కాల్చ లేదన్నదానిలోని అంతరార్థం.

లంక తమో నిలయం. అయినా ఆ తమోనిలయంలోకూడా కొన్ని జ్ఞానసంబంధములైన వెల్గులు మినుకు మినుకుమంటూ కన్పిస్తాయి. రావణ పరివారంలో త్రిజట, మండోదరి, విభీషణుడు, విభీషణుని భార్య సరమ, ఆతని పెద్దకూతురు అనల అనేవారు కేవల సాత్త్విక వృత్తులకు మారుపేర్లు. రావణునితోనే ఉన్నావారు రావణునికి తోడ్పడలేదు. అంటే సాత్త్విక వృత్తులు తమో నిలయంలో ఉన్నా, తమస్సుకు తోడ్పడవన్నమాట. ఇంద్రజిత్తు, కుంభకర్ణుడుకూడ రావణునితో 'సీతను రామునికిచ్చివేయు' మని ముందుగా బోధించిన వారే. మారీచుడుకూడా ముందుగా రాముని గొప్పతనాన్ని పొగడి చెప్పి సీతాపహరణం మంచిది కాదన్నాడు. అయినా వీరు రావణుని మాటను కాదనలేక రావణునికి తోడ్పడ్డారు. వీరిని పాక్షిక సాత్త్విక వృత్తులుగా చెప్పాలి. దశగ్రీవలోని, అంటే పది ఇంద్రియాలలోని తమో వృత్తులలోనే తద్వ్యతిరేకవృత్తులు అంటే కేవలసాత్త్విక వృత్తులు, పాక్షిక వృత్తులుకూడా ఉన్నాయి అని చెప్పాలి. మనం

లోచూపుతో చూచినపుడు, మనలోనే ఈ విధమైన కేవల వృత్తులూ, పాక్షిక వృత్తులూ పనిచేయడం గమనించగలం.

మంద + ఉత్ + అరి అని తగ్గించి వేయబడ్డ పెద్ద శత్రువులు కలది అనే వ్యుత్పత్త్యర్థం మందోదరి పదానికి చెప్పుకొనివున్నాము. ఆమె సీతమీద రావణుని చెయ్యి పడకుండా రావణుని ఇంద్రియా వేగాన్ని తగ్గించింది. ఆ కారణంగా మందోదరి పదం సార్థకమైంది.

నహ + రమా = నరమా (రమ్ ధాతువునకు ఆనందం అర్థం. 'రమా' అన్నదానికి ఆనందాన్నిచ్చేది అని అర్థం.) ఆనందాన్నిచ్చేదానితో కూడినది 'నరమ' అవుతుంది. ఆనందాన్నిచ్చేది 'జ్ఞానం'. కాన 'నరమ' అంటే జ్ఞానంతో కూడిన మనోవృత్తి. అనల అంటే అగ్ని అని అర్థం. అగ్నివలె శుద్ధంగా ఉండే మనోవృత్తి అనగా జ్ఞానజ్యోతి అని అనల పదానికి అర్థం. ఇంద్రజిత్తు అంటే మనస్సును జయించిన సిద్ధులు కల్గించే సాధన చేసినవాడు. కుంభకర్ణుడు అంటే కుంభక + ఋణుడు అనగా కుంభకము ఋణముగా కలవాడు. అనగా కొంత కాలం మాత్రమే కుంభక యోగంలో ఉండేవాడు అని అర్థం. కుంభకర్ణుడు ఆరు నెలలు నిద్రలోను ఆరు నెలలు మెలకువలోను ఉంటాడు. అంటే సంవత్సరంలో సగం కాలం కుంభక యోగంలో ఉంటాడు. మిగిలిన సగకాలం యోగహీనుడై స్వార్థపరుడుగా ఉంటాడు అని అర్థం. కుంభకయోగం శాశ్వతంగా నిలువదు కాన అది అప్పు తీసికొన్న సొమ్ము (ఋణం) వంటిది. దాన్ని తిరిగి ఇచ్చివెయ్యవలసినదే. ఈ విధంగా కుంభకర్ణుని హఠయోగము యొక్క ఒక వృత్తిగా చెప్పవచ్చును. మారీచుని గూర్చి, త్రిజటనుగూర్చి లోగడ అంతరార్థాలు చెప్పినపుడు చెప్పుకున్నాం.

పై విధంగా తమోగుణంలో (లంకలో) కేవల సాత్త్విక లక్షణాలు, పాక్షిక సాత్త్విక గుణాలూ కూడ మినుకు మినుకుమంటూ గుడ్డి దీపాలులాగ మెరుస్తూ ఉన్నాయి. ఇవి క్రమంగా తమో

లోకానికి అంతకూ కూడ వెలుగును ప్రసాదించాలని పని చేస్తూనే ఉంటాయి. ఈవిధంగా సాధకునిలోని తమోగుణంకూడ కొన్ని పాక్షిక సాత్త్విక వృత్తులూ, కేవల సాత్త్విక వృత్తులూ కల్గి వుంటుం దని అర్థం.

లంకలో ఈవిధంగా సాత్త్విక వృత్తులు కొన్ని మినుకు మినుకు మంటూ వున్నా వానిని లెక్కచెయ్యకుండా, ఆవెల్గులను పైకి రానియకుండా మిగిలిన కేవల తామసిక వృత్తులెన్నో తమోగుణాన్ని పోషించేవి వుంటనే వున్నాయి. వానిని ఆంజనేయుడు అంటే, బుద్ధి కాల్చివేసింది. అయితే తిరిగి రామునిమీద యుద్ధం చెయ్యడానికి దుష్ట శక్తులు అనగా రాక్షసులు లంకలో మిగులకూడదే! రామునితో వానర సేన నెదిరించి ఎందఱో అసంఖ్యాకులైన రాక్షసులు హెూరాహెూరీగా యుద్ధం చేసారు కదా! లంకంతా నాశంచేస్తే ఇంకా వారెక్కడ మిగిలారు? అని ప్రశ్నించవచ్చు. ఆంజనేయుడు తనకెదురువచ్చిన వారిని చంపేడు. లంకలోని ఇళ్ళు తగుల పెట్టినప్పుడు రాక్షసులు ఇళ్ళలోనుంచి పారిపోయి ప్రాణాలు కాపాడుకొన్నారు. కాని ఇళ్ళలో చనిపోలేదు. ఇళ్ళపై కప్పులు మాత్రమే కాలిపోయాయి. అంటే, దుష్టశక్తులయొక్క పైపై విజృంభణాన్ని మాత్రమే బుద్ధి నాశం చెయ్యగలదు. వానికి మూలములైన వాసనలను అది నాశం చెయ్య గల సామర్థ్యం కలది కాదు కూడ. పూర్ణ జ్ఞానానందరూప పరబ్రహ్మ స్వరూప సాక్షాత్కారం వల్లనే అవి అపరబ్రహ్మతత్త్వంలో లీనమై పోయి నశిస్తాయి. అంతవరకూ ఎంత నాశం చేసినా అవి ప్రేళ్ళూను కొని తిరిగి తిరిగి చిగురిస్తూనే ఉంటాయి. రామచంద్రుడు యుద్ధంలోకి దిగి బాణప్రయోగం చేసినతర్వాతనే, రాక్షసులు సమూలంగా నాశ మయ్యారు. అంటే, ఆనందరూప పరబ్రహ్మ సాక్షాత్కారం లభించి నప్పుడే అతమోవాసనలు పూర్తిగా నశించి బ్రహ్మసాయుజ్యం చెందుతాయని అంతరార్థపరంగా చెప్పుకోవాలి. ఈవిధంగా ఊహించి నపుడే రామాయణాన్ని ముక్తిగ్రంథంగా వాల్మీకి రచించినట్లు అర్థం చేసికోగల్గుతాం.

## మధువన ప్రవేశం,

కథ :— తిరిగి ఆంజనేయుడు సముద్రం దాటి, తోడి వానరులను కలిసికొని సీతాదర్శనం గూర్చి చెప్తాడు. తర్వాత అంతాకలసి మధువనంలోపడి అందులో స్వేచ్ఛగా మధువు త్రాగి కావలసిన పండ్లు, కాయలు తిని రామునిదగ్గరకు చేరుతారు. రాముడు అంజనేయుణ్ణి తన గాఢాలింగనంతో బహూకరిస్తాడు.

మధువనం అంటే తేనెపట్టులతోకూడిన అడివి అని వాచ్యార్థం. సుఖానుభవస్థితి అని అంతరార్థం. వనంలోని ఫలాలూ, తేనెపట్టులూ సుఖాలన్నమాట. వానిని అనుభవించి ఆపైని వానరులు రామదర్శనం చేసికొన్నారు. వానరులు అంటే సాత్త్వికవృత్తులు. సుఖానుభవంతో అవి ఆనందరూప పరబ్రహ్మ స్వరూపాన్ని దర్శించుకొన్నాయన్నమాట. సాత్త్విక వృత్తి సుఖాన్నిస్తూ బ్రహ్మ తత్త్వం పొందుతుందన్నమాట. కాన సుందరకాండ పారాయణం వద్దన్నా సకల సుఖాల్ని సమకూరుస్తూనే చివరకు పరబ్రహ్మ సాక్షాత్కారాన్ని కూడా కల్గిస్తుంది అన్న అంతరార్థం స్పష్టంగా ఇందు కనిపిస్తూంది. ఈవిధంగా సుందరకాండను అంతరార్థపరంగానే పారాయణ చెయ్యడం లాభకరం. ఎంతెంతవారికీకూడా దొరకని రామగాఢపరిష్వంగసుఖం ఆంజనేయుడికి లభించిందంటే ఏ సాధనవల్లనూకూడ పొందలేని సచ్చిదానంద రూప పరమాత్మయొక్క స్పర్శ సుఖం జ్ఞాన మార్గంలోనే బుద్ధి యోగ సాధనకు మాత్రమే లభిస్తుంది. అని మనం అంతరార్థపరంగా గ్రహించుకోవాలి.

ఉపసంహారం ;—

సుందరకాండ కథ ఆంజనేయుడు సముద్రందాటి లంకలో ప్రవేశించడంతో ప్రారంభించి లంకాదహనంతో పూర్తియైంది. అంటే తమోనిలయంలో బుద్ధితత్త్వం ప్రవేశించి తమోవృత్తుల విజృంభణాన్ని నాశం చేసింది అన్న సాధనా భాగానికి అంతరార్థపరంగా సంబంధించి

వుంది. సుందరకాండ మధ్యలో సిద్ధులు లభించడం, వానిని సాధకుడు వదలివేయడం, సుఖవాసనావృత్తులు ఆటంకం కలిగించడం, సాధకుడు వానికి లొంగకుండా తన స్వరూపాన్ని విజృంభింపజెయ్యడం వగైరా విషయాలతో అనుసంధింపబడివుంది. ఇది చివరకు ప్రకృతితత్త్వాన్ని పరమాత్మతత్త్వంతో అనుసంధించడానికి చేసిన సాధకుని కృషి ఫలవంతమైందన్నది ఇందులోనే తెలుపబడింది.

సుందరకాండ పారాయణ చేస్తే లాభాలు కల్గడం అంటే ఆంజనేయుడికి మైనాకుడు, సురస ఎదురుపడడం అన్నమాట. వానిని కాదని ముందుకు వెడితే ముక్తి లభిస్తుంది. అంతతో ఆగితే కోర్కెలు సిద్ధిస్తాయి. ముక్తిమాత్రం రాదు. జ్ఞానంతో అసంగ యోగంతో అంటీ ముట్టకుండా సుఖాల్ని అనుభవిస్తూ ముందుకు సాగిపోతూ ముక్తిని అందుకోవడానికి ముముక్షువులు ప్రయత్నిస్తారు. ఈ అసంగతత్త్వం అలవరచుకొన్నవారికి సురసామైనాకులవల్ల సుఖాలూ లభిస్తాయి, ముక్తి లభిస్తుంది. ఈజాగ్రత్తతో సాధకుడు సుందరకాండ పారాయణం సాగించాలి. కేవలం కోర్కెలను మాత్రమే సిద్ధింపజేసికొని ఆగిపోకూడదు. అట్టివారికి మోక్షంరాదు. భుక్తి ముక్తి ఇచ్చే అసంగతత్త్వం అలవరచుకోవాలి

# అంతరార్థ రామాయణము.

## యుద్ధకాండ.

రాముడు సముద్రతరణం కోసం సముద్రతీరానికి వానర సేనలను తరలింపజేసాడు. దానితో అప్పుడే లంకలో కలవరం ప్రారంభమైంది. రావణుడు సభచేసి జరుగుతూన్న విషయంచెప్పి సభవారి సలహాలు అడిగేడు. వానరులు రాకుండ ప్రతిఘటిద్దామని సభవారు సలహాలు చెప్పేరు.

'లంకా' అన్న పదంయొక్క వ్యుత్పత్తి ప్రదర్శన చేసేటప్పుడు ఆపదాన్ని తలక్రిందు చేస్తే 'కాలం' అని అవుతుంది. కాలం అంటే నలుపు. నలుపు తమోగుణానికి చిహ్నం. కాన లంకాపదం తమోగుణ నిలయంగా అర్థమవుతుంది.

*వానరులు, కపులు, హరులు అనే పదాలు కోతులకు వాడబడ్డాయి. పై పదాలన్నిటికీ వ్యుత్పత్త్యర్థపరంగా జ్ఞానాశ్రయ సాత్త్విక వృత్తులు అని అర్థం చెప్పుకోవచ్చు. ఈ విధమైన అర్థంతో, వానరులు వస్తున్నారంటే, సాత్త్విక వృత్తులు తమో నిలయంలో ప్రవేశించడానికి వస్తున్నాయని చెప్పుకోవచ్చు

---

వానర :– 'వన' అన్నపదం సంబంధార్థమున 'వాన' అవుతుంది. లేదా 'వనం' అన్నది 'వానం' అవుతుంది. వానస్య=అరణ్య సంబంధస్య, తమసః. రః=అగ్నిః నాశక ఇత్యర్థః అనే వ్యుత్పత్తిలో వానర అవుతుంది. అంటే అడవిలోని చీకటిని నాశం చేసేది. అనగా అల్లిబిల్లిగా అల్లుకొన్న చెట్లు తీగలవల్ల కలిగిన తమో వ్యాపారాన్ని నాశం చేసేదిగా 'వానర' పదానికి వ్యుత్పత్త్యర్థం తామసిక వృత్తుల్ని నాశంచేసే సాత్త్వికవృత్తిపరంగా చెప్పచ్చు. లేదా 'వన' పదానికి నీరు అర్థం. వానం అంటే నీటిలో ఉన్న భగవత్ శక్తి. ఆ శక్తిని 'ర' అంటే గ్రహించేది. సాత్త్వికవృత్తి.కపిః, కం=సుఖం,మోక్షసుఖం, పిబతి ఇతి కపిః మోక్ష సుఖాన్ని గ్రహించే సాత్త్వికవృత్తి. నీటిలో భగవంతుడు తవ శక్తిని ప్రవేశపెట్టేడని "అప ఏవ స సర్జాదౌ తాసు వీర్య మపాసృజత్" అనే దానివల్ల తెలుస్తూంది.

లంకలో అంటే జ్ఞానపరంగా తమోనిలయంలో; యోగపరంగా మూలాధార చక్రంలో, కలవరం బయలుదేరింది. సాత్త్విక వృత్తులు తమోవృత్తుల్ని నాశం చేస్తాయి. ఆసందర్భంలో తామసికవృత్తులు భయపడుతూనే, వానిని తామే నాశం చెయ్యడానికి యథాశక్తి ప్రయత్నంచేస్తూంటాయి. అదే రావణునికి సభవారు చెప్పినసలహాలు.

తమోనిలయంలో కూడ కొన్ని సాత్త్విక వృత్తులు బలహీన మైనవి వుంటాయి. కాని అవి తమోగుణాన్ని వృద్ధిచెయ్యవు. ఎప్పుడైనా తమోగుణం విశృంఖలంగా సంచరించేటప్పుడుదాని వేగాన్ని తగ్గించడానికి యథాశక్తి ప్రయత్నిస్తాయి కొన్ని సాత్త్విక వృత్తులు తమ ప్రయత్నం ఫలించనపుడు తమోనిలయాన్ని విడిచి సాత్త్విక సంపత్తికి శరణాగతి చేస్తాయి. విభీషణుడు చేసినదదే. విభీషణు డంటే ఈషణత్రయం గూర్చి భయం పొందని సాత్త్వికవృత్తి. లంకలో విభీషణుడు, అతని భార్య సరమ, అతని పెద్దకూతురు అనల, కుంభ కర్ణుడు, మారీచుడు, మండోదరి మొదలగువారు కొందరు రావణుని చేష్టలను ఇష్టపడనివారున్నారు. లోన బలహీనతవల్ల ఇష్టం లేక పోయినా విధిలేక తప్పనిసరిగా రావణుని మాట చెల్లించినవారు మండోదరి, మారీచుడు, ఇంద్రజిత్తు, కుంభకర్ణుడు. విభీషణుడు మాత్రం రావణుడు తన మాట విననప్పుడు రాముని శరణుపొందేడు. అంటే తమోనిలయంలోని కొన్ని వృత్తులు బలవంతమైనవి బలహీన మైనవి సాత్త్విక వృత్తులుంటాయని గ్రహించడానికే ఈ పాత్రలలో ద్వివిధలక్షణాలు వాల్మీకి సృష్టించా డనిపిస్తుంది.

మన నిత్యానుభవంలోనుండి కూడా ఒక్కొక్కప్పుడు మనం తమోగుణవృతులమై యున్నప్పుడుకూడ, కొన్ని సాత్త్వికవృత్తులు ఆతమస్సులోనుండి తలయెత్తడం, మనకు మంచిని బోధచెయ్యడం, అయినా మనం వానిని పట్టించుకోకపోవడం, జరుగుతూ వుంటుంది. ఈ అనుభవాన్ని ఆలోచించి చూస్తే, మనకు రావణానుచర వర్గంలో

రావణుని చేష్టలను ఇష్టపడక అతనిని విధిలేక అనుసరిస్తూన్న పాత్రల లక్షణం అవగాహన మవుతుంది. ఇవన్నీ ఒక వృత్తిలో మరొక వృత్తి చోటు చేసుకోవడం తెల్పుతాయి.

విభీషణుడు = వి + భీ + ఈషణ = విభీషణ; ఇది ఒక సాత్త్విక మనోవృత్తి; వి = విగతమైన; భీ = భయంకల, ఈషణ = దారేషణ, ధనేషణ, పుత్రేషణ గల సాత్త్వికవృత్తి అని వ్యుత్పత్త్యర్థం. మారీచుడు = 'మరీచి' యే మారీచ అవుతుంది. మరీచి అంటే ఎండమావి. లేనిది ఉన్నట్లు కనిపించే మాయ.

అర్థం :— సరమ = రమతో అనగా ఆనందముతో (రం ధాతువు నకు ఆనందం అర్థం. ఆ ధాతువుపై 'రమా' అవుతుంది.) (ఆనందంతో) కూడిన సాత్త్వికవృత్తి.

అనల = అగ్నివంటి పరిశుద్ధమైన సాత్త్వికవృత్తి.

మణ్డోదరి అన్నదే మండోదరి అని వాడబడింది.

మండోదరి = ముండ + ఉత్ + అరి-తగ్గించివేసే, గొప్ప శత్రు వృత్తులు గలది; రావణునిలోని సీతావ్యామోహాన్ని తగ్గించి అపైన రావణుడు బలాత్కారం చెయ్యకుండా చేసింది మండోదరి.

కుంభకర్ణుడు = కుంభ + క + ఋణుడు. కుంభ = కుంభకములో, కం = బ్రహ్మానంద సుఖమును, ఋణుడు = ఎరువుగా పొందే సాత్త్విక వృత్తి. కుంభకర్ణుడు రావణునకు రాముని శరణుపొందుమని హితబోధ చేసిన తరువాతనే యుద్ధమునకు వెడలినాడు.

ఇంద్రజిత్తు = ఇంద్రపదానికి మనస్సు అర్థం. మనస్సును జయించి తద్వారా సిద్ధులు పొందినవాడు.

## సముద్రానికి సేతు నిర్మాణ ప్రయత్నం.

కథ :— సముద్రుణ్ణి ప్రసన్నుని చేసుకొనేందుకు (దాటడానికి) రాముడు మూడు రోజులు అన్నపానాలు విసర్జించి మౌనవ్రతం

జరిపేడు. కాని, సముద్రుడు ప్రసన్నుడు కాలేదు. వెంటనే రాముడు సముద్రంమీద ప్రయోగించడానికి బాణం తీసేడు. రాముడు శర సంధానం చెయ్యకుండానే సముద్రుడు చేతులు జోడించి రాముని ముందు నిలబడ్డాడు. తన్ను దాటడానికి సేతువును నల నీలుల సహాయంతో నిర్మించుకోవలసిందిగా సలహా చెప్పేడు.

ప్రాణంలేని జలభూతాన్ని ఆరాధించడమేమిటి? అందుకు మౌనోపవాసం ఏమిటి? అది ప్రసన్నత పొందలేదని శరసంధానం చెయ్యడం ఏమిటి? ఇదంతా మూఢ విశ్వాసం లేని తార్కిక బుద్ధికి వింతగా కన్పిస్తుంది.

సముద్రం అంటే, దేవతాయాథార్థ్యచింతనం అనే అర్థం బారతీ నిరుక్తి అనే వేదార్థాన్ని వివరించి చెప్పే గ్రంథంలో ఉందనే సంగతి మనం లోగడనే చెప్పుకొని వున్నాం. దేవతా అంటే దేవత్వం. అంటే, ప్రకాశత్వం (దివ్ ధాతువునకు ప్రకాశం అర్థం) అంటే జ్ఞానం అని అర్థం చెప్పాలి, దాని యాథార్థ్యాన్ని అంటే దానిని మాయా వరణం లేకుండా శుద్ధంగా వుంచడం, అదే విజ్ఞానం. దాని చింతనం అంటే దాన్ని తరచు తరచు భావించడం శుద్ధజ్ఞానభావన. అదే సముద్రం అంటే స + ముద్ + ర; ముద్ అనగా ఆనందం సముద్ అనగా ఆనందంతో కూడినది అని అర్థం. అంటే విజ్ఞానం. దానిని 'ర' అంటే గ్రహించుట (రాతి గృహ్ణాతి ఇతి రః) అని అర్థం. ఆనందరూప విశేషజ్ఞానాన్ని గ్రహించడం కొఱకు చేసే భావన లేక ధ్యానము సముద్రపదాని కర్థం. ఇది నిరుక్త శాస్త్ర ప్రకారం నిరూపితమైంది,

మూడురోజులు మౌనం అంటే, విశ్వ, తైజస, ప్రాజ్ఞ అనేమూడు అవస్థలలోను ఒకదానితో ఒకటి లీనం చేసి చలనంలేని స్థితి పొందడం అని అర్థం. అన్నపానాలు లేకుండా అన్నది, ద్వంద్వ అతీత స్థితిని తెల్పుతుంది. ద్వంద్వాతీతుడై అవస్థాత్రయాన్ని అతిక్రమించినపుడు తురీయావస్థలో దివ్యత్వం సిద్ధిస్తుంది. అంటే దేవతా యాథార్థ్య

దర్శనం సాధకునకు లభిస్తుంది. అదే జ్ఞానసిద్ధి. కాని, ఇక్కడ ఎంత వ్రతం చేసినా రామునకు సముద్రుడు ప్రత్యక్షం కాలేదు. అప్పుడు రాముడు సముద్రుణ్ణి నాశం చెయ్యడానికి * శరసంధానం చేసేడు. అప్పుడు సముద్రుడు ప్రత్యక్షమయ్యేడు. అంటే సాధకుడు, అవస్థా త్రయం దాటి ద్వంద్వాతీతుడై ధ్యానం చేసినా, దేవతాయాథార్థ్య దర్శనం కాకపోవడంతో ఆసాధన ఇంతవరకూ చేసినదంతా బూటక మని, దాన్ని నాశం చెయ్యడానికి సాధకుడు నిస్పృహతో సిద్ధపడ్డాడు అన్నదే శరసంధానానికి అంతరార్థం. అట్టి నిస్పృహస్థితివరకు సాధకుడు వస్తేనేకాని దేవత్వ (ప్రకాశత్వ) సిద్ధి రాదు. ఆ నిస్పృహ స్థితి సాధకునకు చివరి స్థితి. ఆస్థితిలో దైవదర్శనం (జ్ఞానం) లభించి తీరుతుంది. అదే సముద్రుడు శరసంధానంతో రామునకు ప్రత్యక్షమయ్యేడన్న దానిలోని అంతరార్థం.

సముద్రుడు రామునకు నల, నీలుల సహాయంతో తనపైని సేతువును నిర్మించుకొమ్మన్నాడు.

'నల' అన్న పదానికి 'న లాతి గృహ్ణాతి ఇతి 'నలః' అని వ్యుత్పత్త్యర్థం. అంటే దేనిని గ్రహించనిది. అనగా, అసంగతత్త్వం (అంటీ ముట్టకుండా ఉండే జ్ఞానస్థితి) అన్నమాట. నీలః అనేది నీరః అనే దాని రూపం (రలయోరభేదః) అంటే, నిర్గతః రాత్ గ్రహణాత్ ఇతి. నిర్ + రః ఇతి నీరః 'రో రి' అనే వ్యాకరణ సూత్రంచేత, నిర్ లోని 'ని' అన్నదానికి దీర్ఘం వచ్చి 'ర్' లోపించి 'నీ' మిగులుతుంది) 'ర' అనునది రలలకు అభేదం అనే దానిచేత 'ల' అవుతుంది. అప్పుడు 'నీర' అనేది 'నీల' అని అయింది. అసలు 'నీర' అన్నదే సరైనది. నలపదంతో ద్వంద్వంగా నీర పదం కలిపి ఉచ్చరించడంలో 'నల' లోని 'ల' కార సాహచర్యంవల్ల నీరలోని

* 'శౄ హింసాయాం' అను ధాతువునుండి 'శర' అను పదం ఏర్పడింది. కావ 'శర' అనగా హింసించునది అనీ, 'శరసంధానం' అనగా 'నాశంచేయుట' అనీ అర్థాలు చెప్పవచ్చు.

'ర' కారం కూడ లకారంగా ఉచ్చరించడం జరగడంవల్ల వచ్చిన అక్షరం మళ్ళీ రావడం అనే అనుప్రాసతో పదానికి అందం వచ్చింది. అవిధంగా ఉచ్చారణలో నీలగా మారి నలుడు, నీలుడు అనేవి వాడకంలోకి వచ్చేయి.

నీల అన్నదానికి 'నిర్' అంటే నిర్గతమైన, 'ల' అంటే గ్రహణం కలది. అది వ్యుత్పత్తిలో నిస్సంగత్వస్థితి అనే అర్థం వస్తుంది. సంగమును అతిక్రమించిన జ్ఞానస్థితి అవుతుంది. ఈ విధంగా నల, నీల పదాలకు అసంగత్వ నిస్సంగత్వ స్థితులు అర్థం చెప్పవచ్చు. అసంగత్వం అంటే సంగం అనతే లేకపోవడం ( Non-attachment ). నిస్సంగత్వం అంటే సంగం ఉన్నట్లు కనుపడుతూ దానిని తనకు వాసనా రూపంలో అంటని స్థితిని పొందడం. ( Detatched attachment ) అని అర్థం. సూక్ష్మంగా కొంచెం తేడాలున్నా పైకి రెండూ ఒకే అర్థాలు చెప్పే పదాలుగానే ఉన్నాయి. సాధకునకు దేవతా యాథార్థ్య చింతనం వలన కల్గిన జ్ఞాన సిద్ధి ఈ అసంగత్వ, నిస్సంగత్వ స్థితులతో కల్గుతుంది. అనే బోధ నలనీలుల సహాయంతో రాముడు సేతుబంధనం చేసేడు అన్న కథకు అంతరార్థంగా స్ఫురిస్తుంది.

## సేతు నిర్మాణం

'షిఞ్ బంధనే' సినోతి బధ్నంతి మృత్పాషాణాదిభిః ఏనం ఇతిసేతుః'

అని అమర నిఘంటువులో గురుబాలప్రబోధికావ్యాఖ్యలో వ్యుత్పత్త్యర్థం చెప్పబడింది. షిఞ్ అనే ధాతువునకు బంధనం అర్థం అనీ, మట్టితోను రాళ్ళతోను బంధిస్తారు, కనుక 'సేతువు' అనీ దాని అర్థం.

'సముద్రం' అంటే దేవతా యాథార్థ్య చింతనం. ఆ విధంగా ఇచ్చట సముద్రానికి అంటే దేవతా తత్త్వచింతనానికి అనే అర్థం అంతరార్థ పరంగా చెప్పవలసివుంది. అప్పుడు సేతువు అంటే ఇచ్చట కర్మ, భక్తి, యోగ, జ్ఞాన మార్గాలచే కట్టబడిన ఆధ్యాత్మిక సేతువు అని

అంతరార్ధ పరంగా వ్యుత్పత్త్యర్థం చెప్పుకోవాలి. సముద్రాన్ని అంటే దేవతా యాథార్థ్య చింతనాన్ని దాటాలంటే కర్మ, భక్తి, యోగ, జ్ఞాన మార్గ సాధనాలతో నిర్మింపబడ్డ ఆధ్యాత్మిక సేతువు కావాలన్నమాట.

'సేతుం దృష్ట్వా సముద్రస్య పునర్జన్మ న విద్యతే' అని వుంది. అంటే సముద్రము యొక్క సేతువును చూస్తే జన్మరాహిత్యం కల్గుతుంది అని అర్థం.

కేవలం నీటితో నిండిన సముద్రానికి మట్టితోను, కర్రలతోను, రాళ్ళతోను కట్టిన వంతెనను చూస్తే జన్మరాహిత్యం ఎట్లా వస్తుంది? కాన ఇక్కడ సముద్రం అంటే దేవతా తత్త్వ చింతనం అనీ, సేతువు అంటే కర్మ, భక్తి, యోగ, జ్ఞాన సాధనాలతో నిర్మించబడ్డ ఆధ్యాత్మిక సేతువు అనీ, అట్టి సేతువును చూస్తే అంటే అనుభూతిని పొందితే జన్మరాహిత్యం వస్తుందనీ అర్థం చెప్పుకోవాలి. ఇక్కడ, ఇప్పుడు సముద్రతరణానికి వానరులు సేతువును నిర్మించారు, అంటే, సాధకునిలోని సాత్త్వికవృత్తులు దేవతాయాథార్థ్యచింతనానికి అంటే దివ్యజ్ఞాన సిద్ధి దాటి వెళ్ళడానికి కర్మ, భక్తి, యోగ, జ్ఞాన మార్గ సాధనా నిర్మాణం సాగించేరని అంతరార్థం చెప్పుకోవాలి.

## రామ లక్ష్మణులు వానరులతో లంకలో ప్రవేశించుట

కథ :— సేతువును నిర్మించుకొని సముద్రతరణంతో వానరులు లంకలో ప్రవేశించారు.

అంటే సాత్త్వికవృత్తులు భక్తి, యోగాది సాధనలతో దివ్యజ్ఞానం సాధించి ఆపైని తమోనిలయంలోనికి ప్రవేశించాయి అన్నమాట. అప్పుడు అందున్న తమోవృత్తులు ఆ సాత్త్విక వృత్తులవల్ల నాశంకాక ఏమవుతాయి? కొంతవరకు పెనగులాడినా తుదకు వాటిలో లీనమై పోతాయి. లంకలో వానరులచేత రాక్షసులు వధింపబడ్డారు. అన్నదానికి ఇదే అర్థం.

కథ :— ఆంజనేయుడు, రాముణ్ణి తన భుజాలమీద ఎక్కించుకొని సముద్రాన్ని దాటేడు. అంగదుడు లక్ష్మణుని తన భుజాలమీద ఎక్కించుకొని వెళ్ళేడు.

ఆంజనేయుడు అంటే, భగవంతుని అన్వేషించే బుద్ధి అనీ, రాముడు అంటే ఆనందరూపమనీ, మనం లోగడ చెప్పుకున్నాం. కాన, భగవంతుని అన్వేషించే బుద్ధి ఆనందాన్ని తనలో నింపు కొంటుంది అనేదే, ఆంజనేయుడు రాముణ్ణి భుజాలమీద ఎక్కించు కొన్నాడన్నదానికి అంతరార్థం.

లక్ష్మణుడు అంటే, పరమాత్మకు చిహ్నమైన జీవాత్మ. వాసనా సహితమైన ఆత్మ జీవాత్మ వాసనా రహితమైన ఆత్మ పరమాత్మగ అనబడుతుంది. ఇంతే, రెండిటికీ భేదం. అంగదుడంటే "అంగం దదాతి ఇతి అంగదః"; అణిమ లఘిమ, గరిమ అనే దేహసంబంధమైన సిద్ధులను పొందడం అని అర్థం వస్తుంది. అంగద సిద్ధి అంటే దేహ ధారణం, జీవాత్మకే సంబంధించినది. కాన, అణిమాది సిద్ధులు దేహాన్ని ఆధారం చేసికొంటాయి అని, ఆ శక్తులు పరమాత్మవికావు జీవాత్మవన్న జ్ఞాన రహస్యం అంగదుడు, లక్ష్మణుని మోసుకొని వెళ్ళేడు అన్నదానికి అంతరార్థం. అణిమాది సిద్ధులను పొంది అవి భగవంతుని సాక్షాత్కారం వల్ల పొందిన సిద్ధులుగా కొందరు యోగులు తామే భగవంతుని అవతారములుగా ప్రకటించుకొంటూ, ప్రజలను వశీకరించుకొని వారిచేత కొలిపించుకుంటూండడము నేడు లోకంలో చూస్తున్నాం. అవి భగవత్సాక్షాత్కారం వల్ల లభించినవి కావనీ, కేవలం యోగం వల్ల దేహానికి మాత్రమే లభించిన సిద్ధులనీ, దేహ సంబంధమైనవిగానే వానిని గుర్తించాలనీ వాల్మీకి అంగదుడు లక్ష్మణుణ్ణి మోసికొని వెళ్ళేడు అన్నదానిలో అంతరార్థపరంగా నిక్షే పించాడనిపిస్తోంది.

## లంకలో రావణుని సన్నాహం.

కథ :— లంకలో రావణుడు వానర సేనలు ప్రవేశించకుం పశ్చిమ ద్వారాన్ని రక్షించడానికి ఇంద్రజిత్తును ఏర్పాటు చేసా ఉత్తరద్వారాన్ని, రావణుడు తానే స్వయంగా రక్షించడానికి నిర్ణయిం కొన్నాడు. విరూపాక్షుణ్ణి నగరంలోని మూలబలానికి నాయకుణ్ణ నిర్ణయించేడు.

'ఇంధతే ప్రకాశతే ఇతి ఇంద్రః' అని ఇంద్రపదానికి వ్యుత్ప చెప్పి, నిత్యం ఏదో ఆలోచనతో వుంచుతూ వుండే మనస్సు ఇం పదానికి అర్థంగా లోగడనే చెప్పుకున్నాం. మనస్సు, సంక వికల్పాత్మకం. ఉన్నట్లు కన్పిస్తూ నశిస్తూ వుండే మాయమనస్సు ఇంద్రపదం పర్యాయంగా నిలుస్తుంది. 'ఇంద్రజాలం' అన్నప్పు 'మాయాజాలం' అని అర్థంగదా! ఈప్రయోగంవల్ల ఇంద్రపదం మా పర్యాయంగా చెప్పడంలో విప్రతిపత్తి లేదు. 'జిత్తు' అంటే వశపం కొన్నవాడు అని అర్థం. కాన ఇంద్రజిత్తు అన్న పదానికి మాయ జయించువాడు లేక మాయలు నేర్చినవాడు అనేది అర్థం చెప్పవచ ఈ మాయాజాలం, మనస్సుకి సంబంధించిన సాధనలవల్ల వశప తుంది. మనస్సాధనలతో మాయాసిద్ధులను సాధించినవాడు కూడ ఇంద్రజిత్తు పదానికి అర్థం చెప్పవచ్చు. ఒకవేళ ఇంద్రజి పదానికి మనో విజయం సాధించిన వాడని అర్థం వచ్చినా ఇక్క పూర్తి మనోవిజయం కాక కొంత మాత్రమే మనోవిజయం అని అ చెప్పాలి. సిద్ధులు లభించేటంత మనో విజయం రావడంతో చా మంది ఆ ప్రలోభంలో పడి యోగాన్ని మానివేస్తారు. ఇంద్రజి అట్టివాడు అనాలి.

తమోనిలయాన్ని మూడుభాగాలుగా భాగిస్తే, మొదటిది మా వృతమైన భాగం. అదే, లంకలోని పడమటిద్వారం. అదే ఇంద్రజి యొక్క (మాయా విశారదుని యొక్క) రక్షణలో ఉంచబడిం

అందులోనికి వచ్చే సాత్త్విక వృత్తుల్ని మాయి ఆవరించి తబ్బిబ్బు పరుస్తుంది అని అంతరార్థపరంగా సాధనావివరాలను గ్రహించవచ్చు.

రెండవది, మధ్యభాగం. అది విరూపాక్షుని రక్షణలో ఉంచబడింది. అంటే, 'విరూప + అక్ష' అంటే, ఇంద్రియాలయొక్క స్వస్వరూపాన్ని మార్పుచేసే తమోవృత్తి. అక్ష పదానికి ఇంద్రియం అని అర్థం. మొదటిభాగంలో మాయను తప్పించుకొని వచ్చినా, ఇందులోనికి వచ్చేటప్పటికి, సాత్త్వికవృత్తులు విరూపం పొంది, ఇంద్రియవశం అవుతాయి. మూడవది, ఉత్తరద్వారం. ఆఖరు ద్వారం. ఇది దశకంఠరావణుని, రక్షణలోనే వుంటూంది. అంటే, దశేంద్రియాలు, మూలాధారంలో స్వస్వరూపాలతోనే అచ్చటకు చేరిన స్వాత్త్విక వృత్తులను, వశపఱచుకుంటాయి. అంటే, ఇక్కడ సాత్త్విక వృత్తులు ఇంద్రియవ్యాపారలంపటతలో చిక్కుకుంటాయి. ఈ విధంగా రావణుని లంకారక్షణవిభాగానికి అంతరార్థంగా గ్రహించాలి.

## వానరుల లంకా ప్రవేశం.

కథ:- వానరులు లంకానగరంలోకి దిగేరు, యుద్ధం ప్రారంభం అయింది. రెండువైపులా కూడ వేలకొలది వీరులు నేలకొరిగేరు.

బలహీనములైన సాత్త్వికవృత్తుల్ని, బలవంతములైన తామసిక వృత్తులు, నాశం చేసాయి. అల్లాగే, బలహీనములైన తామసికవృత్తుల్ని బలవంతములైన సాత్త్వికవృత్తులు నాశం చేసాయి. అని యుద్ధానికి అర్థం.

చిత్రమేమంటే, సాత్త్వికవృత్తివల్ల నశించిన తామసికవృత్తి శాశ్వతంగా సాత్త్వికవృత్తిలో లీనమైపోతుంది. కాన, అట్టిదానికి తిరిగి తలెత్తడం అంటూవుండదు. తామసికవృత్తి చేత నాశమైన, సాత్త్విక వృత్తి మాత్రం పూర్తిగా స్వరూపనాశం పొందదు. అది తమోవృత్తిలో లీనం కాదు. తమోవృత్తియొక్క ప్రాబల్యానికి అది అణగివుంటుంది.

ఆ కారణంచేత, అది అదను చూసుకొని తలెత్తుతూనేవుంటుంది. రాక్షసులచేత వానరులు మూర్ఛపడ్డారేకాని చావలేదని చెప్పినదాని అంతరార్థం ఇదే.

కథ :— యుద్ధం అంతా అయిపొయ్యేక రాముడు ఇంద్రుణ్ణి ప్రార్థిస్తే ఇంద్రుడు అమృతవర్షాన్ని కురిపించేడు. వానరులంతా మూర్ఛనుండి పునర్జీవులైనారు.

యుద్ధభూమిలో ఇంద్రుడు అమృతవర్షాన్ని మృతులైన వానరులమీద మాత్రమే పడేటట్లు వర్షింపజేసాడా? వానరులతోపాటు రాక్షసులు అమృతవర్షం తమమీద పడినా బ్రతకలేదా? ఏమిటి?

రాముడు ఇంద్రుణ్ణి ప్రార్థించేడు. రాముడు అంటే, ఆనందం గదా! ఇంద్రుడు అంటే, మనస్సుగదా! ఆనందాంశయొక్క ప్రేరణతో మనస్సు తమోవృత్తులవల్ల తాత్కాలికంగా అణిగిపోయిన సాత్త్వికవృత్తుల్ని తిరిగి తలెత్తేటట్లు చేసిందని అంతరార్థం ఇక్కడ. రాముడు, ఇంద్రుణ్ణి కోరి అమృతవర్షం కురిపించడంవల్ల, వానరులు పునర్జీవులైనారన్న దానియొక్క అంతరార్థంగా గ్రహించాలి. తమోవృత్తులు, సాత్త్వికవృత్తులలో లీనం అయిపోయాయి కనుక, అవి తిరిగి పునర్జీవులయ్యే అవకాశం లేనేలేదు కాన రాక్షసులు పునర్జీవితులు కాలేరు. అని ఇచ్చట అంతరార్థపరంగా తెలిసికోవాలి. అప్పుడు మనకు పై వాక్యంలో అసంబద్ధత ఏమీ కన్పించదు.

## ఇంద్రజిత్తు, నాగాస్త్రప్రయోగం.

కథ :— ఇంద్రజిత్తు రామలక్ష్మణులమీద నాగాస్త్రాన్ని ప్రయోగించేడు. వాళ్ళు ఆ అస్త్రమహిమచేత నాగపాశాల్లో చిక్కుకొని కదల్లేక నేలమీద పడిపొయ్యేరు. ఇంతలో సముద్రం పెద్దగా కల్లోలితమైంది. పక్షిరాజైన గరుత్మంతుడు తనరెక్కలగాలిచేత సముద్రాన్ని కల్లోలిత పరుస్తూ అక్కడికి వచ్చేడు. గరుత్మంతుడు

రాగానే రామలక్ష్మణుల శరీరాల్ని బంధించిన నాగపాశాలు వదలి రివ్వున పైకెగరిపొయ్యేయి. ఏమిటిది? నాగాస్త్రాన్ని ప్రయోగిస్తే పాములు చుట్టివేస్తాయనీ, గరుడాస్త్రాన్ని ప్రయోగిస్తే గరుత్మంతుడు వస్తాడనీ, అతణ్ణిచూసేసరికి పాములుఎగిరిపోయాయనీ చెప్పుకుంటారు. వాచ్యార్థంలో నాగాస్త్రంతో పాములు రావడం ఏమిటి? అవి కరవకుండా పట్టుకొని బంధిస్తాయా? అసలు ఇక్కడ గరుత్మంతుడు రావడానికి గారుడాస్త్రప్రయోగం ఎవరూ చేయనేలేదే! గారుడాస్త్రం, ప్రయోగించి రామలక్ష్మణులు నాగాస్త్రాన్ని నాశం చెయ్యలేదే! వారికి గారుడాస్త్రం తెలియదా! వాచ్యార్థంలో ఇదంతా అయోమయ స్థితిని సృష్టిస్తోంది. ఇల్లాంటప్పుడే ఇందులో ఏదో అంతరార్థదృష్టితో వాల్మీకి రచన సాగించేడని చెప్పక తప్పదు.

'నాగ' అంటే, న+అగ; 'అగ' అన్నదానికి కదలిక లేనిది అని అర్థం వస్తుంది. కదలనిది అంటే, నిశ్చలతత్త్వం. అదే ఆస్తికత్వం 'న+అగ' అన్నప్పుడు నిశ్చల తత్త్వం కానిది; లేక ఆస్తికత్వం కానిది; చంచల తత్త్వం; అనగా నాస్తికత్వం అనే అర్థం వస్తుంది 'అగం' అనగా =ఆస్తికత్వం నాగం అనగా నాస్తికత్వం అన్నమాట. నాస్తిక వాదం అంటే, భౌతిక వాదం. ఈ భౌతికవాదం చంచలములైన తామసిక, రాజసికతత్త్వాలకు సంబంధించినది. నాగాస్త్రం అంటే అదే. దాన్ని, రామలక్ష్మణులమీద, ఇంద్రజిత్తు ప్రయోగించేడు. అంటే, భౌతికవాదం, భగవంతునియొక్క అస్తిత్వాన్ని తొలగించేందుకు, తామసిక, రాజసిక తత్త్వాలచేత అనగా నాస్తికులచేత జీవాత్మ, పరమాత్మల మీద ప్రయోగింపబడగా, ఆ వాదప్రభావంవల్ల భగవంతుని అస్తిత్వం అనగా భగవంతు డున్నాడన్నది కొంత శంకింపబడేస్థితి పొందుతుంది. అదే రామలక్ష్మణులు నాగపాశాలకు కట్టుబడడం అంటే.

తర్వాత సముద్రం కల్లోలమైంది. దేవతాయాథార్థ్యచింతనం అన్నది సముద్రపదానికి అర్థం. దేవతాయాథార్థ్యచింతనం చాల శిథిలమైంది. నాస్తికత్వంవల్ల దేవవిజ్ఞానం శైథిల్యం పొందింది.

అంతలో గరుత్మంతుడు వచ్చేడు. గరుత్మంతుడు అంటే వేదం. (గరుత్మంతుడు ఛందోమయుడు అని వుంది) రెండు రెక్కలూ వీచుకుంటూ, గరుత్మంతుడు వచ్చేడు అంటే, కర్మ భాగం, ఉపనిషద్భాగం అనే రెండు భాగాలనూ వ్యాప్తి చేసికొంటూ వేదం వచ్చి సాధకునిలో నిలబడింది అని అర్థం. అది రాగానే నాగపాశాలు శిథిలితములై ఎగిరిపోయేయి. అంటే సాధకునిలో చోటు చేసికొన్న భౌతిక, నాస్తిక వాదాలు వేద వాదం ముందు నిలవక ఎగిరిపోయేయి అన్నమాట.

ఎంతెంతటి సాధకులలోనూ సాధన సిద్ధి పొందే సమయానికి ముందు ఒక్కొక్కప్పుడు విసువు జనించి నాస్తికవాదం ఆవరిస్తూంటుంది. కొందరు సాధకులు ఆ విసుగుదలకు తట్టుకోలేక నాస్తికులయిపోయే ప్రమాదంకూడ ఉంది. అట్టి విసుగుదల జనించడం అనేది సాధకునకు ఎదురయ్యే ఆఖరు విఘ్నం. అట్టి విఘ్నం తలెత్తిన సందర్భంలో సుస్థిరుడైన సాధకునిలో అంతవరకు కుదురుకొనియున్న వేదవిజ్ఞానం ఆ నాస్తికవాదానికి తీవ్రప్రత్యర్థిగా నిలుస్తుంది. అప్పుడు నాస్తికత్వం పటాపంచలై పోతుంది. నాగాస్త్ర ప్రయోగం, ఛందోమయుడైన గరుత్మంతుని రాక, రామలక్ష్మణులు నాగాస్త్రం నుండి విముక్తులుకాగల్గడం అన్న కథకు ఇదే అంతరార్థంగా గ్రహించాలి. 'గరుత్మంతు' డనగా 'రెక్కలు గలవా' డని అర్థం. కర్మమార్గం, ఉపనిషన్మార్గం రెండు రెక్కలుగా గరుత్మంతుడు ఛందోమయుడని చెప్పబడింది.

## ఇంద్రజిత్తువలన లక్ష్మణమూర్ఛ.

కథ :— ఇంద్రజిత్తు లక్ష్మణుణ్ణి మూర్ఛ పడగొట్టేడు. ఆంజనేయుడు తెచ్చిన సంజీవనౌషధివల్ల మూర్ఛదేటి, లక్ష్మణుడు ఇంద్రజిత్తును చంపేడు. ఇంద్రజిత్తు పదునాలుగేండ్లు నిద్రాహారాలు లేనివాని చేతిలో కాని చావడు. ఈ విధంగా అతనికి వరం ఉంది.

లక్ష్మణుడు సీతారాములను పదునాలుగేండ్లు అరణ్యవాసంలో నిద్రాహారాలు లేకుండా సేవించేడు. ఆ కారణంగా, ఇంద్రజిత్తుకు, లక్ష్మణుని చేతిలో చావు వచ్చింది.

'జీవాత్మ కర్మవాసనలకు బద్ధుడు. కాన, వాసనాప్రభావం వల్ల మాయకు తాత్కాలికంగా వశపడడం సహజం' అనే సంగతిని 'ఇంద్రజిత్తుతో యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛపడ్డాడు' అన్నదానికి అంతరార్థంగా చెప్పాలి. ఆంజనేయుడు తెచ్చిన సంజీవపర్వతం మీది సంజీవనీకరణి అనే ఓషధి ప్రభావంవల్ల, లక్ష్మణుడు మూర్ఛనుండి తెప్పరిల్లినాడు అంటే, బుద్ధివల్ల జరిగిన అమృతీకరణ శక్తి చేత జీవుడు మాయనుండి తేరుకొన్నాడని అంతరార్థం. మనస్సున కల్గిన మాయ, బుద్ధి విజ్ఞానం ద్వారా తొలగిపోతుంది అనే రహస్యం ఇది విప్పి చెప్తుంది. ఆంజనేయుడంటే బుద్ధితత్త్వం అని లోగడనే చెప్పుకొనియున్నాం. బుద్ధి నిశ్చయాత్మకమైనది కాన దానికి చంచలత వుండదు.

మాయ అనేది ఇంద్రియాలలో చాంచల్యం ఉన్నప్పుడే పని చేస్తుంది. దాని ఉనికికి ఇంద్రియచాంచల్యమే కారణం. జీవుడు వాసనావశుడై అప్పుడప్పుడు చాంచల్యం పొందుతాడు. ఇంద్రియ చాంచల్యం లేనిచోట మాయ ఉండనే ఉండదు. అసలు మాయ అనే పదానికి, లేనిది ఉన్నట్టుగా తోపింపజేసేది అనేదే అర్థం గదా! యా, మా, సా, మాయా, యా–ఏది, మా–లేదో సా–అది మాయా అని పిలువబడుతూవుంది. లేనిది, ఉన్నట్లు తోపించే భ్రాంతికే మాయ అని పేరు. భ్రాంతి ఇంద్రియాలు నిశ్చలస్థితిలో వున్నప్పుడు కలుగనేకలుగదు. ఇంద్రియ నిశ్చలత గల్గినపుడు మాయ తనంత తాను నశిస్తుంది.

## ఇంద్రజిత్తు యొక్క వధ.

ఇంద్రజిత్తు పదునాలుగేండ్లు, నిద్రాహారములు లేనివాని చేత గాని, చావడు. అంటే, ఇంద్రజిత్తు ( అంటే మాయశక్తులు )

పదునాలుగేండ్లు ( అంటే పదునాల్గు ఇంద్రియాలలో - కర్మేంద్రియాలు, అయిదు; జ్ఞానేంద్రియాలు అయిదు; మనో, బుద్ధి, చిత్తాహంకారాలనే అంతఃకరణ చతుష్టయం మొత్తం పధ్నాల్గు. ) నిద్రాహారాలు లేక మెలకువ కల్గివుండి ( అంటే, పదునాల్గింటిలోను చాంచల్యం ఏమాత్రం లేకుండా నిద్రాహారాలు లేకుండా ద్వంద్వాతీతనిశ్చలత కల్గియుండి) యున్నవానిచేతిలో ఇంద్రజిత్తు చస్తాడుఅన్నమాట. (అంటే, పది ఇంద్రియాలలోను అంతఃకరణచతుష్టయంలోను చాంచల్యం లేనిస్థితిలో మాయాప్రభావం నశిస్తుంది అని అర్థం.) లక్ష్మణుడు సీతారాములను, పదునాల్గేండ్లు అరణ్యవాసంలో, నిద్రాహారాలు లేకుండా సేవించేడు. అంటే జీవాత్మ ప్రకృతిపురుషులయొక్క సేవలో అరణ్యంలో (ప్రశాంత స్థితిలో) ఇంద్రియాలలో నిశ్చలతను సాధించేడు అని అర్థం. ఇట్టి లక్ష్మణుని చేతిలో ఇంద్రజిత్తు నశించేడు అంటే, పదునాల్గు ఇంద్రియాలలోను నిశ్చలత సాధించి ద్వంద్వాతీతుడైన సాధకుని యెదుట మాయాజాలం నిలువలేక నశిస్తుంది. ఇంద్రజిత్తు మనస్సు వరకు ఉన్నదానిలో పాక్షికమైన విజయం సాధించేడు. లక్ష్మణుడు పదునాల్గింటిలో సిద్ధి పొందేడు అని అంతరార్థం మనకు బోధపడుతూంది. మాయాతీతుడు కావాలంటే సాధకుడు పది ఇంద్రియాలలోను అంతఃకరణ చతుష్టయంలోను ద్వంద్వాతీతుడుగా నైశ్చల్యం సాధించాలన్న సాధనారహస్యం ఇంద్రజిత్తువధలో వాల్మీకిమహర్షిచే నిక్షేపింపబడింది.

కథ :— లక్ష్మణుడు, ఇంద్రజిత్తును ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించి చంపేడు.

ఐంద్ర అంటే, ఇంద్రసంబంధమైన ( మనస్సంబంధమైన ) అని అర్థం. మాయ అనేది నిశ్చలత లేని మనస్సునకు సంబంధించినదే. దాని నాశనంకూడ, మనస్సునకు సంబంధించినదే. మనస్సు చాంచల్యంగా ఉంటే మాయాసహితమై ఉందన్నమాట. ఆ మనస్సే నిశ్చలతలో ఉంటే మాయాతీతమై ఉందన్నమాట. ఐంద్రాస్త్ర

ప్రయోగంతోనే ఇంద్రజిత్తును నాశనం చెయ్యడం జరిగింది. అంటే అంతరార్థం ఇదే. మనస్సుకు సంబంధించిన హఠయోగ సాధనలు మాయను ఇతరులపై ప్రయోగించే సామర్థ్యాన్ని ఇస్తాయి. ఆవిధంగా, ఇంద్రజిత్తు మనస్సును యోగసాధనచే జయించి మాయాప్రౌఢిని సంపాదించేడు. ఇది పూర్తి మనోవిజయం సాధించనక్కరలేకుండానే మనోవిజయ సాధనా మార్గంలో పాక్షిక మనోవిజయం వచ్చే శక్తి మాత్రమే. కొంత ఆశక్తి రాగానే యోగతుష్టుడై మనోవిజయసాధన విడిచివేస్తాడు. ఇది పాక్షిక మనోవిజయం యొక్క పాక్షికస్థితి మాత్రమే. ఇట్టి పాక్షిక మనో విజయంతో మాయా శక్తిగల తామసిక మనోవృత్తికి ఇంద్రజిత్తు అని పేరు. పదునాలుగు ఇంద్రియాలలోను నిశ్చలత సాధించడం పూర్తి మనోవిజయం అవుతుంది లక్ష్మణుని పూర్తి మనోవిజయం సాధనలో ఇంద్రజిత్తుయొక్క పాక్షికమనో విజయం నశిస్తుంది. ఇదే ఇంద్రాస్త్రప్రయోగంవల్ల లక్ష్మణుడు ఇంద్రజిత్తును నాశం చేశాడన్నదాని అంతరార్థం.

మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః అన్న వాక్యార్థము ఈ ఇంద్రజిత్ లక్ష్మణ పాత్రల అంతరార్థ కార్య విధానములకు మూలముగా గ్రహింపవచ్చు. మాయావృతుడైనవాడు బంధితుడగును. ఇంద్రియ నిశ్చలతతో మాయను జయించినవాడు ముక్తుడగును అన్నది ఇచ్చట గ్రహింపదగు పరమార్థము.

## కుంభకర్ణుని యుద్ధం.

కుంభకర్ణుడు మొదట్లో రావణునకు హితబోధ చేసాడు. కాని రావణుడు అతని మాట వినలేదని అతణ్ణి విడిచిపోలేదు. రావణుని కోసం రాముడితో యుద్ధంచేసి యుద్ధంలో చనిపోయాడు. కుంభకర్ణుడికి ఆరునెలలు నిద్రావస్థ. మిగిలిన ఆరునెలలు జాగ్రదవస్థ. కుంభకర్ణుణ్ణి నిద్రలోనుండి బలవంతంగా లేపి రావణుడు యుద్ధానికి పంపేడు. 'కుంభకర్ణ' అంటే, కుంభక + ఋణ అని విడదీయాలి.

ఋణం, అంటే, ఎరువు వస్తువు; బదులుగా తీసుకొన్నది కాన, అది తనవద్ద శాశ్వతంగా ఉండేది కాదు. కొన్నాళ్ళు మాత్రమే, ఋణం తీసుకొన్న వస్తువు మనదగ్గర ఉండేది. కుంభకప్రాణాయామ యోగంలో వాయువును, కుంభించి వున్నంతకాలం మనస్సు నిశ్చలంగా వుంటుంది. మనస్సు నిశ్చలంగా వున్నప్పుడు, నిర్విషయానందం కల్గుతుంది. ఆ నిర్విషయానందమే, బ్రహ్మతత్త్వం. ఆ ఆనందం కుంభకయోగం విడిచినపుడు ఉండదు. ఆ ఆనందం కుంభక యోగికి ఋణం తెచ్చుకొన్న వస్తువన్నమాట. కుంభకయోగం, విడిచిన పిమ్మట మనో నిశ్చలత వుండని కారణంచేత ఆతనికి విషయ లంపటత తిరిగి వస్తుంది. ఈ కుంభక ప్రాణాయామ యోగం పాక్షికంగా మాత్రమే భగవత్తత్త్వాన్ని సాధకునకు కల్గింపజేస్తుంది. ఒక్క జ్ఞాన యోగంలో మాత్రమే, సర్వకాల, సర్వావస్థలయందు, భగవత్తత్త్వం, పరివేష్టింపబడి వుంటుంది. ఈ విధంగా 'కుంభకర్ణుడు' అంటే, కుంభక యోగంలో పాక్షికంగా భగవత్తత్త్వంలో లీనమయ్యే యోగ సాధకుడు అని అర్థం. కుంభకర్ణునికి ఆరు నెలలు నిద్ర, ఆరు నెలలు మెలకువ అన్నదానికి కుంభకంలో భగవత్తత్త్వం ఉండడం, అది కానప్పుడు మాయావృతం కావడం అన్నది అంతరార్థంగా గ్రహించాలి.

కుంభకర్ణుడు రామునితో రావణుని ఆజ్ఞతో యుద్ధం చేసాడంటే, మెలకువలో నున్నప్పుడు, అంటే, కుంభక యోగాన్ని విడిచి యున్నప్పుడు, దశఇంద్రియాధీనుడై ఈ కుంభక యోగి ప్రవర్తిస్తాడని, అప్పుడు భగవదపచార ప్రవర్తనకుకూడ సిద్ధపడతాడని యోగరహస్యం ఇందులో స్పష్టం చెయ్యబడింది. రావణుడు కుంభకర్ణుణ్ణి నిద్రనుండి లేపి యుద్ధోన్ముఖుణ్ణి చేశాడన్నదాని అర్థంకూడ ఇదే అర్థం చెప్తూంది.

కథ :— కుంభకర్ణునిచేత అంగదుడు దెబ్బలు తిని స్పృహ తప్పి పడిపోయేడు. సుగ్రీవుడుకూడ తెలివితప్పి పడ్డాడు. కుంభకర్ణుడు సుగ్రీవుణ్ణి ఎత్తుకొనిపోయి లంకలోకి పారిపోయేడు. తర్వాత

సుగ్రీవుడికి తెలివి వచ్చి ఆకాశమార్గాన ఎగిరి వెళ్ళి రామచంద్రుణ్ణి చేరికొన్నాడు. అంగదుడు తిరిగి స్పృహలోనికి వచ్చేరు.

లక్ష్మణుడు, కుంభకర్ణుడిమీద బాణాలు ప్రయోగించేడు కాని, కుంభకర్ణుడు వాటిని లెక్కచెయ్యకుండా దాటుకొనివెళ్ళి రాముడి మీదకు యుద్ధానికి తలపడ్డాడు, రాముడు కుంభకర్ణుడితో చాలసేపు పోరాడి చివరకు వానిని చంపివేసాడు.

కుంభకర్ణవధతో రావణుడు బెదరిపోయేడు. "నాకేం అర్థం కావడంలేదు. ఈ రాముడి పరాక్రమం చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉందే. ఇతడు సాక్షాత్తునా రాయణుడేనా!" అని రావణుడు ఆలోచనలో పడ్డాడు. పైవాక్యాలకు ఒక్కొక్క వాక్యాన్నే విప్పి చెప్పి అంతరార్థం వివరిస్తాను.

"యుద్ధంలో కుంభకర్ణుడిచేతిలో అంగదుడు దెబ్బలుతిని స్పృహతప్పి పడిపోయేడు".

అంటే, కుంభకయోగ మార్గంలో కుంభకంతో కలిగిన మనో లయంతో బ్రహ్మానందానుభవస్థితిని కొంతకాలం మాత్రమే అనుభ వించే యోగస్థితిముందు మనోనిగ్రహసాధనతో సంపాదించిన అంగద సిద్ధియోగం, అంటే శరీరానికి సంబంధించిన అణిమాది సిద్ధు లను మాత్రమే పొందే యోగస్థితి చాల తక్కువస్థాయిలోనిది. కాన కుంభక స్థితికి అంగదసిద్ధియోగం వశపడిపోతుందనీ కుంభకస్థితి పాక్షికం మాత్రమే కావడంవల్ల ఆ కుంభకస్థితి విడిచిన కాలంలో అంగదసిద్ధి దాన్ని మించినదే అవుతుందనీ అనక తప్పదు. ఆకారణం చేతనే మొదట్లో అంగదుడు మూర్ఛపడి కొంతసేపటికి తెప్పరిల్లినాడని చెప్పడం జరిగింది.

"సుగ్రీవుణ్ణి మూర్ఛపుచ్చి కుంభకర్ణుడు లంకలోకి తీసుకొని పోయేడు. సుగ్రీవుడు కొంతసేపటికి తెప్పరిల్లి ఆకాశమార్గాన రామచంద్రమూర్తిని చేరుకొన్నాడు".

అంటే, సుగ్రీవుడు విశుద్ధజ్ఞానంగా మనం చెప్పుకున్నాం. ఈ జ్ఞానం నిర్విషయానందంతో కలిసికొని వుంటుంది. అనేదే కొంత సేపటికి సుగ్రీవుడు తెప్పరిల్లి రాముని చేరుకున్నాడన్నదానికి అంతరార్థం. కుంభకర్ణుడు అంటే, కుంభక యోగంలో భగవద్దర్శనం ఋణంగా పొందినవాడని కదా అర్థం. ఈ భగవద్దర్శనకాలంలో అతనికి జ్ఞానం వెన్నంటియే యుంటుంది. అప్పుడు జ్ఞానం వేరుగా స్పృహతో ఉండదు. అదే భగవదానందంలో లీనమై స్వస్వరూపాన్ని కోల్పోతుంది. కుంభకం విడవడంతో విశుద్ధమూ, అనిర్విషయానందమూ ఉండవు. అప్పుడు విశుద్ధ జ్ఞానం సర్వత్రా వ్యాపించి యుండిన ఆనందరూప పరబ్రహ్మవద్దకు చేరిపోతుంది. రాముని చేతిలో కుంభకర్ణుడు చనిపోయేడు. అంటే, సాక్షికంగా భగవత్తత్వాన్ని గ్రహించిన యోగం సర్వత్ర నిండిన ఆనందరూపపరమాత్మలో లీనమైపోయింది. ఈవిధంగా అంతరార్థపరంగా ఈ యోగ రహస్యాలను చెప్పడమే పై కథయొక్క ఉద్దేశం.

రావణుడు అంటే దశేంద్రియ కేంద్రశక్తి. అంటే తామసిక సాధకుడు తాను సంపాదించిన, ఇంద్రజిత్ కుంభకర్ణయోగాలు వ్యర్థమైపోవడంతో జ్ఞాన రూప * నారాయణుని యొక్క యాథార్థ్యాన్ని గుర్తించే స్థితికి వచ్చేడన్నమాట. తామసిక సాధకుడు తన తామసిక వృత్తులు సాత్త్వికవృత్తులతో కలసిపోతున్నాయని గుర్తిస్తాడు అన్నది రావణ పశ్చాత్తాప స్థితికి అంతరార్థంగా గ్రహించాలి.

## లంకా పునర్దహనం.

కథ :— వానరులు లంకలో ప్రవేశించి రాత్రి తొలిజామున లంకా నగరానికి నిప్పు పెట్టేరు.

---

* నారం అంటే జ్ఞానం, అయనం అంటే స్థానం, జ్ఞానము స్థానముగా కలవాడు నారాయణుడు. అనగా జ్ఞానగమ్యుడు, పరమాత్మ అని అర్థం.

రాత్రి తొలిజామునే అంటే రావణునికి పశ్చాత్తాపం కల్గిన, మొదటి స్థితిలోనే, వానరులు అంటే, సాత్త్విక వృత్తులు, లంకలో ప్రవేశించి, అంటే తమోనిలయంలోకి చేరి నిప్పు పెట్టేరు. అంటే జ్ఞానదీప్తిని బాగా కల్గించారన్నమాట.

కథ :— కుంభకర్ణుని కొడుకులైన కుంభుణ్ణి సుగ్రీవుడు, నికుంభుణ్ణి ఆంజనేయుడు చంపివేశారు. అంటే, నిర్విషయానందాన్ని ఋణంగా పొందడానికి పూర్వస్థితిలో పుట్టిన అంటే, కుంభకర్ణ యోగానికి పూర్వస్థితిలో కల్గిన కుంభయోగం, నికుంభయోగం అన్నవి శుద్ధ జ్ఞానం ముందు బుద్ధియోగం ముందు నిలువజాలినవి కావని చెప్పడమే ఇచ్చట అంతరార్థంగా గ్రహించాలి.

## రామరావణయుద్ధం

కథ :— యుద్ధంలో రామబాణాలకు రావణాసురుడి తలలు ఎన్నిసార్లు తెగి పడిపోయినా అవి తిరిగి మొలుస్తూనే ఉన్నాయి.

అంటే, దశకంఠరావణాసురుని తలలు పదీ, పది ఇంద్రియాలకు చిహ్నాలు. ఇంద్రియ వృత్తుల్ని ఎన్నిసార్లు నిగ్రహించినప్పటికీ, అవి నశించినట్లే కనిపిస్తూ తిరిగి తిరిగి మొలకెత్తి విజృంభిస్తూ సాధకుని తికమికలు పెడుతూనే వుంటాయి అని అర్థం.

కథ :— విభీషణుడు రావణుని హృదయ మధ్యలో అమృత కలశ వుందనీ, దాన్ని నాశం చేసేదాకా అతని తలలు తిరిగి తిరిగి మొలుస్తూనే వుంటాయనీ, కాన, దాన్ని బ్రహ్మాస్త్రంతో ఛేదించ వలసిందనీ రాముడికి హెచ్చరిక చేస్తాడు. రాముడా ప్రకారం చేసే టప్పటికి రావణుడు మరణిస్తాడు.

బ్రహ్మాస్త్రం అంటే పరబ్రహ్మస్వరూపాన్ని గూర్చిన వేదాంత విజ్ఞానం. బ్రహ్మ పదానికి ఉపనిషత్తులు అర్థం. ఉపనిషత్ జ్ఞానమే,

బ్రహ్మజ్ఞానం. ఇంద్రియాల వాసనాస్థానం మనస్సు. మనస్సుకు నివాసం హృదయం. గుండెకు కొంచెం దిగువవైపు దాని నివాసంగా చెప్తారు. అదే పరబ్రహ్మమునకు నివాసస్థానం. బుద్ధి గుహయందలి పరబ్రహ్మమే అమృత కలశ అంటే. అందులోనికి బ్రహ్మజ్ఞానాన్ని ప్రసరింపజేస్తే ఆ జ్ఞానం బుద్ధినుండి మనస్సుకు, మనస్సునుండి ఇంద్రియాలకు చేరినప్పుడే ఇంద్రియ వ్యాపారం బ్రహ్మజ్ఞాన స్థితిలో పూర్తిగా నశిస్తుంది. 'హృదయంలోని అమృత కలశ' అంటే ఎప్పుడు నశించకుండా వుండే ఆనంద స్వరూపాన్ని, బ్రహ్మత్వంతో, అంటే, ఉపనిషద్విజ్ఞానంతో అనుసంధానంచేసి అంటే విజృంభింపజేస్తే ఆ బ్రాహ్మస్థానంనుండి, ఆ విజ్ఞానం బుద్ధికి, బుద్ధినుండి దశ ఇంద్రియాలకూ పోకి దశ ఇంద్రియాలలోను బ్రాహ్మ నైశ్చల్యం ఏర్పడి బ్రహ్మానందానుభూతి కల్గుతుంది. అప్పుడిక ఇంద్రియవ్యాపారాలు ఏవీ తిరిగి తలెత్తడం ఉండదు అని బ్రహ్మజ్ఞానానుసంధానోపదేశం సాధకునికి జరుగడమే రావణుని హృదయమధ్యలోని అమృతకలశముపైన బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించవలసిందిగా విభీషణుడు చేసిన హెచ్చరికలోని అంతరార్థం.

## అగస్త్యునిచేత ఆదిత్యహృదయోపదేశం.

ఇంద్రసారథియైన మాతలి రామునికి యుద్ధంలో "ఇంద్రుడు దేవతలకు శత్రువైన రావణుణ్ణి సంహరించడానికి పంపించే" దని రథాన్ని తీసుకొనివచ్చి ఇస్తాడు. ఆరథంమీద ఎక్కి రాముడు రావణునితో యుద్ధంచేసి, ఎప్పటికీ రావణుని చంపలేక పోతూంటే, విభీషణునిలాగే మాతలికూడ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించమని సలహా ఇస్తాడు. అప్పుడే అగస్త్యుడు, యుద్ధపరిశ్రాంతుడై, చింతామగ్నుడై రావణుని యెదుట యుద్ధం చేస్తూన్న రాముడి వద్దకు వచ్చి ఆదిత్య హృదయాన్ని ఉపదేశిస్తాడు. దానితో రాముడు గొప్ప బలంపొంది రావణుని బ్రహ్మత్వంతో సంహరించగల్గుతాడు.

ఇంద్రుడంటే మనస్సు అని అనేకపర్యాయాలు చెప్పుకునే ఉన్నాం. పరాశక్తికి అపరాశక్తికికూడ ఈమనస్సు కేంద్రం. పరాశక్తికి కేంద్రంగా సాత్త్విక వృత్తులకూ, జ్ఞానానికినిలయం. బ్రహ్మతత్త్వాన్ని గ్రహించే వృత్తులకు నివాసం. అంటే, రాముడు, వానరులు నివసించేచోటు అన్నమాట.

అపరాశక్తికి కేంద్రం అనగా తామసికగుణానికి, అజ్ఞానానికి పునర్జన్మనిచ్చే వాసనాపరంపరకు, తామసికవృత్తులతోడి ఇంద్రియాలకు నిలయం, అంటే, లంక. రావణుడు, రాక్షసులు నివసించే స్థానం అన్నమాట. రెండూ ఒకే సాధకునిలో ఉండేవే.

ప్రతివానిలోనూ పరాశక్తి, అపరాశక్తులయొక్క విజృంభణం ఉంటూనే వుంటుంది. పరాశక్తని ప్రబలంచేసి, సాధకుడు అపరాశక్తని పరాశక్తిలో విలీనంచేసికోవడానికి సాధనలతో అభ్యాసంచేసి సిద్ధిని పొందాలి. అంటే, జనన మరణ చక్రం నుండి విడిపడే కైవల్యస్థితిని సాధించాలి. ఇందుకు చేసే సాధనాక్రమంలో అనేకవిధానాలు రామాయణంలో కథారూపాలుగా ఇంతవరకు దర్శించాం. ఇప్పుడు * రామాయణానికి ముగింపుగా రావణవధను ఆదిత్యహృదయంతో పూర్తిచేస్తూ చెప్పబడుతూంది.

ఇంద్రసారథి, అంటే, ఇంద్ర - మనస్సు యొక్క, సార - శ్రేష్ఠమైన, ధీః - బుద్ధిని కలది; అనగా మనస్సుయొక్క సారమైన బుద్ధి వ్యాపారం ఇంద్రసారథి అన్నమాట కర్థం. సంశయాత్మకమైనపుడు మనస్సు అనీ, ఆ మనస్సే నిశ్చయాత్మకమైనపుడు బుద్ధి అనీ చెప్పబడుతుంది. కాన మనస్సు యొక్క సారరూపమే బుద్ధిగా చెప్పకొనవచ్చును. అదే పరాశక్తియొక్క సంపూర్ణస్వరూపమైన జ్ఞానం. దేవతలు, అంటే, దివ్యస్థితిని అంటే, జ్యోతిర్మయస్థితిని

---

* రామ + అయనము = రామాయణము, రామ - ఆనందమువకు అయనము = స్థానము అనగా బ్రహ్మానందస్వరూపము.

అంటే, జ్ఞానదీప్తిని పొందిన సాత్త్వికవృత్తులు, అని అర్థం. వానికి, తమోవృత్తికి కేంద్రమైన లంకలోని రావణునిద్వారా రాక్షసులవల్ల అపకారం జరుగుతూంది. అందుచేత, రావణ నాశం, అంటే, తమోగుణపూర్ణ వినాశం జరిపించడానికి, ఇంద్రుడు, అంటే, మనస్సు తన సారథియైన, అంటే సారవంతమైన బుద్ధిని అనగా మాతలిని, అంటే, సంపదయొక్క స్థానాన్ని పొందిన జ్ఞానవృత్తిని అని అర్థం (మాయాయాః మోక్షలక్ష్మ్యాః తలం స్థానం యస్య సః మాతలిః) సాయంగా పంపించేడు. సాధకుడు తనలోని తమోగుణ వృత్తులను, తనలోని సాత్త్వికగుణంలో లీనం చెయ్యడం మనస్సులోని మోక్షవిజ్ఞాన సంపద ద్వారా జరుగాలి. తమోగుణంతో తలపడినప్పుడు సాధకుడు తనలోని ముక్తిజ్ఞానసంపదను స్వాధీనంలోనికి, అంటే జ్ఞప్తిలోనికి తెచ్చుకోవలసివున్నదే రావణునితో యుద్ధంచేసే సమయంలో ఇంద్రుడు సారథియైన మాతలిని పంపించాడన్న దానిలోని అంతరార్థం.

రావణుడు ఎంతకూ, చావకుండా వుంటూంటే ఇంద్రసారథియైన మాతలి రామునకు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించమని హెచ్చరించేడు. అంటే, సాధకుడు జ్ఞప్తికి తెచ్చుకొన్న ముక్తిజ్ఞానాన్ని, దశేంద్రియ ప్రవృత్తులమీద ఉపయోగించవలసిందిగా మనస్సు చేసిన హెచ్చరికయే మాతలి రామునికి చేసిన హెచ్చరిక అంటే.

ఈ సందర్భంలో అగస్త్యుడు వచ్చేడు. అంటే, నిశ్చలస్థితి అనుభవానికి అర్థం. అగే కూటం (అగ సాలి వాని దాగలి) అగము, 'స్థ' అంటే ఉన్నవాడు, నిశ్చల స్థితిలో ఉండువాడు, భగవంతుడు. అతడే సాక్షాత్తుగా వర్ణింపబడినాడు. అగస్త్యుని ధర్మమే అస్త్రము అంటే, భగవంతుని పొందించేది, జ్ఞానము. ఆ భగవజ్జ్ఞానము సాధకుని వద్దకు వచ్చి చేరుకొని (ఇది సాధకునిలో [illegible] ఉన్నదే) సంపూర్ణస్థితిలో ప్రత్యక్షమైందన్నమాట. ఆ అగస్త్యుడు, రావణ వధకు, రామునకు ఆదిత్యహృదయాన్ని ఉపదేశించేడు. ఆదిత్య హృదయం అంటే, నారాయణస్వరూపం అని అర్థం.

ధ్యేయస్సదా సవితృ మండల మధ్యవర్తీ నారాయణః అని వున్నది. సవితృ మండలమునకు మధ్యగా * నారాయణుడున్నారని, వానిని నిరంతరం స్మరించాలని దాని అర్థం. ఆదిత్య పదానికి అర్థం పరిశీలిద్దాం.

'ద, ఖండనే' అనే ధాతువుపై తద్ధితప్రత్యయరూపం 'దితము' అవుతుంది. దితము అంటే, ఖండితము, అనగా, ముక్కలుచేయబడ్డది. న+దితము-అదితము, దాని భావము ఆదిత్యము. అనగా ఖండితము కాని భావము, అఖండరూపమైన దైవభావము, అనగా, సంపూర్ణస్థితిని పొందిన దైవభావము, అఖండానందస్వరూపం, పరబ్రహ్మస్వరూపం అవుతుంది. పరబ్రహ్మస్వరూపాన్ని తెలిపే ధర్మం 'ఆదిత్యం' అవుతుంది దానియొక్క హృదయం అనగా ముఖ్యస్థానం అన్నమాట. అదే జ్ఞాన స్వరూపలక్షణం. దాన్ని ఉపదేశించినవాడు అగస్త్యుడు. ఆదిత్య హృదయం గాయత్రీమంత్రానికి వ్యాఖ్యానం. గాయత్రీ మంత్రాన్ని బ్రహ్మాస్త్రంగా చెప్తారు. బ్రహ్మాస్త్రం అంటే, అజ్ఞానమును సంహరించే ప్రజ్ఞానబ్రహ్మయొక్క ధ్యానం. గాయత్రీమంత్రార్థం ఈ ఉప సంహారభాగంలో వివరిస్తున్నాను.

## గాయత్రీ మంత్రం.

"ఓం, త త్సవితుః వరేణ్యం భర్గో దేవస్య ధీమహి
ధియో యోనః ప్రచోదయాత్"॥

ఓమ్ : అ + ఉ + మ్ – 'అ' అంటే, జాగృతస్థితి. అదే 'విశ్వం' అనే పేరున పిలువబడుతూంది. 'ఉ' అంటే, స్వాప్నిక స్థితి. అదే 'తైజసం' అని పిలువబడుతూంది. 'మ్' అంటే, సుషుప్త స్థితి. అదే 'ప్రాజ్ఞం' అని పిలువబడుతూంది. ఈ మూడుస్థితులు

* నారాయణుడు అంటే నారం అయనం యస్య సః అన్న వ్యుత్పత్తిలో నారం = జ్ఞానము, అయనం=స్థానముగా గలవాడు, జ్ఞానస్వరూపుడని అర్థం

దాటిన తర్వాత తురీయస్థితిలో ఉండేది పరబ్రహ్మస్థితి. దాని లక్షణాన్ని ధ్యానించాలి అని "ఓమ్" అన్నది సంగ్రహంగా దీని యొక్క భావం. ఓంకారధ్యానం ఒక్కటే ముక్తి నియ్యగలదు.

యః = ఏది, నః = మనయొక్క, ధియః = బుద్ధులను, ప్రచోదయాత్ = ప్రేరేపణను చేయుచున్నదో, తత్ = అటువంటి, సవితుః = యజ్ఞభోక్తయైన, దేవస్య = పరమేశ్వరునియొక్క (సవము అంటే యజ్ఞం, సవితా అంటే యజ్ఞభోక్త, యజ్ఞం అంటే నిస్స్వార్థకర్మ) వరేణ్యం = శ్రేష్ఠమైన, భర్గః = తేజస్సును, ధీమహి = ధ్యానము చేయుచున్నాము.

మన బుద్ధులను ప్రేరేపించుచున్న ఏ భగవన్మూలశక్తి కలదో ఆమూలభగవత్శక్తిని ధ్యానం చేయుచున్నాము.

ఈ ధ్యానమే బ్రహ్మాస్త్రం అంటే. ఇది పరబ్రహ్మస్వరూప విజ్ఞానమును కల్గించేది. ధీః + అనం = ధ్యానం అవుతుంది. ధీః = బుద్ధిని, అనం = బ్రతికించియుంచుట అని అర్థం; పై అర్థభావనలో బుద్ధిని ప్రసరింపజేయడమే మంత్రధ్యానం అంటే. మంత్రం అంటేనే ఆలోచన. * జపం అంటే అర్థభావన.

> ఇంద్రియాణి పరా ణ్యాహుః ఇంద్రియేభ్యః పరం మనః
> మనస స్తు పరాబుద్ధిః యో బుద్ధేః పరత స్తు సః॥

అని భగవద్గీత చెప్తూంది.

ఇంద్రియములు విషయాలకు వెనుక ఉన్నవి. వానికి వెనుక మనస్సు ఉన్నది. దానికి వెనుక బుద్ధి ఉన్నది. ఆ బుద్ధికి వెనుక ఉన్నది అనిర్వాచ్యజ్ఞానరూపపరబ్రహ్మస్వరూపం. ఆబుద్ధి వెనుకగల జ్ఞానభగవానుని భావించడమే గాయత్రీమంత్రజపం అంటే. ఆ గాయత్రీమంత్రానికే 'సావిత్రీమంత్రం' అనికూడ పేరు.

* 'తజ్జపం యదర్థభావనం' అర్థభావనమే జపం అని దాని అర్థం.

సావిత్రి అంటే, సవితృదేవతాసంబంధమైనది అని అర్థం. ఆదిత్య హృదయం అంటే, అదే విస్తరించి చెప్పబడింది కాన గాయత్రి మంత్రానికి ఆదిత్యహృదయం వ్యాఖ్యానంగా భావించవచ్చును.

"న గాయత్ర్యాః పరం మంత్రం" అని గాయత్రీమంత్రానికి సాటియైన మంత్రం లేదన్న ప్రసిద్ధి వుంది.

"గాయంతం త్రాతి ఇతి గాయత్రీ" అనే వ్యుత్పత్త్యర్థంలో 'ఎవరు జపిస్తారో వారిని రక్షించేది గాయత్రి'. 'ఈ గాయత్రీ మంత్రం ప్రేరక మంత్రమే గాని ధ్యానమంత్రం కాదు. ధ్యానాత్మకమైనది ఆదిత్య హృదయం. ఇది గాయిత్రీ మంత్రాన్ని ఎట్లు ధ్యానించాలోచెప్పేది. ఈ ఆదిత్యహృదయంలో, మొదటి 6 శ్లోకాలు ఆదిత్య హృదయ మంత్రం యొక్క మహిమను చెప్పే భావం కల్గి వున్నాయి. 7 మొదలు 14 వరకు శ్లోకాలు ఆదిత్యుని స్వరూపం చెప్పేవిగా వున్నాయి. 14 మొదలు 20½ వరకు ఉన్న శ్లోకాలు ఆదిత్యుని ధ్యానించే మంత్ర శ్లోకాలుగా వున్నాయి. 20½ నుండి 26 వరకు ఆదిత్యుని మహత్తును వివరిస్తూ అతని ధ్యానమును గూర్చి ప్రబోధించే శ్లోకాలుగా వున్నాయి. 27 మొదలు 30 వరకు ముగింపు శ్లోకాలుగా వున్నాయి.

## ఆదిత్యహృదయం.

తతో యుద్ధపరిశ్రాంతం సమరే చింతయా స్థితం
రావణం చాగ్రతో దృష్ట్వా యుద్ధాయ సముపస్థితం. 1

దైవతైశ్చ సమాగమ్య ద్రష్టు మభ్యాగతో రణమ్
ఉపాగ మ్యా బ్రవీ ద్రామ మగస్త్యో భగవాన్ ఋషిః 2

రామ రామ మహాబాహో శృణు గుహ్యం సనాతనం
యేన సర్వా నరీన్ వత్స! సమరే విజయిష్యసి. 3

ఆదిత్యహృదయం పుణ్యం సర్వశత్రువినాశనం
జయావహం జపే న్నిత్యం అక్షయ్యం పరమం శివం. 4

సర్వమంగళమాంగళ్యం సర్వపాపప్రణాశనం
చింతాశోకప్రశమనం ఆయుర్వర్ధన ముత్తమం. 5

రశ్మిమంతం సముద్యంతం దేవాసురనమస్కృతమ్
పూజయస్వ వివస్వంతం భాస్కరం భువనేశ్వరం 6

సర్వదేవాత్మకో హ్యేష, తేజస్వీ రశ్మిభావనః
ఏష దేవాసురగణాన్ లోకాన్ పాతి గభస్తిభిః. 7

ఏష బ్రహ్మా చ విష్ణుశ్చ శివ స్స్కందః ప్రజాపతిః.
మహేంద్రో ధనదః కాలో యమ స్సోమో హ్యపాంపతిః 8

పితరో వసవ స్సాధ్యా హ్యశ్వినౌ మరుతో మనుః.
వాయు ర్వహ్నిః ప్రజాః ప్రాణ ఋతుకర్తా ప్రభాకరః 9

ఆదిత్య స్సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్
సువర్ణసదృశో భానుః హేమరేతా దివాకరః 10

హరిదశ్వ స్సహస్రాక్షః సప్తసప్తి మరీచిమాన్
తిమిరోన్మథనః శంభుః త్వష్టా మార్తాండ అంశుమాన్ 11

హిరణ్యగర్భ శ్శిశిరః తపనో భాస్కరో రవిః
అగ్నిగర్భో ఒదితేః పుత్రః శంఖ శ్శిశిరనాశనః 12

వ్యోమనాథ స్తమోభేదీ ఋగ్యజుస్సామపారగః.
ఘనవృష్టి రపాంమిత్రో వింధ్యవీధీ ప్లవంగమః 13

ఆతపీ మండలీ మృత్యుః పింగళ స్సర్వతాపనః.
కవి ర్విశ్వో మహాతేజా రక్త స్సర్వభవోద్భవః 14

నక్షత్రగ్రహ*రాశీనామధిపో విశ్వభావనః
తేజసామపితేజస్వీ ద్వాదశాత్మన్ నమోస్తుతే 15

నమః పూర్వాయ గిరయే పశ్చిమాయాద్రయేనమః.
జ్యోతిర్గణానాంపతయే దినాధిపతయే నమః 16

జయాయ జయభద్రాయ హర్యశ్వాయ నమోనమః
నమోనమ స్సహస్రాంశో ఆదిత్యాయ నమోనమః 17

* తారాణామధిపః అని పాఠాంతరం వుంది.

నమ ఉగ్రాయ వీరాయ సారంగాయ నమోనమః
నమః పద్మప్రబోధాయ మార్తాండాయ నమోనమః 18

బ్రహ్మేశానాచ్యుతేశాయ సూర్యా యాదిత్యవర్చసే.
భాస్వతే సర్వభక్షాయ రౌద్రాయవపుషే నమః 19

తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నా యామితాత్మనే
కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాంపతయే నమః 20

తప్తచామీకరాభాయ వహ్నయే విశ్వకర్మణే
నమ స్తమోభినిఘ్నాయ రుచయే లోకసాక్షిణే 21

నాశయ త్యేష వై భూతం త దేవ సృజతి ప్రభుః.
పాయ త్యేష తప త్యేష వర్ష త్యేష గభస్తిభిః 22

ఏష సుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠితః
ఏష ఏ వాగ్నిహోత్రం చ ఫలం చై వాగ్నిహోత్రిణాం 23

వేదాశ్చ క్రతవ స్సర్వే క్రతూనాం ఫలమేవచ
యాని కృత్యాని లోకేషు సర్వ ఏష రవిః ప్రభుః 24

ఏన మాపత్సు కృచ్ఛ్రేషు కాంతారేషు భయేషు చ
కీర్తయన్ పురుషః కశ్చి న్నావసీదతి రాఘవ! 25

పూజయ స్వైన మేకాగ్రో దేవదేవం జగత్పతిం
ఏత త్త్రిగుణితం జప్త్వా యుద్ధేషు విజయిష్యసి 26

అస్మిన్ క్షణే మహాబాహో రావణం త్వం వధిష్యసి
ఏవ ముక్త్వా త దాగస్త్యో జగామ చ యథాగతం 27

ఏత చ్ఛ్రుత్వా మహాతేజా నష్టశోకోఽభవ త్తదా
ధారయామాన సుప్రీతో రాఘవః ప్రయతాత్మవాన్ 28

ఆదిత్యం ప్రేక్ష్య జప్త్వా తు పరం హర్ష మవాప్తవాన్
త్రిరాచమ్య శుచి ర్భూత్వా ధను రాదాయ వీర్యవాన్. 29

ఆలోచించి చూస్తే, ఇది సూర్యపరమైనదిగా పైకి కన్పించినను, ముక్తిదాతయైన పరబ్రహ్మ తత్త్వస్వరూపాన్ని చెప్తూంది అనక తప్పదు. యుద్ధం కొరకు సిద్ధంగా ఉన్న రాముణ్ణి చూడడానికి దేవతలతో కూడి, భగవానుడైన మహర్షి అగస్త్యుడు వచ్చి ఇట్లు చెప్పేడు. "రామా! సమస్త శత్రువులను, నీవు యుద్ధంలో జయించగల ఆదిత్యహృదయం అనే సనాతనమంత్రం ఉంది దానిని నీకు ఉపదేశిస్తాను. ఇది పుణ్యమైనది. అపవిత్రమును పవిత్రము చేయునది. సర్వ శత్రు నాశనం చేసి జయాన్నిస్తుంది. దీనిని నిత్యమూ అంతరార్థభావనతో జపిస్తూండాలి. అల్లా చేస్తే అంతశ్శత్రువులను పారద్రోలి సాధనా విజయం కల్గిస్తుంది. అర్థభావనం ఎప్పుడూ చేస్తూఉండాలి. దీన్ని నాశం చెయ్యడం ఎవరికీ శక్యంకాదు. పరమ శివమైనది. మంగళ ములకెల్ల మంగళకరమైనది. సర్వపాపాలను పోగొట్టేది. చింత, విచారం లేకుండా చేసేది. కావుననే, ఆయుర్దాయాన్ని వృద్ధిపొందించే వానిలో గొప్పది. పాప చింత యొక్క నాశంచేతనూ, శోకనాశం చేతనూ వృద్ధిపొందుతుంది అని చెప్పేడు. ఈ క్రింద చెప్పబడ్డ పదాలకు వాచ్యార్థపరంగాను అంతరార్థపరంగాను అర్థాలుచెప్ప బడినవి. రశ్మిమంతం = కాంతి కిరణములు కలది. అంటే జ్ఞాన కిరణాలు కలది కాన అజ్ఞాన నాశం చేస్తుంది. సముద్యంతం = చక్కని ఉదయ ప్రభావము కలది. చక్కగా ప్రకాశించునది. దేవాసురనమస్కృతం = దేవతలచేతను, రాక్షసులచేతనుకూడ నమస్కరింపబడునది. సత్త్వ తమస్సులు రెంటినీ లీనంచేసుకొనేది వివస్వంతం = ప్రకాశించునది. జ్ఞానప్రకాశం కలది. భువనేశ్వరం = త్రిభువనములకు, త్రిగుణములకు పరిపాలకమైనది. ఇటువంటి, భాస్కరం = సూర్యుని ప్రకాశమానమగు పరబ్రహ్మస్వరూపమును పూజయస్వ = పూజింపుము.

ఈ ఆరు శ్లోకములు ప్రబోధనాపరములైనవి.

## స్తుతిపరమైన శ్లోకాలు
( 7 నుండి 15 వరకు )

సర్వదేవాత్మకో హ్యేషః = ఇతడు సర్వదేవతాస్వరూపుడు. సమస్త జ్ఞాన కాంతులయొక్క మూర్తి.

తేజస్వీ = కాంతికలవాడు; జ్ఞానతేజస్సుకలవాడు.

రశ్మిభావనః = కాంతికిరణములు కల్గించువాడు; జ్ఞానదీప్తులను భావింపజేయువాడు.

ఏష దేవాసురగణాన్ లోకాన్ పాతి గభస్తిభిః - ఇతడు దేవ రాక్షసలోకాలను తన కిరణములచేత పవిత్రముచేయువాడు; ఇతడు, సాత్త్విక, తామసిక గుణాలను రెంటినికూడ తన జ్ఞానదీప్తిలో లీనం చేయువాడు.

ఏష బ్రహ్మాచ మొదలు విశ్వభావనః అన్నవరకుఉన్న శ్లోకములలో 65 పేర్లున్నవి.

1. బ్రహ్మ = చతుర్ముఖబ్రహ్మ; సర్వస్వరూపుడు.

2. విష్ణుః = వైకుంఠముననున్న విష్ణుమూర్తి; అంతట వ్యాపించియుండువాడు.

3. శివః - కైలాసపతి; మంగళస్వరూపుడు.

4. స్కందుడు = కుమారస్వామి; శత్రువులను (అరిషడ్వర్గమును) నిరోధించువాడు.

5. ప్రజాపతిః = దక్షుడు మొదలైన ప్రజాపతి; పుట్టినవారందరకు ప్రభువు. పుట్టిన ప్రతిప్రాణి చివరకు ముక్తిని పొందవలసినదేకాన, అన్ని ప్రాణులకు ముక్తి నిచ్చి రక్షించువాడు.

6. మహేంద్రః = స్వర్గమును పాలించు ఇంద్రుడు; ఇంద్రశబ్దం మనస్సును తెల్పుతుంది. (ఇంధతీ అనే ధాతు

రూపం) మహా + ఇంద్ర = గొప్ప మనస్స్వరూపుడు; మనస్సు వెనుక నుండే బుద్ధికే మహా మనస్సు అని పేరు. ఆ బుద్ధికి వెనుకనున్న పరబ్రహ్మస్వరూపం ఉంది. (యోబుద్ధే పరతస్తు సః అని గీతా వాక్యం)

7. ధనదః = కుబేరుడు; ధనము అనగా ఋణముకానిది అనగా సొంతమైనది. అట్టిదానిని అనగా ముక్తిని యిచ్చువాడు.

8. సోమః = చంద్రుడు; స-ఉమా యస్య సః - సోమః ఉమ కలవాడు; ఉమ అనగా ప్రకృతి. ప్రకృతిలో నుండువాడు.

9. కాలః = యముడు; కాలస్వరూపుడు.

10. యమః = యముడు; ఇంద్రియ నిగ్రహమున నుండువాడు.

11. అపాంపతిః = నీటికి ప్రభువు, వరుణుడు; న + పాతి ఇతి అప్ అనగా రక్షణ లేనిది. (అపాం = రక్షణలేని వారికి, పతిః = ప్రభువు) అనాధరక్షకుడు.

12. పితరః = పితృదేవతల స్వరూపము; అన్ని భూతములకు జనకులుగా తానైనవారు, సర్వకారణుడు.

13. వసవః = అష్టవసువులు అతడే; జ్ఞానకిరణములైనవారు,

14. సాధ్యాః = సాధ్యులను దేవతలు అతడే; సాధింపదగిన లక్షణములైనవారు; సాధకునిచే సాధనలుచేసి సాధింపదగిన లక్షణములు కలవారు.

పై అంతరార్థములోని బహువచనము గౌరవార్థమును తెల్పునది.

15. అశ్వినౌ = అశ్వనీ దేవతలు అతడే ప్రకృతి పురుషరూపమును, తానైన వాడు; అశ్వ = అనగా ప్రకృతి, అశ్వి అనగా

ప్రకృతిలోనివాడు, రెండిటి యొక్క ద్వివచనము "అశ్వినౌ" అనియగును. ఇది ప్రకృతి పురుషుల అవిభాజ్యమైన జంటను తెలుపునదిగా ద్వివచనంగా వాడబడినది.

16. మరుతః = వాయువులు అతడే; ప్రాణవాయువుల రూపము కలవాడు.

17. వహ్నిః = అగ్ని; అన్నిటిని తనలోకి చేర్చుకొని, తనలో దగ్ధము చేయునది అనగా అన్నిటిని తనలో లీనం చేసుకొనేది.

18. ప్రజాః = బాహ్యార్థం:— ప్రజనన స్వరూపుడు. సూర్యకాంతి లేనిదే బీజోత్పత్తి కలుగదు; ప్రకృష్టములైన పుట్టుకలు తానైనవాడు. ఇది పరబ్రహ్మ స్వరూపమైన అర్థాన్ని మాత్రం తెల్పుతుంది.

19. ఋతుకర్తా = వివిధ ఫలముల నిచ్చు ఆరు ఋతువులను చేయువాడు; ఆరు విధములగు చక్రములను పాలించువాడు. (మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞాచక్రములు.)

20. ప్రభాకరః = కాంతికి నివాసమైనవాడు; ప్రకృష్టమైన జ్ఞాన దీప్తికి నివాసమైనవాడు.

21. ఆదిత్యః = అదితియొక్క పుత్రుడు; దిత్యః అంటే, ఖండింప దగినవాడు (ద ఖండనే అనే ధాతురూపము) అదిత్యః అంటే అఖండస్వరూపుడు పరమాత్మ; అదిత్యుడే, ఆదిత్యుడు అవుతుంది. స్వార్థమున ఆదివృద్ధి వచ్చినరూపం.

22. సవితా = సవము అనగా యజ్ఞము; సవి అనగా యజ్ఞము చేసినవాడు తౄ తరణే అను ధాతువునకు తరించుట, లేక తరింపజేయుట అని అర్థము. సవితా అనగా, యజ్ఞములు చేసినవారిని తరింపజేయువాడు; యజ్ఞము అనగా నిస్స్వార్థకర్మ. నిస్స్వార్థ కర్మవలన అసంగత్వము; అసంగత్వమువలన, నిశ్చలత్వము; నిశ్చలత్వమువలన జీవన్ముక్తి కలుగును. కాన సవిత యనగా జీవన్ముక్తి ప్రదాతయగు పరబ్రహ్మ స్వరూపమనియర్థము, ఇచ్చట కేవల సూర్యమండల పరంగా అర్థము లేదు. పరమాత్మ పరంగానే వ్యుత్పత్త్యర్థము సిద్ధించును. గాయత్రీ మంత్రంలోని 'తత్ సవితు ర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్' అను మంత్రములోని 'సవితుః' అన్న పదానికికూడ యజ్ఞ ఫలప్రదాతయగు పరమాత్మ అనియే అర్థం. బుద్ధిని ప్రచోదనము చేయునది పరమాత్మ. 'యో బుద్ధే పరతస్తుసః' అని గీతావాక్యము కూడ గలదు. ఈ కారణముచే, ఆదిత్య హృదయంలోని సవితృపదం, గాయత్రీ మంత్రంలోని సవితృపదం ఒకే అర్థాన్ని వివరిస్తాయి.

23. సూర్యః — సూర్యుడు; సూరి + అః = సూర్యః = సూరుల యొక్క, అనగా పండితులయొక్క; * అః = అంగణమైనవాడు; (అంగణము అంటే ముందు వాకిలి) పండితులకు ముందు వాకిలియైనవాడు; పండితుల భావనా సంచారము కలవాడు,

* అకారో బ్రహ్మ విష్ణ్వీశ కమఠే ష్వంగణేషుచ.

24. ఖగః = ఖే గచ్ఛతి ఇతి ఖగః; ఆకాశమునందు తిరుగువాడు. సూర్యుడు; ఖే = ఇంద్రియే, గచ్ఛతి ఇతి ఖగః ఇంద్రియమందు పొందువాడు. ఇంద్రియములను విషయములందు ప్రవర్తింపజేయువాడు, పరమాత్మ. 'ఇంద్రియాణి పరాణ్యాహుః, ఇంద్రియేభ్యః పరం మనః మనస స్తు పరా బుద్ధిః యో బుద్ధేః పరత స్తు సః, అన్న గీతావాక్యాన్ని చివరినుండి మొదటికి అన్వయిస్తూ చెప్తే, సః- అంటే అనిర్వాచ్యమైన ఆ పరమాత్మ, బుద్ధిని ప్రచోదనము చేయును. ఆ బుద్ధి మనస్సును ప్రేరేపించును. ఆ మనస్సు ఇంద్రియములను ప్రేరేపించును. అని చెప్పవచ్చును.

25. పూషా, పుష్ ధాతువునుండి ఏర్పడినరూపము, ఆరోగ్యమును పోషించువాడు; ఆత్మ తత్త్వమును పోషించువాడు.

26. గభస్తిమాన్ = కిరణములు గలవాడు; జ్ఞానదీప్తులుకలవాడు.

27. సువర్ణసదృశః = బంగారముతో సమానమైన (కాంతిగల) వాడు; సు = మంచిని అనగా ముక్తిని చెప్పే, వర్ణ = అక్షరములచేత అనగా వేదాక్షరముల చేత, సదృశః = చక్కగా చూడదగినవాడు; వేదముచేతనే ఆ పరమాత్మను సరిగా చూడ గలము.

28. భానుః = కిరణములుకలవాడు; జ్ఞానకిరణములు కలవాడు.

29. హేమరేతాః = బంగారము రేతస్సుగా కలవాడు; రేతస్సు సంతానహేతువు. కాన బంగారమును అనగా ప్రకృతిని సంతతిగా కలవాడు. అనగా ప్రకృతికి

జన్మదాత-పరమాత్మ. 'హిరణ్మయేన పాత్రేణ సత్యస్య పిహితం ముఖం' అను వాక్యములో హిరణ్మయ పదం ప్రకృతిని చెప్తూంది. ఇచ్చట హిరణ్మయ పర్యాయపదమైన హేమపదంచేత ప్రకృతిని చెప్పడం జరిగింది. ఇది ఉపనిష ద్వ్యాఖ్యార్థము.

30. దివాకరః = పగటిని చేయువాడు, సూర్యుడు; దివ్‌ధాతువునకు ప్రకాశం అర్థం. కనుక, ప్రకాశమును అనగా జ్ఞానప్రకాశమును చేయువాడు అని అర్థం.

31. హరిదశ్వః = హరిద్వర్ణముగల గుఱ్ఱములు గలవాడు పచ్చని గుఱ్ఱములు గలవాడు. హరి అంటే, నశించునది హరిత్ అనగా నశించునదై ఆచరించునదియైన ప్రకృతి అని అర్థం. ఆచారార్థమున క్విన్ ప్రత్యయం చేస్తే హరి ఇవ ఆచరతి ఇతి 'హరిత్ అవుతుంది. అనగా ప్రకృతిని, అశ్వః — గుర్రముగా కలవాడు అనగా పరమాత్మ. పరమాత్మను ప్రకృతి వహించుచున్నది. లేదా,

అశ్వః = శ్వః అనగా రేపు. న + శ్వః = అశ్వః = రేపు ఉండనిది; ప్రతినిత్యమును మార్పుతోనే ఉండు నది- ప్రకృతి. 'అశ్వత్థం ప్రాహు రవ్యయం' అను గీతావాక్యంలోని 'అశ్వత్థ' పదం ప్రకృతినే చెప్తూంది. కాన 'హరిదశ్వః' అనగా నశింపు గల ప్రకృతి గలది, పరమాత్మ అని అర్థం. పరమాత్మ ప్రకృతిని తనలో లీనం చేసు కుంటుంది అని అర్థం.

32. సహస్రాక్షః = ఇంద్రుడు వేయికన్నులు (కిరణాలు) కలవాడు; సహస్రములైన అక్షములు, అనగా ఇంద్రియ వ్యాపారములు కలవాడు, పరమాత్మ (సర్వఇంద్రియ ప్రచోదకర్త)

33. సప్త సప్తిః - ఏడు గుఱ్ఱములు గల రథమును కలవాడు అని వాచ్యార్థం. సప్త ధాతువులనే గుఱ్ఱములు కల దేహమందుండువాడు, పరమాత్మ.

34. మరీచిమాన్ = కిరణములు కలవాడు; మరీచి పదం లేనిది ఉన్నట్లుగా కన్పించే మాయ అనే అర్థాన్నిస్తుంది. మాయకలవాడు మరీచిమాన్ కాగలడు. యోగ మాయా విశిష్టుడు పరమాత్మ.

35. తిమిరోన్మథనః = చీకట్లను పోగొట్టువాడు; అజ్ఞానమును లేక తామసిక వృత్తులను పోద్రోలువాడు.

36. శంభుః - సస్యాదులకు వృద్ధి కల్గించి సుఖమును కల్గించువాడు అనగా, అన్ని సుఖములకు మించిన సుఖము మోక్షము. దానిని కల్గించువాడు.

37. త్వష్టా - త్వష్టి అను నీశ్వర కర్మస్వరూపుడు 2 చెక్కెడివాడు అనగా జన్మవాసనలను చెక్కివేయువాడు.

38. మార్తాండః - మృత + అండః - మృతండః (శకం ధ్వాది పరరూప సంధి) మృతండ ఏవ మార్తాండః, అనగా మృతునకు అండము, అనగా తనలో జీవించుటకు చోటు నిచ్చునది. అండము అనగా జీవమునకు స్థానమైనది, గ్రుడ్డు. మృతులగువారికి, తనలో చోటునిచ్చునది, పరమాత్మ.

39. అంశుమాన్ - కిరణములుకలవాడు; జ్ఞానదీప్తులుకలవాడు.

40. హిరణ్యగర్భః - హిరణ్యమనగా ప్రకృతి, ప్రకృతి గర్భమందు తాల్చువాడు-పరమాత్మ.

41. శిశిరః - వర్షము నిచ్చుటచే చల్లనైనవాడు, ఆనందముచే జన్మ బంధ తాపములను చల్లార్చువాడు.

42. తపనః - వేడి కల్గించువాడు; ముక్తికి ఉత్తేజము (తపనను) కల్గించువాడు.

43. భాస్కరః = కాంతి కల్గించువాడు; జ్ఞానదీప్తి నిచ్చువాడు.

44. రవిః = ర అగ్నిని, వి వ్యాప్తిచేయువాడు;జ్ఞానాగ్నినిచ్చువాడు.

45. అగ్నిగర్భః = వేడి గర్భమందు గలవాడు; జ్ఞానాగ్ని తనలో నుండువాడు.

46. అదితేః పుత్రః - కశ్యపుని భార్యయైన అదితియొక్క కుమారుడు; అదితేః అఖండత్వమునకు సంబంధించినదానికి, పుత్ త్రః = పుత్రః = నరకమునుండి రక్షించు వాడు; అఖండ తత్త్వముయొక్క ధ్యానంవల్ల నరకప్రాప్తి అనగా,పునరపి జననం, పునరపి మరణం అను పరిభ్రమణం లేకుండా చేయు పరమాత్మ.

47. శంఖః - వేడివలన సుఖమును ఇంద్రియములందు కల్గించు వాడు; ఖే, శం యేననః-శంఖః, ఖే- ఇంద్రియ మునందు, శం - శుభము, ముక్తి కలవాడు. అనగా ఇంద్రియముల నిగ్రహముద్వారా ముక్తి సుఖమును కల్గించువాడు పరమాత్మ.

48. శిశిరనాశనః - చలిని పోగొట్టువాడు, శిశిర-మంచు, అనగా నీటి యొక్క జడరూపం. దానిని పోద్రోలువాడు, జడత్వమును పోగొట్టువాడు శిశిరుడు, శిశిర

నాశనుడు కూడ అతడే. ఇట్టి విశేషణముల వలన ఆదిత్యుడన కేవలసూర్యగోళమనికాక పరమాత్మ స్వరూపము అనే అర్థము విస్పష్టమగును.

49. వ్యోమనాథః - ఆకాశమునకు ప్రభువు; పరమ వ్యోమమునకు, అనగా చిదాకాశమునకు ప్రభువు. అనగా జ్ఞాన మార్గ వర్తి.

50. తమోభేదీ-చీకటిని ఛేదించువాడు;అజ్ఞానమును పోద్రోలువాడు.

51. ఋగ్యజుస్సామ పారగః - ఋగ్యజుస్సామవేదముల అంతమును పొందువాడు. వేదాంతవేద్యుడు.

52. ఘనవృష్టిః - మేఘములందు వర్షము కల్గించువాడు; గట్టిపడిన వానలను ద్రవింపజేసి నశింపజేయువాడు.

53. అపాం మిత్రః - నీటికి మిత్రుడును, నీటిని కిరణములచేపీల్చి శుభ్రపరచి తిరిగి ఇచ్చువాడు; అప్ = రక్షణ లేనిది. అపాం - రక్షణలేనివారికి, మిత్రః మిత్రుడు, రక్షణలేనివారికిరక్షకుడు, పరమాత్మ.

54. వింధ్యవీథీప్లవంగమః- వింధ్యపర్వతవీథియందు ఎగురువాడు; వింధ్య అనుదానిని 'వింద్య' గా మార్చుకుంటే, వింద్య అనగా తెలియతగినది. (గోఽవిందః అనుదానిలో విందః అనునది ఇంద్రియములచే తెలియునిది అని అర్థం.) వీథీ - వీధులందు, (జ్ఞానమార్గములందు) ప్లవంగమః - ఎగురునది పరమాత్మ.

55. ఆతపి - ఎండకల్గించువాడు; ఆసమంతాత్ తపః యస్య సః ఆతపీ - మిక్కిలి తపస్సుకలవాడు అనగా మిక్కిలి ధ్యానంవల్ల పొందబడువాడు.

56. మండలీ = గుండ్రనివాడు; ఆదిమధ్యాంతములులేని పూర్ణుడు. (పూర్ణ మిదం పూర్ణమదః పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమే వావ శిష్యతే) అని ఈశావాస్య ఉపనిషత్తులో భగవద్రూపం చెప్పబడింది.

57. మృత్యుః = సూక్ష్మజీవులను నశింపచేయువాడు; మృతివల్ల పొందదగినవాడు; మృతిచెందకుండా సాయుజ్య ముక్తిరాదు. కాన మృత్యు వనగా ముక్తిరూపము అని అర్థము ఇచ్చట చెప్పుకొనవలెను.

58. పింగళః = పింగళవర్ణము గలవాడు; పింగళనాడియైనవాడు; ఇది యోగశాస్త్రంలో 'సూర్యనాడి' అనబడును.

59. సర్వతాపనః = అన్నింటిని తపింపచేయువాడు; సర్వవాసనలను తపింపచేయువాడు.

60. కవిః = కావ్యకల్పన చేయువాడు; జ్ఞాన కల్పనకు కారకుడు పరమాత్మ.

61. విశ్వః = ప్రపంచస్వరూపుడు. వి = విగతమైన, అనగా పోయిన; శ్వః = రేపు (కాలము) కలవాడు; కాలాతీతుడు, పరమాత్మ.

62. మహాతేజాః = గొప్ప కాంతి కలవాడు; గొప్ప జ్ఞానతేజస్సు కలవాడు.

63. రక్తః = ఎర్రనివాడు; ప్రేమ రూపముకలవాడు.

64. సర్వ భవోద్భవః = అన్ని బీజముల పుట్టుకకుకారణమైనవాడు; అన్ని జీవులందు ఉండువాడు, పరమాత్మ.

65. నక్షత్రగ్రహ తారాణాం అధిపః = ఇరువది నక్షత్రములకు గ్రహములకు, సర్వ నక్షత్రమండలములకు

ప్రభువు; క్షత్రః అనగా దెబ్బనుండి రక్షించువాడు (క్షతా త్రాయతే ఇతి క్షత్రః) న+క్షత్రం=దెబ్బనుండి (ఆపదనుండి) రక్షించుకొనలేనివాడు; గ్రహ = స్వీకరించుటలు; తార = తరింపజేయుటలు వగైరాలకు, అధిపః = ప్రభువు అనగా పాపములనుండి రక్షణలేని వారిని గ్రహించి ముక్తులగువరకు తాను తరింపజేయువాడు-పరమాత్మ.

66. విశ్వభావనః = ప్రపంచభావన కలవాడు, విగతః శ్వః యస్య నః విశ్వః; శ్వః = రేపు, విశ్వః = రేపు లేనిది అనగా నిరంతరము మార్పుగల ప్రకృతి; అట్టి ప్రకృతిచేత ధ్యానింపబడువారు, లేక ప్రకృతి యందు నివసించువారు.

67. తేజసామపి తేజస్వీ = కాంతిగలవారిలో కాంతిమంతుడు; జ్ఞానదీప్తులకుకూడ ప్రకాశము కల్గించువాడు.

68. ద్వాదశాత్మన్ = 12 సూర్యగోళములుగా ఉండువాడు. పది ఇంద్రియములు + 1 మనస్సు 2 జీవాత్మ మొత్తం 12 గ పరమాత్మ స్వరూపమైనవాడు. ఇంతవఱకూ స్తుతిపూర్వకమైన మంత్రధ్యానం చెప్పబడింది ఇచ్చటనుండి నమస్కారపూర్వక ధ్యానం చెప్పబడుచున్నది

నమః పూర్వాయ గిరయే = తూర్పు పర్వతమునకు నమస్కారము.
పశ్చిమాయ అద్రయేనమః = పడమటి కొండకు నమస్కారము.

పూర్వ దిశ మొదటి దిక్కు. ఇందున్నది ఉదయపర్వతము. పశ్చిమ దిశ పడమటి దిక్కు. ఇందున్నది అస్తమయ పర్వతము. ఈ రెండు పర్వతముల యందు కల సూర్యునకు నమస్కారము.

2. ఆది అంతములు కలవాడగు, అనగా, ఆద్యంత రూపుడగువాడు, అనగా జనన మరణ రూపుడగు పరమాత్మ అని అంతరార్థము. 'నమస్కారము' అంటే నమస్ క్రియ అనగా నమ్రభావముతో ఉండడం. అంటే నేను నీకు అధీనుడను. నేను స్వతంత్రుడను కాను అని భావించడం అన్నమాట.

జ్యోతిర్గణానాం పతయే - కాంతి సమూహములకు ప్రభువు అగు దినాధిపతయే - పగటికి రాజగువానికి, నమః = నమస్కారము; జ్ఞాన దీప్తులకు స్థానమై జ్ఞానస్వరూపుడైనట్టి వారికి అని అర్థం.

జయాయ = జయస్వరూపునికొఱకు; జయభద్రాయ - జయమంగళునికొఱకు; హర్యశ్వాయ = పచ్చని గుఱ్ఱములు కలవానికొరకు; నమః - నమస్కారము; జయాయ = జ + య; జ = అంటే పుట్టినవానికొరకు; య = జీవనమార్గము నడపువానికొరకు; (యాతి ఇతియః) అని అర్థం జననస్థితి కారకుడగు పరమాత్మకొరకు అని అంతరార్థం. హరి + అశ్వాయ; అశ్వము అంటే ప్రకృతి, న+శ్వ = అశ్వ (రేపు ఉండనిది) హరి అంటే హరించునది, హరించునట్టి అంటే నాశమగునట్టి అశ్వము (ప్రకృతి) కలవాడు, అంతస్వరూపుడు; సహస్రాంశో = ఇది సంబుద్ధిరూపము. ఇంతవరకూ, అన్నింటినీ చతుర్థ్యంతములుగా వాడి, ఇచ్చట సంబోధనా ప్రథమావిభక్తి వాడినాడు. ఇది ప్రత్యక్షంలో వేడుకొనుచున్నప్పుడు వాడే రూపం. పై చతుర్థ్యంత విశేషణ భావనచే పరమాత్మను ఆత్మసాక్షాత్కృతుని చేసికొని, ఆపైని ప్రత్యక్షమైన భగవానుని సంబోధించే పదం 'సహస్రాంశో' అనేది పిలుపునకు సంబంధించినదిగా ప్రయోగం చేయబడింది. వేయి కిరణములు కలవాడా! నీకు నమస్కారము. అనేక భావనలు చేసి అన్నిటినీ ఆపరమాత్మయందే పరిణమింపజేయడం అనేది ధ్యానపద్ధతిలో నొకటి ఇది సంబుద్ధిపదం కావలసివుంటుంది. లేకపోతే దానినికూడ వాల్మీకి చతుర్థ్యంతమే చేసియుండును. నమో నమః అని రెండుసార్లు చెయ్యేత్తి నమస్కార క్రియను చెప్పడం,

అనేక భావనలు చేసి, ఆయా రూపములను బహువిధంగా సాక్షాత్క రించుకొని, రెండు మూడు సార్లు నమస్కారం చేయడం అత్యంత నమ్రమత్వానికి తన్మయత్వ స్థితికి నిశ్చయతకూ సంబంధించి వుంటుంది. అందుకే ఇక్కడనుండి నమస్కారక్రియ రెండుసార్లు చెప్పబడుతుంది.

ఆదిత్యాయ నమోనమః = అదితి యొక్క కుమారునకు నమస్కారము; అఖండమనోవృత్తిస్వరూపునకు నమస్కారము నమస్కారము

నమః ఉగ్రాయ, వీరాయ = ఉగ్రరూపుడైన పరాక్రమశాలి కొఱకు నమస్కారము. సంహారకాలమున ఉగ్రతా వీరత్వములు చూపువానికొరకు నమస్కారము.

సారంగాయ = సారం గచ్ఛతి ఇతి సారంగః — సారమును పొందినవారు సర్వశ్రేష్ఠుడు అన్నది విశేషణం కాన 'నమో నమః' అని రెండు సార్లు చెప్పినాడు. నమః పద్మప్రబోధాయ = పద్మములను వికసింప జేయు వాని కొఱకు; హృదయపద్మమును వికసింప జేయువానికొరకు నమస్కారము హృత్పుండరీకంలో పరమాత్మ ఉంటాడని ప్రసిద్ధి.

మార్తాండాయ = మృతండ మహర్షికి పుత్రుడు అగువానికొఱకు మృత + ఏవ మార్తః = మార్త + అండః = మార్తండః (శకంధ్వాది పరరూపసంధి) మృత = మృతులకు, అండాయ = జనన కారణమైన వానికొరకు అనగా, చనిపోయినవారిని తిరిగి జననము నందుంచు కర్మ వాసనారూపునికొఱకు;

— బ్రహ్మేశానాచ్యుతేశాయ-బ్రహ్మ + ఈశాన + అచ్యుత + ఈశాయ: బ్రహ్మ, శివుడు, విష్ణువులకు ప్రభువు. బ్రహ్మ. అంటే, అంతటను అవరించినవాడు ఈశాన = పాలించువాడు; అచ్యుత = నాశంలేనివాడు, (ఈ + శ) ఈశ = 'ఈ' అంటే బుద్ధి, బుద్ధియందు, 'శ' అంటే

శయనించియుండునది. బుద్ధియందు నివసించి యుండునదిపరమాత్మ జ్ఞానం. యో బుద్ధేః పరతస్తు సః అని యున్నదిగదా! అదే ఆత్మ. బుద్ధిలోని ఆత్మస్వరూపుడు అగునని ఈశపదానికి అర్థం.

సూర్యాయ = సూర్యమండలము కొరకు; సూర అంటే పండితులు; సూర్య అంటే పండితులచే పొందదగినవాడు;

ఆదిత్యవర్చసే = అదితి పుత్రులగు దేవతలకు ప్రకాశము కల్గించువాని కొరకు; అఖండ జ్యోతి స్వరూపునికొరకు;

భాస్వతే = ప్రకాశించువానికొరకు; (ఉభయార్థకము)

సర్వభక్షాయ = సర్వరోగక్రిములను హరించువానికొరకు; సమస్త కలుషములను (సమస్త పాపములను) కిరణముల ద్వారా (జ్ఞాన దీప్తులద్వారా) హరించువానికొఱకు;

రౌద్రాయ = తీవ్రరూపునికొరకు; రుత్ + ర = రుద్ర; రుద్రపదమే రౌద్ర అగును; 'రుత్' అనే ధాతువునకు రోదనం అర్థం. ర అంటే అగ్ని; రోదనము లేకుండ చేయునది; శోక రహితమైనది పరమాత్మ అట్టివానికొరకు;

తమోఘ్నాయ = చీకటిని పోగొట్టువానికొరకు; అజ్ఞానం పోగొట్టువాని కొరకు;

హిమఘ్నాయ = మంచును పోగొట్టువానికొరకు; జడత్వమును పోగొట్టువానికొరకు;

శత్రుఘ్నాయ = రోగములను శత్రువులను పోగొట్టువానికొరకు; అంత శ్శత్రువులను పోగొట్టువాడు పరమాత్మ. అట్టివాని కొరకు;

అమితాత్మనే = సర్వ ప్రపంచవ్యాపకుని కొఱకు; అమిత + ఆత్మనే = అనంతమై అఖండాత్మయై యున్నవానికొరకు;

కృతఘ్న ఘ్నాయ = కృత = మనుష్యులచే కల్పింపబడిన నస్యాదు లను; ఘ్న = నాశనము చేయు క్రిములను; ఘ్న =

చంపువానికొఱకు; కృతఘ్నులను నాశనము చేయు వానికొరకు;

కృత = జననమును, ఘ్న = మరణమును; ఘ్న = నాశనము చేయు వానికొరకు;

దేవాయ - దేవతారూపుడైనవానికొరకు; జ్యోతిస్స్వరూపుని కొరకు;

జ్యోతిషాం పతయే నమః = గ్రహనక్షత్రములకు ప్రభువైనవానికొరకు; జ్ఞానదీప్తులకు ప్రభువైనవానికొరకు;

తప్త చామీకరాభాయ = పుటము పెట్టిన బంగారు కాంతి కలవాని కొరకు;

తప్త = తపింపజేయబడిన; అనగా నాశం చేయబడిన, చామీకర అంటే ప్రకృతి కలవారికొఱకు; (హిరణ్మయ పర్యాయ పదము లన్నిటికిని ప్రకృతి అని అర్థం.)

వహ్నయే = అగ్నికొరకు; పాపములను నాశనము చేయువానికొఱకు;

విశ్వకర్మణే = సమస్త కర్మలను కలవానికొరకు; అనగా, సూర్యుడుదయించి నప్పటినుండి, సమస్త కర్మలు సాగుననుట-కర్మలకు ప్రేరకుడు, పరమాత్మకొఱకు; అన్ని కర్మల స్వరూపమైనవానికొరకు;

నమస్త మోభినిఘ్నాయ = చీకటిని మిక్కిలిగా పోగొట్టువానికొఱకు; తమః = తమోవృత్తులను అభినిఘ్నాయ = అంతట తప్పక పోగొట్టువానికొఱకు; (ఈ అర్థం కల విశేషణము 'తమోఘ్నాయ అనే 20వ శ్లోకములోకూడనున్నది. అక్కడ 'ఘ్నాయ' అని ఉంటే ఇచ్చట 'అభినిఘ్నాయ' అని అభి 'ని' అనే ఉపసర్గలతో నున్నది. అభి అంటే అంతటను అర్థం. 'ని' అనే ఉపసర్గకు 'నితరామ్' అనే అర్థం. నితరామ్

అంటే, అత్యంతము, మిక్కిలి అని అర్థం. దీనివల్ల మానసిక వృత్తులను పూర్తిగా తప్పకుండా నాశము చేయువాడు అని పరమాత్మ పరంగా అర్థం చెప్పాలి)

రుచయే = కాంతి కలవానికొఱకు; మధురమైనవానికొఱకు;

లోకసాక్షిణే - కర్మసాక్షికొఱకు; లోకుల సర్వకార్య వృత్తులకు సాక్షిమాత్రంగా ఉండువానికొరకు-పరమాత్మ.

ఇంతవరకూ, 15 నుండి 21 వరకు శ్లోకములు. ఈ 7 శ్లోకములు నమస్కారపూర్వకమంత్రములైయున్నవి. "సప్త సప్తి ఏడు గుఱ్ఱాలు కట్టిన రథం కలవాడుసూర్యభగవానుడు; సప్త ధాతువులతో నిర్మాణమైన దేహమునందుండువాడు పరమాత్మ కాన, సప్త శ్లోకములుగా ఈ మంత్ర శ్లోకములు నిర్ణయింపబడినవి. మంత్ర జపమునకు ఈ ఏడు శ్లోకములు చాల ముఖ్యములు అని చెప్పడమే దాని తాత్పర్యము. 21 నుండి 24 వరకు తిరిగి స్తుతిపరములైన వాక్య గతములగు మంత్రములు చెప్పబడినవి.

నాశయత్యేష .... .... .... ....
.... .... .... .... వర్షత్యేష గభస్తిభిః

ఈతడు, తన తీవ్ర కిరణములచే, పుట్టినదానిని నశింపచేయును వాన నొసగి తిరిగి సృజింపజేయును — జనన మరణ కారణుడు; పరమాత్మ. ఇతడు కిరణములచే రక్షించును, ఫలములనొసగును. వర్షించును; జ్ఞానదీప్తి నొసగి రక్షించును. కర్మ ఫలముల నొసంగును. కర్మలను జాఱిపోవునట్లు ద్రవింపజేయును.

ఏష సుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠితః
ఏషఏవాగ్నిహోత్రంచ ఫలంచైవా గ్నిహోత్రిణాం

ఇతడు, అన్నిప్రాణులు నిద్రించినను, తాను నిద్రింపక యుండును — అన్ని ప్రాణులు నిద్రించినపుడు, అనగా, సుషుప్తి అవస్థయను మూడవ అవస్థలో నున్నపుడు తాను వారితో తురీయ

స్థితిలో మెలుకువగ నుండి, వారిని రక్షించును. తురీయావస్థలో నుండువాడు పరమాత్మ.

అగ్నిహోత్రుడితడే. అగ్నిహోత్రము చేయువానియొక్క ఫలముకూడ ఇతడే, జ్ఞానము ఇతడే. జ్ఞానఫలదాతయు ఇతడే.

వేదాశ్చ, క్రతవస్సర్వే — — — —
— — — — రవిః ప్రభుః

వేదములు, యజ్ఞములు, యజ్ఞఫలములు అన్ని కార్యములు నితడే. లోకములయందు జరుగు నిద్య అన్ని పనులుకూడ ఇతడే. ఇది కేవలం పరమాత్మ పరమైన విశేషణం. చిట్టచివర 25, 26, 27 శ్లోకాలు ఫలశ్రుతిని తెల్పుచు ఆదిత్యహృదయమునందు అభిలాషను కల్గించే హెచ్చరికలను తెల్పునవి.

ఏన మాపత్సు కృచ్ఛ్రేషు — — — —
— — — — జగామచ యధాగతం

రామా! అన్నిరకాల ఆపదలయందు అడవులయందు, అన్ని విధముల భయములందు ఈతనిని స్తుతించువానికి నాశనములు ఎప్పుడూరావు.

ఈతనిని ఏకాగ్రచిత్తుడవై పూజింపుము. ఈతడు దేవదేవుడు, జగత్పతి, ఈతనికి సంబంధించిన ఈ ఆదిత్యహృదయాన్ని మూడుసార్లు జపిస్తే (జపం అంటే, అర్థ భావన చేయడం _ తజ్జపం యదర్థ భావనం) నీవు అన్ని యుద్ధములందు విజయము నందగలవు.

## రావణవధ.

ఈ విధంగా అగస్త్యుడు చెప్పి వచ్చినదారిని వెళ్ళిపోయెను. ఆదిత్యహృదయాన్ని విని గొప్ప తేజస్సు పొందినవాడై రాముడు శోకరహితుడయ్యెను.

రాముడు, అగస్త్య ఉపదేశప్రకారం ఆదిత్యహృదయాన్ని ముమ్మారు పఠించి బ్రహ్మాస్త్రంతో రావణుని హృదయగతమైన అమృత కలశను ఛేదించేడు. రావణుడు హతుడయ్యెను. అంటే,

సాధకుడు అఖండసచ్చిదానందఘనస్వరూపుడైన పరమాత్మను, అనుభవ పూర్వకంగా బ్రహ్మజ్ఞానంతో తనలోని దశేంద్రియ తామసిక వృత్తులను తిరిగి తిరిగి తలెత్తకుండా, తనలోని అఖండానందరూప పరమాత్మలో విలీనం చేసివేసినాడని అంతరార్థం. సాధకునిలో తమోవృత్తి పరంజ్యోతిలో ఐక్యమైపోయింది. అంతా ఆనందమయ స్థితిగా మిగిలింది.

లంకనుండి తర్వాత సీతను రామునివద్దకు తీసికొని రావడం, రాముడామెను అగ్నిపరీక్ష చెయ్యడం, అగ్నిహెూత్రుడామెను, దహింపలేక, నిర్దోషురాలుగా నిరూపించడం జరిగింది.

అంటే సాధకునిలోని ప్రకృతి, లంకలో, అనగా తమస్సులో నున్నప్పటికి దోషరహితంగా నున్నదనీ, బ్రహ్మజ్ఞానంతో అఖండానంద పరమాత్మలో అదికూడ లీనమైపోయిందనీ అంతరార్థం.

తర్వాత, రాముడు పుష్పక విమానంలో అయోధ్యకు వస్తూ, తాను అరణ్యవాసం చేసినప్పుడు దర్శించిన ఆశ్రమాలను సీతకు చూపిస్తూ, చివరకు భరద్వాజాశ్రమంలో విందారగించి, గుహుని పరామర్శించి, భరతుని వద్దనుండి రాజ్యాన్ని స్వీకరించి అయోధ్యను పాలించేడు.

అంటే, సాధకుడు పుష్పకాన్ని అధిరోహించేడు, అనగా, తన్ను పోషించినవారిని రక్షించేదైన ధర్మానికి ( పుష్ + ప ) * పుష్పకం అనిపేరు అని లోగడ చెప్పుకున్నాం. అట్టి ధర్మాన్ని సాధకుడు స్వీకరించినవాడై, తాను చేసిన సాధన లన్నిటిని తిరిగి ఒకసారి గుర్తునకుతెచ్చుకుంటూ, మొట్టమొదట తనకు చిత్రకూటాన్ని నివాసస్థానంగా చేసికొమ్మని ఉపదేశించిన భరద్వాజుని, అంటే జ్ఞానం ద్వారా నిశ్చలపరమాత్మను చేరవలసిందిగా చెప్పిన హఠయోగ మార్గాన్ని ఎంతో గారవించి దానికి ఆనందం కల్గించి, అంటే, హఠయోగంద్వారా కూడ అహంస్మృతితో జరిగినపుడు జ్ఞానయోగం సాధ్యమైనదని

* పుష్యంతం పాతి ఇతి పుష్పకః ధర్మోరక్షతి రక్షితః ఈ రెండూ ఒకే అర్థం.

నిరూపించిన తన అనుభవాన్ని ఎంతో తాను మెచ్చుకొని హృదయగుహలో నివసించిన పరమాత్మను దర్శించి, అయోధ్యలో భరతునివద్ద నుండే రాజ్యం స్వీకరించేడు. అంటే, దేహమున్నంతవరకూ జీవనమును తీర్చుటకు లోకంలో ప్రకాశించికూడ తనకు సుఖములు వాసనారూపములో అంటనివిధంగా జీవనము చేస్తూ అనుభవిస్తూ కాలం గడుపడం అనే సంగతిని తెల్పుతూంది. ప్రాణోత్క్రమణ సమయములో సాధకుడు పరమాత్మ స్మృతిలోనేఉంటాడు. ఆకారణమున, సాధకుడు అఖండ సచ్చిదానందపరమాత్మలో లీనమైపోతాడు. అంటే, ముక్తుడై జన్మరాహిత్యాన్ని పొంది పరమాత్మస్వరూపం పొందుతాడు.

ఉపసంహారం:— ప్రకృతిని సాధనలద్వారా జయించి పురుషునిలో ఐక్యం చెయ్యడమే, అంటే ప్రకృతిని పరమాత్మగా మార్చడం అన్నదే రామాయణంలోని అంతరార్థసారాంశం. రామాయణాన్ని వాల్మీకి 'సీతాయాశ్చరితం మహత్' అన్నాడు. అంటే,ప్రకృతి యొక్క గొప్ప నడకయే (గమనమే) రామాయణం అని అర్థం. అనగా ప్రకృతి పరమాత్మలో చేరడం అన్నదే సీతాచరిత్ర.

గుహుడు, భరద్వాజుడు, అగస్త్యుడు, ఈ ముగ్గురూ రాముడు అరణ్యవాసానికి వెళ్ళేటప్పుడు ప్రారంభంలో కలిసికొన్నారు. వారి సాయంతోనే రాముడు ముందుకు సాగేడు. ఈముగ్గురూ, తిరిగి రెండవసారి రాముణ్ణి కలసేరు. అయోధ్యకుచేరి రాముడు రాజ్యపాలన సుఖంగా సాగించేడు.

గుహుడు భక్తుడు. భరద్వాజుడు యోగి. అగస్త్యుడు జ్ఞాని. సాధకుడు ముక్తినిపొందడానికిచేసే సాధనాత్రయంలో ఆరోహణామార్గంలో ముందు భక్తిమార్గాన్ని చేపట్టి, ఆపైని యోగమార్గాన్ని పరామర్శించి,

వివరకు జ్ఞానమార్గంతో, వాసనలను విడిచిపుచ్చి ముక్తపురుషుడై అపైని, తిరిగి జ్ఞానంతో ఈ మార్గత్రయాన్ని అవరోహణకూడచెయ్యాలి. ఆ అవరోహణలో, జ్ఞానమార్గంలోని అనుభవాన్ని యోగమార్గంలో చూచి, యోగమార్గానుభవాన్ని, భక్తిమార్గంలో చూచి, భక్తి మార్గానుభవాన్ని ఐహిక జీవనంలో చూచుకుంటూ వుంటే, తనకు తిరిగి జీవితంలో వాసనలు అంటనే అంటవు. ఈవిధంగా ఆరోహణా మార్గంలో పూర్ణత పొంది, తిరిగి అవరోహణామార్గంలో సుస్థిరత జరిపించడం పూర్ణయోగం అనిపించుకుంటుంది. ఈపూర్ణయోగి జీవన్ముక్తుడుగాఉంటాడు. అంటే,ఎన్నాళ్ళుజీవించినా, ఏపనులుచేసినా ముక్తస్థితిలోనే, అంటే వాసనారాహిత్యస్థితిలోనే ఉంటాడు. ఈపూర్ణ యోగమార్గం రామాయణంలో అంతరార్థపరంగా వాల్మీకి మహర్షిచే స్పష్టం చెయ్యబడింది. వట్టి కథమాత్రమే రామాయణం అయితే, గుహుడు, భరద్వాజుడు, అగస్త్యుడు అను పాత్రలులేకపోయినా, కథ సాగడానికి ఏమీఅడ్డురాదు. ఈ మూడు పాత్రలను వాల్మీకి కావాలని సృష్టించుకున్నాడంటే, పైనిచెప్పినఅంతరార్థపరంగా రామాయణకథను మలచడానికి అత్యవసరంగా మార్గ త్రయాన్ని కావాలని రెండుసార్లు వచ్చేటట్లు సృష్టించుకొన్నాడని చెప్పక తప్పదు. ఇది జరిగినచరిత్ర అని అనిపించేలాగు వాల్మీకి వ్రాసి, రాముడికి గుళ్ళు, గోపురాలు కట్టించ గల్గేడు. కథను సుస్థిరం చేసేడు.

పూర్ణ యోగాన్ని, ఈ కాలంలో అరవింద యోగి పునః ప్రతిష్ఠాపనంచేసేరు. ఇది పూర్వం ఉన్నదేకాని కొత్తదికాదు అని షట్కాండల లోను రామాయణకథ అంతరార్థపరంగా చెప్తూంది. ఇక ఉత్తరకాండ విషయం అంతగా అంతరార్థపరంగా చెప్పనవసరం లేదు. షట్కాండ లలో చెప్పబడిన రామాయణంలో సాధకుడు జీవన్ముక్తుడగుటకు సాధ

నలు అంతరార్థపరంగాచెప్పబడివున్నాయి. ముక్తుడైజీవించియుండడం జీవన్ముక్తావస్థ అనిపించుకుంటుంది. జీవన్ముక్తావస్థను పొందడం వరకే సాధన. ఆతర్వాత వేరేసాధనలేకుండానే ప్రాణోత్క్రమణముతో వ్యష్టి ప్రకృతి, సమష్టిప్రకృతి (విశ్వచైతన్యం) లో లీనమౌతుంది. అదే ఉత్తర రామాయణంలో చెప్పబడినకథకు అంతరార్థపరంగా భావించాలి. ఉత్తర రామాయణకథలో సాధకుడు సాధించవలసిన ప్రత్యేకసాధన లేదు. కావున నేఅంతరార్థంలో అది చాలసంక్షిప్తంగా చెప్పబడింది. ఆకారణం చేత ఉత్తరరామచరిత్రను చెప్పి అంతరార్థ ప్రదర్శన చెయ్యడం అనవసరంకాన విరమించబడిందని పాఠకులు గ్రహించగలరు. ఉత్తరకాండ వాల్మీకిప్రోక్తంకాదనికూడ కొందరుచెప్తారు. ఏమైనా అంతరార్థపరంగా సాధన అవసరంలేదు. కాన దానిని వివరించడం జరుగలేదు.

సంపూర్ణము.

Acc. No 3597
294.5922 SUR
ల 25.

## ముఖ్యములైన సవరణలు.

### అభిప్రాయములు.

| | పంక్తి. | తప్పు | ఒప్పు. |
|---|---|---|---|
| వెంకటావధానిగారు i | 17 | ప్రత్యాఖ్యేయము. | అప్రత్యాఖేయము. |
| నివేదనము i | 3 | అంతర్ | అంతర |

### బాలకాండ. అయోధ్యకాండలు.

| పేజీ. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 23 | 5 | మఁదేనా | మండేన |
| 29 | 10 | నిగ్రహ | నిగ్రహాకుడి |
| 29 | 15 | ధరో | ధరోధీరో |
| 33 | 10 | మహో | గుహో |
| 43 | 3 | అవీన | అవన |
| 45 | 26 | ప్రయేగ | ప్రయోగ |
| | 28 | .. | .. |

### అరణ్యకాండ కిష్కింధకాండలు.

| | | | |
|---|---|---|---|
| 59 | 20 | చదవడం | చదవడంతో |
| 61 | 14 | రామాయణం | రామాయణంలో |
| 61 | 18 | అవృత్తికి | అతనికి |

### సుందరకాండ, యుద్ధకాండలు.

| | | | |
|---|---|---|---|
| 27 | 20 | దానిని | దారిని |
| 31 | 6 | వాలాగ్రం | శిరోవిక్షిప్తవాలాగ్రం |
| 31 | 7 | 'శిరో' అనునది తొలగించవలెను. | |
| 31 | 8 | 'విక్షిప్త' అనునది తొలగించవలెను. | |